సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 229


SUNDAY Special

ఆదివారం 10-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే
సర్కారు పని తీరుకు కొలమానం'



ఒడుపైన ఎత్తు.. ఒత్తిడే చిత్తు

దేశంలోని ఉన్నత విద్యా సంస్థలైన ఐఐటీల్లో విద్యార్థులకు మానసిక ఒత్తిడి, భయాన్ని తగ్గించేందుకు అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు.

- వివరాలు 16లో



నేడు రెండో టి20 మ్యాచ్

భారత్, దక్షిణాఫ్రికా మధ్య నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు రెండో టి20 జరగనుంది. తొలి పోరులో గెలిచిన భారత్ 1-0తో ఆధిక్యంలో ఉంది

- వివరాలు 14లో



డీఏపీకి 'గాజా' దెబ్బ

ఏడాదిగా సాగుతున్న గాజా సంక్షోభం భారత్‌లో డీఏపీ కొరతకు దారి తీస్తోంది. హరియాణా రైతులు రోడ్డెక్కేందుకు కారణంగా మారుతోంది.

- వివరాలు 6లో ▶



ఆ రాష్ట్రాలు కాంగ్రెస్‌కు ఏటీఎంలు

కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ఆ రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకొని దోచుకోవడం ఆ పార్టీని నడిపిస్తున్న కుటుంబానికి అలవాటేనని ప్రధాని మోదీ మండిపడ్డారు.

- వివరాలు 6లో ▶

మీకెందుకు చెప్పాలి?

సమగ్ర సర్వేలో ఆస్తులు, ఆర్థిక అంశాల వెల్లడికి ప్రజల విముఖత

ఇంటి విస్తీర్ణం, బ్యాంకు ఖాతా, రుణాలు, టర్నోవర్, ఆదాయ పన్ను వంటివి ఎందుకనే నిలదీతలు

ప్రభుత్వ పథకాలు, రేషన్‌కార్డు రద్దు చేస్తారేమోననే ఆందోళన.. రైతుబంధు, భరోసా రానప్పుడు భూమి, ధరణి వివరాలు సేకరించడమేంటనే ఎదురుప్రశ్నలు..

కొన్ని కేటగిరీల ప్రశ్నలకు అరకొరగానే సమాచారం.. భవిష్యత్తులో పథకాలు రావేమోనని సందేహం

పేద వర్గాల నుంచి మాత్రం స్పందన.. రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం వినతులు

శనివారం కూడా కొనసాగిన స్టిక్కరింగ్ ప్రక్రియ

75 ప్రశ్నలు, సవివర కోడింగ్‌తో ఎన్యుమరేటర్ల ఇబ్బంది

పలు ప్రాంతాల్లో సమయానికి అందని సర్వే ఫారాలు

రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్వేపై 'సాక్షి' పరిశీలన

2లో

గ్రౌండ్ రిపోర్ట్



ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

సర్వేపై సందేహాలు తీర్చాలి

- ప్రజల సందేహాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత మనదే.. కలెక్టర్లు ఎన్యుమరేటర్లతో మాట్లాడాలి
- సర్వే ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పోరాడే చిరునవ్వులు ▼



'బాలల దినోత్సవం' నేపథ్యంలో హైదరాబాద్‌లోని 'స్పర్శ్' హాస్పిస్ కేంద్రంలో సేవలు పొందుతున్న పసి హృదయాలలో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేసింది 'సాక్షి' మీడియా. వెండి తెరపై చైల్డ్ ఆర్టిస్టులుగా రాణిస్తున్న కార్తికేయ దేవ్, ఫర్జానాలు ఈ చిన్నారులతో కలిసి ముచ్చటించారు. ఈ విశేషాలు 'సాక్షి ఫ్యామిలీ'లో.

వివరాలు 13లో ▶

నేటి మధ్యాహ్నం 12.30 గంటలకు సాక్షి టీవీలో

సాక్షి SAKSHI TV

ట్రంప్ ఎన్నికపై సైన్యంలో రుసరుసలు!

వివాదాస్పద ఆదేశాలిస్తే ఏం చేయాలన్న దానిపై చర్చ

6లో

ఆ పిచ్చిమాటలు ఎందుకు?



ప్రభుత్వంలో ఉన్నవారు మాట్లాడే తీరు ఇదేనా..?

సీఎం రేవంత్‌పై పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్ మండిపాటు

- లోపలేస్తం, కూలగొడతం లాంటి మాటలేంటి?.. మేం తిట్టలేమా?.. కాంగ్రెస్ పాలనలో ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది
- మేం అధికారం కోసం తప్పుడు పనులు చేయం
- బీఆర్ఎస్ కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా

3లో





నేడు మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం పర్యటన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాకు రానున్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలోని కురుమూర్తి స్వామిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లో తన నివాసం నుంచి రోడ్డు మార్గం ద్వారా బయల్దేరి.. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మాపురం చేసుకుంటారు. కురుమూర్తిస్వామి ఆలయం ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులతో పాటు మరి కొన్ని పనులకు శంకుస్థాపన చేసి, అనంతరం స్వామివారిని దర్శించుకుంటారు. తిరిగి అక్కడి నుంచి బయల్దేరి 3 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు.

సీఎంపై ఫిర్యాదు

ఖమ్మం క్రైం: మూసీ వెంట పాదయాత్ర సందర్భంగా శుక్రవారం కేసీఆర్‌పై.. సీఎం రేవంత్ శుక్రవారం అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆరోపించారు. కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేసిన సీఎంపై కేసు నమోదు చేయాలని ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణకు శనివారం ఫిర్యాదు చేశారు.



‘ఇసుక’ లేని ఇన్‌కం కోసం..

ఇసుకేతర ఆదాయానికి టీజీఎండీసీ కొత్తమార్గాల వెతుకులాట

- కొత్తగా సున్నపురాయి, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ లీజుకు దరఖాస్తు
- జాతీయస్థాయిలోనూ ఖనిజాన్వేషణ ప్రాజెక్టులకు ప్రయత్నం
- ఒడిశాలో సున్నపు రాయి గనుల లీజుకు సంస్థ ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) ఇతర ఆదాయ వనరులపై దృష్టి సారించింది. సంస్థకు ఏటా వందల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నా, అదంతా రాష్ట్ర ఖజానాకు చేరుతోంది. దీంతో టీజీఎండీసీ ఖాతా ఎప్పటికప్పుడు ఖాళీ అవుతోంది. ఫలితంగా ఇసుక వెలికితీస్తున్న కాంట్రాక్టు సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలు నెలల తరబడి పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇసుక విక్రయాల్లో లోపాలను అరికట్టడంతో పాటు ఇతర ఖనిజాల అన్వేషణ, విక్రయం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. నాపరాయి, మార్బుల్, సున్నపురాయి, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ గనులను లీజుకు తీసుకొని వెలికితీత, విక్రయాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు జాతీయస్థాయిలోనూ సున్నపురాయి గనులను లీజుకు తీసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.

ఏటా రూ.వందల కోట్ల ఆదాయం వస్తున్నా..

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థకు సగటున ఏటా రూ.650 కోట్ల నుంచి రూ.700 కోట్ల మేర ఇసుక విక్రయాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఏటా సుమారు కోటిన్నర క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుకను వెలికితీసి ఆన్‌లైన్ విధానంలో విక్రయిస్తోంది. సంస్థ నిర్వహణ వ్యయం, ప్రభుత్వ ఖజానాకు చేరుతున్న ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే టీజీఎండీసీ లాభాలు ఏటా రూ.30 కోట్లకు మించడం లేదు. ఇదిలా ఉంటే రీచ్‌ల నుంచి ఇసుకను వెలికితీసి స్టాక్ పాయింట్లకు తరలిస్తున్న కాంట్రాక్టు సంస్థలకు చెల్లించాల్సిన బిల్లులు కూడా రూ.400 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నట్టు టీజీఎండీసీ వర్గాలు వెల్లడించాయి. సంస్థ ఆదాయం రాష్ట్ర ఖజానాకు మళ్లుతుండటంతో ఈ తరహా పరిస్థితి తలెత్తినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సంస్థ ఆదాయం పెంచుకునే దిశగా టీజీఎండీసీ ఆలోచన చేస్తోంది. సంస్థకు కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ ఎక్స్‌ప్లొరేషన్ ఏజెన్సీ(ఎన్‌ఈఏ) గుర్తింపు ఉండటంతో జాతీయస్థాయిలోనూ ఖనిజాల వెలికితీత, విక్రయాలపై దృష్టి సారించింది.

ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా ఇసుక విక్రయాలు	2021-22 ఆర్థిక సంవత్సరం	2022-23	2023-24	2024-25(సెప్టెంబర్)
రీచ్‌లు	312 రీచ్‌లు	285 రీచ్‌లు	167 రీచ్‌లు	148 రీచ్‌లు
ఆదాయం	ఆదాయం రూ.719.96 కోట్లు	రూ.715.84 కోట్లు	రూ.654.57 కోట్లు	రూ.376.66 కోట్లు

సున్నపురాయి గనుల లీజు కోసం..

రాష్ట్రంలో ఐదుచోట్ల 83.23 హెక్టార్ల ప్రభుత్వ, అటవీభూముల్లో ఉన్న నాపరాయిని వెలికితీయడం, ఖమ్మం జిల్లా ఇల్లెందు పరిసరాల్లో పాలరాయి నిల్వల మదింపుపై టీజీఎండీసీ దృష్టి పెట్టింది.

- మంచిర్యాల జిల్లా దేవాపూర్ సమీపంలో 880 హెక్టార్ల అటవీ భూమిని సున్నపురాయి వెలికితీత కోసం 2018లోనే రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ క్వారీల లీజు కోసం దరఖాస్తులు అందాయి.
- గుండాల అటవీ ప్రాంతంలోని పలు కంపార్ట్‌మెంట్లలో నిల్వలు ఉన్నట్టు తేలడంతో ప్రస్తుతం మైనింగ్ లీజుల అనుమతుల ప్రక్రియను ప్రారంభించింది.
- గతంలో నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్ (ఎన్‌ఎంఈటీ) నిధులతో తెలంగాణతోపాటు ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో సున్నపురాయి అన్వేషణ ప్రాజెక్టులను టీజీఎండీసీ పూర్తి చేసింది. కేవలం అన్వేషణకే పరిమితం కాకుండా సున్నపురాయి గనులను లీజుకు తీసుకోవాలని సంస్థ భావిస్తోంది. ఒడిశాలోని కొన్ని సున్నపురాయి క్వారీలను లీజుకు తీసుకోవడంపై ఆసక్తి చూపుతున్న టీజీఎండీసీ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తోంది.
- ఎన్‌ఎంఈటీ నిధులతో మాంగనీస్, మాలిబ్డినం అన్వేషణ కార్యకలాపాలు కూడా చేపట్టనుంది.
- రాబోయే రోజుల్లో రోడ్ మెటల్‌కు భారీ డిమాండ్ ఉంటుందని టీజీఎండీసీ అంచనా వేస్తోంది. రంగారెడ్డి జిల్లా బండ రావిర్యాలలో రోడ్‌మెటల్ క్వారీయింగ్ చేపట్టేందుకు టీజీఎండీసీ సన్నద్ధమవుతోంది. ఇతర కార్యకలాపాల ద్వారా ఆదాయం పెంచుకునే ప్రణాళికలపై కసరత్తు జరుగుతున్నట్టు సంస్థ ఎండీ సుశీల్ కుమార్ ‘సాక్షి’కి వెల్లడించారు.

మీకెందుకు చెప్పాలి?

- సమగ్ర సర్వేలో ఆస్తులు, ఆర్థిక అంశాల వెల్లడికి ప్రజల విముఖత
- ఇంటి విస్తీర్ణం, బ్యాంకు ఖాతా, రుణాలు, ఆదాయ పన్ను వంటివి ఎందుకనే నిలదీతలు

రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్వేపై ‘సాక్షి’ గ్రౌండ్ రిపోర్ట్

“మా ఆస్తుల వివరాలు, వార్షికాదాయం లెక్కలు ఎందుకు? స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతా వివరాలతో ఏం చేస్తారు? ధరణి పాస్‌బుక్ నంబర్ ఎందుకు చెప్పాలి? మేం ఎక్కడ రుణం తీసుకుంటే, ఎందుకోసం తీసుకుంటే ప్రభుత్వానికి ఎందుకు? వీటితో మాకొచ్చే ప్రయోజనం ఏంటి? రైతుబంధు రానప్పుడు భూముల వివరాలు ఎందుకు అడుగుతున్నారు? ఇల్లు ఎన్ని గజాల్లో ఉంటే ఏం చేస్తారు?.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం వెళ్తున్న ఎన్యూమరేటర్లకు ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలివి. అసలు ఈ సర్వే ఎందుకు చేస్తున్నారో, ఏ వివరాలు చెబితే ఏ పథకాలకు కోతపెడతారో, రేషన్‌కార్డు ఏమైనా రద్దు చేస్తారోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వివరాలు, ఉద్యోగం, వ్యాపారం వంటి వివరాలు చెప్పడానికి ముందుకురాని పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై ‘సాక్షి’ క్షేత్రస్థాయిలో చేపట్టిన పరిశీలనలో వెల్లడైన అంశాలివీ..

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాల సేకరణ గందరగోళంగా మారింది. పేర్లు, కులం, వృత్తి వంటి కొన్ని సాధారణ వివరాలను వెల్లడిస్తున్న జనం.. ఆర్థికపర అంశాలను వెల్లడించేందుకు ఇష్టపడటం లేదు. ప్రజల నుంచి సరైన సమాధానాలు రాకపోవడం, కొన్ని అంశాల్లో సందేహాలు వ్యక్తం చేస్తూ ఎదురు ప్రశ్నలు వేస్తుండటం, వారికి సర్దిచెప్పాల్సి రావడంతో సర్వేలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు. మరోవైపు పేద వర్గాల నుంచి మాత్రం సర్వేకు మంచి స్పందన కనిపిస్తోంది. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు కావాలంటూ పెద్ద సంఖ్యలో విజ్ఞప్తులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో భాగంగా... ఈ నెల 6వ తేదీ నుంచి ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు వేసిన సంగతి తెలిసిందే. శనివారం నుంచి ఎన్యూమరేటర్లు ఆ ఇళ్లకు వెళ్లి పూర్తి వివరాలను సేకరించి, సర్వే ఫారాల్లో నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు.

కాలమ్ నంబర్ 19 నుంచి తిప్పలు!

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలు (56 ప్రధాన ప్రశ్నలు, 19 ఉప ప్రశ్నలు) ఉన్నాయి. సర్వే బుక్‌లెట్ రెండు భాగాలుగా ఉంది. మొదటి విభాగం (పార్ట్–1)లో కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలపై ప్రశ్నలు అడుగుతున్నారు. ఇందులో విద్య, ఉద్యోగ, ఉపాధి, భూమి, రిజర్వేషన్లు, రాజకీయాలు, వలసలకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. సాధారణ వివరాలను వెల్లడించేందుకు ప్రజలు సిద్ధంగానే ఉన్నా.. కాలమ్ నంబర్ 19 నుంచి వస్తున్న పలు ప్రశ్నలు ఆందోళన రేపుతున్నాయి. ప్రధానంగా వ్యాపారం వార్షిక టర్నోవర్, వార్షికాదాయం, ఆదాయ పన్ను చెల్లింపులు, బ్యాంకు ఖాతా సమాచారం, భూములు, ధరణి పాసు పుస్తకం వివరాలు, భూమి కొనుగోలు కోసం వనరులకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించేందుకు చాలా మంది విముఖత చూపుతున్నారు. అదేవిధంగా రిజర్వేషన్ ఫలాలు, ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలను అడిగినప్పుడు.. ఆ వివరాలు ఎందుకని ఎదురు ప్రశ్నలు ఎన్యూమరేటర్లకు ఎదురవుతున్నాయి.



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

‘ఆర్థిక స్థితిగతుల’పై ఆందోళన

సర్వే ప్రశ్నావళి రెండో విభాగం (పార్ట్–2)లో కుటుంబ ఆర్థిక స్థితిగతులపై ప్రశ్నలు అడిగినప్పుడు ప్రజల్లో ఆందోళన కనిపిస్తోంది. వాటికి సరైన సమాధానం రావడం లేదని ఎన్యూమరేటర్లు చెప్తున్నారు. రుణాలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, పశు సంపద, స్థిరాస్తి, వాహనాలు, రేషన్‌కార్డు, నివాస గృహానికి సంబంధించిన సమాచారాన్ని చెప్పేందుకు ఇష్టపడటం లేదని అంటున్నారు. బ్యాంకు రుణాలు, అప్పులు, ఆస్తులకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతున్నప్పుడు ప్రజల నుంచి ఎదురు ప్రశ్నలు వస్తున్నాయని వివరిస్తున్నారు. ‘మేం రుణాలు చెల్లించకుంటే ప్రభుత్వం చెల్లిస్తుందా? ఆస్తుల వివరాలు మేమెందుకు చెప్పాలి? మాకున్న అప్పులకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా? ఆదాయం వివరాలు చెబితే పథకాలు వస్తాయా? ఉన్నవాటికి కోతపెడతారా?’ అని ప్రజలు నిలదీస్తున్నారని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు.

శనివారమూ కొనసాగిన స్టిక్కరింగ్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఈ నెల 6వ తేదీనే ప్రారంభమైంది. 6, 7, 8వ తేదీల్లో ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతంలోని ఇళ్లను పరిశీలించి యజమానులు, అద్దెదారుల వివరాలను తెలుసుకుని, స్టిక్కర్లు అంటించాలని, 9వ తేదీ నుంచి సర్వే ఫారాల్లో వివరాల నమోదు చేపట్టాలని నిర్ణయించారు. కానీ రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో నాలుగో రోజు కూడా స్టిక్కరింగ్ ప్రక్రియే కొనసాగింది. ఇళ్లకు తాళం ఉండటం, యజమానులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఇళ్ల విజిటింగ్, స్టిక్కరింగ్ ప్రక్రియలో జాప్యం జరిగినట్లు ఎన్యూమరేటర్లు చెప్తున్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తయిందని.. ఆదివారం నుంచి సర్వే ఫారాల్లో వివరాల నమోదు కొనసాగుతుందని ప్రణాళిక శాఖ వర్గాలు వెల్లడించాయి.



శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వివరాల సేకరణతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభిస్తున్న ప్లానింగ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, బుర్రా వెంకటేశం, జిల్లా కలెక్టర్ అనుదీప్

వివరాల సేకరణలో తిప్పలు

సర్వేలో ఒక్కో ఇంటికి సంబంధించి 75 ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టడం, 43 ప్రశ్నలకు బుక్‌లెట్ చూసుకుని కోడింగ్ వేయడం వేయడం ఎన్యూమరేటర్లకు తలకు మించిన భారమవుతోంది. పట్టణాలు, గ్రామాల్లో 150 నుంచి 175 వరకు ఇళ్లను ఎన్యూమరేషన్ బ్లాక్‌గా విభజించి ఒక్కో ఎన్యూమరేటర్‌కు అప్పగించారు. రోజుకు 10 ఇళ్లలో సర్వే చేయాలని ఆదేశించారు. కానీ చాలా ప్రాంతాల్లో తొలిరోజు ఐదు, ఆరు ఇళ్ల సర్వేనే పూర్తయింది. కుటుంబాలు ఎక్కువగా ఉన్న ఇళ్లలో అయితే గంటకుపైనే సమయం పడుతోందని.. మధ్యాహ్నం నుంచి కాకుండా రోజంతా చేస్తేనే సర్వే పూర్తవుతుందని సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. వివరాలు సేకరిస్తూ ఫామ్ నింపడం కష్టంగా ఉండటంతో కుటుంబ సభ్యులను సహాయకులుగా తీసుకెళుతున్నట్టు చెప్తున్నారు.

ఇళ్లకు తాళాలతో ఇబ్బంది

పంటల కోతల సమయం కావడంతో ఎన్యూమరేటర్లు ఎప్పుడు వస్తారో తెలియక రైతులు, కూలీలు పనులకు వెళ్తున్నారు. దీనితో సర్వే కోసం వెళ్తున్న ఎన్యూమరేటర్లకు తాళాలు వేసిన ఇళ్లు దర్శనమిస్తున్నాయి. పట్టణాల్లో ఇళ్లలో ఎవరో ఒకరు ఉంటుండటంతో సర్వే ముందుకుసాగుతోంది. తాళాలు వేసిన ఇళ్లను గుర్తుంచుకుని మళ్లీ రావడం ఇబ్బందేనని ఎన్యూమరేటర్లు చెప్తున్నారు.

రైతు భరోసా లేదు.. నేనెందుకు చెప్పాలి?

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావి ప్రాంతంలో నరిగె ఐలయ్య ఇంటికి సర్వే కోసం ఎన్యూమరేటర్ వెళ్లారు. కొన్నింటికి సమాధానాలు చెప్పిన ఐలయ్య.. వ్యక్తిగత ఆస్తుల విషయంలో సరిగా స్పందించలేదు. రైతు భరోసా రానప్పుడు భూమి వివరాలు ఎందుకని ఎదురు ప్రశ్నించారు. పింఛన్ ఎప్పుడు ఇస్తారని ఆరా తీశారు. ఎన్యూమరేటర్ సర్దిచెప్పడంతో చివరకు భూమి వివరాలు చెప్పినా.. ఈ కుటుంబం వద్దే రెండు గంటలు గడిచిపోయింది.

అరగంట నుంచి గంట వరకు పడుతోంది..

మాకు రోజుకు 20 కుటుంబాల చొప్పున సర్వే చేయాలంటూ బుక్‌లెట్లు ఇచ్చారు. ప్రశ్నలు అడగడం, వాటి కోడ్ కోసం బుక్‌లెట్ చూడటం ఇబ్బందిగా ఉంది. డైరెక్ట్‌గా ఫామ్‌లోనే నమోదు చేసేలా ఉంటే బాగుండేది. సర్వేపై ప్రజలకు అవగాహన లేక సమాధానాలు చెప్పడానికి ఆలోచిస్తున్నారు. ఒక కుటుంబంలో ఎక్కువ మంది సభ్యులు ఉంటే అరగంట నుంచి గంట వరకు సమయం పడుతోంది.

– ఎన్.పారిజాత, ఎన్యుమరేటర్, నకిరేకల్, నల్లగొండ జిల్లా

వివరాలు చెప్పేందుకు వెనకాడుతున్నారు



ఇంటి యజమానిని ప్రశ్నలన్నీ అడిగి పూర్తి చేయడానికి చా లా సమయం పడుతోంది. కొన్ని ప్రశ్నలకు జవాబు చెప్పేందుకు చాలా మంది ఇష్టపడటం లేదు. అవగాహన లేకపోవడంతో ఆస్తులకు సంబంధించిన వివరాలు చెప్పడానికి వెనుకాడుతున్నారు. కొన్ని ఇళ్ల వద్ద గంట దాకా సమయం పడుతోంది. సర్వే కోసం మరికొంత సమయం ఇవ్వాలి.

– వేలిశెట్టి నరసింహారావు, ఎన్యుమరేటర్, వైరా, ఖమ్మం జిల్లా

ఎన్యుమరేటర్లపై కుక్కలను వదిలిన ఇంటి యజమాని



‘గతి’ ప్రభుత్వ పాఠశాల టీచర్లు అపురూప, రమ్యశ్రీ

సమగ్ర కుటుంబ సర్వే కోసం హైదరాబాద్ బంజారాహిల్స్ అరోరా కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన ఇద్దరు మహిళా ఎన్యుమరేటర్లతో ఓ ఇంటి యజమాని దురుసుగా ప్రవర్తించాడు. వ్యక్తిగత వివరాలు మీకెందుకు చెప్పాలంటూ.. వారిపైకి కుక్కలను వదిలాడు. వారు భయంతో తాము పనిచేసే బడికి పరుగెత్తుకుంటూ వెళ్లి ప్రధానోపాధ్యాయుడికి గోడు వెళ్లబోసుకున్నారు. ఈ ఇద్దరూ నెల రోజుల క్రితమే కొత్తగా టీచర్ ఉద్యోగాల్లో చేరినవారే కావడం గమనార్హం.

‘సర్వే’ను బహిష్కరించిన వెంకట్రావుపల్లె



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ఇల్లంతకుంట (మానకొండూర్): తమ గ్రామ సరిహద్దుల విషయంలో స్పష్టత ఇవ్వాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లె గ్రామస్తులు ఇంటింటి కుటుంబ సర్వేను బహిష్కరించారు. అధికారులు విజ్ఞప్తి చేసినా వెనక్కి తగ్గలేదు. ఇటీవల ఈ గ్రామ సరిహద్దులు మార్పుతూ గెజిట్ వచ్చింది. గ్రామస్తులు దానిని వ్యతిరేకిస్తూ నెల క్రితం ఎంపీడీవో, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా స్పందన రాకపోవడంతో.. శనివారం ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు దూరంగా ఉన్నారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలించి, మళ్లీ సర్వే చేయిద్దామని.. కుటుంబ సర్వేకు సహకరించాలని కోరారు. కానీ సరిహద్దును రీసర్వే చేశాకే సర్వేకు సహకరిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

జిల్లాల వారీగా ‘సర్వే’ తీరును పరిశీలిస్తే..

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8,53,950 ఇళ్లు ఉండగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో శనివారం రాత్రి వరకు స్టిక్కరింగ్ పూర్తి కాలేదు. వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు, కూలీలు పొలాలకు వెళ్లడంతో చాలా ఇళ్లకు తాళం వేసి ఉంది. కొందరు ఇళ్ల యజమానులు వ్యక్తిగత వివరాలు చెప్పేందుకు నిరాకరించారు. భద్రాద్రి జిల్లాలో సర్వే ఫామ్‌లు ఆలస్యంగా చేరాయి. ఏజెన్సీ ఏరియాలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటే ఆ వివరాలు చెప్పలేదు. గొత్తికోయలకు ఆధార్‌కార్డులు, ఓటరు కార్డులు ఉన్నా కులం సర్టిఫికెట్లు లేక సర్వేలో ఏం రాయాలో స్పష్టత లేకుండా పోయింది.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా మంది ఆదాయ వివరాలను సరిగ్గా చెప్పలేదు. ధరణి సమాచారం అడిగిన ఎన్యుమరేటర్లకు ‘మీకెందుకు?’అనే ప్రశ్న ఎదురైంది. రోజువారీ కూలీలు మొదటిరోజు పనులు వదులుకుని ఇంటి వద్దే ఉన్నా ఎన్యుమరేటర్లు రాక విసుగుపడటం కనిపించింది. ఇంటి నిర్మాణం, విస్తీర్ణంపై సమాధానాలు రాలేదు. ఐటీ రిటర్నులు, వడ్డీ వ్యాపారులు, కులాంతర వివాహాల సమాచారం రాబట్టలేకపోతున్నారు.
- కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో శనివారం కూడా స్టిక్కరింగే కొనసాగింది. పలుచోట్ల కొందరు ఇంటికి స్టిక్కర్లు వేయవద్దంటూ నిరాకరించారు.
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పత్రాల కొరతతో సర్వే ఆలస్యంగా మొదలైంది. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు పది గృహాలను అప్పగించగా.. సమయం సరిపోక 5, 6 ఇళ్లే సర్వే చేస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో శనివారం రాత్రి వరకు కూడా స్టిక్కరింగ్ కొనసాగింది. రెండో శనివారం కావడంతో ఆర్పీలు, ఉపాధ్యాయులు సర్వేకు హాజరుకాలేదు. బోధన్ నియోజకవర్గంలో సర్వే స్టిక్కర్లు వేయలేదని స్థానికులు చెప్పారు.
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11,17,467 ఇళ్లు ఉండగా.. 8,231 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూములు, ఆస్తుల వివరాలను చెప్పడం లేదు. ఆధార్ నంబర్, పాస్‌బుక్ వివరాలు ఇచ్చేందుకు కూడా వెనకాడుతున్నారు. పట్టణాల్లో దాదాపు అన్ని వివరాలు చెబుతున్నా ఉద్యోగం, ఆస్తి వివరాలు దాటవేస్తున్నారు.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 8.5 లక్షల కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. పలువురు ఆస్తులు, భూములు, ఓపెన్ ప్లాట్ల వివరాలు చెప్పడం లేదు. ఇంట్లో ఉద్యోగం చేసే వారి వివరాలు చెప్పడం లేదు. ఉమ్మడి కుటుంబాల్లోని వారు వేర్వేరుగా వివరాలు నమోదు చేయాలని కోరుతున్నారు. ధరణి పాస్ బుక్ నంబర్, ఆధార్ కార్డులు వెతకడం, పట్టా పాస్ బుక్‌లు బ్యాంకుల్లో ఉండటంతో వివరాల నమోదులో జాప్యం జరుగుతోంది. బెల్లంపల్లిలో చాలాచోట్ల వార్డు కౌన్సిలర్లు, నాయకులు అందరినీ ఒకేచోటకు పిలిపించి.. వివరాలు నమోదు చేయించారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 9,67,871 కుటుంబాలు ఉన్నాయి. రుణాలు, భూములు, ఆస్తి వివరాలు చెప్పడానికి చాలామంది ముందుకురాలేదు. బీసీ–ఈ, సీ సర్టిఫికెట్లు తీసుకున్న వారు చెప్పడానికి వెనుకంజ వేశారు. కొందరు మహిళా టీచర్లు తమ భర్త, పిల్లలను సహాయకులుగా తెచ్చుకున్నారు.

ఇదండీ సంగతి



సమోసాల్లో జరిగిన మోసాన్ని నిగ్గుతేల్చాలంటే సీబీఐ దర్యాప్తు చేయాల్సిందే సార్..

తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ దుష్ప్రచారం

- ముంబైలో విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- ‘గ్యారంటీల’పై ప్రధాని సహా ఆ పార్టీ నేతలు చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపాటు
- మహారాష్ట్ర ప్రజలకు నిజాలు చెప్పేందుకే తాను వచ్చినట్లు వెల్లడి



శనివారం రాత్రి రోడ్ షోలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి ముంబై: ప్రధాని మోదీతోపాటు మహారాష్ట్రలోని బీజేపీ నేతలు తెలంగాణ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఈ నెల 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేపడుతున్న రేవంత్.. ఇందులో భాగంగా శనివారం ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతోపాటు మహారాష్ట్రలో ఉన్న బీజేపీ కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణలో కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై మోదీ సహా బీజేపీ నేతలు అబద్ధాలు చెప్పడం మానుకోనంత వరకు తాము నిజాలు చెబుతూనే ఉంటామన్నారు. అందుకే తాను మహారాష్ట్ర ప్రజలకు తెలంగాణలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలు విషయంపై నిజాలు చెప్పేందుకు వచ్చినట్లు రేవంత్ చెప్పారు.

అత్యధిక రైతు ఆత్మహత్యలు మహారాష్ట్రలోనే..

దేశంలోకెల్లా మహారాష్ట్రలోనే అత్యధికంగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని మరిచిపోవడం వల్లే మహారాష్ట్రలో రైతులు అత్యధికంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన 25 రోజుల్లోనే 22.22 లక్షల మంది రైతులకు రూ.17,869 కోట్ల రుణమాఫీ, 10 నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 50 లక్షల మంది పేదలకు ప్రతి నెలా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ అందిస్తున్నట్లు రేవంత్ వివరించారు.

17 మెగా ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించారు

మహారాష్ట్రకు రావల్సిన 17 మెగా ప్రాజెక్టులు ప్రధాని మోదీ గుజరాత్‌కు తరలించుకొని పోయారని రేవంత్ ఆరోపించారు. దేశ చరిత్రలోనే మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉందని.. అంబేడ్కర్ సహా దేశ ప్రగతిని మార్చిన ఎందరో మహానుభావులకు మహారాష్ట్ర జన్మనిచ్చిందని గుర్తుచేశారు. ప్రజలను మోసగించిన బీజేపీ కూటమిని ఈ ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

అమీన్ పటేల్‌ను గెలిపించండి...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సాయంత్రం ముంబై ముంబాదేవి నియోజకవర్గంలో తెలంగాణ వాసులు ఎక్కువగా ఉండే కమాటిపురాలో రోడ్ షో నిర్వహించారు. మహావికాస్ అఘాడీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. ముంబాదేవిలో మూడుసార్లు గెలిచి మరోసారి పోటీ చేస్తున్న కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే అమీన్ పటేల్‌ను గెలిపించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణవాసులకు అండగా ఉంటామన్నారు.

‘సర్వే’పై సందేహాలు మనమే తీర్చాలి

ప్రజల సందేహాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత మనదే

- కలెక్టర్లు నేరుగా ఎన్యుమరేటర్లతో మాట్లాడాలి
- సర్వే ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల సందేహాలను ఎన్యుమరేటర్ల ద్వారా తెలుసుకోవాలని, అందుకు జిల్లా కలెక్టర్లు నేరుగా వారితో మాట్లాడాలని సూచించారు. శనివారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రజలు లేవనెత్తే సందేహాలను జిల్లా కలెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి, వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువసార్లు సర్వేలో భాగస్వాములయ్యేలా చూడాలని ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా పెద్ద కార్యక్రమం అని, ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహిస్తున్నారని అధికారులను భట్టి అభినందించారు. సర్వే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. దేశం మొత్తం తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న సమగ్ర సర్వేను గమనిస్తోందని అన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రతి చిన్న విషయం కూడా నిర్లక్ష్యం చేయకుండా ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించుకోవాలని ఆదేశించారు. సర్వేపై కలెక్టర్లతోపాటు అన్ని స్థాయిల అధికారులు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని కోరారు. కాగా, ధరణి సమస్యలు, ప్రతిపాదిత కొత్త రెవెన్యూ చట్టం గురించి డిప్యూటీ సీఎం భట్టితో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భూమి సునీల్ శనివారం సచివాలయంలో భేటీ అయ్యారు. భూ సంస్కరణల చట్టం, అర్బన్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్, రెవెన్యూ రికవరీ యాక్ట్, ధరణిలోని పార్ట్–ఏ, పార్ట్–బీ భూముల వివరాల గురించి ఈ భేటీలో చర్చించారు.

క్లుప్తంగా...

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: వ రి కోతలు ఊపందుకున్న నేపథ్యంలో రానున్న నెల రోజులు ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు తగ్గట్లుగా కింది స్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సూచించారు. శనివారం ఆ యన సచివాలయంలో వరి కోతలు, ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొను గోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఉండేలా చూ డాలని, కొనుగోలు చేసిన వడ్లను తరలించేందుకు గోదాములను గుర్తించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లను ఆరబోసుకోవడానికి తాలు, చెత్త తీయడానికి ప్యాడీ క్లీనర్లు, విన్నోయింగ్‌ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్‌ శాఖ డైరెక్టర్‌ ఉదమ్‌కుమార్‌కు ఆదేశించారు.

తప్పుడు ప్రచారం మానుకోండి

పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్‌: జగిత్యాల జిల్లా తొంబరావుపేట గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.17 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు.. మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్‌ చేయడంపై పంచాయతీ రాజ్‌ శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం మీడియా, సోషల్‌ మీడియాలో ఉండేందుకు పాకులాడుతూ.. తప్పుడు ప్రచారం చేయడాన్నే హరీశ్‌రావు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. చేసిన పనులకు బిల్లులు తీసుకుని.. బిల్లులు రాలేదని తప్పుడు ప్రచారం చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. అక్టోబర్‌ 19నే మాజీ సర్పంచ్‌ మామిడి సత్తమ్మకు రూ.7,46,787 చెక్‌లు ఇవ్వగా.. 23న ఆమె డబ్బులు విత్‌ డ్రా చేసుకున్నట్లు అధికారులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ భవనం ప్లాస్టరింగ్‌ పనులు పెండింగ్‌లో ఉన్నాయని.. పనులు పూర్తి చేశాక బిల్లులు సమర్పించాలని మాజీ సర్పంచ్‌కు సూచించగా.. ఇప్పటి వరకు సమర్పించలేదని జిల్లా అధికారులు మంత్రికి నివేదిక సమర్పించారు. దీనిపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఓ మీడియాలో వచ్చిన కథనంపై వాస్తవాలు తెలుసుకోకుండా హరీశ్‌రావు ట్వీట్‌ చేయడాన్ని సీతక్క తప్పుబట్టారు.

సీఎం బజారు భాష మాట్లాడుతున్నారు

మూసీ ప్రక్షాళనకు బీఆర్‌ఎస్‌ వ్యతిరేకం కాదు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: మూసీ ప్రక్షాళన పేరిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బజారు భాష మాట్లాడుతున్నారని, మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళనకు బీఆర్‌ఎస్‌ వ్యతిరేకం కాదని, అయితే నిర్వాసితులకు నష్టం జరగకూడదన్నదే తమ డిమాండ్‌ అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పార్టీ నేత స్వామి యాదవ్‌తో కలసి శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 2013 భూసేకరణ చట్టం ప్రకారం మూసీ నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని, సీఎం రేవంత్‌ తన వ్యవహార శైలిని మార్చుకోవాలని హితవు పలికారు.

కాంగ్రెస్‌ పాలనలోనే నల్లగొండ నాశనం: బడుగుల లింగయ్య యాదవ్‌

గతంలో కాంగ్రెస్‌ పాలనలోనే నల్లగొండ జిల్లా నాశనమైందని బీఆర్‌ఎస్‌ మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మరో నేత క్యామ మల్లేశ్‌తో కలసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. కేసీఆర్‌ భగీరథ ప్రయత్నంతోనే నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్‌ రహితంగా మారిందని మల్లయ్య యాదవ్‌ అన్నారు.

బీజేపీ సంస్థాగత ఎన్నికలపై సమీక్ష

15 నుంచి బూత్‌ కమిటీ ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై చేపట్టాల్సిన చర్యలను కేంద్రమంత్రి. రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సమీక్షించారు. ఈ నెల 15 నుంచి గ్రామీణ ప్రాంతాలతో సహా రాష్ట్రంలోని పోలింగ్‌ బూత్‌ స్థాయిలో బీజేపీ సంస్థాగత ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. 15వ తేదీ నుంచి 25 తేదీలోగా బూత్‌ కమిటీల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఎన్నికలకు పార్టీపరంగా చేస్తున్న ఏర్పాట్లు, ప్రస్తుతం జిల్లాస్థాయిల్లో సాగుతున్న వర్క్‌షాపుల పురోగతి తదితర అంశాలు చర్చకు వచ్చాయి. ఈ వర్క్‌షాపుల నిర్వహణ ఎలా జరపాలి, కిందిస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై సమీక్షించారు. శనివారం రాత్రి బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్‌ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి పాల్గొన్నారు.

ఆ పిచ్చిమాటలు ఎందుకు?

ప్రభుత్వంలో ఉన్నవారు మాట్లాడే తీరు ఇదేనా..?

- సీఎం రేవంత్‌పై పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌ మండిపాటు
- లోపలేస్తం, కూలగొడతం లాంటి మాటలేంటి?.. మేం తిట్టలేమా?
- కాంగ్రెస్‌ పాలనలో ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది
- మేం అధికారం కోసం తప్పుడు పనులు చేయం
- బీఆర్‌ఎస్‌ కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా



శనివారం ఎర్రవల్లిలోని నివాసంలో కేసీఆర్‌. చిత్రంలో ఎర్రబెల్లి, జీవన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: ''కాంగ్రెస్‌ పాలనలో ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ఏమీ చేయలేరని తేలిపోయింది. వందకు వంద శాతం మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే అనడంలో అనుమానం లేదు. అధికారం కోసం మనం కత్తులు తిప్పం, లంగ పనులు చేయం, ప్రజలకు మంచి పనులు చేస్తం'' బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌ కాంగ్రెస్‌ ముఖ్యనేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో కలసి శనివారం బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. ఎర్రవల్లిలోని కేసీఆర్‌ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన నేతలకు కేసీఆర్‌ గులాబీ కండువాలు కప్పారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు.

మనకు తిట్లు రావా.. తిట్టలేమా?

ప్రజలను కాపాడటమే ప్రభుత్వ బాధ్యత అని.. కానీ లోపలేస్తం, కూలగొడతం అంటూ పిచ్చి, చండాలపు మాటలు అవసరమా? అని కేసీఆర్‌ ప్రశ్నించారు. ''ప్రభుత్వంలో ఉన్నవారు మాట్లాడే తీరు ఇదేనా? మనం తిట్టలేమా? ప్రజలు బాధ్యత ఇచ్చినపుడు దానిని బరువుగా తీసుకుని అంతే గాఢంగా సేవలు అందించాలి. పరిస్థితులను బట్టి అంచనాలు, లెక్కలు వేసుకుని బడ్జెట్‌ కేటాయించి.. అందరూ బాగుపడేలా ముందుకు పోవాలి. ఒక కులానికో, వర్గానికో మేలు చేయడం సరికాదు. బలహీనులు, బాధల్లో ఉన్నవారు, బతకలేని పరిస్థితిలో ఉన్న వారిని ముందుకు తీసుకెళ్లడమే గొప్పతనం. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్‌ పార్టీ అదే చేసి చూపింది. కొన్ని సందర్భాల్లో తమాషాగా ప్రజల నెత్తిన దెయ్యం కూర్చుని ఎర్రబెల్లి దయాకర్‌రావు వంటి పనిచేసే నేతలను ఓడిస్తారు''అని కేసీఆర్‌ వ్యాఖ్యానించారు.

అట్టడుగు వర్గాల కోసమే పథకాలు

దళితబంధు ఫలవంతమైన తర్వాత భూమి లేని గిరిజనుల కోసం గిరిజన బంధు, బీసీ బంధు వంటివి పూర్తిస్థాయిలో అమలు చేయాలని అనుకున్నామని కేసీఆర్‌ చెప్పారు. పూర్తిగా అట్టడుగున ఉన్నవారిని దృష్టిలో పెట్టుకుని పథకాలు అమలు చేస్తే హెచ్చుతగ్గులు లేని సమాజం ఏర్పడుతుందన్నారు. ఆ ఉద్దేశంతోనే దీర్ఘకాలిక లక్ష్యంతో మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని.. ఒక వ్యక్తి ప్రయోజనం కోసమో, ఓట్ల కోసమో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పని చేయలేదని చెప్పారు. ప్రజలకు పది శాతం హామీలే ఇచ్చినా.. చెప్పనివి మరో 90 శాతం చేసి చూపించామని, గత పథకాలను అవలోకనం చేసుకుంటే ప్రజలకు ఈ విషయం అర్థమవుతుందని పేర్కొన్నారు. ఇటీవల పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌ ఎదుట పెట్రోల్‌ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన గిరిజనుడు శ్రీనివాస్‌ కుటుంబానికి కేసీఆర్‌ చేతుల మీదుగా రూ.3 లక్షల సాయం చెక్కును అందజేశారు. త్వరలో తాను శ్రీనివాస్‌ ఇంటికి వెళతానని ప్రకటించారు. మాజీ సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాళేశ్వరం' కమిషన్‌పై సందిగ్ధం!

- గత నెలతో ముగిసిన గడువు.. నేటికీ పొడిగింపుపై వెలువడని ఉత్తర్వులు
- రెండు వారాలుగా సీఎంఓలో పెండింగ్‌లో ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్‌ పినాకి చంద్రఘోష్‌ కమిషన్‌ కొనసాగింపుపై సందిగ్ధం నెలకొంది. గత నెలాఖరుతో కమిషన్‌ గడువు ముగియగా ఇప్పటికీ గడువు పొడిగింపు ఉత్తర్వులు వెలువకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఛత్తీస్‌గఢ్‌ విద్యుత్‌ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాల నిర్మాణంపై విచారణకు ఏర్పాటైన జస్టిస్‌ మదన్‌ బి.లోకూర్‌ కమిషన్‌ గడువు గత నెల 28తో ముగియగా అదే రోజు కమిషన్‌ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. జస్టిస్‌ పీసీ ఘోష్‌ కమిషన్‌ విచారణ ఇంకా ముగియకపోకవడంతో మరో రెండు నెలల సమయం పొడిగించాలని రెండు వారాల కిందే నీటిపారుదల శాఖ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి ప్రతిపాదనలు వెళ్లాయి. సీఎం ఆమోదం లభించకపోవడంతో కమిషన్‌ గడువు పొడిగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం విద్యుత్‌తోపాటు సాగునీటి రంగంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రస్తుత ప్రభుత్వం మార్చి 14న రెండు విచారణ కమిషన్లను ఏర్పాటు చేయడం తెలిసిందే.

ఐఏఎస్‌ల విచారణ జరిగేనా?

వాస్తవానికి ఈ నెల 12 నుంచి జస్టిస్‌ పీసీ ఘోష్‌ కమిషన్‌ మూడోవిడత క్రాస్‌ ఎగ్జామినేషన్‌ నిర్వహించాల్సి ఉంది. ఐఏఎస్, రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారులను విచారించేందుకు కమిషన్‌ సన్నాహాలు చేసింది. నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా, ఇతర హోదాల్లో పనిచేసిన ప్రస్తుత, మాజీ ఐఏఎస్‌లను ఇదే నెలలో విచారించి బరాజ్‌ల నిర్మాణంలో కీలక నిర్ణయాలను ఎవరు తీసుకున్నారన్న అంశంపై సాక్ష్యాలను సేకరించేందుకు సన్నద్ధమైంది. గత ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధులకు వచ్చే నెలలో క్రాస్‌ ఎగ్జామినేషన్‌ నిర్వహించి ఆ నెలాఖరులోగా నివేదికను సమర్పించేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. కానీ ప్రభుత్వం గడువు పొడిగింపుపై చేస్తున్న జాప్యంతో నివేదిక ఆలస్యమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

నెలాఖరులోగా బిల్లులు చెల్లించాలి

- లేకపోతే నిరాహారదీక్ష చేపడతాం
- తెలంగాణ సర్పంచుల సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: ఈ నెలాఖరులోగా మాజీ సర్పంచుల పెండింగ్‌ బిల్లులు చెల్లించకపోతే డిసెంబర్‌లో ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేపడతామని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌ చందర్‌ హెచ్చరించారు. విధి నిర్వహణలో మరణించిన సర్పంచుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం రూ. 25 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గ్రామాల్లో ప్రస్తుతం ఎన్నికైన సర్పంచులు లేనందున ఇందిరమ్మ కమిటీలలో మాజీ సర్పంచులకు స్థానం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2019–2024 మధ్యకాలంలో సర్పంచులుగా కొనసాగి, రాష్ట్రవ్యాప్తంగా బిల్లులు అందని పలువురు మాజీ సర్పంచులు శనివారం మీడియాతో మాట్లాడారు. పంచాయతీల పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, సకాలంలో నిధులు అందకపోయినా గ్రామాభివృద్ధికోసం సొంత డబ్బులతో పనులు చేశామని, అయితే వాటికి బిల్లులు రాక అప్పుల పాలయ్యామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సర్పంచులు చేపట్టిన పనులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టడం సరికాదని పేర్కొన్నారు. బిల్లులకోసం ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

చింతిస్తున్నాం.. పునరావృతం కానివ్వం

షోకాజ్‌ నోటీసులకు నీటిపారుదల శాఖ ఈఎన్సీ, కొత్తగూడెం సీఈ వివరణ

సాక్షి, హైదరాబాద్‌: సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణ పనులకు పరిపాలనా అనుమతులు, ఆర్థికశాఖ ఆమోదం లేకుండానే టెండర్లు పిలవడంతో పాటు దీనిపై ఇటీవల మంత్రుల ముందే వాగ్వాదానికి దిగినందుకు షోకాజ్‌ నోటీసులు అందుకున్న నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్‌) జి. అనిల్‌ కుమార్, కొత్తగూడెం చీఫ్‌ ఇంజనీర్‌ ఇంజనీర్‌ ఎ. శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు. అనుమతి లేకుండా చీఫ్‌ ఇంజనీర్‌ టెండర్లు పిలవడాన్ని మాత్రమే తాను ప్రశ్నించానని.. అందులో వేరే ఉద్దేశాలు లేవని ఈఎన్సీ (జనరల్‌) వివరణ ఇచ్చినట్లు సమాచారం. జరిగిన ఘటనపై చింతిస్తున్నానని.. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు ప్రభుత్వ ఆదేశాలతోనే టెండర్లను పిలిచినట్లు కొత్తగూడెం చీఫ్‌ ఇంజనీర్‌ బదులిచ్చినట్లు తెలియవచ్చింది. మధుమేహంతోపాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉండటంతో మంత్రుల సమీక్షలో తాను నియంత్రణ కోల్పోయి ప్రవర్తించానని, ఇకపై అలా జరగకుండా చూసుకుంటానని ఆయన వివరణ ఇచ్చారు.

డిసెంబర్‌ ఆఖర్లోగా పెండింగ్‌ బిల్లులివ్వండి

సాక్షి, హైదరాబాద్‌: డిసెంబర్‌ చివర్లోగా తమ పెండింగ్‌ బిల్లులను ఇప్పించాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు.. సర్పంచ్‌ల సంఘం జేఏసీ విజ్ఞప్తి చేసింది. శనివారం ఈ మేరకు జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్‌ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. తమ డిమాండ్లు, సమస్యలపై ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే.. రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచ్‌ల కుటుంబాలతో సహా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



గౌస్‌కొండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బుల్డోజర్లతో తొక్కించడానికి ఇదేమైనా పాకిస్తానా?

- సీఎం రేవంత్‌ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
- బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టీకరణ
- మూసీ పాదయాత్ర కాదు.. కల్లాల యాత్ర చేస్తే రైతుల కష్టాలు తెలుస్తాయని హితవు
- ఖర్చులు కేంద్రమే భరిస్తుంటే వడ్లు కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఏం నొప్పి అని నిలదీత
- భువనగిరి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

భూదాన్‌ పోచంపల్లి: మూసీ నది ప్రక్షాళనకు అడ్డుపడే వారిపై బుల్డోజర్లు ఎక్కిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బుల్డోజర్లతో తొక్కించడానికి ఇదేమైనా పాకిస్తానా లేక పాలస్తీనానా? అని ప్రశ్నించారు. ఇది ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా? అని నిలదీశారు. సీఎం బెదిరింపులకు ఎవరూ భయపడబోరని తేల్చి చెప్పారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌ పోచంపల్లి మండలం గౌస్‌కొండ, రేవనపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కిషన్‌రెడ్డి సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ధాన్యం తీసుకొచ్చి 45 రోజులవుతున్నా కొనుగోళ్లు జరగడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌ శుక్రవారం వలిగొండ మండలం సంగెం వద్ద మూసీలో బోటు షికారు చేశారు తప్ప రైతుల గోస పట్టించుకోలేదని విమర్శించారు. వరికి క్వింటాల్‌కు రూ. 2,320 మద్దతు ధరతోపాటు అన్ని ఖర్చులూ కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంటే కేవలం వడ్లు కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఏం నొప్పి అని ప్రశ్నించారు. సీఎం మూసీ పాదయాత్ర బదులు కల్లాల పాదయాత్ర చేస్తే రైతుల సమస్యలు తెలుస్తాయని హితవు పలికారు.

రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం కోసమే మూసీ ప్రక్షాళన

రేవంత్‌రెడ్డి రియల్‌ఎస్టేట్‌ వ్యాపారం కోసమే మూసీ ప్రక్షాళన చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని.. కానీ మూసీపరీవాహకంలో పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. మూసీ పక్కన పేదల ఇళ్లను కూల్చి హౌసింగ్‌ కాంప్లెక్స్‌లు, షాపింగ్‌ కాంప్లెక్స్‌లు, సినిమా థియేటర్లు కడతామంటే ఒప్పుకోబోమన్నారు. గండిపేట మొదలు పోచంపల్లి వరకు డ్రైనేజీ నీరంతా మూసీలో కలుస్తోందని.. ఇలా డ్రైనేజీ నీరు మూసీలో కలవకుండా రిటైనింగ్‌ వాల్‌ కట్టాలని కిషన్‌రెడ్డి సూచించారు. ప్రాథమిక ప్రణాళికే లేకుండా మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం రూ. లక్షన్నర కోట్లు ఎక్కడ నుంచి తీసుకొస్తుందని నిలదీశారు. ప్రాజెక్టు సమగ్ర నివేదికే 18 నెలల తరువాత రావాలని టెండర్‌లో పెట్టారని.. ప్రక్షాళనను ఎప్పుడు మొదలు పెట్టి, ఎప్పుడు పూర్తి చేస్తారనే దానిపై స్పష్టత లేదన్నారు. దీనిపై ప్రశ్నించిన వారిని బుల్డోజర్లతో తొక్కిస్తానంటే ప్రజలెవరూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర నేతలు గూడురు నారాయణరెడ్డి, కిసాన్‌సెల్‌ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో రణరంగం

- దళితబంధు కోసం రోడ్డెక్కిన లబ్ధిదారులు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి
- పోలీసులకు, ఎమ్మెల్యే, లబ్ధిదారుల మధ్య తోపులాట
- ఆందోళనలో సొమ్మసిల్లిన ఎమ్మెల్యే, ఆస్పత్రికి తరలింపు



హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు



కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హుజూరాబాద్‌ రూరల్‌: కరీంనగర్‌ జిల్లా హుజూరాబాద్‌ పట్టణం రణరంగంగా మారింది. దళితబంధు లబ్ధిదారుల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లింది. పోలీసులకు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, లబ్ధిదారుల మధ్య తోపులాట జరిగింది. ఆందోళనలో సొమ్మసిల్లిన ఎమ్మెల్యేను ఆస్పత్రికి తరలించారు. హుజూరాబాద్‌ నియోజకవర్గంలో గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు రెండో విడత నిధులకోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల నుంచి శనివారం స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించిన తరువాత లబ్ధిదారులతో కలిసి అంబేడ్కర్‌ చౌరస్తాకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ లబ్ధిదారులతో కలిసి ధర్నాకు సిద్ధమవుతున్న క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయినప్పటికీ ఎమ్మెల్యే, లబ్ధిదారులు కరీంనగర్‌– వరంగల్‌ ప్రధాన రహదారిపై గంటపాటు బైఠాయించారు. దీంతో పోలీసులు లబ్ధిదారులను, కౌశిక్‌రెడ్డిని అక్కడినుంచి వాహనంలో తరలిస్తున్న క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కౌశిక్‌రెడ్డి సొమ్మసిల్లడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొంతమంది లబ్ధిదారులు, బీఆర్‌ఎస్‌ నాయకులు సైతం అస్వస్థతకు గురయ్యారు. ధర్నాతో హుజూరాబాద్‌– కరీంనగర్‌– జమ్మికుంట ప్రధాన రహదారులపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కౌశిక్‌రెడ్డి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలియడంతో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు ఆరా తీశారు. కాగా, దళితబంధు లబ్ధిదారులకు న్యాయం జరిగేవరకు వారి పక్షాన పోరాడుతానని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ కౌశిక్‌రెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యేపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

ఇళ్లు కూల్చిన చోట పాదయాత్రకు సిద్ధమా?

- ముఖ్యమంత్రికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌... హైదరాబాద్‌లో పేదల ఇళ్లు కూల్చేసి నల్లగొండలో పాదయాత్ర చేయడమేంటని ధ్వజం
- కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే మూసీ మురికి కూపంగా మారిందని మండిపాటు
- కేసీఆర్‌ హయాంలో మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడి
- ధాన్యం కొనుగోళ్లు జరగక రైతులు రోడ్డున పడ్డారని ఆవేదన



విలేకరులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, పద్మా దేవేందర్‌ రెడ్డి, వంటేరు

నర్సాపూర్‌/కొల్చారం: 'మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇళ్లు కూలగొట్టిన ప్రాంతం నుంచి పాదయాత్ర చేయడానికి నేను సిద్ధంగా ఉన్నా.. నువ్వు వస్తావా?'అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌ విసిరారు. శనివారం మెదక్‌ జిల్లా నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. అలాగే కొల్చారంలో నిర్వహించిన రైతు దీక్షలో ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డిది పాదయాత్ర కాదని.. ప్రాయశ్చిత్త, పాప పరిహార యాత్ర అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అయినా హైదరాబాద్‌లో పేదల ఇళ్లను కూల్చేసి నల్లగొండలో పాదయాత్ర చేయడం ఏమిటని మండిపడ్డారు. కేసీఆర్‌ పదేళ్ల పాలనలో రాష్ట్ర వికాసం జరిగితే ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విధ్వంసంతో కూడిన పాలనను కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే మూసీ నది మురికికూపంగా తయారైందని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో మూసీకి పునరుజ్జీవం పోసేందుకు నాటి సీఎం కేసీఆర్‌ శ్రీకారం చుట్టి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారని గుర్తుచేశారు.

రైతులను సీఎం, మంత్రులు పట్టించుకోవట్లేదు..

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్డునపడ్డారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంతోపాటు మంత్రులు రైతులను పట్టించుకోవడం లేదని, పాలనను గాలికి వదిలి గాలి మోటార్లలో ఇతర రాష్ట్రాలు, దేశాల్లో విహారయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆదిలాబాద్‌ జిల్లాలో పది రోజుల్లో 92 మంది విద్యార్థులు విషాహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారని.. వారిలో ఇద్దరు చనిపోయారని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులను పరామర్శించే తీరిక సీఎం ఇతర రాష్ట్రాల్లో మాత్రం తిరుగుతున్నారని మండిపడ్డారు.

అరెస్టులకు భయపడం..

బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ను అరెస్ట్‌ చేస్తారని సీఎం లీకులిస్తూ భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని.. కానీ అరెస్టులకు ఎవరూ భయపడరని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. కేటీఆర్‌ ఐటీ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపి హైదరాబాద్‌ బ్రాండ్‌ ఇమేజ్‌ను పెంచారని కొనియాడారు. కేసీఆర్‌ ఆనవాళ్లు లేకుండా చేస్తానని ప్రకటించడాన్ని హరీశ్‌రావు తప్పుపట్టారు. కేసీఆర్‌ నిర్మించిన యాదాద్రి ఆలయ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు ఇచ్చి మరింత అభివృద్ధి చేయాలన్నారు.

కోమటిరెడ్డిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్‌ చేయాలి

తెలంగాణను సాధించిన కేసీఆర్‌ను చంపేస్తా.. మూడు ముక్కలు చేసి మూసీలో పడేస్తానంటూ వ్యాఖ్యానించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంత్రి పదవి నుంచి గవర్నర్‌ బర్తరఫ్‌ చేయాలని హరీశ్‌రావు డిమాండ్‌ చేశారు. హింసను ప్రేరేపించేలా మాట్లాడిన మంత్రిపై పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ, మాణిక్‌రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, క్రాంతికిరణ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

బిల్లులు రాక పంచాయతీ కార్యాలయం తాకట్టు

సాక్షి, హైదరాబాద్‌: జగిత్యాల జిల్లా తొంబరావుపేటలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో గ్రామపంచాయతీ భవనాన్ని తాకట్టు పెట్టే దుస్థితి వచ్చిందని హరీశ్‌రావు ఓ ప్రకటనలో విమర్శించారు. స్థానిక సంస్థలకు నిధులు, విధులు పూర్తిస్థాయిలో అప్పగిస్తామంటూ మేనిఫెస్టోలో బీరాలు పలికిన కాంగ్రెస్‌ ఇప్పుడు ఏం చెబుతుందని నిలదీశారు. కాగా, హుజూరాబాద్‌లో అంబేడ్కర్‌ విగ్రహం సాక్షిగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు దాడి చేయడంపట్ల హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్‌ మార్కు రాక్షస పాలన సాగుతోందన్నారు. పోలీసుల దాడిలో అస్వస్థతకు గురైన కౌశిక్‌రెడ్డికి హరీశ్‌రావు ఫోన్‌ చేసి ఆరా తీశారు.

వీధి రౌడీల్లా సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి: దాసోజు శ్రవణ్‌



సాక్షి, హైదరాబాద్‌/బంజారాహిల్స్‌: నాలుగు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉంటూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవులను త్యాగం చేసిన కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వీధి రౌడీల్లా మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్‌ నాయకుడు దాసోజు శ్రవణ్‌ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌ వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా కాలకేయుళ్లలా రేవంత్, కోమటిరెడ్డి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌ పాలనలో రియల్‌ ఎస్టేట్‌ రంగం పూర్తిగా నాశనం కాగా, డీపీఆర్‌ లేకుండానే మూసీ అభివృద్ధి పేరిట జీవన విధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. పది నెలల్లోనే రేవంత్‌ తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారని, కేసీఆర్‌ను దూషించేందుకే మూసీ పాదయాత్ర చేశారని దాసోజు విమర్శించారు.

రేవంత్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు..: మాజీ సీఎం కేసీఆర్‌ను ముక్కలుగా చేసి మూసీ నదిలో పడేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, ఆయనపై క్రిమినల్‌ కేసులు నమోదు చేయాలని దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, బీసీ కమిషన్‌ మాజీ సభ్యులు కిశోర్‌గౌడ్‌ తదితరులు శనివారం బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూసీ పాదయాత్రలో భాగంగా పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇద్దరూ కలిసి మాజీ సీఎం కేసీఆర్‌పై ఇష్టానుసారంగా దుర్భాషలాడారని, అసభ్యపదజాలంతో దూషించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఆయన ఆజ్ఞ నిత్యజీవమని నేనెరుగుదును గనుక నేను చెప్పు సంగతులను తండ్రి నాతో చెప్పిన ప్రకారము చెప్పుచున్నాను.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** శు.నవమి సా.4.38 వరకు, తదుపరి దశమి,
నక్షత్రం: దనిష్ఠ ఉ.7.46 వరకు తదుపరి శతభిషం, **వర్జ్యం:** ప.2.37 నుండి 4.05 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.56 నుండి 4.44 వరకు, **అమృతఘడియలు:** రా.10.44 నుండి 12.10 వరకు.

సూర్యోదయం : 6.05
సూర్యాస్తమయం : 5.23
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అజిత్ పవార్ (డిప్యూటీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఎవరి మీదనైనా మనకు పట్టనలవి కాని గౌరవం ఉన్నప్పుడు ఆ గౌరవాన్ని కాపాడుకోవలసిన బాధ్యత కూడా మనదే అవుతుంది తప్ప, అవతలి వాళ్లది కానే కాదని గట్టిగా నమ్ముతాన్నేను.

శరద్‌జీ అంటే నాకు గౌరవం. సాధారణ గౌరవం కాదు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే మీద, నా సహ ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మీద ఉన్న గౌరవంతో సమానమైన గౌరవం. "అదంతా నాటకం, గౌరవం కాదు" అని శరద్‌జీ అనుకుంటున్నా కూడా... నేనాయన్ని గౌరవించటం మానను. మనిషి ఎదుటా మానను. మనిషి చాటునా మానను.

భుజాలపై ఎప్పటికీ అలా ఉంచేసుకుంటారని స్టేజీ పైకి వెళ్లి శాలువాను కప్పి వస్తామా ఎవరికైనా? గౌరవమూ అంతే! మనం ఇచ్చిన గౌరవాన్ని నిలుపుకుంటున్నారా, లేదా అని మనం వెళ్లి అస్తమానం తొంగి చూస్తుండ కూడదు. అసలు చూసేందుకు వెళ్లనే కూడదు. గౌరవించాలి, వెంటనే అక్కడి నుంచి వెనక్కు వచ్చేసి వేరే పనిలో పడిపోవాలి.

అయితే గౌరవనీయులు కొన్నిసార్లు తిన్నగా ఉండరు. మనల్నీ తిన్నగా ఉండనివ్వరు. శరద్‌జీ పై నాకున్న గౌరవాన్ని నేను



కాపాడుకోవలసిన పరిస్థితులను శరద్‌జీ ఈమధ్య నాకు తరచుగా కల్పిస్తున్నారు!

సంతోషమే. ఆయనేం చేసినా ఆయనపై నా గౌరవం ఎక్కడికీ పోదు. కానీ నన్ను పంపించేందుకే ఆయన తన ఎన్నికల ప్రచారంలోని అమూల్యమైన సమయాన్నంతా వినియోగిస్తున్నారు. 'బారామతి'లో నాకు పోటీగా నా తమ్ముడి కొడుకు యోగేంద్ర పవార్‌ను దింపారు. "బాహుబలీ! నీదే ఇకపై బారామతి" అని ఆశీర్వదించారు. యోగేంద్ర నా తమ్ముడి కొడుకైతే, నేను శరద్‌జీ తమ్ముడి కొడుకుని. ఇద్దరు 'తమ్ముడి కొడుకుల' మధ్య పోటీకి బారామతే దొరికిందా శరద్‌జీకి?

"ఇక చాలు. ముప్పై ఏళ్లు నేను బారామతి ఎమ్మెల్యేగా ఉన్నాను. ముప్పై ఏళ్లు అజిత్ బారామతి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇప్పుడిక మూడో తరం రావాలి. యోగేంద్ర రాబోయే ముప్పై ఏళ్లు బారామతి ఎమ్మెల్యేగా ఉండాలి" అని సభల్లో హోరెత్తిస్తున్నారు శరద్‌జీ!

ఇక చాలా!! ఎవరికి చాలు? వరుసలో కూర్చొని భోజనం చేస్తున్నవారు తాము తింటూ, "వాళ్లకు ఇక చాలు" అని పక్క వాళ్ల వైపు చెయ్యి చూపిస్తూ చెప్పినట్లుంది శరద్‌జీ నా మాటెత్తి "ఇక చాలు" అనటం!

ఇలాంటప్పుడే, శరద్‌జీ పైన నాకున్న గౌరవాన్ని కాపాడుకుంటూ రావటం నాకు కష్టమైపోతుంటుంది.

"పాత తరం ఎక్కడో ఒక చోట ఆగిపోవాలి. కొత్త తరం రావాలి..." అంటున్నారు శరద్‌జీ! ఏదీ, పాత తరం ఎక్కడ ఆగింది? 83 ఏళ్లు వచ్చినా ఇంకా ర్యాలీలు తీస్తూనే ఉంది. మరో రెండేళ్లు రాజ్యసభ ఎంపీగా కూడా ఉంటుంది. పాత తరం ఎప్పటికీ ఆగిపోదని, పార్టీ అధ్యక్షుడిగా ఈ భూమ్యాకాశాలు ఉన్నంతకాలం ఉండిపోతుందని తెలిసిపోయాకే కదా నేను కొత్త దారి వెతుక్కుంటూ వచ్చేసింది. వచ్చేశాక కూడా నేను శరద్‌జీని గౌరవించటం మానలేదు.

నవంబర్ 20న పోలింగ్. ఎన్సీపీ నుంచి బయటికి వచ్చిన ఎన్సీపీ నాది. శివసేన నుంచి బయటికి వచ్చిన శివసేన ఏక్‌నాథ్ షిందేది. ఎన్సీపీ–శివసేన–బీజేపీ కలిసిన మా 'మహాయుతి'కి; శరద్‌జీ ఎన్సీపీ–ఉద్ధవ్ ఠాక్రే శివసేన–కాంగ్రెస్‌ల 'మహా వికాస్ అఘాడీ' కి మధ్య 288 అసెంబ్లీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల యుద్ధం ఇది.

కానీ శరద్‌జీ అలా అనుకుంటున్నట్లు లేరు! ఇదంతా బారామతి కోసం జరగబోతున్న మహా సంగ్రామం అని, వాళ్లు మొత్తం అన్ని చోట్లా గెలిచినా, బారామతిలో నేను ఒక్కడినీ ఓడిపోకపోతే వాళ్లదసలు గెలుపే అవదని ఆయన భావిస్తున్నట్లుంది! ఆయన భావన ఎలాంటిదైనా ఆయనపై నా గౌరవ భావన మాత్రం చెక్కు చెదిరేది కాదు.

వీరు నేరస్థులా?

సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిని వ్యవస్థీకృత నేరస్థులుగా చిత్రించే ప్రయత్నాలు ప్రమాదకరం. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా సెక్షన్లలో లేని శిక్షలను పేర్కొంటూ వచ్చిన ఒక వార్త ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. చట్టాలకు వక్ర భాష్యం చెప్పే విధంగా ఉన్న అటువంటి వార్తలు చూస్తే ఏ విలువల కోసం ఈ జర్నలిజం అనిపిస్తోంది.

అభిప్రాయం



పి. విజయ బాబు

సోషల్ మీడియా కార్యకర్తలు వ్యవస్థీకృత నేరస్థులని అందునా, ఒక పార్టీకి చెందిన వారి కోసం భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 111 ఏర్పాటయింది అనేటువంటి రీతిలో ఒక పత్రికలో వార్త చదివిన తర్వాత చాలా ఆశ్చర్యం అనిపించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా, సెక్షన్లలో లేని శిక్షలు, అన్వయం కానివారికి అన్వయిస్తారు. 'ఖబడ్దార్' అనే రీతిలో భూతద్దంలో చూపించి భయభ్రాంతులను చేసే విధంగా, చట్టాలకు వక్రభాష్యం చెప్పే విధంగా ఉన్న ఆ వార్తలు చూస్తే ఏ విలువల కోసం ఈ జర్నలిజం అనిపించింది. అందుకే అసలు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 111లో ఏముంది అనేది ఇక్కడ చెప్పదలుచుకున్నాను. కాగా, సోషల్ మీడియా కార్యకర్తలు కావచ్చు, మరెవరైనా కావచ్చు పోలీసులు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుని ఎడాపెడా కేసులు బనాయిస్తే కోర్టులు చూస్తూ ఊరుకోవు. భారత అత్యున్నత న్యాయస్థానం అనేక తీర్పుల్లో ఇదే సత్యాన్ని స్పష్టం చేసింది. అంతెందుకు తాజాగా ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానం కూడా ఇదే విషయాన్ని ఉటంకిస్తూ ఒక హెచ్చరిక జారీ చేసింది. చట్టాలకు అతిశయోక్తులు జోడించి చెప్పటం, వక్ర భాష్యాలు చెప్పడం నేరం. చిన్న నేరాలకు సంబంధం లేని సెక్షన్లు పెట్టిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్న ఉదంతాలు కూడా చాలా ఉన్నాయి.



భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 111 విషయానికి వచ్చినట్లయితే ఈ సెక్షన్ కింద సోషల్ మీడియాలో ఏ విధమైన పోస్టులు చేసినా వాళ్లకు భారీ శిక్షలు తప్పవు అని అర్థం వచ్చే రీతిలో ప్రచురితమైన వార్తను చూసినప్పుడు అసలు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 111 ఏమిటనేది ఒకసారి పరిశీలిస్తే, ఆ వార్తలోని అర్ధసత్యం అర్థం అవుతుంది.

కిడ్నాప్, వ్యవస్థీకృత నేరాలు, వాహన దొంగతనం, దోపిడీ, భూ దోపిడీ, కాంట్రాక్ట్ హత్య, ఆర్థిక నేరం, సైబర్ నేరాలు, వ్యక్తుల అక్రమ రవాణా, డ్రగ్స్, ఆయుధాలు లేదా అక్రమ వస్తువులు, అక్రమ సేవలు, వ్యభిచారం లేదా మానవ అక్రమ రవాణా వంటి నేరాలకు పాల్పడటం సెక్షన్ 111 కిందికి వస్తాయి .

సైబర్ నేరాలు అంటే... ఎవరైనా వ్యక్తులు గానీ, ఒక వ్యక్తి గానీ ఒక సమూహ గౌరవానికి, ఒక వ్యక్తి గౌరవానికీ భంగం కలిగించే విధంగా కానీ; శారీరకంగా, మానసికంగా బాధపెట్టే విధంగా కానీ ప్రవర్తిస్తే, అది ఐటీ చట్టం–2000 ప్రకారం సైబర్ క్రైమ్ కిందికి వస్తుంది. విస్తృత ప్రజా ప్రయోజనాలతో కానీ, విశ్వసనీయ సమాచారంతో కానీ ప్రచురించినా, ప్రసారం చేసినా అది ఐటీ చట్టం కింద నేరంగా పరిగణించటం సాధ్యం కాదు. ఇటువంటివే మరి కొన్ని మినహాయింపులు ఈ చట్టపరిధిలో ఉన్నాయి.

సైబర్ క్రైమ్ అంటే ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా ఒక వ్యక్తి ఐడీని దొంగిలించటం లేదా అతని అకౌంట్ మొత్తం హ్యాక్ చేయడం, ఈ–మెయిల్ పాస్‌వర్డ్ దొంగిలించి తద్వారా తప్పుడు మెసేజ్‌లు బయటికి పంపడం, అశ్లీల చిత్రాలను, వీడియోలను సమాజంలోకి పంపడం; దేశ భద్రతకు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా నేరాలకు పాల్పడటం వంటివన్నీ సైబర్ నేరాలుగా పరిగణిస్తారు. సమాజంలో జరుగుతున్న వ్యవహారాన్ని వార్తలుగా కానీ రాజకీయ పరమైన విమర్శలుగా కానీ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే వాటికి ఈ చట్టాలను ఆపాదించడం సరికాదు. ఇక వ్యవస్థీకృత నేరం అంటే, నేర కార్యకలాపాల్లో సిండికేట్ సభ్యునిగా లేదా ఉమ్మడిగా వ్యవహరించే ఏ వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం... హింసకు పాల్పడటం, బెదిరింపు, బలవంతం లేదా ఏదైనా ఇతర చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా ఆర్థిక ప్రయోజనంతో సహా ప్రత్యక్ష లేదా పరోక్ష భౌతిక ప్రయోజనాన్ని పొందడం వ్యవస్థీకృత నేరంగా పరిగణించబడుతుంది. మరి ఇవన్నీ సోషల్ మీడియా కార్యకర్తలకు ఎలా వర్తింపచేస్తారో గౌరవ న్యాయ స్థానాలే నిర్ణయించాలి.

'చట్టవిరుద్ధమైన కార్యకలాపాన్ని కొనసాగించడం' అంటే చట్టప్రకారం నిషేధించబడిన పనులు చేయడం. ఇందుకు గాను మూడు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష విధిస్తారు. ఏ వ్యక్తి అయినా ఒక్కరుగా లేదా ఉమ్మడిగా, వ్యవస్థీకృత నేర సిండికేట్ సభ్యునిగా చేస్తే, అదీ పదేళ్ల వ్యవధిలో ఒకటి కంటే ఎక్కువ ఛార్జిషీట్లు దాఖలు అయితే శిక్షలు కఠినంగా ఉంటాయి. ఇవి నేరాలకు అన్వయం కానీ రాజకీయ విమర్శలకు వర్తించవు.

ఇక సోషల్ మీడియాకి సంబంధించిన శిక్షలు అంటూ కొన్ని సెక్షన్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఈ సెక్షన్లు దేనికి అన్వయం అవుతాయో భారతీయ న్యాయ సంహిత ప్రకారం పరిశీలిద్దాం.

ఐటీ యాక్ట్ 67 ప్రకారం... నేరాలకు పాల్పడిన వారికి అంటూ, వీరు దేశంలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారికి ఈ సెక్షన్ కింద ఐదేళ్ల జైలు శిక్ష, 70 లక్షల జరిమానా ఉంటుంది అని రాశారు.

అసలు వాస్తవం పరిశీలిస్తే, 67 ప్రకారం రాజకీయపరమైన విమర్శలు ఈ చట్ట పరిధిలోకి రావు. అశ్లీల దృశ్యాలు ప్రచురించినా, ప్రసారం చేసినా ఈ చట్ట ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, ఐదు లక్షల జరిమానా ఉంటుంది.

వేరే వ్యక్తి పేర అకౌంట్ కానీ, ఫేస్‌బుక్ ప్రొఫైల్ ద్వారా కానీ మోసం చేయడం, ఇన్‌కమ్‌టాక్స్ అకౌంట్స్ హ్యాక్ చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సెక్షన్ 66డీ కిందకి వస్తుంది.

ఈ నేరాలకు పాల్పడిన వారికి లక్ష జరిమానా, మూడు వేల జైలు. ఇక సెక్షన్ 356 ప్రకారం పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ప్రచురిస్తే లేదా ప్రసారం చేస్తే రెండేళ్ల జైలు, జరిమానా ఉంటుంది. అయితే పరువు ప్రతిష్ఠ కేసులకు సంబంధించి చాలా మినహాయింపులు ఉన్నాయి. ఇందులో కూడా విస్తృత ప్రజాప్రయోజనాలు ఉన్న, నమ్మదగిన సమాచారం ఉన్నా, సత్యనిష్ఠకు సంబంధించి రుజువు చేయగలిగితే అది డిఫమేషన్ కిందికి రాదు. అక్కడ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ ఆర్టికల్ 19(1)ఏ అండగా నిలుస్తుంది.

అయితే భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో సమాజంలో అశాంతి రేకెత్తించడం, మహిళల్ని కించపరచటం కచ్చితంగా నేరాలే! ఈ నేరాలకు ఎవరు పాల్పడినా వాళ్లను శిక్షించవలసిందే! ఇందులో ఎవరికీ మినహాయింపులు ఉండవు కానీ భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 111 ప్రత్యేకంగా ఒక పార్టీకో, ఒక పార్టీలో సోషల్ మీడియా వారి కోసమో నిర్దేశించినట్టుగా వార్తలు రాయడం సత్యనిష్ఠకు వ్యతిరేకం, భంగకరం. చట్టం ముందు అందరూ సమానులే! చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా వారు కచ్చితంగా శిక్షార్హులే! అంచేత చట్టాల ఉల్లంఘనకు పాల్పడే వారిని రాజకీయాలకు అతీతంగా శిక్షించడానికి పూనుకున్నప్పుడు సమాజం హర్షిస్తుంది. కాదంటే న్యాయ పరిరక్షణలో చట్టాల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై న్యాయస్థానం చర్యలు తీసుకుంటుంది. వారు ఏ స్థాయిలో ఉన్నా న్యాయస్థానం ముందు దోషులుగా నిలబడక తప్పదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు, రాజ్యాంగ న్యాయశాస్త్ర పట్టభద్రులు

ఆ నినాదాల కథేమిటి?

'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్', 'అమెరికా ఫస్ట్' అనే రెండు ఆకర్షణీయమైన నినాదాలను ట్రంప్ ఇచ్చారు గానీ, వాటిని నిర్వచించలేదు. ఎంత అస్పష్టంగా ఉన్నప్పటికీ అమెరికన్ సమాజంలోని కొన్ని తరగతులను ఈ నినాదాలు బలంగా ఆకర్షించాయి. ఈ విడతలో ట్రంప్ పాలన ఈ నినాదాలకు ఎంతవరకు అనుగుణంగా ఉండవచ్చునన్నది ప్రశ్న.

అభిప్రాయం



టంకశాల అశోక్

అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్), 'అమెరికా ఫస్ట్' అనే రెండు ఆకర్షణీయమైన నినాదాలు అయితే ఇచ్చారు గానీ, వాటికి నిర్వచనం ఏమిటో చెప్పకపోవటం ఆసక్తికరమైన విషయం. తన 2016 ఎన్నికలలోనూ ఈ నినాదాలు ఇచ్చిన ఆయన అపుడు గెలిచి, తర్వాతసారి ఓడి, ఈసారి తిరిగి గెలిచారు. అయినప్పటికీ ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆ మాటలకు ఎప్పుడూ నిర్వచనాలు చెప్పలేదు. తన సమర్థకులు, వ్యతిరేకులు, మీడియా, ఇతరులు అయినా అడిగినట్లు కనిపించదు. ఇది ఆశ్చర్యకరమైన స్థితి.

పై రెండు నినాదాలు ట్రంప్ ఉబుసుపోకకు ఇచ్చినవి కావు. అందువల్లనే ఇన్నేళ్ళుగా వాటిని ఇస్తూనే ఉండటమేగాక, 'మాగా'ను ఒక ఉద్యమంగా ప్రకటించారు. దీనిని బయటి ప్రపంచం అంతగా పట్టించుకోక సాధారణమైన ఎన్నికల నినాదాలుగా పరిగణించటం ఒకటైతే, అమెరికాలోని ట్రంప్ ప్రత్యర్థులు, అకడమీషియన్లలోని అధిక సంఖ్యాకులు, ప్రధాన మీడియా సైతం అదే వైఖరి తీసుకోవటం గమనించదగ్గది. అట్లాగని అందరూ వదలివేశారని కాదు. అమెరికన్ సమాజంలోని కొన్ని తరగతులను ఈ నినాదాలు, అవి ఎంత అస్పష్టంగా ఉన్నప్పటికీ, బలంగా ఆకర్షించటాన్ని గుర్తించిన కొద్ది మంది పరిశీలకులు మాత్రం దాని లోతుపాతులలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారి అధ్యయనాలను గమనించినట్లయితే ఈ రెండు నినాదాలు ఏ పరిస్థితులలో ఎప్పుడు రూపు తీసుకున్నాయి? వాటి పరస్పర సంబంధం ఏమిటి? అవి ఏ తర గతులపై ఎందుకు ప్రభావాలు చూపుతున్నాయి? ఆ నినాదాల స్వభావం ఏమిటి? ట్రంప్ వంటి నాయకుల జయాపజయాలతో నిమిత్తం లేకుండా వారి వెంట బలంగా ఎందుకు నిలబడుతున్నారు? 'మాగా'ను ట్రంప్ అసా ధారణమైన రీతిలో ఒక ఉద్యమమని ఎందుకు అంటున్నారు? చివరిగా చూసినట్లయితే, ఈ ఉద్యమం అనేది అమెరికన్ సమాజంలో ఎందుకు ఇంకా విస్తరిస్తున్నది? అనే విషయాలు ఒక మేరకైనా అర్థమవుతాయి.



ఆ పరిశీలకులు చెప్తున్నది ముందు యథాతథంగా చూసి, ఈ నినాదాల లక్ష్యాల సాధనకు ట్రంప్ తన మొదటి విడత పాలనలో చేసిందేమిటి? చేయలేక పోయిందేమిటి? చేసిన వాటి ఫలితాలేమిటి? ఈసారి చేయగలదేమిటి? అనే విషయాలు తర్వాత విచారిద్దాము. విశేషం ఏమంటే, ట్రంప్ రిపబ్లికన్ కాగా, తన 'మాగా' తరహా నినాదాన్ని అదే పార్టీకి చెందిన అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ (1981–89) మొదటిసారిగా 1980లోనే మరొక రూపంలో ఇచ్చారు. ఆయన నినాదం 'లెట్ అజ్ మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్'. ఈ నినాదంలో రీగన్ ఆలోచనలకు ట్రంప్ ఉద్దేశాలతో పోలిక లేదన్నది అట్లుంచితే, రీగన్ తర్వాత ఆ నినాదం వెనుకకు పోయింది. తర్వాత 22 సంవత్సరాలకు రిపబ్లికన్ అభ్యర్థి మిట్ రోమ్నీ 2012లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి బరాక్ ఒబామా చేతిలో ఓడినప్పుడు, ట్రంప్ తన 'మాగా' నినాదం తయారు చేశారు. అంతేకాదు, ఉత్పత్తులకు కాపీరైట్ పద్ధతిలో దీనిని రిజిస్టర్ కూడా చేయించారు. మరొక మూడేళ్లకు 2015లో అధ్యక్ష పదవి పోటీకి నామినేషన్ వేసి, 'మాగా' నినాదాన్ని ప్రకటించటంతోపాటు, అది ఒక 'ఉద్యమ'మని కూడా అన్నారు.

'మాగా', 'అమెరికా ఫస్ట్' నినాదాలు వెంటనే అమెరికన్ సమాజంలోని కొన్ని తరగతులను ఆకర్షించాయి. వారిలో శ్వేతజాతీయులైన కార్మికులు, మామూలు పనులు చేసుకునేవారు, గ్రామీణ–పట్టణ ప్రాంత పేదలు, కన్సర్వేటివ్‌లు, సాంప్రదాయిక క్రైస్తవులు, డెమోక్రటిక్ పార్టీ సంపన్నుల కోసం పనిచేస్తుందనీ అందువల్ల తాము నష్టపోతున్నామనీ భావించేవారు, తమ నిరుద్యోగ సమస్యకు ఆ పార్టీ విధానాలే కారణమనేవారూ ఉన్నారు. ఆ చర్చలోనే భాగంగా విదేశీయుల సక్రమ, అక్రమ వలసలు ముందుకొచ్చాయి. గమనించదగినదేమంటే, 2012లో గానీ, 2015లో నామినేషన్ వేసిన సమయానికిగానీ ట్రంప్ తన నినాదాలకు నిర్వచనం చెప్పలేదు. అయినప్పటికీ వారంతా, 'అనిర్వచనీయ అనుభూతి' అన్న పద్ధతిలో ట్రంప్ నినాదాలలో తమ సమస్యలకు 'అనిర్వచనీయ పరిష్కారం' ఏదో చూసుకున్నారు. ట్రంప్ అన్నట్లు అదొక ఉద్యమంగా, లేక రహస్యోద్యమంగా వ్యాపించింది. దాని కదలి కలను డెమోక్రాట్లు, మీడియా, ఉదార వాదులు, అకడమిక్ పండితులు ఎవరూ గమనించలేదు. తీరా 2016 ఎన్నికలో హిల్లరీ క్లింటన్ ఓడి ట్రంప్ గెలవటంతో వీరికి భూకంపం వచ్చినట్లయింది.

ట్రంప్ స్వయంగా నిర్వచించకపోయినా, ఆయన నినాదాలలో తన సమర్థకులకు కనిపించిందేమిటి? అవి అమెరికాలో మొదటి నుంచిగల నేటివ్ అమెరికన్లకు ఉపయోగపడతాయి. అమెరికా ఒకప్పుడు గొప్ప దేశం కాగా తర్వాత తన ప్రాభవాన్ని కోల్పోయింది. అందుకు కారణాలు విదేశీ ప్రభావాలు. ఆ ప్రభావాలు వలసలు, బహుళ సంస్కృతుల రూపంలో, అదే విధంగా ప్రపంచీకరణల ద్వారా కనిపిస్తూ స్థానిక జనాన్ని, సంస్కృతులను, ఆర్థిక పరిస్థితులను దెబ్బ తీస్తున్నాయి. అందువల్లనే ఉద్యోగ ఉపాధులు పోవటం, ధరలు పెరగటం వంటివి జరుగుతున్నాయి. ఈ పరిస్థితులలో విదేశీ ఆర్థిక ప్రభావాలను, వలసలను అరికట్టినట్లయితే, 'అమెరికా ఫస్ట్' నినాదం ప్రకారం తమకు రక్షణ లభిస్తుంది, తమ సంస్కృతి వర్ధిల్లుతుంది. ఈ తరగతుల ఈ విధమైన ఆలోచనల నుంచి వారికి ఈ నినాదాల ద్వారా, కొన్ని లక్షణాలు లేదా స్వభావం ఏర్పడ్డాయి. నాయకత్వం నుంచి నినాదాలకు స్పష్టమైన నిర్వచనాలు లేకపోవటం అందుకు దోహదం చేసింది. అట్లా కలిగిన లక్షణాలు తీవ్రమైన వైఖరి తీసుకోవటం, వలసలు వచ్చే వారిపై, ముస్లిం తదితర మైనారిటీలపై ఆగ్రహం, జాతివాదం, మహిళా వ్యతిరేకత, ఉదారవాద వ్యతిరేకత, మెయిన్ స్ట్రీమ్ మీడియా అనేదానిపట్ల వ్యతిరేకత, తీవ్రంగా వివాదాస్పదంగా మాట్లాడటం, చట్టాల ఉల్లంఘన, హింసకు వెనుకాడకపోవటం వంటివి వారిలో తలెత్తి నానాటికీ పెరుగుతూ పోయాయి.

విశేషం ఏమంటే, ట్రంప్ స్వయంగా ఒక ధనిక కుటుంబం నుంచి వచ్చి తాను కూడా బిలియన్లకొద్దీ ధనం సంపాదించి కూడా తన భావజాలం ప్రభావంతో పై విధమైన తరగతులకు ప్రతినిధిగా మారారు. వారి ఆలోచనలూ, ఆకాంక్షలకు, తన ఆలో చనలకు తేడా లేనందున 'మాగా', 'అమెరికా ఫస్ట్' నినాదాలకు ప్రత్యేకంగా నిర్వచనాలు చెప్పవలసిన అవసరమే రాలేదు. ఒకరినొకరు అప్రకటితమైన రీతిలో అర్థం చేసుకుని సహజ మిత్రులయ్యారు. గత పర్యాయం ట్రంప్ ప్రచారాంశాలు, మొదటి విడత పాలనలో తను తీసుకున్న కొన్ని చర్యలు వారి బంధాన్ని మరింత బలపరిచాయి. ఉదాహరణకు, ముస్లింల రాకను 'పూర్తిగా' నిషేధించగలనని 2015 నాటి ప్రచారంలోనే ప్రకటించిన ఆయన, అధ్యక్షుడైన తర్వాత పట్టుదలగా మూడుసార్లు ప్రయత్నించి కొన్ని అరబ్ దేశాల నుంచి వలసలను నిషేధించారు. అమెరికాకు, మెక్సికోకు మధ్య గోడ నిర్మాణం మొదలుపెట్టారు. వీసాలపై పరిమితులు విధించారు. యూరప్‌తో సహా పలు దేశాల దిగుమతులపై సుంకాలు పెంచారు. తమకు ఆర్థిక ప్రత్యర్థిగా మారిన చైనాపై ఆర్థిక యుద్ధం ప్రకటించారు. తమ ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధిస్తున్నదంటూ ఇండియాను నిందించారు. చైనా నుంచి అమెరికాకు తిరిగి రావాలంటూ అమెరికన్ కంపెనీలను బెదిరించారు. ఆ దేశం తమ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉద్యోగాలను 'దొంగిలిస్తూ' తమ యువకులకు ఉద్యోగాలు లేకుండా చేస్తున్నదన్నారు.

ఈ చర్యల వల్ల అమెరికాకు అంతిమంగా కలిగిన ప్రయోజనాలు స్వల్పమన్నది వేరే విషయం. కానీ, గమనించవలసింది దీనంతటిలోని అంతరార్థం. అది గమనించినందువల్లనే, నినాదాలకు నిర్వచనాలంటూ లేకున్నా ఆ తరగతులు ఇప్పటి ఎన్నికల వరకు ట్రంప్‌కు అండగా నిలిచాయి. చివరకు, పోయినసారి ట్రంప్ ఓడిపోయి కూడా అధికార బదిలీకి వెంటనే అంగీకరించని అసాధారణ స్థితి గానీ, ఆయన ప్రోత్సాహంతో అనుచరులు క్యాపిటల్ హిల్ వద్ద హింసకు పాల్పడటంగానీ, పైన పేర్కొన్న స్వభావాల నుంచి పుట్టుకొచ్చినవే.


ట్రంప్ పాలన ఈ విడతలో 'మాగా', 'అమెరికా ఫస్ట్' నినాదాలకు ఎంతవరకు అనుగుణంగా ఉండవచ్చునన్నది ప్రశ్న. గత పర్యాయపు పాలనానుభవాలు ఆయనకు ఉన్నాయి. అది గాక, ప్రపంచ పరిస్థితులు ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా అప్పటి కన్నా మారాయి. అందువల్ల, వాస్తవ పాలన ఏ విధంగా సాగేదీ వేచి చూడవలసిందే.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

ఉద్యమకారిణి స్మృతిలో విజ్ఞాన కేంద్రం

పితృస్వామ్య సంకెళ్లను తెంచుకుని సమసమాజ నిర్మాణ దార్శనికురాలుగా, నిజమైన కమ్యూనిస్టుగా తెలుగు నేలకు పరిచయమైన వాళ్లలో రంగవల్లి కూడా ఒకరు. నేటి ములుగు జిల్లా జగ్గన్నగూడెం అడవుల్లో సాయుధ విప్లవకారిణిగా కామ్రేడ్స్ జాన్‌రెడ్డి, చీపురు సతీష్, వాంకుడోతు అనితలను ముగ్గురు సహచరులతో ఆమె ఎన్‌కౌంటర్‌లో మృతి చెంది నవంబర్ 11 నాటికి 25 ఏళ్ళు పూర్తవుతుంది. శాంతి చర్చల కాలంలో (2004–2005).... ఆమె అసువులు బాసిన ఐదేళ్ల తర్వాత రంగవల్లి (40) స్మృతిలో వేములవాడ సమీపంలోని నంది కమాన్ వద్ద నిర్మించ తలపెట్టిన స్తూపం నిర్బంధ కారణాల రీత్యా అర్ధంతరంగా ఆగిపోయింది. ఇరవైయేళ్ల తర్వాత కూడా దానిని పునర్నిర్మాణం చేయలేని పరిస్థితుల్లో, ఆమె స్మృతిని శాస్త్రీయ విజ్ఞాన భాండాగారంగా మార్చాలని తలంపుతో దాని సమీపంలోనే 'రంగవల్లి విజ్ఞాన కేంద్రం' అనే ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక గ్రంథాలయం నిర్మాణం కావడం ఆహ్వానించదగ్గ పరిణామం. చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, సిక్కోలు నిర్మల, అంకమ్మ, సరస్వతి, స్నేహలతా రెడ్డి, గోదావరి లోయ లక్ష్మక్క, పూలక్క, కరీంనగర్ చైతన్య, జ్యోతి, అరుణ, దేవేంద్ర, కొదురుపాక రాజవ్వ లాంటి ఎంతోమంది త్యాగధనులకు ప్రతిరూపంగా... జనశక్తి రాష్ట్ర నాయకురాలిగా నేలరాలిన రంగవల్లిని భావించాలి.

ఒకవైపు కృత్రిమ మేధ పెరుగుతూ, మొబైల్ ద్వారా అర చేతిలో ప్రపంచం కనబడుతున్న పరిస్థితుల్లో విజ్ఞాన కేంద్రాలు, గ్రంథాలయాల పాత్ర ఏమిటనే ప్రశ్న వినపడుతుంది. కంప్యూటర్ యుగంలోనూ పఠనాసక్తి పెరుగుతుందని దేశ–విదేశీ సర్వేలు అనేకం వెల్లడి చేస్తున్నాయి. ప్రతి ఏటా బుక్ ఫెయిర్‌లో లభిస్తున్న పుస్తకాలు, లెక్కకు మించిన సంఖ్యలో ప్రచురించబడుతున్న పుస్తకాలు ఈ విషయాన్ని రూఢి చేస్తున్నాయి.



ఆధునిక గ్రంథాలయాలు ప్రజా విశ్వవిద్యాలయాలుగా పిలువబడుతున్నాయి. ప్రపంచంలోనే అరుదైన, అత్యంత మేధా సంపన్నులుగా గుర్తించబడుతున్న మహనీయులు కారల్ మార్క్స్, డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్‌లు లండన్ గ్రంథాలయంలో అధ్య యనం చేసిన వాళ్ళే.

స్టడీ సర్కిల్స్, మార్క్సిస్టు విజ్ఞాన కేంద్రాలు, శిక్షణ తరగతులు మొదలుకొని తెలుగు నెలలో ఎన్నో ప్రజా విశ్వవిద్యాలయాలు సామాజిక చైతన్యంలో తమ పాత్రను పోషిస్తున్నాయి. అయితే వర్గ పోరాటాలనే పాఠశాలలు ప్రజలను జాగరూకులుగా చేస్తూ, ప్రజా జీవితాల్లో గుణాత్మక మార్పుకు నాంది పలుకుతూనే ఉన్నాయి. ఆచరణ నుండి జ్ఞానం, జ్ఞానం నుండి మరింత మెరుగైన ఆచరణ అనే గతితార్కిక క్రమంలో ప్రజా విశ్వవిద్యాలయాలుగా గ్రంథాలయ పాత్రను మనం విస్మరించలేము. దీని నుండే 'స్టడీ అండ్ స్ట్రగుల్' (అధ్యయనం పోరాటం) అనే నినాదం ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి నుండి ప్రారంభమైంది. అందుకే విప్లవ విద్యార్థి సంఘాలన్నీ కలిసి ఉస్మానియాలో కామ్రేడ్ జార్జిరెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకై పోరాడుతున్నాయి. మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రారంభంలో గ్రంథాలయోద్యమం కూడా కీలక పాత్ర పోషించింది.

రంగవల్లి విజ్ఞాన కేంద్రం కూడా ప్రజలకు శాస్త్రీయ విజ్ఞానాన్ని పంచడంతో పాటు వైవిధ్య భరిత చర్చాగోష్ఠులతో 'వంద పూలు వికసించనీ – వేల భావాలు ఘర్షించనీ' అంటూ ముందుకు సాగాలి. 'అందరికీ ఒకే బడి – అందరికీ ఒకే విద్య' అంటూ కొత్త నినాదంతో సాగుతున్న ఉద్యమంలో 'ప్రతి బడికి ఒక గ్రంథాలయం – ప్రతి ఊరికి ఒక గ్రంథాలయం' అంటూ జోడిస్తూ కలిసికట్టుగా ముందుకు సాగుదాం. ఈ విషయంలో రంగవల్లి విజ్ఞాన కేంద్రం కూడా తన వంతు పాత్ర పోషించాలి.

– అమర్

(రేపు వేములవాడ నందికమాన్ దగ్గర రంగవల్లి విజ్ఞానకేంద్రం ప్రారంభం)

సైన్స్ సద్వినియోగంతోనే...

సైన్స్ అనేది శాంతి, సమాజ అభివృద్ధి కోసం ఉపయోగపడాలని సైన్స్‌ను సమాజంతో మరింత సన్నిహితంగా అనుసంధానించడం ద్వారా సమాజంలో సైన్స్ యొక్క ముఖ్యమైన పాత్రను తెలియజేయాలనే యూఎన్ ఎడ్యుకేషనల్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) భావించింది. అందుకే ప్రతి సంవత్సరం నవంబర్ 10వ తేదీని 'వరల్డ్ సైన్స్ డే ఫర్ పీస్ అండ్ డెవలప్మెంట్' (శాంతి మరియు అభివృద్ధికి ప్రపంచ సైన్స్ దినోత్సవం)గా జరుపుకోవాలని నిర్ణయించింది.

శాస్త్రవేత్తల సైంటిఫిక్ పరిశోధనలు సమాజ ప్రయోజనాల కోసం కనుగొనబడినా, వాటిని విధ్వంసానికీ వాడటం విషాదకరం. ఆల్ఫ్రెడ్ నోబెల్... మైనింగ్, నిర్మాణ ప్రాజెక్టుల కోసం పెద్దపెద్ద బండ రాళ్లను, పేల్చడానికి సురక్షితమైన, మరింత సమర్థమైన మార్గాన్ని సృష్టించాలనే ఉద్దేశంతో 'డైనమైట్'ను కనుక్కున్నాడు. కానీ డైనమైట్ యుద్ధంలో సైనికులు చనిపోవటానికీ, అనేకరకాల విధ్వంసానికి కూడా ఉపయోగించబడింది. అదేవిధంగా ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 'మాస్–ఎనర్జీ ఈక్వివలెన్స్' సూత్రం మానవాళి ప్రయోజనానికి ఉద్దేశించబడినది. ఈ సూత్రాన్ని ఉపయోగించి సమాజానికి అవసరమయ్యే అణువిద్యుత్తును తయారు చేయటంలో, వైద్య రంగంలో, వివిధ ఇతర రంగా లలో ఈ సూత్రం ఉపయోగపడుతుంది. కానీ ఇదే సూత్రాన్ని ఉపయోగించి ప్రపంచ విధ్వంసకర అణుబాంబులను తయారు చేయడాన్ని చూసి ఐన్‌స్టీన్ చాలా పశ్చాత్తాప పడ్డాడు.

మొత్తం మీద సైన్స్ ఆవిష్కరణలు మన జీవితాలను మార్చాయి, అనేక ప్రయోజనాలను తెచ్చాయి, కొన్ని ప్రతికూల ప్రభావాలనూ చూపిస్తున్నాయి. ఉదాహరణకు మితిమీరిన సోషల్ మీడియా వినియోగం మానసిక ఆరోగ్య సమస్యలు కలగడానికీ, సామాజిక నైపుణ్యాలు తగ్గటానికీ కారణం అవుతున్నది. అనియంత్రిత జెనెటిక్ ఇంజనీరింగ్ వ్యవసాయ ఉత్పత్తులు... పర్యావరణ వ్యవస్థలు, మానవ ఆరోగ్యానికి ప్రమాదాలను పెంచాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగాలు కోల్పోవటంతో పాటు మానవుని మేధాశక్తి వినియోగం తగ్గిపోతుంది. పురుగు మందుల మితిమీరిన వినియోగం పర్యావరణ వ్యవస్థలను మరియు మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేసింది. ప్లాస్టిక్‌ల ఆవిష్కరణ మానవాళికి ఒక వరంగానూ, శాపంగానూ పరిణమించింది. ప్లాస్టిక్‌తో చాలా సులభంగా తక్కువ ఖర్చుతో అనేక వస్తువులను తయారు చేస్తున్నప్పటికీ... దీని విచ్చలవిడి వాడకం క్యాన్సర్ వంటి అనేక అనారోగ్య సమస్యలకూ, వాతావరణ సమస్యలకూ కారణమవుతోంది.

సైన్స్‌ను సమాజానికి అనుసంధానించడం ద్వారా ప్రజలలో చేతబడి వంటి మూఢ విశ్వాసాలను, భయాలను నిర్మూలించవచ్చు. అదే విధంగా ప్రతి విషయాన్నీ హేతుబద్ధంగా ఆలోచించే స్వభావాన్ని సమాజంలో పెంపొందించవచ్చు. భారతదేశానికి బలమైన సైంటిఫిక్ వారసత్వం ఉంది. మన పూర్వీకులు ఆర్యభట్ట, బ్రహ్మగుప్తుడు, భాస్కరుడు వంటివారు మనకు చూపిన వైజ్ఞానిక మార్గాన్ని అనుసరించి ప్రజలలో సైంటిఫిక్ ఆలోచనలను విస్తృతంగా ప్రచారం చేసినప్పుడే మన పూర్వ వైభవాన్ని తిరిగి పొందగలుగుతాము.

– డా॥ శ్రీధరాల రాము । ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్, హైదరాబాద్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

26 రోజుల పాటు..
'ఏడాది' పాలన విజయోత్సవాలు

- ఈ నెల 14 నుంచి డిసెంబర్ 9 వరకు నిర్వహిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి
- ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం, కొత్త విధానాల ప్రకటన
- ఉస్మానియా కొత్త ఆస్పత్రికి శంకుస్థాపన.. 16 నర్సింగ్, 28 పారామెడికల్ కళాశాలల ప్రారంభం
- ఉత్సవాల ఉప సంఘం భేటీలో నిర్ణయించినట్టు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై వచ్చే నెల 7వ తేదీతో ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజైన నవంబర్ 14న ప్రారంభించి.. డిసెంబర్ 9వ తేదీ వరకు 26 రోజులపాటు నిర్వహించనుంది. ఈ ఉత్సవాల నిర్వహణ కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శనివారం సచివాలయంలో సమావేశమైంది. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, ప్రజాకవి జయరాజ్, వివిధ శాఖల కార్యదర్శులు ఈ భేటీలో పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళతాం..

సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. ''సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో దేశంలోని మరే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని ఎన్నో విప్లవాత్మక, ఊహకు అందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమాలను షోకేస్ చేస్తూ, ప్రభుత్వ విజన్‌ను తెలియచేసేలా విజయోత్సవ కార్యక్రమాలను రూపొందిస్తున్నాం. ఈ 26 రోజుల కార్యక్రమాల్లో ప్రభుత్వ గ్యారంటీ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పెంపు తదితర పథకాలతోపాటు, ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలను చైతన్యపరుస్తాం..''అని భట్టి తెలిపారు. ఇప్పటికే 50వేల ఉద్యోగాలు ఇచ్చామని.. రూ.18 వేల కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేశామని, మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందచేశామని భట్టి చెప్పారు. మూతపడిన కమలాపూర్ రేయన్స్ పరిశ్రమను రూ.4 వేల కోట్లతో పునరుద్ధరించబోతున్నామని వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

వేడుకగా ముగింపు కార్యక్రమం

విజయోత్సవాల ముగింపు రోజైన డిసెంబర్ 9న హైదరాబాద్‌లో వేలాది మంది కళాకారులతో ప్రదర్శనలు, లేజర్ షోలు, బాణసంచా ప్రదర్శన వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని భట్టి తెలిపారు. ఉత్సవాల సమయంలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. గ్రూప్–4 పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని.. వివిధ శాఖలకు సంబంధించిన పాలసీలను ప్రకటిస్తామని వివరించారు. పలు కంపెనీలతో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం, స్కిల్ యూనివర్సిటీకి ఫౌండేషన్, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారా మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం, ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను ప్రారంభిస్తామన్నారు. ఆయా కార్యక్రమాలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా సంబంధిత శాఖలను ఆదేశించినట్టు తెలిపారు.

యాదాద్రిలో కార్తీక వ్రతాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండ దిగువన ఉన్న వ్రత మండపంలో శనివారం వివిధ ప్రాంతాల భక్తులు శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను జరిపించారు. అనంతరం కొండపైన శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక దీపారాధనలో పాల్గొన్నారు. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి రెండు గంటల సమయం పడుతుండగా.. వీఐపీ దర్శనానికి 45 నిమిషాలు పడుతోందని భక్తులు వెల్లడించారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలతో రూ.5,67,200, నిత్య ఆదాయం రూ.42,42,475 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహిస్తున్న భక్తులు

దొంగలతో దోస్తీ చేసిన కానిస్టేబుల్ మృతి

- ముఠాలోని ఓ సభ్యుడి అరెస్ట్

నాగోలు: దొంగలతో మిలాకాత్ అయి, వారితో కలిసి నేరాలు చేసి ఉద్యోగం పోగొట్టుకున్న ఓ కానిస్టేబుల్ చివరికి వారి చేతిలోనే హతమయ్యాడు. సెటిల్‌మెంట్ కోసమని కానిస్టేబుల్‌ని పిలిచిన నిందితులు కారుతో ఢీకొట్టారు. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందిన కానిస్టేబుల్ శుక్రవారం మృతి చెందాడు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మేకల ఈశ్వర్ 2010లో కానిస్టేబుల్‌గా పోలీసు విభాగంలో చేరాడు. నేరాలపై పట్టు సాధించడంతో దొంగలతో దోస్తానా పెరిగింది. వారి ఆదాయం, ఆర్భాటం చూసి తాను కూడా భారీగా సంపాదించి జల్సాగా బతకాలని ఆశించాడు. ఈ క్రమంలో నగరంలో చోరీకి గురైన ఫోన్లు కొనుగోలు చేసిన వారిని బెదిరిస్తూ డబ్బులు, సెల్‌ఫోన్‌లు తీసుకునేవాడు. అంతేకాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక ఇతర ప్రాంతాలల్లో స్నాచర్లు, దొంగలతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో చెన్నైలో ఉంటూ ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఇతర ప్రాంతాలల్లో తన నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని జేబుదొంగల గ్యాంగ్‌లను నిర్వహిస్తున్నాడు. అయితే నగరంలో ఆయా గ్యాంగ్‌ల ఆధిపత్యపోరు పెరిగింది. దీంతో విభేదాలు పెరగడంతో గత వారం రోజుల క్రితం ఈశ్వర్‌ను సెటిల్‌మెంట్ కోసమని కర్మన్‌ఘాట్‌కు పిలిచారు. అందరూ మద్యం సేవించిన అనంతరం గొడవ పడ్డారు. దీంతో అక్కడే ఉన్న మరో ముఠా సభ్యులు కారుతో ఈశ్వర్‌ను గుద్ది హత్య చేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనలో ముఠాలోని ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం.

కూల్ డ్రింక్‌లో విషం తెచ్చిన విద్యార్థిని

- తల్లిదండ్రులు మందలించడంతో తెచ్చిన వైనం
- తెలియక తాగిన స్నేహితురాలికి అస్వస్థత



ఇటిక్యాలలోని మోడల్ స్కూల్

రాయికల్: జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల మోడల్ స్కూల్‌కు చెందిన ఓ విద్యార్థిని తల్లిదండ్రులు మందలించడంతో కూల్ డ్రింక్‌లో విషం కలుపుకొని పాఠశాలకు వచ్చింది. ఈ విషయం తెలియని ఆమె స్నేహితురాలు తాగడంతో అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మండలంలోని ఆలూరుకు చెందిన విద్యార్థిని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. దీపావళికి ఇంటికి వెళ్లిన ఆమె కుటుంబసభ్యులతో గొడవపడి తిరిగి హాస్టల్‌కు చేరుకుంది. వచ్చే సమయంలో తన వెంట ఒక కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలుపుకొని వచ్చింది. అయితే అదే హాస్టల్‌లో ఉంటున్న నిర్మల్ జిల్లా చిన్నబెల్లాలకు చెందిన ఆమె స్నేహితురాలు ఆ కూల్‌డ్రింక్‌ను కొద్దిగా తాగింది. గమనించిన సదరు విద్యార్థి అందులో గడ్డి మందు కలిపానని హాస్టల్ సిబ్బందికి చెప్పడంతో వారు హుటాహుటిన ఆమెను రాయికల్ ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు ప్రిన్సిపాల్ రాజేశ్ తెలిపారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బానోతు మైబు

వర్ధన్నపేట/సంగెం: పంటపై పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతోపాటు, చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం జగ్నాతండాలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై చందర్ కథనం ప్రకారం.. జగ్నాతండాకు చెందిన బానోతు మైబు (35) తనకున్న ఎకరం పొలంతోపాటు నల్లబెల్లి గ్రామానికి చెందిన గజ్జెల ఆగయ్యకు చెందిన రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పెట్టుబడులు అధికం కావడం, పంట దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనకు గురయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మైబు తన భార్య రజితకు ఫోన్ చేసి అప్పులు తీర్చే మార్గం కనిపించక పురుగు మందు తాగానని చెప్పాడు. దీంతో వెంటనే ఆమె తన బంధువులను తీసుకుని పొలం వద్దకు వెళ్లి చూడగా మైబు అపస్మారకస్థితిలో కనిపించాడు. మైబును 108 ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్ తెలిపారు.

పొలం దున్నుతూనే ఆగిన రైతు గుండె



రాజాలు

పంటచేనులో నాగలితో దున్నుతుండగానే ఓ రైతు గుండె ఆగిపోయింది. ఈ ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో శనివారం చోటు చేసుకుంది. గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు ఎల్లబోయిన రాజాలు (49) తన పొలంలో దుక్కి దున్నుతున్నాడు. ఈ క్రమంలో గుండెపోటుకు గురైన రాజాలు అకస్మాత్తుగా కిందపడిపోయాడు. ఇది గమనించిన భార్య పుష్ప సమీపంలోని రైతులను పిలిచి ఆసుపత్రికి తరలిద్దామనుకునేలోగా రాజాలు చనిపోయాడు. రాజాలుకు కుమారుడు శ్రీకాంత్, కూతురు అనుష ఉన్నారు.

అప్పులు తీర్చలేక..

- సిరిసిల్లలో నేత దంపతుల ఆత్మహత్య



అమర్, స్రవంతి

సిరిసిల్ల టౌన్: అప్పులు తీర్చే మార్గం కనిపించక నేత దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సంఘటన పై మృతుల బంధువులు తెలిపిన వివ రాలివి. మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి సిరిసిల్లకు 15 ఏళ్ల క్రితం బైరి అమర్ (41), స్రవంతి (34) దంపతులు ఉపాధి నిమిత్తం సిరిసిల్లకు వచ్చారు. వీరికి ముగ్గురు పిల్లలు లహరి (15) , శ్రీవల్లి (14), దీక్షిత్ (12) ఉన్నారు. నేత కార్మికుడిగా పనిచేసిన అమర్ తర్వాత బెడ్‌షీట్లు తయారు చేసే వ్యాపారం ప్రారంభించారు. అప్పుచేసి ఇల్లుకొని, సొంతంగా వ్యాపారం పెట్టుకున్నారు. వీటి కోసం దాదాపు రూ.95 లక్షల వరకు అప్పు చేసినట్లు బంధువులు తెలిపారు. కాగా, ఇటీవల సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో ఆదాయం పడిపోయింది. ఈక్రమంలో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. అప్పు చెల్లించకపోవడంతో ఇంటిని బ్యాంక్ వారు స్వాధీనం చేసుకుంటారన్న బాధతో దంపతులు శనివారం ఇంట్లోనే ఉరి వేసుకున్నారు. సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బేగంపేట ఎయిర్ పోర్టును వాణిజ్య అవసరాలకివ్వాలి'

సాక్షి, హైదరాబాద్: బేగంపేట విమానాశ్రయం భూమిని వాణిజ్య అవసరాలకు ఉపయోగించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ స్థలాన్ని కేంద్ర పర్యాటక, వాణిజ్యశాఖల భాగస్వామ్యంతో పౌరవిమానయానశాఖ వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ఇందువల్ల తగిన ఆదాయాన్ని ఆర్జించడం ద్వారా హైదరాబాద్ ప్రజలకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చని ఒక ప్రకటనలో సూచించారు. దాదాపు 90 ఏళ్ల ఈ విమానాశ్రయం వాణిజ్యపరంగా ఎలాంటి వైమానిక కార్యకలాపాలు జరగక.. నిరుపయోగంగా ఉందని పేర్కొన్నారు.

డీఏపీకి 'గాజా' దెబ్బ

మన రైతులను వేధిస్తున్న డీఏపీ కొరత

- దిగుమతులు తగ్గడమే ప్రధాన కారణం
- హరియాణాలో ఆందోళనలు తీవ్రతరం
- పంజాబ్, యూపీల్లోనూ ఇదే పరిస్థితి
- మధ్యప్రదేశ్, కర్నాటకల్లోనూ ఇక్కట్లే

ఎక్కడో జరిగిన చర్య ఇంకెక్కడో ప్రతి చర్యకు కారణమవుతుందంటారు. హరియాణా రైతుల విషయంలో అది నిజమవుతోంది. ఏడాదిగా సాగుతున్న గాజా సంక్షోభం భారత్‌లో డీఏపీ కొరతకు దారి తీస్తోంది. హరియాణా రైతులు రోడ్డెక్కేందుకు కారణంగా మారుతోంది.



హరియాణాలోని సిర్సా ప్రాంతంలో రైతులు వారం రోజులుగా రోడ్డెక్కుతున్నారు. రబీ సీజన్ వేళ తమకు సరిపడా డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్) ఎరువు సరఫరా చేయాలంటూ ఆందోళనకు దిగితున్నారు. పలు ఇతర జిల్లాల్లో కూడా రైతులు ఎరువుల పంపిణీ కేంద్రాల వద్ద కొద్ది రోజులుగా బారులు తీరుతున్నారు. కొరత నేపథ్యంలో డీఏపీ మున్ముందు దొరుకుతుందో లేదోనని ఎగబడ్డారు. దాంతో పోలీసులు లాఠీచార్జీ చేసేదాకా వెళ్లింది. పంజాబ్, ఉత్తరప్రదేశ్‌ల్లో కూడా ఇదే పరిస్థితి తలెత్తుతోంది. ఆవాలు, గోధుమ పంటల దిగుబడి బాగా రావాలంటే డీఏపీ తప్పనిసరి. ఆ మూడు రాష్ట్రాల్లో పంటలకు డీఏపీని విరివిగా వాడుతారు. పంటల నత్రజని, సల్ఫర్ అవసరాలను డీఏపీ బాగా తీరుస్తుంది. ఆ రాష్ట్రాల రైతులను డీఏపీ కొరత ఇప్పుడు తీవ్రంగా వేధిస్తోంది. హమాస్‌పై ఇజ్రాయెల్ యుద్ధంతో ఎర్రసముద్రంలో నెలకొన్న ఉద్రిక్తతలు డీఏపీ సరఫరాలో ఆలస్యానికి ప్రధాన కారణంగా మారాయి. గాజాలో ఏడాదికి పైగా సాగుతున్న యుద్ధం దెబ్బకు ప్రపంచ సరకు రవాణా గొలుసు అక్కడక్కడా తెగింది. దాంతో ఎరువుల దిగుమతిపై ఆధారపడిన భారత్ వంటి దేశాలకు కష్టాలు పెరిగాయి.

ఏటా 100 లక్షల టన్నులు

భారత్ ఏటా 100 లక్షల టన్నుల డీఏపీని వినియోగిస్తోంది. వీటిలో అధిక భాగం దిగుమతుల ద్వారానే వస్తోంది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణాలతో పాటు మధ్యప్రదేశ్, రాజస్తాన్, పశ్చిమబెంగాల్, కర్నాటకల్లోనూ డీఏపీ వాడకం ఎక్కువే. డీఏపీ లోటు ప్రస్తుతం ఏకంగా 2.4 లక్షల మెట్రిక్ టన్నులను దాటింది. దాంతో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో డీఏపీ కష్టాలు మరింత పెరిగాయి. హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం పశ్చిమాసియాలో విస్తరించి ఇరాన్, లెబనాన్, హెజ్‌బొల్లా, హౌతీలు ఇందులో భాగస్వాములయ్యారు. దీంతో ఎర్రసముద్రంలో ఉద్రిక్తత పెరిగి అతి కీలకమైన ఆ అంతర్జాతీయ సముద్ర మార్గం గుండా సరకు రాకపోకలు బాగా తగ్గాయి.

సరఫరాలపై హౌతీల దెబ్బ!

సరకు రవాణా విషయంలో ఎర్రసముద్రం చాలా కీలకం. మధ్యధరా సముద్రాన్ని సూయాజ్ కాల్వ ద్వారా హిందూ మహాసముద్రంతో కలిపేది అదే. అలాంటి ఎర్ర సముద్రంపై యెమెన్‌లోని హౌతీలు పట్టుసాధించారు. నౌకల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారారు. వాటిపై తరచూ దాడులకు తెగబడుతుండటంతో ఎర్రసముద్రం మీదుగా సరకు రవాణా బాగా తగ్గిపోయింది. దగ్గరి దారి అయిన సూయాజ్ ద్వారా రావాల్సిన సరకు ఆఫ్రికా ఖండాన్నంతా చుడుతూ కేప్ ఆఫ్ గుడ్‌హోప్ మీదుగా తిరిగి రావాల్సి వస్తోంది. అలా ఒక్కో నౌక అదనంగా ఏకంగా 6,500 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. ఫలితంగా సరకు డెలివరీ చాలా ఆలస్యమవుతోంది. కేంద్రం దీన్ని ముందుగానే ఊహించింది. సెప్టెంబర్–నవంబర్ సీజన్‌లో ఎక్కువ ఎరువును అందుబాటు ఉంచాలని భావించినా ఆ స్థాయిలో సరకు దిగుమతి కాలేదు. దాంతో డీఏపీ కొరత అధికమైంది. భారత్ 2019–20లో 48.7 లక్షలు, 2023–24లో 55.67 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీని దిగుమతి చేసుకుంది.

ప్రత్యామ్నాయంగా ఎన్‌పీకే

డీఏపీకి బదులు నైట్రోజన్, పాస్ఫరస్, పొటాషియం (ఎన్‌పీకే) ఎరువును వాడాలని రైతులకు కేంద్రం సూచిస్తోంది. హరియాణాకు 60,000 మెట్రిక్ టన్నుల ఎన్‌పీకే కేటాయించామని, అందులో 29,000 టన్నులు రైతులకు అందిందని చెబుతోంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగినప్పుడే డీఏపీ కొరత తప్పదన్న భయాందోళనలు తలెత్తాయి. గాజా సంక్షోభం పుణ్యమా అని అవి తీవ్రతరమవుతున్నాయి.

ధరాభారం కూడా...

అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన ధరల వల్ల కూడా కేంద్రం భారీగా డీఏపీని కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. 2023 సెప్టెంబర్‌లో టన్ను డీఏపీ 589 డాలర్లుంటే ఈ సెప్టెంబర్‌కల్లా 632 డాలర్లకు ఎగబాకింది. అయినా కేంద్రం రాయితీ రూపేణా ఆ భారాన్ని భరిస్తూ వచ్చింది. 2020–21 సీజన్ నుంచి 50 కేజీల సంచి ధర రూ.1,350 దాటకుండా చూసింది. రష్యాతో పాటు సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, చైనాల నుంచి కూడా డీఏపీని దిగుమతి చేసుకుంటోంది. హరియాణా రైతులకు ఆందోళన అవసరం లేదని సీఎం నయాబ్ సింగ్ సైనీ చెప్పుకొచ్చారు. నవంబర్ కోటా కింద 1.1 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ సిద్ధంగా ఉందన్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నట్టు స్పష్టమవుతోంది. చాలా జిల్లాల్లో డీఏపీ సంచుల కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. కొందరు రైతులే డీఏపీని ముందస్తుగా భారీ పరిమాణంలో కొనేయడమే మిగతా వారికి సమస్యగా మారిందని హరియాణా సీఎం కార్యాలయం వివరణ ఇవ్వడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్



ట్రంప్ ఎన్నికపై సైన్యంలో రుసరుసలు!

వివాదాస్పద ఆదేశాలిస్తే ఏం చేయాలన్న దానిపై చర్చ

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. దీంతో అమెరికా రక్షణ శాఖలో కొత్త పరిణామాలు సంభవించబోతున్నాయి. విదేశాల నుంచి సామూహిక వలసలను కఠినంగా అణచివేస్తానని, అక్రమ వలసదార్లపై కచ్చితంగా చర్యలుంటాయని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. వలసలను కట్టడి చేయడానికి సైనిక దళాల సేవలు వాడుకుంటామని చెప్పారు. దేశంలో తన వ్యతిరేక గళాలపైనా ఆయన విరుచుకుపడే అవకాశం కనిపిస్తోంది. ప్రత్యర్థులకు వేధింపులు తప్పవన్న ప్రచారం సాగుతోంది. దేశంలో చట్టాల పటిష్ట అమలుకు యాక్టివ్–డ్యూటీ దళాలను రంగంలోకి దింపుతానని ట్రంప్ చెప్పారు. సైన్యంలో తిష్టవేసిన అవినీతిపరులను ఏరిపారేస్తానని ప్రకటించారు. తన ప్రభుత్వంలో విధేయులకు ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. సొంత ఇంటి(స్వదేశం)లోని శత్రువులపైకి సైన్యాన్ని పంపిస్తానని చెప్పారు. మరోవైపు తన అవసరాల కోసం సైన్యాన్ని వాడుకోవడంలోనూ ఆయన సిద్ధహస్తుడే. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడైనప్పుడు ఆయన దుందుడుకు చర్యలను సైనికాధికారులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఫలితంగా వారితో ఆయనకు విభేదాలు ఏర్పడ్డాయి. ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు సైనిక జనరల్స్ బలహీనులు, అసమర్థులు అని ట్రంప్ విమర్శించారు. ఇప్పుడు మరోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఆయన తీరుపై అమెరికా సైన్యంలో చర్చ మొదలైంది. ఒకవేళ ట్రంప్ వివాదాస్పద ఆదేశాలు ఇస్తే ఏం చేయాలి? ఎలా ప్రతిస్పందించాలన్న దానిపై ఇటీవల పెంటగాన్ అధికారులు సమావేశమైన చర్చించుకున్నట్లు తెలిసింది. ఈ భేటీ అనధికారికంగానే జరిగింది. ట్రంప్ ఆదేశాలు అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉంటే సున్నితంగా తిరస్కరించడమే మేలని కొందరు అభిప్రాయపడినట్లు సమాచారం. ట్రంప్ మళ్లీ ఎన్నిక కావడం సైన్యంలో చాలా మందికి ఇష్టం లేనట్లు తెలుస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

చట్టానికే విధేయులం..

అమెరికా అధ్యక్షుడంటే సమస్త సైనిక దళాలకు సుప్రీం కమాండర్. ఆయన ఆదేశాలను అధికారులు అమలు చేయాల్సి ఉంటుంది. కానీ, ట్రంప్‌పై సైన్యంలో స్పష్టమైన విముఖత కనిపిస్తోంది. ట్రంప్ వర్సెస్ అమెరికా మిలటరీ అన్నట్లుగా పరిస్థితి నెలకొంది. ట్రంప్‌తో సైన్యానికి ఉన్న గత అనుభవాలే ఇందుకు కారణం. ఆయన మళ్లీ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత రక్షణ శాఖను ప్రక్షాళన చేస్తారని అంచనా వేస్తున్నారు. తన విధేయులకు పెద్దపీట వేయడంతోపాటు తనను వ్యతిరేకించేవారిని లూప్‌లైన్‌లోకి పంపిస్తారని చెబుతున్నారు. అన్ని రకాల ప్రతికూల పరిణామాలకు సిద్ధమవుతున్నామని ట్రంప్ వ్యతిరేక అధికారులు కొందరు వ్యాఖ్యానించారు. అధ్యక్షుడి హోదాలో ఆయన చట్టవిరుద్ధమైన ఆదేశాలు ఇస్తే వ్యతిరేకిస్తామని, ఎదురు తిరుగుతామని కొందరు పేర్కొంటున్నారు. తాము కేవలం చట్టానికి మాత్రమే విధేయులమని, ట్రంప్‌నకు గానీ, ఆయన ఇచ్చే చట్టవిరుద్ధ ఆదేశాలకు గానీ కాదని ఓ అధికారి స్పష్టంచేశారు.

కెనడాలో ఖలిస్తాన్ మద్దతుదార్లున్నారు

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అంగీకారం

ఒట్టావా: కెనడాలో ఖలిస్తాన్ మద్దతుదారులు ఉన్నారని ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో అంగీకరించారు. అయితే, వారు మొత్తంగా సిక్కు సమాజానికి ప్రాతినిధ్యం వహించడం లేదని చెప్పారు. కెనడాలో ఒట్టావాలోని పార్లమెంట్ హాల్‌లో తాజాగా దీపావళి వేడుకల్లో ట్రూడో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ దేశంలో ఖలిస్తాన్ మద్దతుదారులు ఉన్నమాట వాస్తవమేనని చెప్పారు. అలాగే భారత ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుదారులు, అభిమానులు సైతం ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉన్నారని, అయితే వారంతా హిందూ కెనడా పౌరులకు ప్రాతినిధ్యం వహించడం లేదని తెలిపారు. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య తర్వాత భారత్, కెనడా మధ్య సంబంధాలు బలహీనపడిన సంగతి తెలిసిందే. ఖలిస్తాన్ ఉగ్రవాదులకు కెనడా అడ్డాగా మారిందని, అక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భారత్ పలుమార్లు ఆరోపించింది. అయినా కెనడా ప్రభుత్వం పెద్దగా స్పందించని సంగతి తెలిసిందే.

పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి

- క్వెట్టా రైల్వేస్టేషన్‌లో పేలుడులో 27 మంది దుర్మరణం
- 62 మందికి గాయాలు
- దాడి చేసింది తామేనన్న బలూచ్ లిబరేషన్ ఆర్మీ



పేలుడు అనంతరం రైల్వేస్టేషన్‌లో భీతావహ దృశ్యం

ఇస్లామాబాద్/కరాచీ: దాయాదిదేశం పాకిస్తాన్ ఆత్మాహుతి బాంబర్ పేలుడుతో దద్దరిల్లింది. శనివారం బలూచిస్తాన్ ప్రావిన్స్ రాజధాని నగరం క్వెట్టాలోని ఒక రైల్వేస్టేషన్‌లో జరిగిన పేలుడులో 14 మంది భద్రతాసిబ్బందిసహా 27 మంది ప్రాణాలు కోల్పోయారు. 62 మంది గాయపడ్డారు. ఉదయం 9 గంటలసమయంలో స్టేషన్ నుంచి పెషావర్‌కు జఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు బయల్దేరే సమయంలో ఈ దాడి జరిగింది. రైలు ఎక్కేందుకు ఎక్కువ మంది జనం ప్లాట్‌ఫామ్ వద్దకు చేరుకోవడంతో చాలా మంది ప్రయాణికులు పేలుడుబారిన పడ్డారు. పేలుడు ధాటికి ప్రయాణికుల మృతదేహాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడ్డాయి. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. క్షతగాత్రులను హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు శబ్దం సిటీలోని చాలా ప్రాంతాలదాకా వినిపించింది. లగేజీతో వచ్చిన ఒక ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చుకోవడంతో ఈ ఘటన జరిగిందని క్వెట్టా డివిజన్ కమిషనర్ హమ్జా షఫ్‌కాత్ చెప్పారు. దాడి చేసింది తామేనని ది బలూచ్ లిబరేషన్ ఆర్మీ వేర్పాటువాద సంస్థ ప్రకటించుకుంది. బలూచిస్తాన్ ప్రావిన్స్ అభివృద్ధిని పట్టించుకోకుండా పాక్ ప్రభుత్వం ఈ ప్రాంత సహజవనరులను కొల్లగొడుతోందని చాన్నాళ్లుగా బలూచ్ సంస్థ పోరాటంచేస్తోంది. అయితే ఈ ఆరోపణలను పాక్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతోంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీని పాక్ ప్రభుత్వం ఉగ్రసంస్థగా ప్రకటించింది. బలూచ్‌లోని ముస్తంగ్ జిల్లా ఆస్పత్రి, పాఠశాల వద్ద పేలుడులో 8 మంది చనిపోయిన ఘటన మరువకముందే అదే ప్రావిన్స్‌లో రెండు డజన్ల మంది ప్రాణాలుకోల్పోవడం గమనార్హం. క్వెట్టా పేలుడు ఘటనపై బలూచిస్తాన్ ముఖ్యమంత్రి సర్ఫ్రాజ్ బక్తీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. అమాయక ప్రజలపై దాడిగా అభివర్ణించారు. ఘటనపై వెంటనే సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. పౌరులు, కార్మికులు, మహిళలు, చిన్నారులను లక్ష్యంగాచేసుకుని దాడులుచేసే వారిని ప్రభుత్వం వదిలిపెట్టబోదని సీఎం అన్నారు.

ట్రంప్‌దే నెవడా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జయకేతనం ఎగరవేసిన ట్రంప్ తన మెజారిటీని మరింత పెంచుకుంటున్నారు. ఏడు కీలక స్వింగ్ రాష్ట్రాల్లో ఒకటైన నెవడాను కూడా శనివారం తన ఖాతాలో వేసుకున్నారు. అక్కడి 6 ఎలక్టోరల్ ఓట్లతో కలిపి ఆయన మొత్తం ఓట్లు 301కి పెరిగాయి. నెవడా 20 ఏళ్ల తర్వాత డెమొక్రాట్ల చేజారడం విశేషం. 11 ఓట్లున్న అరిజోనాలో ఫలితం వెలువడాల్సి ఉంది. అక్కడా 83 శాతం ఓట్ల లెక్కింపు పూర్తి కాగా ట్రంప్ 5 శాతానికి పైగా ఆధిక్యంలో ఉన్నారు. హారిస్‌కు 226 ఓట్లుకు రావడం తెలిసిందే. రిపబ్లికన్లు నాలుగేళ్ల తర్వాత సెనేట్‌లో కూడా మెజారిటీ సాధించడం తెలిసిందే. వారికి 52 సీట్లు రాగా డెమొక్రాట్లు 44కే పరిమితమయ్యారు. 2 సీట్లు స్వతంత్రులకు దక్కగా మరో రెండింట్లో ఫలితాలు వెలువడాల్సి ఉంది. ప్రతినిధుల సభ ఎన్నికల్లో కూడా రిపబ్లికన్ల ఆధిపత్యమే సాగుతోంది. 435 స్థానాలకు గాను ఇప్పటిదాకా రిపబ్లికన్లు 212 సీట్లు గెలుచుకున్నారు. మరో 6 సీట్లు వస్తే వారు మెజారిటీ మార్కు చేరుకుంటారు. డెమొక్రాట్లకు 200 స్థానాలు దక్కాయి.



ఆ నాలుగు వద్దు

- హారిస్ ఓటమికి మహిళల ప్రతీకారం
- అమెరికాలో 4బీ ఉద్యమం

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయాన్ని మహిళా హక్కుల కార్యకర్తలు, ప్రధానంగా డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారులైన మహిళలు జీర్ణించుకోలేకపోతున్నారు. గర్భస్రావ హక్కులకు వ్యతిరేకి అయిన ట్రంప్ రాక పట్ల ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా పురుషుల ఓట్లతోనే ఆయన గెలిచారని వారు భావిస్తున్నారు. ట్రంప్‌కు ఓటేసి గెలిపించినందుకు ప్రతీకారంగా పురుషులను పూర్తిగా దూరం పెట్టాలన్న నిర్ణయానికి వచ్చారు! ఈ దిశగా దేశవ్యాప్తంగా వేలాది మంది మహిళలు '4బీ' ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ''ఆ మగవాళ్లను దూరంగా పెడతాం. వారితో శృంగారం, పెళ్లి, పిల్లలను కనడం వంటి సంబంధాలేవీ పెట్టుకోబోం'' అని కరాఖండిగా చెబుతుండటం విశేషం! దక్షిణ కొరియాలో పుట్టుకొచ్చిన ఈ ఉద్యమం ఇప్పుడు అమెరికాలో ఊపందుకుంటోంది. ట్రంప్ విజయం తర్వాత బాగా ట్రెండింగ్‌గా మారింది. ట్రంప్ మహిళల వ్యతిరేకి అని, స్త్రీవాదమంటే ఆయనకు పడదని డెమొక్రటిక్ పార్టీ ముమ్మరంగా ప్రచారం చేయడం తెలిసిందే. గర్భస్రావ హక్కులకు మద్దతుగా నిలిచిన ఆ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ విజయంపై మహిళలు ఎంతగానో ఆశలు పెట్టుకున్నారు. ట్రంప్ విజయంతో ఆవేదనకు గురై వారు కన్నీరుపెట్టారు. తమ బాధను సోషల్ మీడియాలో పంచుకోవడంతోపాటు 4బీ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారం పొడవునా మహిళల హక్కులపై ట్రంప్, హారిస్ మద్దతుదారుల మధ్య మాటల యుద్ధం సాగింది. 4బీ ఉద్యమం దానికి కొనసాగింపని చెబుతున్నారు. ఇది మహిళల విముక్తి పోరాటమంటూ పోస్టు పెడుతున్నారు. ''తరాలుగా సాగుతున్న పురుషాధిక్యత, అణచివేతపై ఇలా నిరసన వ్యక్తం చేస్తున్నాం. మా హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తున్నాం'' అంటున్నారు. 4బీ పోరాటం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. దీని గురించి తెలుసుకొనేందుకు నెటిజన్లు తెగ ఆసక్తి చూపుతున్నారు. పోస్టులు, లైక్‌లు, షేరింగ్‌లతో సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. ఈ రాడికల్ ఫెమినిస్ట్ ఉద్యమం నానాటికీ బలం పుంజుకొంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ 4బీ ఉద్యమం?

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'మీ టూ' ఉద్యమం తర్వాత అదే తరహాలో దక్షిణ కొరియాలో 2018లో 4బీ ఉద్యమం మొదలైంది. ఓ మహిళ తన ఆర్ట్ క్లాస్‌లో భాగంగా నగ్నంగా ఉన్న పురుషున్ని ఫొటో తీసినందుకు అధికారులు ఆమెను అరెస్టు చేశారు. దీనిపై మహిళల ఆగ్రహావేశాలు 4బీ ఉద్యమానికి దారితీశాయి. బీ అంటే కొరియా భాషలో సంక్షిప్తంగా నో (వద్దని) చెప్పడం. పురుషులతో డేటింగ్, పెళ్లి, శృంగారం, పిల్లలను కనడం. ప్రధానంగా ఈ నాలుగింటికి నో చెప్పడమే 4బీ ఉద్యమం. దీన్ని అణచివేసేందుకు కొరియా ప్రభుత్వం ప్రయత్నించింది. స్త్రీ పురుషుల ఆరోగ్యకరమైన సంబంధాలను ఇలాంటి ఉద్యమాలు దెబ్బతీస్తాయని అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్ 2021లో చెప్పారు. ఇప్పుడక్కడ 4బీ గొడవ కాస్త సద్దుమణిగినప్పటికీ ప్రజలపై దాని ప్రభావం ఇంకా బలంగానే ఉంది. దాంతో కొన్నేళ్లుగా అక్కడ జననాల రేటు బాగా తగ్గిపోయింది. 4బీ ఉద్యమమే దీనికి ప్రధాన కారణమని న్యూయార్క్ టైమ్స్ పత్రిక అభిప్రాయపడింది.

ఆ రాష్ట్రాలు కాంగ్రెస్‌కు ఏటీఎంలు

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో విచ్చలవిడిగా అవినీతి

- ఓబీసీ నేత ప్రధానమంత్రి కావడం ఆ పార్టీ సహించలేకపోతోంది
- ఓబీసీలను ముక్కలు చేసి చిన్న కులాలుగా విడగొట్టే కుట్రలు
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం

అకోలా/నాందేడ్: కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ఆ రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకోవడం, అందినంత దోచుకోవడం ఆ పార్టీని నడిపిస్తున్న కుటుంబానికి అలవాటేనని మండిపడ్డారు. మహారాష్ట్రను కాంగ్రెస్‌కు ఏటీఎం కానివ్వబోమని తేల్చిచెప్పారు. ఆ పార్టీకి అధికారం అప్పగిస్తే అవినీతి విలయతాండవం చేయడం ఖాయమని ప్రజలను అప్రమత్తం చేశారు. ఎన్నికల్లో నెగ్గడానికి అవినీతి సొమ్మును విచ్చలవిడిగా వెదజల్లుతున్న కాంగ్రెస్ ఒకవేళ అధికారంలోకి వస్తే ఇక ఏ స్థాయిలో దోచుకుంటారో గమనించాలని కోరారు. శనివారం మహారాష్ట్రలోని అకోలా, నాందేడ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మద్యం వ్యాపారంలో కొల్లగొట్టిన రూ.700 కోట్లను మహారాష్ట్రకు మళ్లించారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలిత తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు సైతం ఆ కుటుంబానికి(సోనియా గాంధీ) ఏటీఎంలుగా మారాయని అన్నారు. విపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)పై మోదీ విమర్శలు గుప్పించారు. ఎంవీఏ అంటే అవినీతి, అక్రమ దందాలు అని మండిపడ్డారు. బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్‌కు సంబంధించిన పంచతీర్థాలను సోనియా గాంధీ కుటుంబం ఏనాడైనా సందర్శించిందా? అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే...

అంబేడ్కర్ మాకు స్ఫూర్తిప్రదాత

''అంబేడ్కర్ దళితుడు కావడంతో ఆయనను కాంగ్రెస్ ద్వేషిస్తోంది. రాజ్యాంగం రాసినందుకు అంబేడ్కర్ అంటే ఆ పార్టీకి ఇష్టంలేదు. కానీ మాకు, మా ప్రభుత్వానికి అంబేడ్కర్ ఒక స్ఫూర్తిప్రదాత. బాబా సాహెబ్‌తో అనుబంధం ఉన్న స్థలాలను ఎంతో అభివృద్ధి చేశాం. యూపీఐ సేవలకు భీమ్ యూపీఐ అని పేరుపెట్టాం. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండడం కాంగ్రెస్‌కు నచ్చదు. అందుకే కులాల మధ్య చిచ్చు పెడుతోంది. ఓబీసీల, ఆదివాసీలు, దళితులు పరస్పరం పోట్లాడుకోవాలని, ఓట్లు చీలిపోవాలని, తద్వారా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది. స్వార్థం కోసం విభజన రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్‌కు హరియాణా ప్రజలు ఇటీవల సరైన రీతిలో బుద్ధి చెప్పారు. దేశం బలహీనపడితే తాము బలపడతామని కాంగ్రెస్ భావిస్తోంది. ఆ పార్టీ ఆటలు సాగనివ్వొద్దు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అక్కడి అసెంబ్లీ ప్రవేశపెట్టిన తీర్మానానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. జమ్మూకశ్మీర్‌లో మళ్లీ హింసను ప్రేరేపించడమే ఆ పార్టీ లక్ష్యమా? కుట్రలు కుతంత్రాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. సంఘ విద్రోహ శక్తుల భాష మాట్లాడుతున్న కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం నేర్పిస్తారు.



కాంగ్రెస్ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒక ఓబీసీ నాయకుడు గత పదేళ్లుగా ప్రధానమంత్రిగా కొనసాగడాన్ని కాంగ్రెస్ సహించలేకపోతోంది. అన్ని వర్గాల సంక్షేమం కోసం నేను పని చేస్తుండడం చూసి ఓర్వలేకపోతోంది. అందుకే ఓబీసీల గుర్తింపును నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఓబీసీల ప్రభావాన్ని బలహీనపర్చేందుకు వారిని చిన్నచిన్న కులాల గ్రూప్‌లుగా విడగొట్టాలని చూస్తోంది. ఆ పార్టీ విషపూరిత కుట్రల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. దేశాన్ని ముక్కలు చేసి, పూర్తిగా ధ్వంసం చేయాలన్నదే కాంగ్రెస్ రహస్య అజెండా. ఆ పార్టీ విసురుతున్న వలలో చిక్కుకోవద్దు. మనమంతా ఐక్యమత్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం. దళితులను, ఆదివాసీలను రెచ్చగొట్టడానికి కాంగ్రెస్ రాజ్యాంగ ప్రతి పేరిట ఖాళీ పుస్తకాలు పంచుతోంది. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఒక్క పదం కూడా ఆ పుస్తకాల్లో లేదు. అంబేడ్కర్ అంటే కాంగ్రెస్‌కు ఎంత ద్వేషం ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రజల ఆశీస్సులు మాకు ఉన్నంతకాలం కాంగ్రెస్ అజెండాను అమలు కానివ్వం'' అని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు.

బీజేపీ విధానాలతో ప్రజలకు చావులే

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ మండిపాటు



జంషెడ్‌పూర్/ధన్‌బాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అనేవి రైతులు, కార్మికులు, పేదలను చంపేస్తున్న ఆయుధాలు అని ధ్వజమెత్తారు. విద్వేషాన్ని విశ్వసించే బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్, ప్రేమను నమ్మే 'ఇండియా' కూటమి మధ్య యుద్ధం జరుగుతోందని చెప్పారు. హింసకు, ఐక్యమత్యాన్ని మధ్య యుద్ధం కొనసాగుతోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విధానాలతో దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతోందని ఆరోపించారు. శనివారం జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ విభజన రాజకీయాలు చేస్తున్నాయని, కులం, మతం, భాష ఆధారంగా సమాజాన్ని విడగొట్టాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తుండగా, తాము పరిరక్షించేందుకు పోరాడుతున్నామని తెలిపారు. కొందరు బడా పెట్టుబడిదారులకు ప్రధాని మోదీ నిధులు అందజేస్తున్నారని, వారు ఆ సొమ్మును విదేశాల్లో పెట్టుబడులుగా పెడుతున్నారని ఆరోపించారు. జంషెడ్‌పూర్‌లో ప్రసంగిస్తుండగా మధ్యలో 'అజాన్' వినిపించడంతో రాహుల్ గాంధీ రెండు నిమిషాలపాటు విరామం ఇవ్వడం గమనార్హం.

మహారాష్ట్రలోనూ కుల గణన

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల తర్వాత మహారాష్ట్రలోనూ అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన ప్రక్రియ ప్రారంభిస్తామని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణలో ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రస్తావిస్తూ ఈమేరకు ఆయన శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఫాస్ట్ ట్రాక్ వీసాలకు కెనడా మంగళం

పెరగనున్న స్టడీ వీసా కష్టాలు

న్యూఢిల్లీ: ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ నిజ్జర్ హత్యోదంతం తిరిగి తిరిగి చివరకు భారతీయ విద్యార్థులకు స్టడీ వీసా కష్టాలను తెచ్చిపెట్టింది. కెనడా–భారత్ దౌత్యసంబంధాలు అత్యంత క్షీణదశకు చేరుకుంటున్న వేళ కెనడా ప్రభుత్వం భారతీయ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కల్గించే నిర్ణయాన్ని అమలుచేసింది. విద్యార్థి వీసాలను వేగంగా పరిశీలించి పరిష్కరించే ఫాస్ట్ ట్రాక్ వీసా విధానం స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(ఎస్‌డీఎస్)ను నిలిపేస్తున్నట్లు కెనడా శుక్రవారం ప్రకటించింది. తమ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తున్నట్లు పేర్కొంది. దీంతో కెనడాలో చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థులకు వీసా జారీ ప్రక్రియ పెద్ద ప్రహసనంగా మారనుంది. ఇన్నాళ్లూ భారత్, చైనా, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్, వియత్నాంసహా 13 దేశాల విద్యార్థులకే ఎస్‌డీఎస్ కింద ప్రాధాన్యత దక్కేది. ఈ దేశాల విద్యార్థులకు స్టడీ పర్మిట్లు చాలా వేగంగా వచ్చేవి. తాజా నిర్ణయంతో ఈ 13 దేశాల విద్యార్థులు సాధారణ స్టడీ పర్మిట్ విధానంలోని దరఖాస్తుచేసుకోవాల్సి ఉంటుంది. తాజా నిర్ణయాన్ని కెనడా సమర్థించుకుంది. జాతీయతతో సంబంధంలేకుండా అన్ని దేశాల విద్యార్థులకు సమాన అవకాశాలు దక్కాలనే ఉద్దేశంతోనే ఎస్‌డీఎస్‌ను నిలిపేశామని వివరణ ఇచ్చింది.

ట్రంప్, జెలెన్‌స్కీ.. మధ్యలో మస్క్!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో ప్రపంచ కుబేరుడు, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సాన్నిహిత్యానికి అద్దం పట్టే మరో ఉదంతం వెలుగులోకి వచ్చింది. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించాక ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ జరిపిన ఫోన్ సంభాషణలో మస్క్ కూడా పాల్గొన్నట్టు సమాచారం. జెలెన్‌స్కీ ఫోన్ వచ్చిన సమయంలో మస్క్ కూడా ట్రంప్ పక్కనే ఉన్నట్టు చెబుతున్నారు. ట్రంప్ స్పీకర్ ఆన్ చేశారని, అనంతరం ముగ్గురూ ఏడు నిమిషాల పాటు మాట్లాడుకున్నారని ట్రంప్ సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ అమెరికాకు చెందిన పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. రష్యా సైన్యాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు స్టార్‌లింక్ సమాచార వ్యవస్థను అందుబాటులో ఉంచినందుకు మస్క్‌కు ఈ సందర్భంగా జెలెన్‌స్కీ ధన్యవాదాలు తెలిపారు. స్టార్‌లింక్ రెండేళ్లుగా ఉక్రెయిన్‌కు కీలక సేవలందిస్తూ వస్తోంది. అందుకు భారీగా ఖర్చవుతోందని ఏడాది క్రితం మస్క్ వాపోయారు. దాంతో ఆ ఖర్చులను ఆయనకు చెల్లించేందుకు అమెరికా ముందుకొచ్చింది.

విషెస్ చెప్పి విమర్శలపాలైన పాక్ ప్రధాని

ఇస్లామాబాద్: ప్రజలకు సుద్దులు చెప్పే నేతలు తాము మాత్రం నిబంధనల్ని బేఖాతరు చేస్తూ వ్యవహరిస్తారన్న విమర్శలు నిజమని పాక్ ప్రధాని నిరూపించారు. వేర్పాటువాద శక్తులు విరివిగా ఉపయోగిస్తూ దేశంలో అస్థిరకతకు కారణమవుతున్నారని, అందుకు పరోక్షంగా కారణమైన 'ఎక్స్' సోషల్ మీడియాపై నిషేధం విధిస్తున్నట్లు పాక్ ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. దానిని అమలుచేస్తోంది కూడా. అయితే ఇటీవల అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయనాదం చేసిన ట్రంప్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ 'ఎక్స్' వేదికను వినియోగించుకోవడం విమర్శలకు తావిచ్చింది. స్వయంగా ప్రభుత్వాధినేతనే సొంత నిర్ణయాలకు విలువ ఇవ్వనప్పుడు ప్రజలేం పట్టించుకుంటారని నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఆర్టికల్ 370 పునరుద్ధరణ అసాధ్యం: షా

రాంచీ/పలాము: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి హోదా కల్పించే ఆర్టికల్ 370 పునరుద్ధరణకు పోరాడతామన్న కాంగ్రెస్‌ను కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా ఎద్దేవా చేశారు. శనివారం జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా హజారీబాగ్, పలామూ పట్టణాల్లో జరిగిన ర్యాలీల్లో అమిత్ ప్రసంగించారు. ''కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం. అలాంటి కశ్మీర్‌కు ప్రత్యేకంగా ఆర్టికల్ 370 అక్కర్లేదు. అయినాసరే దానిని మళ్లీ తెస్తామంటున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఒక్కటే చెప్పదల్చుకున్నా. మీ నాలుగోతరం దిగివచ్చినా సరే ఆర్టికల్ 370ని పునరుద్ధరించలేరు'' అని అమిత్ వ్యాఖ్యానించారు.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 10 । నవంబర్ । 2024



పెళ్లి వేళ.. చిత్ర'కళ'..
ఇటీవల పెళ్లిళ్లలో కొత్త ఆర్టిస్టిక్ ట్రెండ్‌గా సందడి చేస్తోంది టర్మరిక్ ఆర్ట్. లైవ్ పెయింటింగ్ రంగులు అద్దుకుంటోంది. వెడ్డింగ్ ఈవెంట్స్‌లో చిత్రకళకు కొత్త క్రేజ్ వస్తోంది. – సిటీప్లస్‌లో



సామాన్యులకు సందడి.. ఆదివారం అంగడి..
నగరంలోని ఆదివారం అంగడికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది ఎర్రగడ్డ మార్కెట్. సామాన్యుల నుంచి సంపన్నుల వరకూ అందరూ సందడి చేస్తున్నారు. – సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.0/19.0
నగరంలో ఆదివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది . గరిష్టంగా 32 కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

రేపు నీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్‌– 2లో కలబ్‌గూర్ నుంచి పటాన్‌చెరు వరకు ఉన్న 1,500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. లీకేజీలను అరికట్టేందుకు సోమవారం ఉదయం 6 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. దీంతో 24 గంటల పాటు కొన్ని ప్రాంతాల్లో లో ప్రెజర్‌తో నీటి సరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని శనివారం జలమండలి ప్రకటించిది. నగరంలోని ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, బీరంగూడ, అమీన్‌పూర్, బల్క్ కనెక్షన్లు, ఎర్రగడ్డ, ఎస్‌ఆర్ నగర్, అమీర్ పేట్, కేపీహెచ్ బీ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి వెల్లడించింది.

నీవు లేక నేనుండలేనని..

ప్రియుడిని మరిచిపోలేక వివాహిత ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ప్రేమికుడిని మరిచిపోలేని ఓ వివాహిత మనస్తాపంతో భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. ఎంఎన్‌రెడ్డి నగర్‌లో నివాసముంటున్న ఓ వివాహిత (25)కి పెళ్లికి ముందే మరొకరిని ప్రేమించింది. ఈ నేపథ్యంలో ప్రియుడిని మరిచిపోలేక శుక్రవారం రాత్రి తాము నివాసముంటున్న భవనం 5వ అంతస్తు నుంచి ఆమె కిందకు దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపతున్నారు.

పని చేయడం లేదన్నందుకు కుమారుడిపై తండ్రి దాడి

కత్తితో పొడవడంతో మృతి



జైపాల్ (ఫైల్)

నాగోలు: పని చేస్తలేవు అని నిలదీయడంతో.. నన్నే ప్రశ్నిస్తావా అంటూ క్షణికావేశంలో కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలకు గురైన కుమారుడు హాస్పిటల్‌లో మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సరూర్‌నగర్ పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం. కర్మన్‌ఘాట్ న్యూ మారుతినగర్‌కు చెందిన వీరనగరి శేఖర్‌కు కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు జైపాల్ (23) డిగ్రీ చదువు మధ్యలోనే ఆపేశాడు. జైపాల్ ఫ్లవర్ డెకరేషన్ వర్క్ చేస్తున్నాడు. శేఖర్ పని చేయకుండా తిరుగుతుండడంతో తండ్రీ కొడుకుల మధ్య శుక్రవారం రాత్రి గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన శేఖర్ ఇంట్లో ఉన్న కూరగాయలు కోసే కత్తితో కుమారుడు జైపాల్ మెడపై దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సరూర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

ముగ్గురు నగరవాసుల దుర్మరణం

హస్తినాపురం: కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగి జిల్లా కమలాపూర్ సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులు ముగ్గురు ఎల్బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం ఓంకార్‌నగర్ కాలనీకి చెందిన రాఘవేందర్ గౌడ్, నాగోలుకు చెందిన భార్గవ కృష్ణ, సంగీతలుగా గుర్తించారు. కర్ణాటక రాష్ట్రం గానుగాపూర్‌లోని దత్తాత్రేయుడి దర్శనం చేసుకుని తిరిగి నగరానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. కాగా.. మృతులు వేర్వేరు కుటుంబాలకు చెందినవారు అని తెలుస్తోంది. వనపర్తి జిల్లా తాడిపర్తి ప్రాంతానికి చెందిన రాఘవేందర్‌గౌడ్ నగరంలోని ఉప్పల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తూ వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓంకార్‌నగర్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. మిగతా ఇద్దరి వివరాలు తెలియరాలేదు.



కర్ణాటకలోని కమలాపూర్ వద్ద ఢీకొన్న రెండు వాహనాలు



డోర్ డెలివరీ.. డోంట్ వర్రీ

సాక్షి, సిటీబ్యూరో: వందల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన అవసరం లేదు. గంటల తరబడి కాలయాపనకు అవకాశం లేదు. పార్శిళ్లను బుక్ చేసిన వెంటనే ప్రయాణం ఆరంభం, వస్తువులను సురక్షితంగా గమ్యం చేర్చేవరకు అందుబాటులో సేవలు.. పైగా ప్రతీ క్షణం ట్రాకింగ్ చేసే సదుపాయం. ఆర్టీసీ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన డోర్ డెలివరీ సర్వీసులకు అనూహ్య ఆదరణ లభిస్తోంది. రాపిడో, పోర్టర్ వంటి డెలివరీ సంస్థలకు దీటుగా ఆర్టీసీ కార్గో సర్వీసులను వినియోగదారుల ఇంటికే చేరవేసేలా ఇటీవల డోర్ డెలివరీని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు ఆర్టీసీ కౌంటర్లు, బస్టాండ్లకే పరిమితమైన పార్శిళ్లు నేరుగా ఇంటికే చేరడంతో నగరవాసులకు ఊరట కలుగుతోంది. ఆర్టీసీ అయిదేళ్ల క్రితం సరుకు రవాణా రంగంలోకి ప్రవేశించింది. కార్గో బస్సులను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్ నుంచి జిల్లాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల వరకు కూడా కార్గో బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అదే సమయంలో వివిధ జిల్లాల నుంచి నగరానికి సైతం పెద్ద ఎత్తున వస్తు రవాణా కొనసాగుతోంది. నిత్యావసర వస్తువుల నుంచి అత్యవసర మందుల వరకు రవాణా అవుతున్నాయి. కోవిడ్ కాలంలో ఆర్టీసీ కార్గో సర్వీసులకు అనూహ్యమైన ఆదరణ లభించింది. ఒకటి రెండు కిలోల వస్తువుల నుంచి క్వింటాళ్ల వరకు వస్తువులను వివిధ ప్రాంతాలకు చేరవేయడంలో ఆర్టీసీ కార్గో బస్సులు ముందు వరుసలో నిలిచాయి. ఈ క్రమంలోనే కొత్తగా 'డోర్ డెలివరీ'ని ప్రవేశపెట్టింది. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పది రోజుల క్రితం డోర్ డెలివరీ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.

రోజుకు 2000కు పైగా పార్శిళ్లు..

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి నిత్యం 2000కు పైగా పార్శిళ్లు సరఫరా అవుతున్నాయి. పచ్చళ్లు, పిండి వంటలు, దుస్తులు, బియ్యం తదితర నిత్యావసర వస్తువులు నగరానికి వస్తున్నాయి. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి ఎరువులు, ఆటో మొబైల్ వస్తువులు, కిరాణా సామాన్లు, గృహోపకరణాలు, మందులు జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు 13000కు పైగా పార్శిళ్లు రవాణా అవుతుండగా, నగరానికి 2000 పార్శిళ్లు వస్తున్నాయి.

వినియోగదారులకు చేరువయ్యేందుకు..

పార్శిళ్లను తీసుకొనేందుకు వినియోగదారులు ఎంజీబీఎస్, జూబ్లీ, దిల్‌సుఖ్‌నగర్, ఈసీఐఎల్, కోఠి తదితర బస్టాండ్‌లతో పాటు ఉప్పల్, ఎల్‌బీనగర్, మెహిదీపట్నం వంటి 31 సమీప కౌంటర్లకు వెళ్లాల్సి వచ్చేది. వినియోగదారులకు ఇది భారంగా మారింది. ఈ క్రమంలోనే వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు డోర్‌డెలివరీని ప్రవేశపెట్టినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. వివిధ రకాల వస్తు సేవలను ఇంటివద్దే అందజేసేందుకు నగరంలో ఇప్పటికే రకరకాల మొబైల్ ఆధారిత యాప్ సదుపాయాలు ఉన్నప్పటికీ దూరప్రాంతాల నుంచి నగరానికి చేరవేయడంలో ఆర్టీసీ ముందంజలో నిలిచింది. ఆర్టీసీ కార్గో మొబైల్ యాప్ ద్వారా కూడా పార్శిళ్లను ట్రాక్ చేయవచ్చు. జిల్లా కేంద్రాల నుంచి బయలుదేరినప్పటి నుంచి నగరరంలోని వినియోగదారుల ఇంటి వద్దకు 24 గంటల వ్యవధిలో చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ తక్కువ దూరం ఉన్న ప్రాంతాల నుంచి వచ్చే పార్శిళ్లను అయిదారు గంటల్లోనే అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చార్జీలు తక్కువే..

ప్రైవేట్ యాప్ ఆధారిత డోర్ డెలివరీ చార్జీల కంటే ఆర్టీసీ చార్జీలు తక్కువగానే ఉన్నాయి. వినియోగదారుల పార్శిళ్లకు పూర్తి భద్రత, రక్షణ ఉంటుందని ఆర్టీసీ కార్గో విభాగం పర్యవేక్షణాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. కార్గో సర్వీసులను వేగవంతంగా విస్తరించేందుకు తక్కువ చార్జీలతోనే సర్వీసులను అందజేస్తున్నట్లు చెప్పారు. కిలో వరకు రూ.50. 5 కిలోల వరకు రూ.60. 5 నుంచి 10 కిలోల వరకు రూ.65. 10 నుంచి 20 కిలోల వరకు రూ.70. 20 నుంచి 30 కిలోల వరకు రూ.75 చార్జీ. 30 కిలోల తర్వాత స్లాబ్‌ల ఆధారంగా చార్జీలు ఉంటాయని శ్రీధర్ చెప్పారు. ప్రస్తుతం ఇంటి వద్దకు వస్తువులను చేరవేస్తున్న తరహాలోనే కొద్ది రోజుల్లో ఇంటి నుంచే వస్తువులను సేకరించే (హోమ్ పికప్) సర్వీసులను సైతం ప్రవేశపెట్టనున్నారు.

బాపూఘాట్‌లో ఇవ్వండి.. రావిరాలలో తీసుకోండి

200 ఎకరాల్లో బాపుఘాట్ వద్ద మూసీ అభివృద్ధి పనులు

- వీటిలో 100 ఎకరాలు రక్షణ శాఖకు చెందిన భూములే
- డిఫెన్స్ మంత్రికి లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం
- పరిహారంగా ఆర్సీఐ భూమిని ఇవ్వాలని నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నది పునరుజ్జీవానికి సంకల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తొలుత బాపూఘాట్ వద్ద మూసీ అభివృద్ధి పనులను చేపట్టాలని నిర్ణయించారు. బాపూఘాట్, దాని పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ భూముల కంటే రక్షణ శాఖకు చెందినవే ఎక్కువగా ఉన్నట్లు రక్షణ శాఖ, ఎంఆర్‌డీఎల్, రెవెన్యూ విభాగం సంయుక్త సర్వేలో తేలింది. దీంతో మూసీ అభివృద్ధి పనుల కోసం డిఫెన్స్ విభాగం భూములను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడి భూమికి బదులు మరోచోట స్థలం ఇచ్చేందుకు సిద్ధమైంది. బాపూఘాట్‌లో రక్షణ శాఖకు చెందిన భూములు ఇస్తే.. ఆ భూమికి బదులుగా రంగారెడ్డి జిల్లా రావిరాలలోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్సీఐ)కు కేటాయించినవాటిని ఇవ్వాలని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు నిర్ణయించారు. దీంతో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాశారు.

ఆర్సీఐ భూమి ఇచ్చేందుకు సిద్ధం..

బాపూఘాట్, పరిసర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న భూములను గుర్తించేందుకు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు రంగంలోకి దిగారు. తొలుత 70 ఎకరాలే అవసరమని అధికారులు ప్రాథమికంగా గుర్తించినా.. సీఎం ఆలోచనల మేరకు 200 ఎకరాల భూమి అవసరమని తేల్చారు. ఈ ప్రాంతంలో 100 ఎకరాలు కేంద్ర రక్షణ శాఖకు చెందిన భూములే ఉన్నట్లు గుర్తించారు. బాపూఘాట్ వద్ద డిఫెన్స్ విభాగానికి 24 ఎకరాలు, మూసీ నది వెంట 20 ఎకరాలు, ఎగువన ఉన్న టిప్పుఖాన్ వంతెన, తపోవన్ మధ్య మరో 8 ఎకరాల భూమి ఉంది. మూసీ అభివృద్ధి పనులకు ఆయా భూములను రక్షణ శాఖ నుంచి సేకరించి, పరిహారంగా రావిరాలలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఆర్సీఐ భూమిని ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. 2,460 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఆర్సీఐ భూమి కొన్ని దశాబ్దాల కాలం నుంచి లీజు ప్రాతిపదికన రక్షణ శాఖకు కేటాయించారు. ప్రజాప్రయోజనాలు, జాతిపిత విగ్రహం ఏర్పాటు కోసమే భూమి అడుగుతున్నందున రక్షణ శాఖ సానుకూలంగా స్పందిస్తుందనే అంచనాలో ఎంఆర్‌డీసీఎల్ ఉంది.

క్యాచ్‌మెంట్ ఏరియా 150 మీటర్లు..

ఇప్పటికే మూసీ నది పరీవాహక ప్రాంతాన్ని గుర్తించేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేశారు. గరిష్ట వరద ప్రాంతం 150 మీటర్లుగా అధికారులు గుర్తించారు. అయితే.. ఏదైనా మార్గం మధ్యలో ప్రధానమైన రక్షణ శాఖ వ్యవస్థలు, విభాగాల అడ్డు వస్తే గనక గరిష్ట వరద ప్రాంతాన్ని 100 మీటర్లకు తగ్గిస్తామని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో రైలు, రోడ్డు విస్తరణ పనుల కోసం వివిధ ప్రాంతాల్లో 2,450 ఎకరాల రక్షణ భూమిని కోరారు.

జంట జలాశయాలు టు బాపూఘాట్

తొలుత మూసీ సుందరీకరణ పనులను బాపూఘాట్ ఎగువ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల వైపుగా చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు ఇక్కడే ఎడ్యుకేషన్ హబ్, లండన్‌లోని ఐలైక్ ఫెసిలిటీ, ఇతర వినోద, వాణిజ్య కేంద్రాలను ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.



నిమ్స్‌ను సందర్శించిన యూఎస్ వైద్య బృందం

లక్డీకాపూల్: నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)ను అమెరికాలోని సౌత్ వెస్టర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ వైద్య బృందం సందర్శించింది. ఇరు వర్సిటీల మధ్య అకడమిక్ రీసెర్చ్, ట్రైనింగ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అమెరికాకు చెందిన వైద్యులు నిమ్స్‌కు వచ్చారు. పరస్పర ప్రయోజనాల కోసం రెండు విశ్వవిద్యాలయాలు సహకారం అందించే క్రమంలో ఉన్న అవకాశాలను అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా శనివారం టెక్సాస్‌కు చెందిన వైద్య బృందం నిమ్స్‌లో రోగులకు అందుతున్న అత్యవసర సంరక్షణ సేవలు, సౌకర్యాలు, సదుపాయాలు వంటి అంశాలపై సమీక్షించింది. వైద్యరంగంలో ప్రతిష్టాత్మకమైన నిమ్స్‌లో మరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అవసరమైన అవకాశాలను అందించుకునేందుకు యాజమాన్యం ఆసక్తి చూపించింది. ఆ దిశగా సౌత్ వెస్టర్న్ వర్సిటీ కూడా చేయూతనందించడంతో పాటు నిమ్స్ వైద్య సహకారాన్ని అందిపుచ్చుకునేందుకు చొరవ చూపింది. పరస్పర సహకారంతో రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందించాలన్న కృత నిశ్చయాన్ని వ్యక్తం చేసింది.



ఈఎండీ విభాగాన్ని సందర్శించిన వైద్య బృందం

సృజనాత్మకత, ఆవిష్కరణల కేంద్రం హైదరాబాద్

మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: డిజైన్, టెక్నాలజీ సృజనాత్మకత, సహకారవృద్ధిని ప్రోత్సహిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో 8 మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతి రంగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సృజనాత్మకత, ఆవిష్కరణలకు కేంద్రంగా హైదరాబాద్ ఖ్యాతిని మరింత బలోపేతం చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఈ నెల 20న ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ ప్రాంగణమైన టీహబ్‌లో డిజైన్ పరిశ్రమలోని నాయకులు, ఆవిష్కర్తలకు ఒక ప్రధాన సమ్మేళనంగా సదస్సు తలపెట్టడం ఎంతో హర్షణీయమన్నారు. పరిశ్రమల వృద్ధికి కొత్త అవకాశాలను పెంపొందించడం ఈ సదస్సు ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 8 మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ అధికార ప్రతినిధి రాజ్ సావంకర్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ పోస్టర్‌ను మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సర్వే పర్యవేక్షణకు మానిటరింగ్ ఆఫీసర్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎక్కువ కుటుంబాలు ఉన్నందున ఇంటింటి కుటుంబ సర్వేను నిర్ణీత వ్యవధిలో సవ్యంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం నలుగురు ఐఏఎస్ అధికారులకు బాధ్యతలప్పగించింది. వీరిలో కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించింది. మరో ముగ్గురిని మానిటరింగ్ అధికారులుగా ఆరు జోన్లకు నియమించింది. సికింద్రాబాద్, చార్మినార్ జోన్లకు హెచ్‌ఎండీఏ జేఎంసీ కోట శ్రీవత్స, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్ జోన్లకు మున్సిపల్ పరిపాలన శాఖ డిప్యూటీ సెక్రటరీ సీహెచ్ ప్రియాంక, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లకు వాటర్‌బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్‌ను నియమించింది. సర్వేకు సంబంధించి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వీరు సహాయకులుగా ఉంటూ.. సంబంధిత జోనల్ కమిషనర్లకు సహకరిస్తూ పని చేస్తారు. ఈమేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వు జారీ చేశారు.

- స్టిక్కర్లు అంటించేటప్పుడే చేదు అనుభవాలు
- ఆరు గ్యారంటీల్లో ఏమిచ్చారని నిలదీతలు
- ఇప్పుడీ వివరాలెందుకంటూ యక్ష ప్రశ్నలు
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లలో ఇళ్ల గేట్లూ తెరవని వైనం
- కుక్కలను ఉసిగొల్పడంతో భయభ్రాంతుల్లో సిబ్బంది

ఈ గందరగోళమేంటి 'సర్వే'శా!

ఎన్యుమరేటర్లకు పట్టపగలే చుక్కలు



ముషీరాబాద్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది..

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వే గ్రేటర్‌లో పరిధిలో అయోమయంగా మారింది. ఇంటింటికీ వెళ్తున్న ఎన్యుమరేటర్లకు ప్రజల నుంచి ఎదురవుతున్న యక్ష ప్రశ్నలతో పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. 'ఈ సర్వేకో దండం.. మేం చేయలేం సార్' అంటూ ఉన్నతాధికారులకు కొందరు ఆవేదన వెళ్లబుచ్చుతున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి సంపన్న ప్రాంతాల్లో ఎన్యుమరేటర్లను కనీసం గేట్లు కూడా తీయనియ్యలేదు. సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఇంకొందరు కుక్కల్ని కూడా ఉసిగొల్పుతున్నారని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అందించిన దరఖాస్తులకే ఇప్పటి వరకు దిక్కులేదు.. అప్పుడు రెండు రోజుల పాటు పడిగాపులు కాసి ఇచ్చినా, వాటితో మాకెలాంటి ప్రయోజనం కలగలేదు. ఇప్పుడు ఈ సర్వేలో మీకెందుకు వివరాలివ్వాలంటూ ముఖం మీదే కుండబద్దలు కొడుతున్నారు.

స్టిక్కర్లతోనే చుక్కలు కనిపిస్తున్నాయి..

- వాస్తవానికి నగరంలో సర్వే నామమాత్రంగానే ప్రారంభమైంది. శుక్రవారం నాటికి పూర్తి కావాల్సిన స్టిక్కర్లు అంటించే కార్యక్రమం పూర్తికానందున శనివారం కూడా ఆ పనిలోనే ఉన్నారు. స్టిక్కర్లు అంటించేటప్పుడే కుటుంబ యజమాని పేరు, ఫోన్ నంబర్ నమోదు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచించారు. కానీ.. చాలామంది తమ ఫోన్ నంబర్లు ఇవ్వడం లేదు. పేర్లు చెప్పేందుకు కూడా పలువురు యక్ష ప్రశ్నలు వేస్తున్నారు. అసలు ఈ సర్వేతో తమకేంటి లాభం? అంటూ విసురుతున్న ప్రశ్నలతో ఎన్యూమరేటర్లుగా వ్యవహరిస్తున్న ఆశావర్కర్లు తెల్లబోతున్నారు.
- ఆర్థిక పరిస్థితి వంటివి తెలుస్తుంది సార్ అంటే.. మా ఆర్థిక పరిస్థితి నీకెందుకు చెప్పాలి? నువ్వేం చేస్తావ్ ? అంటున్నారని.. ఫారాలు నింపాక పై అధికారులకిస్తాం అంటే.. వారేం చేస్తారు ? వంటి ప్రశ్నలు సంధిస్తున్నారని పలువురు ఎన్యుమరేటర్లు వాపోయారు. స్టిక్కర్ల నాడే పరిస్థితి ఇలా ఉంటే.. అసలు సర్వే ఎలా చేయాలని వాపోతున్నారు. ఎన్యుమరేటర్లుగా వ్యవహరిస్తున్న టీచర్లు మాత్రం వారికి వివరించే ప్రయత్నం చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, వారిని తృప్తి పరచలేకపోతున్నామన్నారు. ప్రజల నుంచి ఎదురవుతున్న ఈ పరిస్థితిని తట్టుకోలేక కాబోలు చాలా ప్రాంతాల్లో స్టిక్కర్లను చదీచప్పుడు కాకుండా ఇంటి బయట గోడలకు అంటించి పోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అంటించకుండానే గేటు బయట నుంచే ఇంటి ఆవరణలోకి విసిరి వేశారు.

సీఎంపై తిట్ల దండకం..

ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే తిడుతున్నారని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో విధుల్లో ఉన్న ఓ మహిళా ఎన్యుమరేటర్ పేర్కొన్నారు. సీఎంను తిడుతున్న వారిలో మహిళలు, వృద్ధులు సైతం ఉన్నారని ఆమె అన్నారు. ఆరు గ్యారంటీల్లో సబ్సిడీ గ్యాస్, ఇళ్లు, పెన్షన్‌లు, మహిళలకు రూ.2500 ఏవీ రావడం లేదని, ఇప్పుడు మీకు మా వివరాలు చెబితే ఉన్న రేషన్ కార్డు కూడా పోతుందేమోనని అంటున్నవారూ ఉన్నారని మరో ఎన్యుమరేటర్ తనకెదురైన అనుభవాన్ని వివరించారు. వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు అడగొద్దని తిప్పి పంపిస్తున్నవారూ ఉన్నారు. చెరువుల్లో ఉన్నాయని ఇళ్లు కూలుస్తున్నారని హైడ్రాను ప్రస్తావిస్తూ.. తమ ఇంటి వివరాలిస్తే మా ఇల్లు కూడా కూలుస్తారేమోననే భయాన్ని వ్యక్తం చేసిన వారు కూడా ఉన్నారని ఎన్యుమరేటర్లు అంటున్నారు.

కోడ్‌లు నింపడానికి ఎంతో సమయం..

ఒక్కో ఇంటికి 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతోందని చెబుతున్నారు. సమాధానాల్ని సంబంధిత కోడ్‌తో సూచించాల్సి ఉన్నందున అన్నీ అర్థం చేసుకొని భర్తీ చేసేందుకు సమయం పడుతోందంటున్నారు. చాలామంది వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తుండగా, కొందరు మాత్రం తమ జంతువుల వివరాలు సైతం చెబుతున్నారు. ఎల్బీనగర్, తదితర ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తులతోనూ స్టిక్కర్లు అంటిస్తున్నట్లు తెలిసింది.

దున్న @ రూ.10 కోట్లు

సదర్ ఉత్సవాల నేపథ్యంలో హరియాణా నుంచి రూ.10 కోట్ల విలువైన దున్నను తీసుకువస్తున్నామని యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేకే శేఖర్ యాదవ్ తెలిపారు. ప్రత్యేకమైన ఈ దున్న తన విన్యాసాలతో కనువిందు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. – జగద్గిరిగుట్ట



భయపడే అంతం చేశాడు

- మహిళతో వివాహేతర సంబంధం
- ఆమె బెదిరించడంతో హత్య చేసిన సెల్‌ఫోన్ షాప్ యజమాని


వివరాలను వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్: తరుచూ సెల్‌ఫోన్ షాపునకు వెళ్తున్న మహిళకు యజమానితో పరిచయమైంది. ఆ తరువాత వారి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెబుతానని ఆమె బెదిరించడంతో భయపడిన సదరు వ్యక్తి ఆమెను అంతమొందించాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి శనివారం దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా పోచమ్మవాడ ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్(36) 2013 నుంచి మొబైల్ షాపు దుకాణం నిర్వహిస్తున్నాడు. అక్కడే నివసిస్తున్న బొద్దుల శారద(50) తరుచూ అతని షాపునకు వస్తుండేది. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. శారద భర్త 2019లో చనిపోవడంతో కుమారుడితో కలిసి 2020లో దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటకు వచ్చింది. శారద స్థానికంగా విఘ్నేశ్వర మిల్క్ పాయింట్‌ను నిర్వహిస్తుండగా ఆమె కుమారుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సెప్టెంబరు 23న ఉదయం తన తల్లిని మిల్క్ పాయింట్ వద్ద వదిలి తాను విధులకు వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి 8 గంటలకు తల్లికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో పక్కనే నివసించే నరేష్‌కు ఫోన్ చేసి చెప్పగా అతను వెళ్లి చూసే సరికి బెడ్‌రూమ్‌లో విగతజీవురాలిగా కనిపించింది. కుమారుడు వచ్చి చూసే సరికి తన తల్లి చనిపోయి ఉంది. మృతురాలి ఒంటిపై బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు.

బెదిరింపులకు భయపడి..

ప్రవీణ్‌కుమార్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్న శారద గతంలో సన్నిహితంగా ఉన్న సమయంలో తీసుకున్న ఫోటోలు, వీడియోలను బయట పెడతానని అతన్ని బెదిరించి డబ్బు డిమాండ్ చేసింది. దీంతో అతను గతంలో రూ.2 లక్షలు ఆమెకు ముట్టజెప్పాడు. తిరిగి అదే విధంగా బెదిరింపులకు దిగడంతో కుటుంబ సభ్యులకు తెలిస్తే తన పరువు పోతుందని భావించి ఆమెను అడ్డు తొలగించుకునేందుకు పన్నాగం పన్నాడు.

పక్కా ప్రణాళికతో హత్య..

గతంలో పలు పత్రికల్లో విలేకరిగా పని చేసిన అనుభవం ఉన్న ప్రవీణ్‌కుమార్ పక్కా ప్రణాళికతో హత్యకు ప్లాన్ చేశాడు. సెప్టెంబర్ 23న శారదకు వాట్సప్ కాల్ చేసి ఆదిలాబాద్ నుంచి నేరుగా ఆమె నిర్వహిస్తున్న మిల్క్ పాయింట్ వద్దకు వచ్చాడు. అక్కడి నుంచి ఇద్దరూ నేరుగా ఆమె ఇంటికి వెళ్లారు. ఆమె నివాసంలోనే గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. ఎలాంటి ఆనవాళ్లు లేకుండా జాగ్రత్త పడ్డాడు. సంఘటన స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులకు ఈ హత్య కేసు మిస్టరీగా మారింది. శారదతో కలిసి వస్తున్న సమయంలో మొఖానికి మాస్క్ ధరించడంతో సిసి కెమెరాల్లో అతని కదలికలు స్పష్టంగా కలిపించలేదు. పైగా హత్య చేసిన అనంతరం దోపిడి దొంగలు చేసిన హత్యగా చిత్రీకరించేందుకు మృతురాలి ఒంటిపై ఉన్న నగలను తీసుకెళ్లడంతో పాటు ఆమె సెల్‌ఫోన్‌ను తీసుకుని అందులో వాట్సాప్‌లోని చాటింగ్, ఫోన్ కాల్స్‌లను డిలీట్ చేశాడు. కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దాదాపు 10 కిలో మీటర్ల మేర సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. మల్లంపేట నుంచి మియాపూర్ వరకు కాలినడకన వెళ్లిన ప్రవీణ్‌కుమార్ అక్కడ శారద సెల్‌ఫోన్‌ను పడేసి ఓ మద్యం దుకాణంలో మద్యం సేవించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సీసీ పుటేజీ, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన దుండిగల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, డిఐ సతీష్, ఎస్సైలు రామ్మోహన్‌రెడ్డి, శంకర్, సిబ్బందిని డిసిపి కోటిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

సైబర్ నేరస్తుల టోకరా.. రూ.33వేలు స్వాహా

జీడిమెట్ల: పరిశ్రమ పనిముట్ల కోసం గూగుల్‌లో వెతికి వెబ్‌సైట్ వాళ్లు ఇచ్చిన అకౌంట్‌లో డబ్బులు పంపించి ఓ వ్యక్తి సైబర్ వలలో చిక్కుకుని రూ.33,662 పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన మేరకు.. చింతల్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన సాయి సంతోష్ జీడిమెట్లలో వుడెన్ డైస్ అనే పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. సంతోష్‌కుమార్ అతని పరిశ్రమకు కావాల్సిన మిషన్‌లను చైనా నుండి కొనుగోలు చేస్తాడు. కాగా ఇటీవల చైనా నుండి రావాల్సిన వస్తువులు అలస్యంగా వస్తుండటంతో ఇండియాలోనే కొందామని గూగుల్‌లో వెబ్‌సైట్ కోసం వెతికాడు. అందులో ఉన్న ఇండియన్ మార్ట్ వెబ్‌సైట్ వారు ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు సంతోష్ వస్తువు కోసం కాల్ చేశాడు. సదరు వ్యక్తి వస్తువు కావాలంటే మేము ఇచ్చిన అకౌంట్ నంబరుకు ముందుగా డబ్బు పంపాలని తెలిపాడు. వారు చెప్పినట్లుగానే అకౌంట్‌కు రూ.32,662 పంపించాడు. డబ్బు పంపినప్పటికీ 15రోజులు గడిచినా వస్తువు రాలేదు. తిరిగి కాల్ చేయగా ఇంకా సమయం పడుతుందని వారు చెప్పడంతో సంతోష్ తాను మోసపోయానని గ్రహించి శనివారం జీడిమెట్ల పోలీసులకు పిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అత్త, వారి బంధువుల వేధింపులు తాళలేక
క్షోభ అనుభవిస్తున్నా



మారీగోల్డ్, గ్రీన్‌పార్క్, ఆవాసా హోటల్స్ డైరెక్టర్ దామోదర్ రెడ్డి భార్య రచనా రెడ్డి

పంజగుట్ట: గత 10 నెలలుగా అత్త, అత్త తరపు బంధువులు పెట్టే వేధింపులను తట్టుకోలేకపోతున్నానని, తమ సమీపబంధువు గౌతంరెడ్డి, అత్త గుణపటి పార్వతి, భర్త ఆదాల దామోదర్ రెడ్డి నుంచి తనకు, తన కుటుంబానికి ఆపద ఉందని గ్రీన్‌పార్క్, మారీగోల్డ్, ఆవాసా హోటల్స్ డైరెక్టర్ ఆదాల దామోదర్ రెడ్డి సతీమణి రచనా రెడ్డి వాపోయారు. ఇంట్లో ఉన్న తనను ఈ నెల 6న 15మంది బౌన్సర్‌లు వచ్చి దాడిచేసి కిడ్నాప్ చేసేందుకు యత్నించారన్నారు. ఈ విషయమై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ చెయ్యలేదని ఆమె ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తన సోదరితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022 సంవత్సరంలో తనకు దామోదర్ రెడ్డికి వివాహం అయ్యిందని అప్పటినుండి కొద్దికాలం సజావుగానే తమ దాంపత్యం కొనసాగిందన్నారు. తన భర్త తన మాటవింటున్నాడు కానీ తన అత్త పార్వతి భర్తనుండి విడదీసేందుకు కుట్రలు పన్నిందన్నారు. తమ సమీపబంధువు గ్రీన్‌పార్క్, మారీగోల్డ్ హోటల్స్ సీఈఓ గౌతంరెడ్డి మా అత్త సాయంతో తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. తన భర్తనుండి విడాకుల నోటీసు ఇప్పించడంతో గత కొంతకాలంగా తాను ఇల్లు వదిలి వెళ్లిపోయానని తిరిగి కోర్టు ఆదేశాలతో గత నెల ఫిల్మ్‌నగర్ లోని తన భర్త ఇంటికి వచ్చినట్లు తెలిపారు. అప్పటినుండి తనను ఇంట్లోవేసి తాళం వెయ్యడం, గదిలో బంధించడం తీవ్రమానసిక వేదనకు గురిచేశారని తెలిపారు. తన అత్త పార్వతి, భర్త దామోదర్ రెడ్డి, గౌతమ్ రెడ్డి నుండి తనకు తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రచనా రెడ్డి వాపోయారు.

ఓయూ న్యాయ కళాశాలలో జాతీయ సదస్సు ప్రారంభం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ న్యాయ కళాశాలలో జాతీయ సదస్సు ప్రారంభమైంది. శనివారం కాలేజీ ఆడిటోరియంలో రెండు రోజులు జరిగే జాతీయ సదస్సును ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు జడ్జి జస్టిస్ నగేష్ భీమాపాక్, గౌరవ అతిథి రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం న్యూస్ క్రిమినల్ లాస్ అంశం పై రచించిన వ్యాసాల సంకలనంతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో లా డీన్ ప్రొ.విజయలక్ష్మి, ప్రిన్సిపల్ ప్రొ.రాధికయాదవ్, సదస్సు కన్వీనర్ డాక్టర్ చంద్రమతి, ప్రొ.రాంప్రసాద్, కరస్పాండెంట్ రవి అనంత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి.. ప్రైవేట్ పరం!

దిద్దుబాటు పనుల్లో అధికారులు

పోచారం: విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పటి జిల్లా కలెక్టర్ బదలాయించడంతో ప్రస్తుత అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొర్రెముల్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 174లో 18.12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 2020వ సంవత్సరం వరకు 18.12 ఎకరాలుగా ఉన్న సర్కారు భూమి 2020 తర్వాత అదే సర్వే నెంబర్‌లో 36.24 ఎకరాలుగా ఉన్నట్లు మారిపోయింది. వాస్తవంగా ఉన్న 18.12 ఎకరాల నుండి 6.12 ఎకరాల భూమిని 2017లో రెండు పడకల గదుల ఇళ్ల నిర్మించడానికి ప్రభుత్వమే కేటాయించింది. మిగిలిన 12 ఎకరాలు సర్కారు అధీనంలో ఉంది. ఈ భూమిపై స్థానిక నాయకుల కన్నుపడింది. ఎలాగైనా ఈ భూమిని తమ సొంతం చేసుకోవాలని తప్పుడు పత్రాలు సృష్టించి పట్టాదారు పాస్ పుస్తకాలకు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తులను 2023 అక్టోబర్ 11న ఘట్‌కేసర్ తహసీల్దారు కృష్ణ తిరస్కరించారు. అనూహ్యంగా అప్పటి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ బదిలీ అయిన రోజే (2023 అక్టోబర్ 12న) మాజీ ఎంపీటీసీ కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తుల పేర్లపైకి 12 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్చేశారు. ఇదిలా ఉండగా, సర్వే నెంబర్ 174లోని 36.24 ఎకరాలలో 18.12 ఎకరాలు ప్రభుత్వ భూమిగా, 6.12 ఎకరాలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లగా, ఉప విభాగంలో ఐదుగురికి వేర్వేరుగా 12 ఎకరాలు ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో సర్వే నెంబర్ 174లోని 18.12 ఎకరాల భూమి రెట్టింపై 36.24 ఎకరాలకు చేరడంతో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్రైవేట్ వ్యక్తుల పాస్ పుస్తకాలను రద్దు చేస్తున్నట్లు తెలిసింది.

అగ్ని ప్రమాదంలో గాయపడ్డ చిన్నారి మహేశ్వరి మృతి

కోలుకుంటున్న మరో ఇద్దరు చిన్నారులు

కుషాయిగూడ: దీపావళి వేడుకల్లో చోటు చేసుకున్న అపశృతిలో మంటలంటుకొని గాయాలపాలైన చిన్నారుల్లో మహేశ్వరి (6) చికిత్స పొందుతు గాంధీ ఆసుపత్రిలో మృతిచెందింది. అక్కడే చికిత్స పొంతుదున్న మృతురాలి సోదరుడు రిషికేష్ (7)తో పాటుగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో చిన్నారి జస్మిత (4) కోలుకుంటున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ శనివారం తెలిపారు. చర్లపల్లి, వెంకట్‌రెడ్డినగర్‌లో ఈ నెల 1న కారుకు మంటలంటుకొని ముగ్గురు చిన్నారులకు కాలిన గాయాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారం రోజులపాటుగా మృత్యువుతో పోరాడిన చిన్నారి మహేశ్వరి చివరకు తుదిశ్వాస విడవడంతో తల్లిదండ్రులు మహేష్, సరిత కన్నీటీ పర్యంతమయ్యారు. ఓ వైపు చనిపోయిన కూతురు, మరోవైపు గాయాలతో చికిత్స పొందుతున్న కుమారుడు రిషికేష్‌ను తలచుకుంటూ రోదిస్తున్న తీరును అందరిని కలిచివేసింది. ఇంటి యజమాని నానెంచర్ల సాయికుమార్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కారులో పెట్రోల్ అయిపోవడంతో బాటిల్‌లో పెట్రోల్ తీసుకొని కారులో పోసి బాటిల్‌ను పక్కనే ఉన్న తులసి చెట్టు వద్ద నిర్లక్ష్యంగా పడవేసినట్లు పోలీసులు గుర్తించారు. సాయంత్రం సమయంలో తులసి వద్ద వెలిగించిన దీపాలు ప్రమాదవశాత్తు పెట్రోల్ పోసి పడేసిన బాటిల్‌కు అంటుకున్నాయి. ఆ మంటలు కాస్తా పక్కనే ఉన్న కారు వరకు వ్యాపించి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. అదే సమయంలో కారు పక్క నుంచి వెళ్తున్న చిన్నారులకు మంటలంటుకొని గాయపడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిర్లక్ష్యంగా వ్యవహరించి చిన్నారి మృతికి కారణమైన ఇంటి యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అంబిటస్ వరల్డ్ స్కూల్ వేదికగా 'అంబిలీప్' పేరిట నిర్వహిస్తున్న వార్షిక క్రీడోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో భాగంగా ఆక్వా, ఆస్ట్రా, జియో, పైరోల మధ్య సాకర్, బాస్కెట్‌బాల్, తైక్వాండో, క్రికెట్, స్కేటింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ వంటి విభిన్న క్రీడలు నిర్వహించారు. ఈ ఆటలపోటీలకు అంతర్జాతీయ బాస్కెట్ బాల్ సమాఖ్య కోచ్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు విద్యార్థుల శారీరక ధారుఢ్యానికి, మానసిక వికాసానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా వివిధ క్రీడా విభాగాల్లో అత్యుత్తమ నైపుణ్యాలను కనబర్చారు. ఈ పోటీల కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ పాండురంగాచారి, అకడమిక్ హెడ్ డాక్టర్ అనుభూతి శుక్లా, అంబిటస్ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ సుజాత హరిక్రిష్ణన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవి మోటూరి పాల్గొని గెలుపొందిన విజేతలందరికి బహుమతులు, ప్రోత్సాహక పత్రాలను అందజేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పోచారం: వివాహ విందు వేడుకలో విద్యుత్ ఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. యంనంపేట్‌లోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మీసాల శ్రీశైలం వివాహం ఈ నెల 7న జరిగింది. 8వ తేదీ రాత్రి అదే కాలనీలో వివాహ విందు ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా ఇంటి ముందు స్టేజీతో పాటు లైటింగ్ ఏర్పాట్లు చేశారు. ఇదే కాలనీకి చెందిన మీసాల నర్సింహ తన కుటుంబ సభ్యులతో విందుకు వచ్చాడు. నర్సింహ కొడుకు ఖేతన్ రామ్ రాత్రి 11:30 గంటల సమయంలో లైటింగ్ షో చూడడానికి స్టేజీ వద్దకు వచ్చినప్పుడు కరెంట్ షాక్ తగిలింది. దీంతో బాధితుని ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

విజయనగర్‌కాలనీ: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. శనివారం పోలీసులు తెలిపిన మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన పర్శు అలియాస్ పరశురాం(26) సెంట్రింగ్ కార్మికుడు. ఆసిఫ్‌నగర్ అజ్రా ప్రాథమిక పాఠశాల వెనుక నిర్మిస్తున్న భవనంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 8న ఉదయం 5.20 గంటల సమయంలో రెండో అంతస్తులో నిద్రిస్తున్న ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. కాంట్రాక్టర్ కె.రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

మేడ్చల్ రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మన్మథ్ తెలిపిన మేరకు.. మెదక్ జిల్లా గుమ్మడిదల మండలం వీరారెడ్డిపల్లికి చెందిన తీగల లక్ష్మి(51) భర్తతో కలిసి మండలంలోని రావల్‌కోల్ గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. భర్తతో కలిసి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో 44వ జాతీయ రహదారిపై రేకులబావి వద్ద వెనుక నుండి వస్తున్న ఆర్టీసి బస్సు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడగా తీవ్రగాయాలపాలైన లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కారు ఢీకొని యువకుడు...


ఆస్మాన్ బగేల్ మృతదేహం

ఘట్‌కేసర్: కారు ఢీకొన్న సంఘటనలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన మేరకు.. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఆస్మాన్ బగేల్ (20) కొంత కాలంగా ఎదులాబాద్‌లో గడ్డి వ్యాపారి బాతుకు కిష్టయ్య దగ్గర గడ్డి కోసే కూలీగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గడ్డి కోసి వ్యాన్‌లో నింపాడు. అనంతరం వ్యాన్ ఎక్కుతుండగా కారు డ్రైవర్ వేగంగా, అశ్రద్ధగా నడుపుతూ ఆస్మాన్ బగేల్‌ను ఢీకొట్టాడు. దీంతో అతడు కిందపడి తలకు బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే తోటి కూలీలు ఓ ప్రైవేటు ఆస్పత్రికి వైద్యం కోసం తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అతడి ఆరోగ్యం విషమంగా ఉందని చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడు అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మరణించాడు. గడ్డి వ్యాపారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

శ్రీనగర్‌కాలనీ: టెక్‌మహేంద్ర ఫౌండేషన్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ (హైదరాబాద్) నిరుద్యోగ యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌తో కూడిన శిక్షణను అందించి ఉపాధిని అందిస్తున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, పీజీ అర్హత కలిగిన 19 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసున్న యువతకు శిక్షణను అందించి తగిన ప్లేస్‌మెంట్‌ను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరున ప్రారంభం కానున్న కొత్త బ్యాచ్‌లో మహిళలకు 50 శాతం స్కాలర్‌షిప్‌ను అందిస్తున్నట్లు, వివరాలకు ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా ఉన్న టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయంలో గానీ, 7337332606 నెంబర్‌కు సంప్రదించవచ్చునని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత


బాధితునికి ఎల్‌ఓసీని అందజేస్తున్న సీఎస్ రెడ్డి

రహమత్‌నగర్: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స అందించుకునే పేద రోగులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎల్‌ఓసీలను అందించి ఆదుకునేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని కార్పొరేటర్ సీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. రహమత్‌నగర్‌లోని తన కార్యాలయంలో హెచ్‌ఎఫ్‌నగర్‌కు చెందిన బాధితుడు మహబూబ్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 60వేల ఎల్‌ఓసీని ఆయన శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సీఎస్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే అత్యధికంగా ఎల్‌ఓసీలను తాను మంజూరు చేయించడం జరిగిందన్నారు. సహాయం కోసం బాధితులు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఫిలింనగర్‌లో రోడ్డు వేయండి

జోనల్ కమిషనర్‌కు ఏవీ రంగనాథ్ ఆదేశం

ఫిలింనగర్: ఫిలింనగర్ కాలనీలో సొసైటీ గత కొన్నేళ్ళుగా మహిళా మండలి కోసం షెడ్డు నిర్మించి 291 గజాల రోడ్డు స్థలాన్ని ఆక్రమించగా శనివారం హైడ్రా సిబ్బంది దాన్ని నేలమట్టం చేసి ప్రభుత్వం స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ స్థలంలో వెంటనే రోడ్డు వేయాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. రెండురోజుల్లో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. రహదారి విషయంలో కూల్చివేతలు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలాన్ని ఆనుకొని ఉన్న ఓ ఇల్లు ప్రహరీ కూడా ఆక్రమించి నిర్మించినట్లు నిర్ధారించారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కూల్చివేతలు జరిగిన వెంటనే డెబ్రిస్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారు. అలాగే రోడ్డు మీదికి వచ్చిన ఇంటి ప్రహరీని కూడా కూల్చివేశారు.

నేత్రపర్వంగా పుష్పయాగం


పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఫిలింనగర్: కార్తీకమాసం శనివారం సందర్భంగా ఫిలింనగర్ దైవసన్నిధానంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి వైభవంగా పుష్పయాగం పూజాదికాలు నిర్వహించారు. అలాగే ఆలయ అర్చకులు విభిన్న రకాల పూలతో స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. తిరుమలలో శ్రీవారికి నిర్వహించే విధంగానే ఇక్కడ కూడా ప్రతియేటా కార్తీక మాసంలో స్వామివారికి పుష్పయాగం చేయడం ఆనవాయితీగా వస్తున్నదని ఆలయ అర్చకులు తెలిపారు. కన్నుల పండువగా జరిగిన ఈ పుష్పయాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియామకం


నియామకపత్రాన్ని అందుకుంటున్న వెంకటేశ్వరరావు

శ్రీనగర్‌కాలనీ: బహుజన్ సమాజ్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షులుగా ఎల్లారెడ్డిగూడకు చెందిన ఎడలా వెంకటేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు బండారి శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి దోరపల్లి రమేష్‌లు నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. తనను నమ్మి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, బహుజనుల హక్కుల కోసం పోరాడతానని వెంకటేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా రాజు ముదిరాజ్, ఇమామ్‌గూడకు చెందిన షేక్ ఇమ్రాన్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

ఉత్సాహంగా టెన్నిస్ టోర్నమెంట్


టెన్నిస్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించిన సీవీ ఆనంద్

బంజారాహిల్స్: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హోటా) ఆధ్వర్యంలో 19వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీలను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బెంగుళూరు, చెన్నై, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. 30 ఏళ్ల వయస్సు నుంచి 70 ఏళ్ల వయస్సు మధ్యలో ఉన్న క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్‌లో తలపడ్డారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు, హోట సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం



ఖైరతాబాద్: చిన్నప్పటి నుంచి పేయింటింగ్ మీద ఉన్న ఆసక్తితో కళాకారిణి లావణ్య భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ఎంతో అద్భుతంగా పేయింటింగ్ వేస్తుంది. ఈ క్రమంలోనే ఖైరతాబాద్‌లో 70 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి రూపాన్ని వినాయక ఉత్సవాల సందర్భంగా రెండు గంటల్లో అద్భుతంగా తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌కు విచ్చేసిన లావణ్యను ఉత్సవ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, సందీప్‌రాజ్‌లు మహాగణపతి జ్ఞాపికను అందజేస్తూ ఘనంగా సన్మానించారు.

సమగ్ర సర్వేపై ప్రజల అనాసక్తి..!

- ప్రభుత్వ పథకాలపై ప్రశ్నలు సంధిస్తున్న ప్రజలు
- ఇంకా కొన్ని చోట్ల పూర్తికాని నివాసాల గుర్తింపు
- కొన్నిచోట్ల సిబ్బందికి తప్పని ఇక్కట్లు
- ఒక్కో దరఖాస్తు నింపేందుకు 40 నిమిషాలకుపైగా సమయం

వివరాలు చెబితే ఏం జరుగుతుందోనని ఆందోళన

సమగ్ర సర్వేలో భాగంగా మొన్నటి వరకు సాఫీగా సాగిన ప్రక్రియ శనివారం కుటుంబ వివరాల నమోదుతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. వివరాల నమోదుకు వెళ్లిన సిబ్బందికి ఆధార్‌కార్డు నెంబర్ కూడా చెప్పడం లేదు. మరి కొందరు కనీసం లోపలకు కూడా రానివ్వకుండా మొహం మీద తలుపులేస్తున్నారు. ఎందుకంటే ఏం చెబితే.. ఏం జరుగుతుందోననే భయం వారిలో నెలకొనడమే ఇందుకు కారణం.. దీంతో కుటుంబాల పూర్తి వివరాలు ఎలా నమోదు చేయాలో అర్థంకాక ఎన్యూమరేటర్లు తలలు పట్టుకుంటున్నారు.



బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కులగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు మూడురోజులపాటు ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. ఆ తరువాత నివాసాల గుర్తింపు ప్రక్రియ శనివారం మధ్యాహ్నం ప్రారంభమైంది. అయితే ఇంటింటికి వెళ్తున్న ఎన్యుమరేటర్లకు ఆయా నివాసితులు చుక్కలు చూపిస్తున్నారు. గత ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల్లోని పథకాలే ఇంకా రాలేదని ఈ సర్వే వల్ల ఏం వస్తుందో రాదో అంటూ ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అందించిన దరఖాస్తు ఫారంలో ఉన్న వివరాలు అన్నింటిని చెప్పేందుకు నివాసితులు ముందుకు రావడంలేదు. దీంతో చాలా గడులు ఖాళీగానే ఎన్యుమరేటర్లు వదిలేస్తున్నారు. దీనికి తోడు ఒక్కో ఫామ్ నింపేందుకు 40 నిమిషాల సమయం పడుతుందని ఎన్యుమరేటర్లు ఆరోపిస్తున్నారు. ఈ ఫామ్‌లో వ్యక్తి పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఉపాధి, ఆదాయం, ఆస్తులు, వ్యవసాయం, వారు పెంచుకునే పెంపుడు జంతువుల వివరాలు, కట్టుకున్న ఇల్లు ఇటుకలతో కట్టారా లేకపోతే దేంతో కట్టారు, రాజకీయంగా గతంలో ఏదైనా పార్టీలో పనిచేశారు, పని చేస్తే ఏదైనా పోస్టులు నిర్వహించారా వంటి ప్రశ్నలను ఎన్యుమరేటర్లు ప్రజలను అడగటంతో కొందరు చెప్పటానికి సంకోచిస్తున్నారు.

ఇంకా పూర్తికాని నివాసాల గుర్తింపు..

అయితే గత మూడు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్కో ఎన్యుమరేటర్ 150 నివాసాలను గుర్తించి ఆ నివాసాలకు స్టిక్కర్లు అంటించి ఆ ఇంటి నెంబర్లను రాసే ప్రక్రియను మొదలు పెట్టినప్పటికీ శనివారం నాటికి కూడా చాలా చోట్ల పూర్తి కాలేదు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఆరు డివిజన్లలో 800 బ్లాక్‌లను విభజించి 800 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. అయితే శనివారం సాయంత్రానికి కూడా స్టిక్కర్లు అంటివేత కార్యక్రమం కొన్ని బస్తీల్లో 60 శాతం మేర కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎక్కడైతే పూర్తిగా నివాసాల గుర్తింపు పూర్తయ్యిందో అక్కడ మాత్రమే సర్వే ప్రారంభించాలని అధికారులు సూచిస్తున్నారు. నివాసాల గుర్తింపు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు.

ఒక వైపు సర్వే... మరో వైపు ఓటరు స్పెషల్ డ్రైవ్

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది, ట్యాక్స్, ఆశా వర్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, టీచర్లు, రిసోర్స్ పర్సన్లు, బీఎల్‌వోలు, మహిళా సమాఖ్యల ప్రతినిధులు అందరినీ సమగ్ర సర్వే చేయాల్సిందిగా సూచించారు. మరో వైపు తాజాగా శని, ఆదివారాల్లో ఎన్నికల సంఘం ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే ఓటరు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఇందులో బీఎల్‌వోలు విధులు నిర్వహించాల్సి ఉంది. కాగా బీఎల్‌వోలు ఇప్పటికే సమగ్ర సర్వేలో కూడా ఉన్నారు. ఈ రెండు రోజులపాటు ఓటరు స్పెషల్ డ్రైవ్ పూర్తయిన తర్వాత వారు సమగ్ర సర్వే చేయాల్సి ఉంటుంది. ఇలా రెండు పనులు తాము ఎలా చేయాలంటూ బీఎల్‌వోలు మండిపడుతున్నారు.

కుక్కలను వదులుతున్నారు



సమగ్ర సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్ళి స్టిక్కర్ అంటించే కార్యక్రమంలో భాగంగా యజమానులు మమ్మల్ని అవమానపరుస్తున్నారు. అడిగిన వివరాలు చెప్పడం లేదు. కొన్నిచోట్ల ముఖం మీదే తలుపేస్తున్నారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్ వద్దకు వెళ్తే కుక్కలను వదిలారు. ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతున్నారు. అసలు వివరాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. స్టిక్కర్లు అంటించే కార్యక్రమం అందుకే ముందుకు సాగలేదు. మేం ఈ సర్వేలో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– జి. పద్మ, ఎన్యూమరేటర్

ఎక్కువ సమయం పడుతుంది



ఒక్కో దరఖాస్తు నింపడానికి 45 నిమిషాలకు పైగానే సమయం పడుతుంది. నివాసితులు చెప్పే ప్రతి విషయాన్ని ఫారంలో నమోదు చేసేందుకు కోడ్‌లు ఇచ్చారు. అవి ఇంకా మాకు అలవాటు కాలేదు. ప్రతి సమాధానానికి కోడ్ ద్వారా మాత్రమే ఫామ్‌లు నింపుతున్నాం. కొంత మంది నివాసితులు ఆధార్ కార్డు చూపించేందుకు కూడా సహకరించడం లేదు.

–సురేఖా రాణి, ఎన్యూమరేటర్

ఇచ్చిన సమాచారం గోప్యంగా ఉంటుంది



నివాసితులు చెప్పే సమాధానాలు తాము ఫామ్‌లో కోడ్‌ల రూపంలో మాత్రమే నింపుతుండటం వల్ల వేరే వారికి నివాసితులు చెప్పే సమాధానాల సారాంశం అర్థం కాదు. గోప్యత విషయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదని నివాసితులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆదాయ, ఆస్తుల విషయాలు చెప్పడానికి నివాసితులు నిరాకరిస్తున్నారు. ఊళ్ళలో ఉన్న వ్యవసాయ భూముల ఉన్నాయని కొందరు చెబుతున్నా వాటికి సంబంధించిన వివరాలు తమ వద్ద లేవంటూ మరి కొందరు చెబుతున్నారు.

– శ్రీనివాస్, ఎన్యూమరేటర్

నిన్న ఎన్యూమరేటర్లు.. నేడు బీఎల్‌వోలు

ఒకవైపు సమగ్ర సర్వే.. మరోవైపు ఓటరు నమోదుతో సతమతం


గతి స్కూల్‌లో బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు


ఫిలింనగర్ పోలింగ్ బూత్‌లో నూతన ఓటరు నమోదు

ఫిలింనగర్: నిన్నటి వరకు సమగ్ర సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లు శనివారం ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాల్లో బీఎల్‌వోలుగా విధులు నిర్వహించారు. ఒక వైపు సర్వే, మరో వైపు ఓటరు నమోదుతో వీరంతా సతమతమయ్యారు. తాను గత మూడు రోజులుగా సమగ్ర సర్వే చేశానని శనివారం గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో విధుల్లో ఉంచారని స్వప్న అనే బీఎల్‌వో వాపోయింది. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో సుమారుగా 240 మంది బీఎల్‌వోలు గత మూడు రోజులుగా ఎన్యూమరేటర్‌గా విధులు నిర్వహించారు. అటు ఎన్యూమరేటర్‌గా, ఇటు ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో రెండు చోట్లా విధులు నిర్వహించడం పట్ల వీరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు తమను ఇష్టానుసారంగా పని చేయించుకుంటున్నారని వాపోతున్నారు. విధి నిర్వహణలో భాగంగా మూడు రోజులపాటు సర్వే చేయగా ఇంటి యజమానుల తిరస్కరణలకు గురయ్యామని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేలో అడుగడుగునా అవమానాలు జరిగాయని తాజాగా ఓటరు నమోదు కార్యక్రమంలోనూ సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లుగా వారు తెలిపారు.

ప్రేమించాలని యువతికి బెదిరింపు

వెంగళరావునగర్: తనను ప్రేమించకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఓ యువకుడు యువతిని బెదిరించిన సంఘటన మధురానగర్ పీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే వ్యక్తి అల్లాపూర్‌లో విధులు నిర్వహిస్తుంటాడు. అతని కుమార్తె ఆర్‌టీసీ రోడ్డులో కోచింగ్ తీసుకుంటుంది. ఈ క్రమంలో 2021 సంవత్సరంలో కరణ్‌సింగ్ యువతిని ప్రేమ పేరుతో వేధించాడు. దీంతో ఆమె తండ్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా,యువకుడి మామలు వచ్చి ఇకపై ఇలా జరగదని చెప్పడంతో కేసును విరమించుకున్నారు. తిరిగి ఈనెల 4వ తేదీన యువతి మధురానగర్ మెట్రోస్టేషన్ నుంచి వస్తుండగా కరణ్‌సింగ్ మద్యం సేవించి యువతిని ప్రేమించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ బెదిరించాడు. విషయం తెలుసుకున్న యువతి తండ్రి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జి వీసీ రావాలి..సమస్యను పరిష్కరించాలి

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన



బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్‌ఏఎఫ్‌ఏయూ) కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు నిరసనను కొనసాగించారు. అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ విశ్వవిద్యాలయానికి వచ్చి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, రాబింద్రనాథ్ సోలమన్‌లు మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రకారం ఏ విశ్వవిద్యాలయానికైనా కనీసం 60-100 ఎకరాలు ఉండాలని పేర్కొన్నారు. జేఏసీ సెక్రటరీ జనరల్ పి.వేణుగోపాల్‌రెడ్డి, పుష్ప చక్రపాణి, చంద్రకళ, ప్రమీల కేతవత్, బీ శ్రీనివాస్, రజనీకాంత్, రాములు, అవినాష్, కిషోర్ తదితరులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

హరికృష్ణకు బీసీ సంఘాల మద్దతు


ప్రసన్న హరికృష్ణకు మద్దతు తెలుపుతున్న బీసీ సంఘాల నేతలు టి.రాజ్‌కుమార్ తదితరులు

కాచిగూడ: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణను బీసీ సంఘాల నేతలు కలిసి మద్దతు ప్రకటించారు. అనంతరం బషీర్‌బాగ్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్ కుమార్ మాట్లాడుతూ హరికృష్ణ గెలుపు కోసం బీసీ పట్టభద్రులు కృషి చేయాలని కోరారు. బీసీ పట్టభద్రుల ఓట్లు బీసీ అభ్యర్థికే వేయాలని ఆయన కోరారు.

మంత్రి పొన్నం నివాసంలో సర్వే


సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శనివారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 13 మినిస్టర్స్ కాలనీలోని తన నివాసంలో ఎన్యూమరేటర్లకు వివరాలు తెలియజేస్తున్న హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

- బంజారాహిల్స్

రెడ్డిగాండ్ల కులాన్ని బీసీ జాబితాలో చేర్చితే సహించం

పంజగుట్ట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కులగణనలో రెడ్డి గాండ్ల కులాన్ని బీసీ జాబితాలో చేర్చరాదని బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు పాలూరు రామకృష్ణయ్య డిమాండ్ చేశారు. రెడ్డి గాండ్లు అంటే వారు రెడ్డి ఉపకులంలో ఒకరని కానీ వారు బీసీ సర్టిఫికెట్ పొందేందుకు గాండ్లు అని రాయిస్తు బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్డి ఉపకులాలు మొత్తం 36 ఉంటాయని అందులో రెడ్డి గాండ్లు 3వ స్థానంలో ఉందని వీరు సమాజంలో గౌరవం కోసం రెడ్డి అని చెప్పుకుంటూ రెడ్డి కులం వారితో వివాహ సంబంధాలు కలుపుకుంటూ గాండ్ల పేరుతో బీసీ బీ సర్టిఫికెట్ పొంది విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో బీసీ రిజర్వేషన్లకు గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణనలో రెడ్డి అని రాయించి ఉపకులం దగ్గర గాండ్లు అని బీసీ బి అని రాయిస్తున్నారని ఇది సరికాదన్నారు. ఈ సమావేశంలో శాలవాహన కుమ్మర సంఘం ప్రతినిధి సముద్రాల తిరుపతి, పంతకాని శ్రీనివాస్, ఆత్మకూరి స్వామి, నిడిగొండ మైనర్ బాబు, వెన్నంపెల్ల మహేష్, జయగిరి సమ్మయ్య, మర్క కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఖైరతాబాద్: ఖైరతాబాద్ పోలీసు స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన సింహగిరి కుటుంబానికి తోటి పోలీసు సిబ్బంది అండగా నిలిచారు. ఆయన కుటుంబానికి అండగా నిలబడాలన్న ఉద్దేశంతో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌తోపాటు తోటి సిబ్బంది తరఫున మృతుడి భార్యకు రూ. 78 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. సింహగిరి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కాచిగూడ: పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గాంధీకుటీర్ బస్తీ అధ్యక్షుడు తోటశివకుమార్ ముదిరాజ్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు వెంకటనారాయణ, నర్సింగ్ రావు, కిమ్స్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ విక్రమ్ అన్నారు. జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం హిమాయత్‌నగర్ డివిజన్ గాంధీకుటీర్ బస్తీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, పిడియాట్రిక్, బీపీ, షుగర్, వెయిట్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనివాస్, గాంధీ కుటీర్ బస్తీ కమిటీ వైస్ చైర్మన్ వేణు, కుమార్ యాదవ్, బి.దాస్ తదితరులు పాల్గొన్నారు.



ఫోన్ ఇస్తానని నగదు తీసుకుని మోసం

వెంగళరావునగర్: ఫోన్ ఇస్తానని నమ్మించి నగదు తీసుకుని యువకుడిని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... టోలీచౌకీలో వ్యాపారం చేసుకునే మహ్మద్ రజీముద్దీన్ ఫోన్ కొనుగోలు చేయడానికి ఓఎల్‌ఎక్స్‌లో వెతికాడు. కిరణ్ అనే వ్యక్తి తన వద్ద రూ.28 వేలు ఖరీదు చేసే ఫోన్ ఉందని, రూ. 25,500లకు ఇస్తానని రజీముద్దీన్‌కు ఫోన్‌లో చెప్పాడు. తాను బిజీగా ఉన్నానని ఎల్లారెడ్డిగూడలోని తన సోదరుని వద్ద ఫోన్ ఉందని, అక్కడికి వెళ్ళి ఫోన్ చెక్ చేసుకుని డబ్బులు పంపితే అతను ఫోన్ ఇస్తాడని చెప్పాడు. ఇది నిజమని ఎల్లారెడ్డిగూడకు వెళ్ళి అద్దెపల్లి లక్ష్మీ నారాయణ అనే యువకుడిని కలిసి ఫోన్ చెక్ చేసుకుని తిరిగి ఇచ్చాడు. అనంతరం రజీముద్దీన్ ఆన్‌లైన్‌లో కిరణ్‌కు డబ్బులు పంపి దాని స్క్రీన్‌ను లక్ష్మీనారాయణకు చూపాడు. అయితే లక్ష్మీనారాయణ తనకు డబ్బులు పంపితేనే ఫోన్ ఇస్తానని చెప్పాడు. దీంతో ఆశ్చర్యపోయిన రజీముద్దీన్ ఇదేమని ప్రశ్నించగా కిరణ్ మీ సోదరుడు కాదా అంటే మీ సోదరుడు కాదా అని ఇద్దరు ప్రశ్నించుకున్నారు. ఆ తరవాత ఇద్దరు మోసపోయామని తెలుసుకొని కిరణ్‌పై రజీముద్దీన్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం... ఆరుగురి అరెస్ట్

వెంగళరావునగర్: గంజాయిని విక్రయిస్తున్న ముఠాను మధురానగర్ పోలీసులు అరెస్టు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఏపీ, తెలంగాణా ప్రాంతాలకు చెందిన కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా మధురానగర్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లు ఇటీవల పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో జీటీఎస్ టెంపుల్, జానకమ్మతోట, యూసుఫ్‌గూడ పరిసర ప్రాంతాల్లో కొంతమంది గంజాయి విక్రయిస్తున్నట్టుగా పోలీసులు గుర్తించారు. దీంతో శనివారం పగడ్బందీగా పోలీసులు ఆయా ప్రాంతాలకు వెళ్ళి గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశారు. అనంతరం వారి వద్ద ఉన్న 659 గ్రాముల ఎండు గంజాయి, నాలుగు ఫోన్లు, రూ.6 వేలు నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎం.శ్రీనివాస్, సీహెచ్.అవినాష్, టి.అరుణ్‌కుమార్, డి.నవీన్, రవి, రాములు ఉన్నారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాబీలోన్ పబ్ మేనేజర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: మితిమీరిన శబ్దాలతో చుట్టుపక్కల వారికి అసౌకర్యం కలిగిస్తున్న బాబీలోన్ పబ్ మేనేజర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని బాబీలోన్ పబ్ నుంచి శృతిమించిన శబ్దాలతో ఇబ్బందికరంగా ఉందంటూ స్థానికులు ఈ నెల 7వ తేదీ రాత్రి 10.15 గంటల సమయంలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ సోమశేఖర్‌గౌడ్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి సదరు పబ్‌పై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడ పెద్దపెద్ద సౌండ్‌లతో మ్యూజిక్ రావడాన్ని గమనించి మేనేజర్ ఆసిఫ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి ఆదివారం, 10, నవంబర్, 2024

ఐదు నెలలు గడిచినా దిశ లేక..

- అభివృద్ధిపై జరగని సమీక్ష
- పథకాలపై పర్యవేక్షణ కరువు
- వచ్చేనెల సమావేశంపై కసరత్తు
- దిశ ఛైర్మన్‌గా మల్కాజిగిరి ఎంపీ


మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన 21 ప్రాయోజిత పథకాలపై పర్యవేక్షణతో పాటు వాటి అమలు, నిధుల వినియోగంపై సమీక్షించాల్సిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశ నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఈ కమిటీకి స్థానిక మల్కాజిగిరి ఎంపీ అధ్యక్షత వహిస్తుండగా.. కలెక్టరు మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దిశ కమిటీ మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో విస్తరించి ఉంది. దీంతో ఈ కమిటీకి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఛైర్మన్‌గా, కలెక్టర్ గౌతమ్ మెంబర్ కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

సమావేశం జరిగితే ప్రయోజనం..

ఎంపీ ల్యాడ్స్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం ఫసల్ బీమా యోజన, ముద్రా రుణాలు, పీఎం ఆవాస్ యోజన తదితర పథకాల అమలుపై నిర్మాణాత్మక చర్చ జరిగితేనే దిశ కమిటీ సమావేశాలు ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయి. మూడు నాలుగేళ్లుగా నిర్మాణాత్మక చర్చ జరగకపోవడంతో అర్హులైన వారికి చాలా వరకు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేకూరలేదు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించడంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందే వీలు ఉంటుంది. అలాగే, ఉపాధి హామీ పథకం, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సర్వ శిక్షా అభియాన్, ఐసీడీఎస్, టెలికామ్, రైల్వే, రహదారులు, గనులు, డిజిటల్ భారత్, ఉజ్వల్ యోజన, మౌలిక సదుపాయాల కల్పన తదితర 21 కేంద్ర పథకాలకు సంబంధించిన కార్యక్రమాలపై దిశ కమిటీలో చర్చ జరిగే అవకాశముంది. ఇది జరిగితే.. అర్హులైన ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

మూడు నెలలకు ఒకసారి..

ప్రతి మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన దిశ సమావేశాలను గతంలో మల్కాజిగిరి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన నేతలు రెండు, మూడు పర్యాయాలు మినహాయించి ఎక్కువగా నిర్వహించలేకపోయారని తెలుస్తోంది. తాజాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బాధ్యతలు చేపట్టి ఐదు నెలలు గడవడంతో కొత్త కమిటీ సమావేశం ఎప్పుడనే విషయంపై చర్చ జరుగుతోంది. ఈ కమిటీలో స్థానిక మల్కాజిగిరి ఎంపీ, కలెక్టర్‌తో పాటూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పురపాలిక ఛైర్మన్లు, జెడ్పీ ఛైర్మన్లు, ఎంపీపీలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు(డీఆర్డీవో)లతో పాటూ పలువురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు.

పాత కమిటీ రద్దు కావడంతో కొత్త కమిటీ ఏర్పాటుకు ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. త్వరలో దిశ కొత్త కమిటీ ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేసి, డిసెంబర్‌లో సమావేశాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీ కాలం ముగిసిపోవడంతో ప్రస్తుతం ఏర్పాటు కానున్న కొత్త కమిటీలో వాటికి ప్రాతినిధ్యం ఉండదు.

నగరంలో నేడు

- వంశీ ఆర్ట్ థియేటర్స్, అమెరికాకు చెందిన డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆళ్ల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ కవి డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ సినారె-ఆళ్ల స్వర్ణకంకణ ప్రదానోత్సవం ఉదయం 11 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరుగుతుంది.
- ఎం.వెంకటరంగయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫ్రీడమ్ ఫర్ గరల్స్ 'ఇక చాలు' అంశంపై యూత్ కన్వెన్షన్ ఉంటుంది.
- రచన టెలివిజన్ సంస్థ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియంలో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తిటీవీ కోటి దీపోత్సవం ఉంటుంది.
- ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇనిస్టిట్యూట్ ఆవరణలో ఉదయం6.45 గంటలకు చిల్డ్రన్స్ ఐ కేర్ అవేర్‌నెస్ వాక్ కొనసాగుతుంది.
- టీఎఫ్‌సీసీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం సాయంత్రం 6 గంటలకు బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.



వైభవంగా కోటి దీపోత్సవం ప్రారంభం

– హాజరైన హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ

కవాడిగూడ: కార్తీక మాసం పురస్కరించుకొని ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా కోటి దీపోత్సవం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నుల పండువగా కాళేశ్వరం శ్రీముక్తేశ్వర స్వామి కల్యాణం జరిపించారు. పుణ్యనదీ జలాలతో కాశీ స్పటిక లింగానికి శతఅష్టోత్తర శంఖాభిషేకం నిర్వహించారు. భక్తులచే స్వయంగా కోటి మల్లెల అర్చన నిర్వహించారు. అనంతరం హంస వాహనంపై కోటి దీపోత్సవ ప్రాంగణంలో ఆది దంపతుల దర్శన భాగ్యం కల్పించారు. ఆ ప్రాంగణమంతా శివనామ స్మరణతో మార్మోగింది. తుని తపోవనం పీఠాధిపతి శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామి భక్తులకు ఆశీర్వచనం అందించగా నంబూరు శ్రీకాలి, వనశ్రమాధిపతి, చంద్రకాలి ప్రసాద్ మాతాజీ, డాక్టర్ మైలవరపు శ్రీనివాస్‌రావు ప్రవచన అమృతాలు వినిపించారు.



పెన్షన్ కంటే తక్కువగా స్కాలర్‌షిప్

- 14లక్షల మంది బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి
- విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


బీసీ విద్యార్థి సంఘం సదస్సులో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో పెన్షన్ కంటే స్కాలర్‌షిప్‌లనే తక్కువగా ఇస్తున్నారని ఈ ప్రభుత్వానికి సిగ్గు ఉందా అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లను పెంచి ఇచ్చేదాక ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14లక్షల బీసీ విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదని విమర్శించారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కాంట్రాక్టర్ల బిల్లులు మాత్రం పాస్ అవుతున్నాయి తప్పా, స్కాలర్‌షిప్‌ల బిల్లులు పాస్ కావడం లేదని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుంటే రానున్న రోజుల్లో ప్రతి కళాశాలలో ధర్నాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను గేరావ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా నాణ్యమైన లీడర్స్ బయటకు వస్తారన్నారు. ప్రభుత్వ లోపాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీష్, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ నీలావెంకటేష్, గుజ్జ సత్యం, రాజేందర్, నందగోపాల్, మోదీ రాందేవ్, రఘుపతి, భాషా, ఉదయ్ పాల్గొన్నారు.

ఫిలింనగర్ సొసైటీకి హైడ్రా షాక్

రూ.కోట్ల విలువైన స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


ఫిలింనగర్ 1/9 చౌరస్తాలో అక్రమ నిర్మాణాలను కూలుస్తున్న హైడ్రా సిబ్బంది

ఫిలింనగర్: ఫిలింనగర్ సొసైటీలోని 1/9 చౌరస్తాలోని ఫిలింనగర్ సొసైటీకి చెందిన 291 గజాల స్థలంలో నిర్మించిన ఫిలింనగర్ మహిళా మండలి షెడ్డును హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. శనివారం ఉదయం ఇక్కడికి చేరుకున్న సిబ్బంది జేసీబీల సహాయంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామని ఈ నెల 6వ తేదీన హైడ్రా డిప్యూటీ సిటీ ప్లానర్ సొసైటీకి నోటీసులు అందజేశారు. జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ సొసైటీ లేఅవుట్‌లో ఇది ఖాళీ స్థలమని, రోడ్డు కోసం వదిలారని, ఈ స్థలంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో హైడ్రా సిబ్బంది ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి 291 గజాల స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. లేఅవుట్‌లో ఇది పూర్తిగా రోడ్డు స్థలమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఈ స్థలంపై చర్యలు తీసుకోవద్దంటూ ఫిలింనగర్ సొసైటీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టు గతేడాది నవంబర్ 10న పర్మినెంట్ స్టే కొనసాగిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు స్టే ఉండగానే ఎలా కూల్చివేస్తారంటూ ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ ప్రశ్నించారు. తమకు నోటీసు కూడా ఎలాంటి సంతకం లేకుండానే డిప్యూటీ సిటీ ప్లానర్ ఇచ్చారని ఆయన అన్నారు. ఈ కూల్చివేతలు నిబంధనలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు.

అల్లు అర్జున్‌తో థమ్సప్



సాక్షి, సిటీబ్యూరో: మెగాస్టార్ చిరంజీవి సహా టాలీవుడ్ సూపర్‌స్టార్స్‌ను బ్రాండ్ అంబాసిడర్స్‌గా నియమించుకున్న శీతల పానీయం బ్రాండ్ థమ్సప్ తమ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను ఎంచుకుంది. ఈ విషయాన్ని బ్రాండ్ నగర ప్రతినిధులు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఒక ఆసక్తికరమైన టీజర్‌ను రూపొందించి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. పుష్ప ద్వారా దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్న అల్లు అర్జున్ ఇమేజ్‌కు తగ్గట్టుగా మరిన్ని ఆసక్తికరమైన నేపథ్యాలతో ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆవిర్భావం


అమరులకు నివాళులర్పిస్తున్న జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూలో కొత్తగా జార్జిరెడ్డి పీడీఎస్‌యూ శనివారం ఏర్పడింది. ఈ సందర్భంగా సమావేశంలో సంఘం నేతలు పీడీఎస్‌యూ 50 ఏళ్ల ప్రస్థానాన్ని వివరించారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎస్.నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సుమంత్, స్టేట్ గల్స్ కన్వీనర్‌గా కె.స్వాతితో పాటు 15 మందితో రాష్ట్ర కమిటీ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా అంజితో పాటు 17 మంది సభ్యులు, ఓయూ విభాగం జార్జిరెడ్డి పీడీఎస్‌యూ అధ్యక్షురాలుగా కె.స్వాతి, ప్రధాన కార్యదర్శిగా రుక్మత్ పాషాతో పాటు 13 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జార్జిరెడ్డి ఆశయ సాధనకు నూతన సంఘాన్ని స్థాపించినట్లు వారు పేర్కొన్నారు.

న్యాయవాద వృత్తి విలువైంది

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వింద్యాల బాలకిష్టారెడ్డి



చిక్కడపల్లి: న్యాయవాద వృత్తి విలువైందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వింద్యాల బాలకిష్టారెడ్డి అన్నారు. చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయ కళాశాలలో శనివారం నిర్వహించిన జాతీయ మూట్‌కోర్టు పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయ విద్య ప్రపంచ స్థాయిలో వృద్ధి చెందిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో న్యాయవాద వృత్తి, విద్య సులభతరమైందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ విభాగం ప్రొఫెసర్ ఎస్.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కృషి చేస్తే న్యాయవాద వృత్తిలో రాణించవచ్చన్నారు. పాలమూరు శాతవాహన విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాధ్యతాయుతమైన న్యాయవాద వృత్తితో సమాజ ప్రగతికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో వాసవి విద్యా సంస్థల అధినేత పి.రామ్‌మోహన్‌రావు, వాసవి సంస్థల కోశాధికారి పార్థసారథి, కార్యదర్శి ఎం. కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి ఎం.ఆనంద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అరవింద, అధ్యాపకులు, విద్యార్థులు, పోటీదారులు తదితరులు పాల్గొన్నారు.

స్టెమ్ ఫెస్ట్.. యువ ఆవిష్కరణలకు స్ఫూర్తిదాయకం

ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ తబస్సుమ్



సాక్షి, సిటీబ్యూరో: మెకథ్లాన్ –2024 హైదరాబాద్ ఎడిషన్ విద్యార్థుల అద్భుతమైన సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చిందని ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి క్యాంపస్ ప్రిన్సిపాల్ తబస్సుమ్ జైదీ అన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కామన్వెల్త్ యూత్ కౌన్సిల్, కామన్వెల్త్ స్టూడెంట్ అసోసియేషన్, గ్లోబల్ అండర్‌స్టాండింగ్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ (జీయూఎస్‌డీ) సహకారంతో నిర్వహించిన ప్రముఖ సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమెటిక్స్(ఎస్‌టీఈఎం) ఫెస్ట్, మెకథ్లాన్ 2024 హైదరాబాద్ ఎడిషన్ యువ ఆవిష్కరణలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. 8 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు గల 1,500 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఆయా విభాగాల్లో ఎంపికైన హైదరాబాద్ ఎడిషన్ విజేతలను నవంబర్ 23, 24 తేదీల్లో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటారన్నారు. ఎకోఇన్నోవా సైన్స్ ఎగ్జిబిషన్, బ్రెయినియాక్ బాటిల్ క్విజ్, రేసర్ రోబో, ఫాస్టెస్ట్ లైన్ ఫాలోవర్ వంటి అధునాతన రోబోటిక్స్ ఛాలెంజ్ పోటీలను ప్రదర్శించారని తెలిపారు. మెకాథ్లాన్ వంటి స్టెమ్ ఫెస్ట్‌లు సైన్స్ అండ్ టెక్నాలజీలో ఉత్సుకతను రేకెత్తిస్తాయన్నారు. విమర్శనాత్మక ఆలోచన, సమస్య-పరిష్కారం, కృషి, నైపుణ్యాలను పెంపొందించాయని వివరించారు. విద్యార్థుల ఆలోచనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మార్చడానికి వేదికను అందిస్తాయని వివరించారు.

తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలు 12న ప్రదానం

నాంపల్లి: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి సంవత్సరం అందజేసే సాహితీ పురస్కారాలను 2022వ సంవత్సరానికి గాను ఈ నెల 12వ తేదీన మంగళవారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీ ఎన్టీఆర్ కళా మందిరంలో ప్రదానం చేయడం జరుగుతుందని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య వై.రెడ్డి శ్యామల ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి, విశిష్ట అతిథిగా మాజీ వీసీ ఆచార్య తంగెడ కిషన్‌రావు హాజరవుతారని, సభాధ్యక్షులుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు వ్యవహరిస్తారని తెలిపారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.20,116 నగదుతో పాటు పురస్కార పత్రాన్ని అందజేస్తామని ఆమె తెలిపారు. సాధారణ పాఠకులతో పాటు కవులు, రచయితలు, విమర్శకులు, నాటక కర్తల నుంచి సూచనలను స్వీకరించి 2019, 20, 21వ సంవత్సరాల్లో ప్రచురించబడిన పుస్తకాలను సేకరించి న్యాయ నిర్ణేతల చేత వివిధ దశల్లో ఎంపిక చేసిన ఉత్తమ సాహితీమూర్తులకు ఈ పురస్కారాలను అందజేయనున్నట్లు వివరించారు.

పురస్కార గ్రహీతలు వీరే..

- శ్రీవరదాభ్యుదయం, పద్య కవిత, – పెండ్యాల కిషన్‌శర్మ
- కాలం వాలిపోతున్న వైపు, వచన కవిత, – మెర్సి మార్గరేట్
- ఆట..పాట, బాల సాహిత్యం, – ఎన్నవెళ్ళి రాజమౌళి
- నూనెసుక్క, కథ/కథానిక, – కొట్టం రామకృష్ణారెడ్డి
- కెరటం, నవల, – తాళ్ళపల్లి యాకమ్మ
- అనుభూతి.. అన్వేషణ, సాహిత్య విమర్శ, – ఆచార్య నిత్యానందరావు
- స్వాతంత్ర్యోద్యమ వీరుల నాటకత్రయం, నాటకం, – పీఏ.దేవి
- వీరయ్య, అనువాదం, – గురుమూర్తి గుబిలి
- ఆజాద్ హింద్ ఫౌజ్, వచన రచన, – సయ్యద్ నశీర్ అహమ్మద్
- రంగంటే ఇష్టం, రచయిత్రి ఉత్తమ గ్రంథం, – చాగంటి తులసి

అన్ని రంగాల్లో ఆధునిక పరిశోధనలకు ప్రాముఖ్యత

– యూజీసీ కార్యదర్శి, ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి



కేపీహెచ్‌బీకాలనీ: రేడియంట్ భారత్‌లో సృజనాత్మకత, ఆధునిక ఆవిష్కరణలకు ప్రత్యేక స్థానం ఉంటుందని యూజీసీ కార్యదర్శి, ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి తెలిపారు. రెండు రోజులుగా జేఎన్‌టీయూహెచ్‌లోని యూజీసీ ఆడిటోరియంలో తెలంగాణ శోధ్ ఆధ్వర్యంలో 'రేడియంట్ భారత్ కోసం పరిశోధన 2024'అనే అంశంపై నిర్వహించిన సదస్సు శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూజీసీ కార్యదర్శి ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండటంతో పాటు ప్రపంచదేశాలకు దీటుగా నిలబడేందుకు అవసరమైన అన్ని హంగులను సమకూర్చుకుందన్నారు. దేశంలోని అన్ని రంగాల్లో ఆధునిక పరిశోధనలకు ప్రాముఖ్యత లభించడం హర్షణీయమని తెలిపారు. జాతీయ విద్యా విధానాన్ని, స్కిల్ ఇండియా పురోగతిని, ప్రోగ్రెసివ్ లెర్నింగ్ లక్ష్యాలను వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలు, గ్లోబల్ ఇన్నోవేషన్స్, వినూత్న ఆలోచన పద్ధతుల విస్తరణ, స్టార్టప్‌ల ప్రభంజనంపై దృష్టి సారించాయన్నారు. అనంతరం ఆధునిక పరిశోధనాత్మక పాత్రలను సదస్సులో ప్రవేశపెట్టారు. భారతీయ సాంఘిక శాస్త్ర పరిశోధన మండలి, ఇక్ఫాయి, జేఎన్‌టీయూహెచ్, ఏబీవీపీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జానారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ ఆర్‌అండ్‌డీ విభాగం డైరెక్టర్ సుర్మత్, డిప్యూటీ డైరెక్టర్ అద్దుపల్లి ఉమ, శ్రీహరికోటలోని ఎస్‌డిఎస్‌ఎస్ డైరెక్టర్ ఏ.రాజరాజన్ పాల్గొన్నారు.

సిటీ కళాశాలకు అరుదైన ఘనత

కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య జి.యాదగిరి



చార్మినార్: శత వసంతాల ప్రభుత్వ సిటీ కళాశాల నాక్ అక్రెడిటేషన్‌లో దేశంలోనే అత్యున్నత గ్రేడ్ పొంది అరుదైన ఘనత సాధించిందని కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య యాదగిరి అన్నారు. నాక్ బెంగళూరు శనివారం విడుదల చేసిన ఫలితాల ప్రకారం.. సిటీ కళాశాల 3.67 సీజీపీఏ సాధించి అరుదైన చరిత్ర సృష్టించిందని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన సంబురాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్, ఐక్యూఎసి సమన్వయకర్త డా.నీరజ, అధ్యాపక బృందం సమష్టి కృషి, బోధనేతర సిబ్బంది సహకారం, విద్యార్థుల భాగస్వామ్యంతో కళాశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. సంయుక్త సంచాలకులు రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో బోధన, విద్యా సంస్కరణల్లో సిటీ కళాశాల మార్గదర్శకమైన ప్రమాణాలు పాటించిందన్నారు. కళాశాల విద్యాశాఖ పూర్వ కమిషనర్ దార్శనికతతో తీసుకున్న నిర్ణయం ఈ ఉత్తమ ఫలితాలకు ప్రధాన కారణమన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్ మాట్లాడుతూ.. గత నాక్ బృందం ఇచ్చిన సూచనలను సంపూర్ణంగా అమలు చేయడంతో పాటు కళాశాలకు సొంత నిధులతో కొత్త భవనాన్ని సమకూర్చుకున్నామని, ఈ ఐదేళ్లలో అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులు నిర్వహించడమే కాకుండా విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి నిర్మాణాత్మకమైన విధానాన్ని అమలు పర్చడంలో కళాశాల కీలకమైన పాత్ర పోషించిందన్నారు. విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అభినందించారు. తాము చదువుకున్న సిటీ కళాశాల దేశంలోనే ప్రతిష్ఠాత్మక గ్రేడ్ సాధించడం పట్ల పూర్వ విద్యార్థులుగా సంతోష పడుతున్నామని ఆచార్య హరగోపాల్, డా.విద్యాధర్ భట్, అనంత మోహన్ తదితరులు తెలిపారు. ఈ సంబరాల్లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ దత్‌శుక్లా, బిల్డింగ్ ఇన్‌చార్జి డా.యాదయ్య, మాధవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మెథడిస్ట్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్

అబిడ్స్: హెచ్‌టీసీ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ ఆబిడ్స్ మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించింది. మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల, స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు గ్రేటర్ పరిధిలోని 10 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి దాదాపు వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రూప్ డిస్కషన్ రౌండ్స్, ఆన్‌లైన్ అసెస్‌మెంట్ టెస్ట్‌ల నుంచి దాదాపు 300 మంది విద్యార్థుల షార్ట్‌లిస్ట్ తయారు చేశారు. తుది ఎంపిక హెచ్‌టీసీ కంపెనీలో నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా మెథడిస్ట్ కళాశాల సెక్రెటరి, కరస్పాండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ.. హెచ్‌టీసీ రిక్రూట్‌మెంట్ బృందం ఎంపిక చేసిన షార్ట్‌లిస్ట్ విద్యార్థులను అభినందించారు. తమ కళాశాలలో విద్య అభ్యసించే విద్యార్థులంతా విద్యాభ్యాసం పూర్తయ్యేలోపు వారు ప్రపంచవ్యాప్తంగా పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందేలా ప్రత్యేకంగా సీఆర్‌టీ తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు విద్యపట్ల ఏకాగ్రత చూపించి గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెథడిస్ట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభుజి బెనకోప్, డైరెక్టర్ డాక్టర్ ఎం.లక్ష్మీపతిరావు తదితరులు ఉన్నారు.

చదువంటే కేవలం మార్కులే కాదు


- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- ప్రారంభమైన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆవిర్భావ వేడుకలు



కవాడిగూడ: చదువంటే కేవలం మార్కులే కాదని, చదువు సంస్కారం, సభ్యత, మానవసంబంధాలను కలుపుతూ సమాజంలో తన కాళ్లపై తాను నిలబడే ధైర్యాన్ని ఇచ్చేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దోమలగూడ గగన్‌మహల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని మొదటి రోజు శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి విద్యార్థులతో పాటు గౌరవ వందన స్వీకరించారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలుగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చేసిన కార్యక్రమాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాలలకు వెళ్లాలంటేనే విద్యార్థులకు భారంగా మారిందన్నారు. ఇంతకు ముందు పాఠశాలల్లో చదువుతో పాటు అన్నిరంగాల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థులను తీర్చిదిద్దేవారన్నారు. కార్పొరేట్ వ్యవస్థ వచ్చిన తర్వాత చదువు అంటే కేవలం ర్యాంకులు, మార్కులే అన్న విధంగా తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంస్థ రాష్ట్ర చీఫ్ కమిషనర్ బుర్రా వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి సీజే అరుణ్ కుమార్, కోశాధికారి ఎం.రాజగోపాల్, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ జి.పరమేశ్వర్లు పాల్గొన్నారు. నేటి ఉత్సవాల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరవుతారని తెలిపారు.

శ్రమ విలువ వెలకట్టలేనిది


– ప్రముఖ కవి సుద్దాల అశోక్ తేజ



చందానగర్: ప్రపంచ చరిత్ర శ్రమతోనే నిండి ఉందని, మానవ వికాసం, సమాజ పురోగమనంలో శ్రమ విలువ వెలకట్టలేనిదని ప్రముఖ కవి సుద్దాల అశోక్‌తేజ పేర్కొన్నారు. కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ రాసిన 57వ 'శ్రమకావ్య' గానం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఆర్ఆర్ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్.టి.సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్ జీవీ రత్నాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు వేదాలు పుట్టకన్నా ముందే శ్రమ సామవేదాన్ని ప్రవచిస్తున్నామన్నారు. ఇప్పుడు మనుషులను విడదీసే మతాలు పుట్టక ముందే ఏకైక శ్రామిక మతాన్ని ప్రకటిస్తున్నామన్నారు. క్రైస్తవం, ముస్లిం, హిందూ మతాల కంటే ముందే ఏర్పడిన ఏకైక మతం శ్రామిక మతమన్నారు. పౌరాణిక ప్రతీకలను వాడుకొని కావ్యాలను రాశామన్నారు. శ్రమ ప్రయాణమే శ్రమాయణమని, రాముడు ధనస్సు, కృష్ణుడు వేణువు వేసుకున్న ఆభరణాలు, విష్ణువు పెట్టుకున్న కిరీటం కూడా శ్రమజీవులు తయారు చేసిందేనని, శ్రముడు, శ్రమి కలిసి సాగిన ప్రస్థానం ఈ శ్రమకావ్యం అన్నారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శులు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు, చెన్నమనేని వెంకటేశ్వర్ రావు, కోశాధికారి చెన్నకేశవరావు, ఎస్ఆర్ఆర్ పరిశోధన కేంద్రం సభ్యులు దేశిని లక్ష్మీనారాయణ, జోస్యభట్ల కల్పన, కనపర్తి జ్యోష్న, డి.కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనలో నిందితులను శిక్షించాలి

ఇందిరాపార్కు వద్ద మహిళా సంఘాల ధర్నా



కవాడిగూడ: కోల్‌కతాలోని ఆర్‌జీకార్ జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, నేతలు స్వరూప, చేతన మహిళా సంఘం నాయకులు శ్రీదేవి తదితరులు మాట్లాడారు. ఆర్‌జీకార్ జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య ఘటన జరిగి 90 రోజులు గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించేంతవరకు పోరాటం ఆగదన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి, పీడీఎస్‌యూ నేతలు ఉన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 10, నవంబర్, 2024





నగరానికి చెందిన ఆలేటి సాయిరాం ప్రమోధిని రెడ్డి, పటేల్ నర్సింహారెడ్డి తమ పెళ్లి వేడుకను ప్రత్యక్షంగా చిత్రీకరించడానికి ఒక పెయింటర్‌ను నియమించుకున్నారు. ప్రత్యక్ష ప్రసారం అందించే లైవ్ టెలికాస్ట్ గురించి విన్నాం కానీ.. లైవ్ పెయింటింగ్ వినలేదు అనుకుంటే మీరింకా వెడ్డింగ్ ట్రెండ్స్‌లో అప్‌డేట్ కాలేదన్నమాటే..

- సాక్షి, సిటీబ్యూరో

పెళ్లి వేళ.. చిత్రకళ..

హైదరాబాద్ వైబ్స్



రంగులు అద్దుకుంటున్న లైవ్ పెయింటింగ్

- వెడ్డింగ్ ఈవెంట్స్‌లో చిత్రకళకు కొత్త క్రేజ్
- లైవ్ పెయింటింగ్, టర్మరిక్ ఆర్ట్ సందడి
- ఔత్సాహిక యువ చిత్రకారులకు చేతినిండా పని
- ఆర్ట్ చుట్టూ అల్లుకుంటున్న కొత్త అనుబంధాలు



వధూవరులు ఓవైపు రంగుల కలల్లో తేలిపోతుంటే.. మరోవైపు సప్తవర్ణాల చిత్ర 'కళ' ఆ ఇద్దరి అనుబంధం సాక్షిగా పెళ్ళి వేడుకను అల్లుకుపోతోంది. ఫొటోగ్రఫీ మామూలే గానీ.. లైవ్ పెయింటింగ్ పెడుతున్నారా లేదా..? అని వెడ్డింగ్ ప్లానర్స్‌ను అడిగే రోజులు వచ్చేశాయంటే.. ఇప్పుడు, వివాహ వేడుకల్లో చిత్రకళకు పెరుగుతున్న అర్థం చేసుకోవచ్చు.

అద్దుతెరతో ఆరంభం..

పెళ్లి వేడుకల సమయంలో వధూవరుల మధ్య ఉంచే అద్దుతెరను కళాత్మకంగా రూపొందించడంతో ఓ రకంగా పెళ్లిళ్లలో చిత్రకళకు ప్రాధాన్యత మొదలైందని చెప్పొచ్చు. ఆ తర్వాత అతిథుల పోర్ట్రెట్‌లు గీసి రిటర్న్ గిఫ్ట్స్‌గా ఇవ్వడం వంటివి ఒకటొకటిగా ఆర్టిస్టులను వెడ్డింగ్స్‌కు దగ్గర చేశాయి.

టర్మరిక్ ఆర్ట్.. ఓ వైవిధ్యం..

ఇటీవలి కాలంలో పెళ్లిళ్లలో కొత్త ఆర్టిస్టిక్ ట్రెండ్‌గా సందడి చేస్తోంది టర్మరిక్ ఆర్ట్. దీనిలో భాగంగా చిత్రకారులు వధూవరుల రూపాలను కాన్వాస్‌పై ఇన్విజబుల్‌గా ప్రత్యేకమైన విధానంలో చిత్రిస్తారు. ఆ తర్వాత దాన్ని పెళ్లి వేడుకల్లో ప్రదర్శిస్తారు. వచ్చిన అతిథులంతా దాని దగ్గరకు వెళ్లి అక్కడే ఉన్న రంగులను చేతులకు అద్దుకుని హస్త ముద్రలు ఆ కాన్వాస్ పై వేస్తూ ఉండగా.. వధూవరుల రూపాలు దానిపై ప్రత్యక్షమవ్వడం ఓ ఆసక్తికరమైన వర్ణ వైవిధ్యం.

ప్రత్యక్ష.. పెయింటింగ్..

పెళ్లి వేడుకలో ఓ వైపుగా కూర్చుని వధూవరులకు సంబంధించిన ముఖ్య ఘట్టాలను చిత్రించడం కూడా ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. పెళ్లి కూతురును పెళ్లి బుట్టలో తీసుకువెళ్లడం, దంపతులు ఒకరి తలపై ఒకరు జీలకర్ర–బెల్లం ఉంచడం, మంగళసూత్రం కట్టడం, సంప్రదాయ ఆటలు ఆడడం వంటి అపురూప సందర్భాలను ఒడిసిపట్టుకోవడానికి వీడియో, ఫొటోగ్రాఫర్‌ల తరహాలో ఆర్టిస్టులు కూడా ఇప్పుడు తలమునకలవుతున్నారు.

ఔత్సాహిక ఆర్టిస్టులకు డిమాండ్..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో యువ ఆర్టిస్ట్ కీర్తన షెడ్యూల్ ఫుల్ బిజీగా మారిపోయింది. 'దంపతులు మా కళాకృతిని చూసిన ప్రతిసారీ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోతారు' అని కీర్తన చెప్పింది. ఆమె గత ఏడాది ఒక పెళ్లి సమయంలో వధూవరుల మధ్య ఉంచే అద్దు తెరను అందంగా చిత్రించింది. ఆ తర్వాత నవంబర్‌లో తన మొదటి ప్రత్యక్ష (లైవ్) వెడ్డింగ్ పెయింటింగ్‌ను రూపొందించింది. అవి సోషల్ మీడియా ద్వారా ఆదరణకు నోచుకోవడంతో ఇప్పటి వరకూ నగరంతో పాటు బెంగళూరు, విజయవాడ, ఖమ్మం, కరీంనగర్‌లో మొత్తం 60 అద్దుతెర చిత్రాలు, 13 వివాహ వేడుకల లైవ్ పెయింటింగ్ వర్క్స్‌ను తన ఖాతాలో వేసుకుంది.

'ఒక పెయింటింగ్ ఫొటోకు దొరకని వివరాలను క్యాప్చర్ చేస్తుంది. దీంతో పాటు మానవ స్పర్శ కూడా అందులో ఉంది' అంటోంది సిటీకి చెందిన ఆర్టిస్ట్ రేష్మ. లైవ్ ఈవెంట్ పెయింటింగ్‌కు పేరొందిన ఈ యువతి.. 'కొన్నిసార్లు మండపం దగ్గర లేదా స్క్రీన్ ముందు ఆర్టిస్టులు వారికి కేటాయించిన స్థలంలో కూర్చుంటారు. వేడుక జరుగుతున్నప్పుడు చూస్తూ స్కెచ్/పెయింట్ చేస్తారు. ఆ క్షణాలలో అక్కడి భావోద్వేగాలు, జ్ఞాపకాల కోసం ప్రధాన సన్నివేశాలను చిత్రించడానికి వాటర్ కలర్‌లను ఎక్కువగా వినియోగిస్తారు. అయితే ఈవెంట్, డెకర్ స్నాప్‌షాట్ కోసం యాక్రిలిక్‌లను కూడా వాడతారు. ప్రస్తుతం ఈ తరహా ఆర్ట్‌వర్క్‌ల ధర 20,000 నుంచి రూ.2 లక్షల వరకూ ఉంటుంది అదే విధంగా అవుట్‌స్టేషన్ నుంచి రప్పించే పేరొందిన ఆర్టిస్ట్ అయితే ప్రయాణ వసతి ఖర్చులను కూడా క్లయింటే భరించాలి.

యువ చిత్రకారులకు ప్రోత్సాహకరం..

ప్రస్తుతం నేను లైవ్ వెడ్డింగ్ పెయింటింగ్‌తో పాటు టర్మరిక్ ఆర్ట్ వర్క్ కూడా అందిస్తున్నాను. ఈ లైవ్ వెడ్డింగ్ ఆర్ట్ ట్రెండ్ మాలాంటి ఔత్సాహిక చిత్రకారులకు బాగా ప్రోత్సాహకరంగా ఉంటోంది. పెళ్లి వేడుకల్ని నేరుగా చూస్తూ చిత్రించడం అనేది సరదాగా ఉంటుంది. అదే సమయంలో అది ఒక సవాల్ కూడా.

- గ్రీష్మ, ఆర్టిస్ట్



కష్టమే కానీ.. గొప్ప సంతృప్తి..

సాధారణంగా ఆర్టిస్ట్‌కి ఏకాగ్రత చాలా ముఖ్యం. అయితే పెళ్లిలో మన వర్క్స్ చూస్తూ వ్యాఖ్యానిస్తూ లేదా ప్రశ్నలు అడుగుతూ వచ్చిన వారు అంతరాయం కలిగిస్తూ ఉంటారు. ధ్యాస చెదరకుండా ఉండాలి. అదే సమయంలో అతిథులతో మర్యాదగా ప్రవర్తించాలి. కష్టమే అయినా గొప్ప సంతృప్తి ఇందులో లభిస్తుంది.

- సత్యవర్షి, ఆర్టిస్ట్





వివిధ విభాగాల్లో ఎనిమిది గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులు

ఒలింపిక్ లక్ష్యంగా పలువురికి శిక్షణ

కవితకు తైక్వాండో క్రీడ అంటే ఆసక్తి 1994లో ఒలింపిక్ గేమ్స్‌లో తైక్వాండో క్రీడను చూసి స్ఫూర్తి పొంది రామంతాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకునేటప్పడే ఈ క్రీడను నేర్చుకోవాలనుకుంది. తైక్వాండోలో శిక్షణకు వెళ్తానంటే ఆడ పిల్లవు ఆ ఆట (తైక్వాండో యుద్ధకళ) ఎందుకు చక్కగా ఖోఖో, రన్నింగ్, కబడ్డీ వంటి క్రీడలు నేర్చుకోమని కుటుంబ సభ్యులు, బంధువులు వారించారు. అయినా వినకుండా కవిత వారిని ఎదిరించి గురువు జయంత్ సంపూర్ణ లింగం వద్ద తైక్వాండో శిక్షణలో చేరి పదో యేటనే బ్లాక్ బెల్టు సాధించింది కవిత. ఈ క్రీడల్లో జాతీయ స్థాయిలో ఐదో డాన్ సాధించిన పురుషులే చాలా తక్కువగా ఉంటారు. దేశంలోనే ఐదో డాన్‌గా ఘనత సాధించిన ప్రథమ మహిళ కవిత.

- రామంతాపూర్

కవిత.. తైక్వాండో భవిత..

తైక్వాండోలో కవిత విజయాలు..

కొరియాలో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో 2004 పోటీల్లో బ్లాక్ బెల్ట్ సాధించి ఐదో డాన్‌గా విజయం సాధించింది. తైక్వాండోలోని వివిధ విభాగాల్లో ఎనిమిది సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించింది. పలు సార్లు హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించింది కవిత. 2009, 2011లో హాంకాంగ్ బ్యాంకాక్‌లో జరిగిన ఇంటర్నేషనల్ తైక్వాండో పోటీల్లో బెస్ట్ కోచ్‌గా అవార్డు పొందింది. దేశ విదేశాల్లో జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొని వందకుపైగా పతకాలు 50కుపైగా ట్రోఫీలు గెలుచుకుంది.

- రాష్ట్రంలోని పోలీస్ ఆర్టీసీ విభాగాలతో పాటు పలు ప్రభుత్వ ప్రైవేటు బహుళ జాతి సంస్థల్లోని మహిళలకు తైక్వాండో క్రీడల్లో శిక్షణ ఇచ్చారు.
- ప్రస్తుతం తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ పొందిన తన భర్త శ్రీకాంత్‌తో కలిసి రామంతాపూర్ శ్రీనివాసపురంలో తైక్వాండో అకాడమీని ప్రారంభించి, పలువురికి ఈ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా మహిళలకు ఫిట్‌నెస్ జిమ్ ఏర్పాటు చేశారు.
- మహిళలు స్వీయ రక్షణ కోసం వారికి తైక్వాండో క్రీడల్లో ఉచిత శిక్షణా శిబిరాలు బస్తీల్లో కాలనీలో, పాఠశాలల్లో ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని కవిత తెలిపారు.
- తన వద్ద తైక్వాండో క్రీడల్లో శిక్షణ పొందుతున్న బాలురు, బాలికల్లోని కొంత మందిని ప్రత్యేకంగా ఎంచుకుని వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి రానున్న ఒలింపిక్స్‌లో తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించే ధ్యేయంతో శిక్షణ ఇస్తున్నామంటున్నారు కవిత. తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందాలనుకునే వారు 9392455995, 7989946176 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బ్లాక్ బెల్ట్‌లో ఐదో డాన్ సాధించిన ప్రథమ మహిళ



'టోఫెల్'

ప్రతిభావంతులకు స్టార్ పురస్కారాలు..



సాక్షి, సిటీబ్యూరో: విదేశీ విద్యకు సంబంధించి నిర్వహించే టోఫెల్ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 23 మంది విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా ప్రదర్శకులుగా పురస్కారాలు అందించారు. టోఫెల్, జీఆర్ఇ పరీక్షలను నిర్వహించే ఇటీఎస్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని తాజ్ కృష్ణా హోటల్‌లో నిర్వహించిన స్టార్ స్టూడెంట్స్‌గా, అదే విధంగా శిక్షకులుగా రాణించిన వారికి స్టార్ ట్రైనర్స్‌గా పురస్కారాలు అందించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో ఇటీఎస్ ఇండియా (దక్షిణాసియా) కంట్రీ మేనేజర్ సచిన్‌జైన్, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ హర్షర్దీప్ సింగ్ మదన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని ఆదివారం అంగడికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది ఎర్రగడ్డ మార్కెట్. సామాన్యుల నుంచి సంపన్నుల వరకూ అందరూ షాపింగ్ చేసేలా కాటుక బరణి నుంచి కార్ టైర్ల వరకూ అన్నీ లభ్యమవుతాయి. దీంతో ఈ మార్కెట్‌కు రాను రానూ క్రేజ్ పెరిగిపోతోంది. ఒక రకంగా చెప్పాలంటే ఈ సంత సామాన్యులు, మధ్యతరగతి పాలిట 'సంత'సాన్ని నింపుతోంది. ఈ ఓపెన్ మాల్.. శ్రీమంతులకు ఆటవిడుపు.. ఆదివారం సూర్యోదయం కాకమునుపే 'గిట్టుబాటు' అంకెలను గుక్కతిప్పకోకుండా పలకడంలో అక్కడ వ్యాపారులు పోటీపడుతుంటారు. ఆ రోజు అందరికీ సెలవు. కానీ, వారికి ఈ సెలవు రోజే బతుకు దెరువు. ఎర్రగడ్డ చౌరస్తా మొదలు.. ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకూ విస్తరిస్తూ పోతోంది..దీని గురించిన మరిన్ని వివరాలు.. - సనత్‌నగర్

- చౌరస్తా మొదలు.. ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకూ విస్తరణ
- కాటుక బరణి నుంచి.. కార్ టైర్ల వరకూ లభ్యం
- ఆదివారం వస్తే షాపింగ్ షురూ.. అన్నట్టే..!





సామాన్యులకు సందడి.. ఆదివారం అంగడి..

ఎర్రగడ్డ మార్కెట్‌కు పెరుగుతున్న క్రేజ్

శతాబ్దం కాలం క్రితం 15–20 దుకాణాలతో మొదలైన సంత నేడు దాదాపు వెయ్యి మంది చిరువ్యాపారులకు బతుకుదెరువుకు కేంద్రంగా మారింది. రోడ్డే ఈ సంతకు అడ్డా. నాడు ఎర్రగడ్డ చౌరస్తాకే పరిమితమైన వ్యాపారాలు నేడు కిలోమీటరు పొడవున తమ షాపులను విస్తరించారు. చౌరస్తా నుంచి మొదలుకొని సనత్‌నగర్ బస్టాండ్ వరకూ వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

ఆల్ ఇన్ వన్ అంగడి..

చిన్నా.. పెద్దా మాల్ అనే తేడా లేదు.. వాటిల్లో ఉండే ప్రతి వస్తువూ ఇక్కడ లభ్యమవుతోంది. స్క్రూడ్రైవర్ నుంచి సూట్‌కేస్ వరకూ.. రెడీమేడ్ దుస్తుల నుంచి రేబాన్ గ్లాసెస్ వరకూ, వంటింటి పాత్రల నుంచి వయ్యారాలు ఒలకబోసే అందమైన ఆటబొమ్మల వరకూ, నాటి గ్రామ్‌ఫోన్‌ల నుంచి నేటి స్మార్ట్‌ఫోన్ల వరకూ.. ఇలా ప్రతిదీ ఈ సంతలో దొరుకుతాయి. ముఖ్యంగా నిత్యం ఇంట్లో ఉపయోగించే వస్తువులకు ఈ మార్కెట్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎరగ్రడ్డ–సనత్‌నగర్ మార్గం ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోతూ సందడిగా మారుతోంది.

'సెకండ్స్'కు పెట్టింది పేరు..

ఎర్రగడ్డ సంత అంటే వస్తువులు 'సెకండ్స్'లో అమ్ముడుపోతాయన్నది వ్యాపార వర్గాలతో పాటు వినియోగదారుల నుంచి వినిపించే మాట. షర్టులు, ఫ్యాంట్లు, గొడుగులు, సీడీలు, ఎలక్ట్రికల్, ఐరన్ వస్తువులు.. ఇలా ఎన్నో రకాల వస్తువులు సెకండ్ హ్యాండ్‌లో లభిస్తాయి. ఇక ఫ్రాక్లైయినర్ నుంచి మొబైల్ ఫోన్ వరకూ.. ఎలాంటి యంత్రాలు, వస్తువులకైనా కావాల్సిన విడి భాగాలు (స్పేర్‌పార్ట్స్)కు ఈ సంత ఫేమస్. అందుకే ఎర్రగడ్డ సంతకు ఇంత క్రేజ్.



నగరం నలుమూలల నుంచి..

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, అమీర్‌పేట నుంచే కాకుండా నగరం నలుమూలల నుంచి ఈ మార్కెట్‌ను సందర్శించి తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకుని మరీ వెళ్తుంటారు. ప్రతి వారం 30–40 వేల మంది వినియోగదారులు ఈ మార్కెట్‌ను సందర్శిస్తుంటారని ఓ అంచనా.

సీజనల్ వ్యాపారాలకు ఊపునిస్తూ..

చలికాలం మొదలైతే ఇక్కడ స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్లు, షాల్స్ అమ్మకాలు భారీగా జరుగుతాయి. ధాన్యపు రాశులు పోసినట్లు రోడ్లపై గుట్టలు పోస్తారు. వర్షాకాలంలో రెయిన్ కోట్లు, రంగురంగుల గొడుగులతో మార్కెట్ నిండిపోతుంది. వేసవి వచ్చిందంటే కాటన్ దుస్తుల అమ్మకాలు ఎక్కువగా జరుగుతాయి.

వందేళ్ల చరిత్రకు సాక్ష్యం..

రాజులు పోయారు.. రాజ్యాలు పోయాయి.. కానీ వందేళ్ల చిత్రకు సాక్ష్యంగా ఇక్కడ మార్కెట్ నిలుస్తోంది. రెండు దశాబ్దాల క్రితం వరకూ పశువుల సంత కూడా ఇక్కడే జరిగేది. వివిధ జిల్లాల నుంచి విభిన్న జాతుల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను, వివిధ రకాల పంటలను రైతాంగం ఇక్కడ క్రయవిక్రయాలు జరిపేది. అయితే నగర విస్తరణ, పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఇక్కడి పశువులను సంతను మోతీనగర్ సమీపంలోని బబ్బుగూడకు తరలించారు. సాధారణ మార్కెట్ మాత్రం ఇక్కడే కొనసాగుతూ వస్తోంది.

కస్టమర్ల అభిరుచికి తగ్గట్టు..

వివిధ జాతులకు చెందిన పిల్లులను తెచ్చి అమ్ముతుంటాను. ఎప్పటికప్పుడు తన వద్దకు వచ్చే కస్టమర్ల అభిరుచికి తగ్గట్టు పెంపుడు జంతువులు తెస్తుంటాం. ఆదివారం వచ్చిందంటే ఇక్కడ వ్యాపారం తప్పనిసరి. ఇదే మా కుటుంబ పోషణ.

- ఖాన్, వ్యాపారి

స్పేర్ పార్ట్స్ కోసం..

మొబైల్ ఫోన్‌కు అవసరమైన స్పేర్‌పార్ట్స్ కోసం ఎల్బీనగర్ నుంచి వచ్చా. ఇక్కడ మార్కెట్‌లో ఏది కావాలన్నా దొరుకుతుంది.. మొదటిసారి ఇక్కడికి రావడంతో ఎంతో ఆశ్చర్యంగా అనిపించింది. సామాన్యుల నుంచి సంపన్నుల వరకూ కొనుగోలు చేసే ప్రతి వస్తువునూ ఇక్కడ చూశాను.

- మహేష్, ఎల్బీనగర్



టీడీపీ అసభ్యకర పోస్టులపై డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

- వైఎస్ జగన్, ఇతర నేతలపై అసభ్య పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి
- ఆధారాలనూ సమర్పించిన నేతలు
- రెండు, మూడు రోజులు వేచి చూస్తామని నేతల వెల్లడి.. చర్యలు తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టీకరణ
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అక్రమ కేసులు పెడుతున్నారు: అంబటి
- పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ, చిత్ర హింసలకు గురి చేస్తున్నారు
- సుధారాణిపై సీఐ దాడినీ డీజీపీకి వివరించాం
- దౌర్జన్యకాండపై పోరాటం చేస్తాం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వ్యవస్థీకృత నేర రాజకీయాల్లో చంద్రబాబు బరితెగింపు

ఎక్స్ వేదికగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి, అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్గనైజ్డ్ క్రైమ్ (వ్యవస్థీకృత నేరాలు)తో కూడిన పాలిటిక్స్ (రాజకీయాలు) సాగిస్తూ చంద్రబాబు మరింతగా బరి తెగించారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి 100 రోజుల పాలన, మోసాలు, వైఫల్యాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చంద్రబాబు సృష్టించిన అబద్ధాన్ని ఎల్లో మీడియా మోయడం.. ఆ తర్వాత ఆ పార్టీల నాయకులు, వారిని మోస్తున్న అధికారులు ప్రజల్లో అశాంతిని రేపేలా చర్యలు, కార్యక్రమాలు చేయడం ఒక పన్నాగం ప్రకారం జరిగాయని ఎత్తి చూపారు. 'ఈ నేపథ్యంలో వ్యవస్థీకృత నేరాల కింద అరెస్టు చేయాల్సింది ఎవరిని? జీవిత ఖైదు వేయాల్సింది ఎవరికి? చంద్రబాబుకు కాదా?'అంటూ శనివారం 'ఎక్స్'వేదికగా సోషల్ మీడియాపై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను ఎండగడుతూ పోస్టు చేశారు. ఆ పోస్టులో జగన్ ఏమన్నారంటే..

1 దొంగే ఎదుటివారిని పట్టుకుని దొంగా అన్నట్టుగా చంద్రబాబు తీరు ఉంది. నలభై ఏళ్లుగా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న చంద్రబాబు ఇప్పుడు కూడా అదే చేస్తూ ఎదుటివారి మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తన స్కాంలు బయటపడుతున్నాయని, తాను చేసిన అవినీతి బయటకు వస్తోందని, తన పాలనా వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతున్నారనే దురహంకారంతో ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా గొంతు విప్పుతున్నవారిని, ముఖ్యంగా చంద్రబాబు తప్పులను నిలదీస్తున్న యువతను లక్ష్యంగా చేసుకుని చట్టవిరుద్ధంగా, అన్యాయంగా, అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. తన అడుగులకు మడుగులొత్తే పోలీసులను వాడుకుంటూ వారిపై భౌతిక దాడులు చేయిస్తూ, హింసిస్తున్నారు. ఇది ఆర్గనైజ్డ్ క్రైం కాదా?



2 ఎలాగూ చంద్రబాబు చేతిలోనే దాదాపుగా అన్ని పేపర్లు ఉన్నాయి. కాస్తోకూస్తో ప్రజాసమస్యలపై గొంతు విప్పే టీవీలను కూడా వ్యవస్థీకృతంగా దెబ్బ తీశారు. కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తెచ్చి వాటి ప్రసారాలను ప్రజలకు చేరనీయకుండా పలు మార్లు కట్ చేశారు. ఇక చంద్రబాబుకు కొరుకుడుపడనిది ఒకే ఒక్కటి. అదే సోషల్ మీడియా. అందుకే చంద్రబాబు ఇలా బరితెగిస్తున్నారు. ఇలా ఒక చేత్తో తన మీడియాను, మరో చేత్తో వ్యవస్థలను, ఆ వ్యవస్థల్లోని తన మనుషులను వాడుకుని నాలుగు దశాబ్దాలుగా చంద్రబాబు చేస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్స్ చూస్తూనే ఉన్నాం. మరి ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌కు పాల్పడుతున్నది ఎవరు?

3 ప్రజలకు మంచిచేసి కాకుండా, మభ్యపెట్టి, మోసం చేసి, అబద్ధాలు ఆడి అధికారంలోకి రావాలని, అధికారంలో ఉంటే దాన్ని ఇలాగే నిలబెట్టుకోవాలన్నది చంద్రబాబు సిద్ధాంతం. దీనికోసం చంద్రబాబుగారు ఒక అబద్ధాన్ని సృష్టిస్తారు. దానికి రెక్కలు తొడిగి తన ఎల్లోమీడియా ద్వారా శరవేగంగా వ్యాపింపచేస్తారు. దానిపైనే వారి పార్టీ నాయకులచేత మాట్లాడిస్తారు. పనిలోపనిగా దత్తపుత్రుడిని, ఇతర పార్టీల్లో తనకు అనుకూలంగా ఉన్నవారినికూడా దీనికి వాడుకుంటారు. ఆ తర్వాత డిబేట్లు చేయిస్తారు. దీనికి మరిన్ని అవాస్తవాలు జోడించి తన కుమారుడు లోకేశ్ ద్వారా సోషల్ మీడియాలో విష ప్రచారం చేయిస్తారు. వాళ్లే ఆరోపణలు చేసి, వాళ్లే మీడియా ట్రయల్ చేసి, వాళ్లే దోషులెవరో నిర్ధారించి, వాళ్లే శిక్షలు విధిస్తారు. ఒక పథకం ప్రకారం, మాఫియా ముఠా మాదిరిగా చంద్రబాబు ఈ నేరాలు చేస్తూనే ఉన్నారు. ప్రత్యర్థి పార్టీలను దెబ్బ తీయడానికి, రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వ హననానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటారు. మరి ఇది వ్యవస్థీకృత నేరం కాదా?

4 అయ్యా చంద్రబాబూ, మీ పార్టీ టీడీపీ అధికారిక సోషల్ మీడియా అకౌంట్లో మీరే ఫేక్ న్యూస్‌పెట్టి, దాన్ని మీరే ప్రాపగండా చేసిన లేటెస్ట్ ట్వీట్‌ను రాష్ట్ర ప్రజలంతా గమనించారు. ఎప్పుడో రెండేళ్ల కిందట మా అమ్మ కారు టైర్ బరస్ట్ అయితే, అప్పటి వీడియోను ఇప్పుడు బయటకు తీసి, లేటెస్ట్‌గా ఇప్పుడే జరిగినట్టుగా, మీరు ట్వీట్‌లో పెడుతూ, నా తల్లిని నేను చంపాలని అనుకున్నానని సిగ్గుమాలిన రీతిలో వ్యక్తిత్వ హననానికి నువ్వు దిగావు. దీన్ని ఖండిస్తూ మా అమ్మ లేఖ రాస్తే దాన్నికూడా ఫేక్ లెటర్‌గా పేర్కొంటూ నువ్వు పబ్లిసైజ్ (ప్రచారం) చేయడం సిగ్గుమాలిన చర్య కాదా? మళ్లీ మా అమ్మ వీడియో మెసేజ్ కూడా ఇస్తూ మీ తీరును దుయ్యబట్టింది. ఇంతలా ఉద్దేశ పూర్వకంగా వ్యక్తిత్వ హననం చేసిన నిన్ను, నీ కొడుకును ఇదే పోలీసులు ఎందుకు అరెస్టు చేయడం లేదు? ఇలాంటివి శతకోటి మీ ఏబీఎన్, మీ ఈనాడు, మీ టీవీ-5, మీ అనుకూల మీడియా ఎన్ని చేసినా పోలీసులు ఏనాడైనా చర్యలు తీసుకున్నారా? నువ్వు చేస్తే ఏదైనా మంచే! కాని నువ్వు చేసిన తప్పుడు పనులను, ప్రజా వ్యతిరేక చర్యలను ఎవరైనా ప్రశ్నిస్తే అది చెడు అవుతుందా? వారిపై కేసులు పెట్టి వారిని హింసించడం ధర్మమేనా?

5 కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్గనైజ్డ్ క్రైమ్‌తోకూడిన పాలిటిక్స్‌లో చంద్రబాబు మరింతగా బరితెగించారు. మొన్నటి తిరుమల లడ్డూ వ్యవహారం వరకూ జరిగిన అనేక పరిణామాలు దీనికి ఉదాహరణ. కూటమి 100 రోజుల పాలన, మోసాలు, వైఫల్యాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చంద్రబాబు సృష్టించిన అబద్ధాన్ని ఎల్లోమీడియా మోయడం, ఆ తర్వాత ఆ పార్టీల నాయకులు, వారిని మోస్తున్న అధికారులు ప్రజల్లో అశాంతిని రేపేలా చర్యలు, కార్యక్రమాలు చేయడం ఒక పన్నాగం ప్రకారం జరిగాయి. మరి వ్యవస్థీకృత నేరాల కింద అరెస్టు చేయాల్సింది ఎవరిని? జీవిత ఖైదు వేయాల్సింది ఎవరికి? చంద్రబాబుకు కాదా?

అరాచకానికి పరాకాష్ట



ఏపీలో అక్రమ కేసులు.. నిర్బంధాలు.. చిత్రహింసలు వికృత క్రీడ.. • చంద్రబాబు ప్రభుత్వ రాక్షసానందం

- ఇష్టానుసారం కక్ష సాధింపులతో పౌర హక్కుల హననం
- పాలకులను ప్రశ్నిస్తే దండన తప్పదని సరికొత్త ఆదేశం
- జీ హుజూర్ అంటూ పోలీసు శాఖ అత్యుత్సాహం
- సుప్రీంకోర్టు, హైకోర్టు హెచ్చరికలు సైతం బేఖాతర్.. ఇప్పటికే వందలాది మందిపై తప్పుడు కేసులు

సాక్షి, అమరావతి : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వారిపైకి పోలీసులను ఉసిగొలుపుతోంది. రాజ్యాంగ ధర్మాన్ని మంటగలుపుతూ పౌర హక్కులను కాలరాస్తోంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు చట్టం, రాజ్యాంగం అనే వాటికి తిలోదకాలు వదిలారు. అధికార పార్టీల నేతలు చెప్పిన వారందరిపై ఉన్నవీ లేనివీ కల్పించి ఎక్కడికక్కడ తప్పుడు కేసులు పెడుతున్నారు. ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులతో విరుచుకుపడుతున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని 24 గంటల్లో న్యాయ స్థానంలో హాజరు పరచాలన్న చట్టాన్ని నిర్భీతిగా ఉల్లంఘిస్తున్నారు. మహిళలు, వృద్ధులు, మైనర్లు అని కూడా చూడకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ చిత్రహింసలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు అర్ధరాత్రి, అపరాత్రి అని కూడా చూడకుండా ఇళ్లపై పడి బీభత్సం సృష్టిస్తున్నారు. నిద్రిస్తున్న వారిని అపహరించుకుపోతున్నారు. ఎక్కడికి తీసుకువెళుతున్నారో చెప్పరు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి అడిగితే మాకేం తెలీదనే సమాధానం వస్తుంది. పోలీసు వాహనాల్లో కుక్కి.. కొడుతూ ఎక్కడెక్కడో తిప్పుతున్నారు. గుర్తు తెలియని ప్రదేశాల్లో నిర్బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఎందుకు కొడుతున్నారని అడిగితే లాఠీలే సమాధానమిస్తున్నాయి. మేం చేసిన తప్పేమిటని ప్రశ్నిస్తే పోలీసుల బూట్లే మాట్లాడుతున్నాయి. ఒక్కొక్కరిపై రెండు మూడు అక్రమ కేసులు నమోదు చేస్తూ ఒక పోలీస్ స్టేషన్ నుంచి మరో పోలీస్ స్టేషన్‌కు తిప్పుతున్నారు. మూడు నాలుగు రోజుల్లోనే ఏకంగా 110కి పైగా అక్రమ కేసులు నమోదు చేయడం ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనం. ఇవన్నీ బాధితుల తరఫున లాయర్లు, గ్రామ పెద్దలు నిలదీస్తేనే అధికారికంగా ప్రకటించినవి కావడం గమనార్హం. అరెస్టు చూపకుండా వేధిస్తున్న కేసులు వేలల్లో ఉన్నాయనడం అక్షర సత్యం. ఒక్కో కేసులో ఒకరు మొదలు 10-20 మందిని సైతం నిందితులుగా చేరుస్తూ వేధిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా అరెస్ట్ చేయకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును సైతం బేఖాతరు చేస్తున్నారు. 41 ఏ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలన్న ఆదేశాలు పట్టవన్నట్టు చెలరేగిపోతున్నారు. బాధిత కుటుంబాలు హెబియస్ కార్పస్ పిటిషన్లతో హైకోర్టును ఆశ్రయించినా తమ నియంతృత్వాన్ని నిర్భీతిగా సమర్థించుకోవడం దుర్మార్గం. ఇదీ చంద్రబాబు మార్కు పోలీసు రాజ్యం.

మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగం!

సోషల్ మీడియా యాక్టివిస్ట్ పెద్దిరెడ్డి సుధారాణి పట్ల పోలీసులు మహిళ అని కూడా చూడకుండా అత్యంత క్రూరంగా వ్యవహరించడం దారుణం. మూడు రోజుల పాటు ఆమెను, ఆమె భర్తను చిత్రహింసలకు గురిచేశారు. 'నన్ను ఈ నెల 5వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. నా భర్త వెంకటరెడ్డినీ చిత్రహింసలకు గురిచేశారు. చిలకలూరిపేట సీఐ రమేష్ దుర్భాషలాడారు. నోరెత్తితే ఇష్టానుసారం కొట్టారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల వద్ద జొన్నవాడలోని రాజరాజేశ్వరి ఆలయానికి వెళ్లినప్పుడు మమ్మల్ని పల్నాడు జిల్లా చిలకలూరిపేట సీఐ రమేష్ బృందం అదుపులోకి తీసుకుంది. చిలకలూరిపేట, ఒంగోలుకు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు' అని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. తుదకు ఆమె తరఫు వారు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడంతో శుక్రవారం సాయంత్రం కొత్త పేట పోలీసులు గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టారు. ఇదే విషయాన్ని ఆమె మెజిస్ట్రేట్ ఎదుటే చెప్పారు. పోలీసులు కొట్టడంతో అయిన గాయాలను చూపించారు. ఈమెపై 6 అక్రమ కేసులు బనాయించారు.

శాంతిభద్రతలు నిల్.. వేధింపులు ఫుల్!

వరుస హత్యలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలతో ఏపీ అట్టుడుకుతోంది. వీటిని అరికట్టాల్సిన చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. టీడీపీ గూండాలు కర్రలు, కత్తులతో గ్రామాలపై పడి బీభత్సం సృష్టిస్తున్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో 177 మంది హత్యకు గురయ్యారు. 500కుపైగా హత్యాయత్నాలు జరిగాయి. 2 వేలకుపైగా దాడులతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారింది. టీడీపీ గూండాల దాడులతో భీతిల్లి దాదాపు 3 వేల కుటుంబాలు గ్రామాలు విడిచిపెట్టి ఇతర ప్రాంతాల్లో తల దాచుకుంటున్నాయి. అత్యాచార పర్వానికి అంతు లేకుండా పోయింది. నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో 110 మందిపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరిగాయి. అయినా శాంతిభద్రతలతో తమకు సంబంధం లేదన్నట్లు సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఓ ముస్లిం బాలిక కిడ్నాప్‌కు గురికాగానే ప్రభుత్వం స్పందించి ఉంటే ఇప్పుడు ఆ అమ్మాయి బతికుండేది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు జాన్ 16 ఏళ్ల బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడితే ఏ మేరకు శిక్ష వేశారో పాలకులే చెప్పాలి.

ఇది నేరమట!



శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో ఈనెల 1వ తేదీన బైనపల్లి దానమ్మ అనే వృద్ధురాలు పింఛన్ కోసం గంటలతరబడి వేచి ఉంటూ సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు వెంటనే ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఇదే విషయాన్ని అదే మండలం కొండపల్లి గ్రామ ఉప సర్పంచ్ మద్దు జస్వంత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇతని పాలిట ఇదే పాపమైపోయింది. పాలక పార్టీ పెద్దల ఆదేశాలతో పోలీసులు అక్రమంగా కేసు పెట్టారు. అంతటితో ఆగకుండా ఆయన్ను భయపెట్టాలని కూడా ఆదేశించారు. దీంతో పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. అప్పుడు ఆయన ఇంట్లో లేడు. గంటల కొద్దీ అక్కడే ఉండి ఆయన కుటుంబ సభ్యులను మానసికంగా వేధించారు. ఆ తర్వాత ఎటువంటి నోటీస్ ఇవ్వకుండానే జస్వంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ రోజు కార్తీక పూజ నిర్వహిస్తున్నామని, భోజనం చేసి వస్తానన్నా కూడా వదల్లేదు. ఫోన్‌ను కూడా లాగేసుకున్నారు. ఏం కేసు పెట్టారని అడిగినా అప్పుడు చెప్పలేదు. తర్వాత లాయర్ సాయంతో బయటకు వచ్చాడు. అయినా ఇప్పటికీ ఫోన్ చేస్తూ ఎప్పుడుపడితే అప్పుడు స్టేషన్‌కు రావాలంటూ ఫోన్లు చేసి పిలిపిస్తూ మానసికంగా వేధిస్తున్నారు. 192 బీఎన్ఎస్ సెక్షన్‌తో ఎఫ్ఐఆర్ (150/24) నమోదు చేశారు.



జశ్వంత్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు (ఇన్‌సెట్‌లో) మద్దు జశ్వంత్



ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో చెట్టుకింద బెడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

దూకుతానంటూ చెట్టెక్కిన యువకుడు

- పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తుండగా ఘటన
- 2 గంటలపాటు ముప్పుతిప్పలు

ఆమనగల్లు: గొడవపడిన భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తుండగా.. భర్త ఆవేశంతో పోలీసు స్టేషన్ ఆవరణలోని వేపచెట్టు ఎక్కాడు. దూకుతానంటూ బెదిరించి పోలీసులను రెండు గంటల పాటు ముప్పతిప్పలు పెట్టాడు. చివరకు చెంచు సంఘం నాయకులు, పోలీసులు నచ్చజెప్పడంతో చెట్టు దిగి వచ్చాడు. వివరాలివి. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణం సమీపంలోని చెంచు కాలనీకి చెందిన నల్లబోతు నర్సింహ, శిరీష దంపతులు. శనివారం మధ్యాహ్నం మద్యం తాగి వచ్చిన నర్సింహ.. భార్యను కొట్టడంతో ఆమె 100 నంబర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు చెంచు కాలనీకి చేరుకుని భార్యాభర్తలను పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చారు. తనను భర్త తరచూ కొడుతున్నాడని శిరీష భర్తపై ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇస్తుండగా.. ఆవేశానికి లోనైన నర్సింహ పోలీసుస్టేషన్ ఆవరణలోని వేపచెట్టు ఎక్కాడు. కేసు పెడితే దూకుతానంటూ భార్య, పోలీసులను బెదిరించాడు. పోలీసులు నచ్చజెప్పినప్పటికీ చెట్టు దిగలేదు. దీంతో స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి బెడ్లు తీసుకువచ్చి చెట్టుకింద వేసి భద్రత చర్యలు తీసుకున్నారు. చివరికి చెంచు సంఘం నాయకులు, పోలీసులు బుజ్జగించడంతో రెండు గంటల తర్వాత చెట్టుదిగి వచ్చాడు. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే జ్యోతి మృతికి సంతాపం

సాక్షి, హైదరాబాద్: మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి మరణంపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దివంగత మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు సతీమణి కొమిరెడ్డి జ్యోతి అనారోగ్యంతో బెంగళూరులోని ఆస్పత్రిలో మృతి చెందారు.

పర్యాటక స్వర్గధామం భారత్

- దేశంలో భారీగా పెరుగుతున్న విదేశీ సందర్శకులు
- 2023లో 90.24 లక్షల మంది రాకపోకలు
- వరల్డ్ టూరిజం ఎకనామిక్ ఫోరమ్ నివేదికలో వెల్లడి

అందమైన కట్టడాలు.. వారసత్వ సంపద నిలయాలు.. ఆలయాలు.. జలపాతాలు.. పర్వతాలు.. లోయలు.. గుహలు.. తీరంలో విస్తరించిన బీచ్‌లు.. ఒకటేమిటి.. ఎన్నో ఎన్నెన్నో. గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం.. విభిన్న గమ్యస్థానాలు.. గ్రామీణ-పట్టణ జీవనశైలిలోని వినూత్నతలు.. ఇవన్నీ చూడటానికి రెండుకళ్లు చాలవు. ఇన్నింటి మేళవింపుతో అలరారుతున్న మనదేశం పర్యాటకుల స్వర్గ ధామం. ఏటికేడాది మనదేశంలో పర్యటించే విదేశీయుల సంఖ్య భారీగా పెరుగుతోంది.



సాక్షి, అమరావతి: ప్రపంచ పర్యాటకరంగంలో భారతదేశం దూసుకెళ్తోంది. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిస్తూ గ్లోబల్ టూరిస్టు డెస్టినేషన్‌గా మారుతోంది. కోవిడ్-19 మహమ్మారి తర్వాత అత్యంత వేగంగా వృద్ధిచెందుతున్న పర్యాటక దేశాల్లో ముందు వరుసలో నిలుస్తోంది. ఈ క్రమంలోనే ట్రావెల్ అండ్ టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో 119 దేశాల్లో 39వ స్థానం దక్కించుకుంది. ఇటీవల దేశానికి అంతర్జాతీయ పర్యాటకుల రాకపోకలు పెరిగాయి. 2023లో ఏకంగా 90.24 లక్షల మంది విదేశీయులు భారత్‌ను సందర్శించారు. అంతకు ముందు సంవత్సరం కంటే విదేశీ పర్యాటకుల్లో 43.5 శాతం పెరుగుదల నమోదైంది. ఇటీవల విడుదలైన వరల్డ్ టూరిజం ఎకనామిక్ ఫోరమ్ నివేదిక ఈ వివరాలు వెల్లడించింది.

రూ.2.30 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యం

వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రకారం పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు మెరుగైన భద్రత చర్యలు, పరిశుభ్రత ప్రమాణాలను మెరుగుపరచడం వంటి కీలక రంగాల్లో మనదేశం మెరుగుదలను నమోదు చేసింది. ఇవి దేశంలో విదేశీ పర్యాటకుల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. 2023లో దేశంలో విదేశీ సందర్శకులతో రూ.2.30 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యం లభించింది. అంతకుముందు సంవత్సరం లభించిన విదేశీమారక ద్రవ్యం రూ.1.39 లక్షల కోట్లే. 2023లో విదేశీ సందర్శకులతో లభించిన విదేశీ మారకద్రవ్యం కంటే 65 శాతం పెరుగుదల నమోదైంది. 2024 సంవత్సరం మొదటి అర్ధభాగంలో 40.80 లక్షలమంది విదేశీ టూరిస్టులు దేశంలో పర్యటించారు.

సులభతర వీసాలు..

వీసాలు సులభంగా అందించడం ద్వారా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడంలో భారత్ కీలకంగా వ్యవహరిస్తోంది. అడ్వెంచర్, ట్రావెల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ, 24 గంటల పాటు బహుభాషా హెల్ప్‌లైన్‌ను అందిస్తూ విదేశీ పర్యాటకులకు బాసటగా నిలుస్తోంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం-2024 రోజున 'పర్యటన్ దీదీ', 'పర్యటన్ మిత్ర' వంటి కార్యక్రమాలను ప్రారంభించడం ద్వారా అంతర్జాతీయ సందర్శకుల కోసం ఆతిథ్య వాతావరణాన్ని సృష్టిస్తోంది. దేశీయ పర్యాటకంలో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. దేశంలో పర్యాటకుల సందర్శనలు 2022లో 173 కోట్లు ఉండగా 2023లో 250 కోట్లకు పెరిగాయి.

కులగణనకు బీజేపీ అనుకూలమా.. వ్యతిరేకమా?

- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతిని కాంక్షించి చేపట్టిన కులగణనకు బీజేపీ అనుకూలమో, వ్యతిరేకమో ఆ పార్టీ ఎంపీ కె.లక్ష్మణ్ స్పష్టం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వెనుకబడిన వర్గానికి చెందిన లక్ష్మణ్ ఆ వర్గాలకు మద్దతు తెలపాల్సింది పోయి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశంలో సామాజిక అసమానతలను తొలగించేందుకు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ కృషి చేసిందని గుర్తు చేశారు. వీపీ సింగ్ ప్రభుత్వం ఓబీసీ రిజర్వేషన్ల ప్రతిపాదన తెస్తే మండల్‌కు పోటీగా 'కమండల్' పేరుతో మత రాజకీయాలు చేసి దేశాన్ని ఇబ్బందులు పెట్టింది బీజేపీ అని, సంఘ్ శక్తులతో వీపీ సింగ్ సర్కార్‌ను కూల్చి ఓబీసీ వ్యతిరేక వైఖరిని చాటుకుందని అన్నారు. కేంద్ర విద్యా సంస్థలు ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది, విద్యా, ఉద్యోగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. ఎన్నికల కోసం మతాన్ని వాడుకొనే బీజేపీ చిత్తశుద్ధితో కులగణన చేస్తున్న ప్రభుత్వాన్ని ఎన్నికల కోసం చేస్తున్నారని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలు ముగిశాయని, స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీ రిజర్వేషన్లు పెట్టాలా వద్దా బీజేపీ చెప్పాలన్నారు. కులగణనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ తెచ్చింది బీజేపీ అని విమర్శించారు. బలహీన వర్గాల ప్రధాని అని చెప్పి మోదీ బీసీల వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని పొన్నం పేర్కొన్నారు.

ప్రజల గోస చూడడానికే సీఎం మూసీ యాత్ర

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: మూసీ ప్రజల గోస ప్రత్యక్షంగా చూసేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సీఎల్పీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సీఎం పాదయాత్రను చూసి ఓర్వలేకే కేటీఆర్, హరీశ్‌రావు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాల భూములను అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలలాగా సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడలేదని అన్నారు. రబ్బరు చెప్పులతో తిరిగిన హరీశ్‌రావుకు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని మల్‌రెడ్డి ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్ కేటీఆర్‌కు కాపలా కుక్కలా పనిచేశాడని, రంగారెడ్డి జిల్లా ప్రజలను ముంచారని ఆరోపించారు.

తెలంగాణ ఉన్నంతకాలం ప్రజల గుండెల్లో కేసీఆర్

ఆయన పేరును ఎవరూ చెరిపేయలేరనే విషయాన్ని సీఎం గుర్తించాలి: కేటీఆర్

- పాదయాత్రలో కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ధ్వజం
- దుర్భాషలతో కేసీఆర్ పేరును చరిత్ర నుంచి చెరిపేయొచ్చనుకోవడం మూర్ఖత్వమని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉన్నంతకాలం కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉంటారని.. ఆయన పేరును ఎవరూ చెరిపివేయలేరనే విషయాన్ని సీఎం రేవంత్ గుర్తుపెట్టుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు అన్నారు. మూసీ పాదయాత్ర సందర్భంగా కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. 'నువ్వు స్లిపర్లు వేసుకొని రాజకీయాల్లోకి వచ్చేందుకు పనికిమాలిన పోరనిలా తిరుగుతున్నప్పుడే ఆయన తెలంగాణ కోసం రాజీనామా చేశాడు. నువ్వు పార్టీ టికెట్ కోసం లాబీయింగ్‌లో బిజీగా ఉన్నప్పుడే ఆయన తెలంగాణ స్వరాష్ట్రం కావాలని కలగన్నాడు. తెలంగాణ గొంతుకలను అణచివేయడానికి నువ్వు తుపాకీ పట్టుకున్నప్పుడు ఆయన రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టాడు. తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి నీ చేతులు 'డబ్బుల బ్యాగులు'పట్టుకున్నప్పుడు ఆయన తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ చేసేలా మేధస్సుకు పదును పెట్టారు. కేసీఆర్ తెలంగాణకు గర్వకారణమైతే నీలాంటి జోకర్ కేసీఆర్‌పై పిచ్చి ప్రచారాలు, దుర్భాషలతో చరిత్ర నుంచి ఆయన పేరు చెరిపేయొచ్చని అనుకోవడం మూర్ఖత్వం'అని కేటీఆర్ ఓ ప్రకటనలో మండిపడ్డారు.

హామీల అమలు చేతకాక దాడులు

దళితబంధు లబ్ధిదారులకు రెండోవిడత ఆర్థిక సాయం చేయాలని అడిగితే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు విచక్షణరహితంగా దాడి చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రజాప్రతినిధులపైనా దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. హామీల అమలు చేతగాక అడిగిన వారిపై దాడుల సంస్కృతికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందన్నారు. ప్రభుత్వ పెద్దల మెప్పు పొందేందుకు పోలీసులు ఓవరాక్షన్ చేస్తే మళ్లీ అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్‌కు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అంటే భయం పట్టుకోవడంతో ఆయనపై కక్ష పెంచుకున్నాడన్నారు. తాటాకు చప్పుళ్లకు బీఆర్ఎస్ సైనికులెవరూ భయపడరని.. అరెస్టు చేసిన కార్యకర్తలను విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఖజానాకు తెలంగాణ ఏటీఎం

కాంగ్రెస్ ఖజానా నింపుకోవడానికి తెలంగాణను ఏటీఎంగా వాడుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం అర్హతగల సంస్థలను అనర్హులుగా ప్రకటించి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండే వారికి ఇచ్చారన్నారు.

సాగర్ డ్యామ్ నీటిపై మరోసారి వివాదం

- రీడింగ్ తీయడానికి రావద్దని ఏపీ అధికారి బెదిరించారన్న తెలంగాణ సిబ్బంది
- కేఆర్ఎంబీ జోక్యంతో సద్దుమణిగిన వివాదం



సాగర్ కుడికాల్వకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జున సాగర్ డ్యామ్‌పై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరోసారి నీటి వివాదం తెరపైకి వచ్చింది. గత ఏడాది తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందురోజు రాత్రి ఏపీ నుంచి వచ్చిన పోలీసులు నాగార్జునసాగర్ డ్యామ్‌ను సగం వరకు ఆక్రమించారు. అప్పటినుంచి సాగర్ డ్యామ్ సీఆర్‌పీఎఫ్ పరిధిలోకి వెళ్లిపోయింది. నీటి వినియోగం లెక్కలను తెలంగాణ ప్రభుత్వమే రోజువారీగా రీడింగ్ తీసి కేఆర్ఎంబీకి సమాచారం అందజేస్తుంది. అందులో భాగంగా శనివారం కుడి కాలువ వద్దకు రీడింగ్ తీయడానికి వెళ్లిన తెలంగాణ ఉద్యోగిని ఏపీ సాగునీటి శాఖ సాగర్ డీఈ.. కుడి కాలువ మీద రీడింగ్ తీయడానికి మరోసారి రావద్దంటూ హెచ్చరించారు. ఈ విషయాన్ని ఆ ఉద్యోగి అక్కడి అధికారులకు తెలియజేశారు. మళ్లీ అక్కడ కనిపిస్తే కాళ్లు విరగొడతామని తనను బెదిరించారని ఆ ఉద్యోగి అధికారులకు చెప్పారు. వెంటనే డ్యామ్ అధికారులు.. కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కేఆర్ఎంబీ అధికారులు ఏపీ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఏపీ అధికారులు కుడి కాల్వ 7వ కిలోమీటర్ వద్ద నీటి రీడింగ్ తీసుకోవడానికి అనుమతులు ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 10-11-2024





యోధులు సైన్యంలో ఉండొచ్చు.
కుస్తీగోదాలలో ఉండొచ్చు.
మార్షల్ ఆర్ట్స్ బరిలో ఉండొచ్చు.
కండలు పెంచే జిమ్‌లలో ఉండొచ్చు.
కాని వీరి కంటే గొప్ప యోధులు,
చిన్నారి యోధులు హాస్పిటల్ బెడ్ మీద ఉంటారు.
వీరు నయం కాని వ్యాధులతో అలుపెరగక
పోరాడుతుంటారు.
సిరంజీలు, సెలైన్ బాటిల్స్ చుట్టుముట్టినా
ఒక్క చిరునవ్వుతో వాటిని ఓడించాలని చూస్తారు.
వీరిని పలకరించడం, ఉత్సాహ పరచడం
సాయ పడటం ఏ మనిషికైనా పరమ కర్తవ్యం.
హైదరాబాద్‌లో ఇలాంటి పిల్లలు
'స్పర్శ్ హాస్పిస్ అండ్ పాలియేటి
కేర్ సెంటర్'లో ఉన్నారు. వారిని 'సాక్షి' కలిసింది.
చైల్డ్ సెలబ్రిటీలను కలిపింది.
పోరాడే నవ్వులను పకపకలాడించింది.

● 'స్పర్శ్' వేదికగా చిన్నారుల కోసం స్టెప్స్ వేస్తున్న బాల తారలు ఫర్హానా, కార్తికేయ దేవ్

నేటి మధ్యాహ్నం 12.30 గంటలకు సాక్షి టీవీలో

SAKSHI TV

పోరాడే చిరునవ్వులు

ప్రపంచంలోని ఏ చిన్నపిల్లలకు కూడా 'స్పర్శ్' వంటి సెంటర్‌ల చిరునామా ఎప్పటికీ తెలియకూడదు. అక్కడకు రావాల్సిన అవసరం ఎప్పటికీ రాకూడదు. కాని దురదృష్టవశాత్తు కొందరు అక్కడికి వస్తారు. నయం కాని వ్యాధులతో పోరాడుతూ అక్కడ సాంత్వన పొందుతారు. సహాయం పొందుతారు. జీవించి ఉండే కాంక్ష చల్లారిపోనీకుండా చూసుకుంటారు. అలాంటి పిల్లలకు 'స్పర్శ్ హాస్పిస్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్'లో ఉచితంగా ఉపశమన సేవలను అందిస్తుంది. జబ్బు నయం కానప్పటికీ వారు కాసింత సాంత్వన పొందడానికి పాలియేటివ్ కేర్ అందిస్తుంది. రానున్న నవంబర్ 14 'బాలల దినోత్సవం' సందర్భంగా ఇక్కడ సేవలు పొందుతున్న పసి హృదయాలలో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేసింది సాక్షి మీడియా. వెండి తెరపై చైల్డ్ ఆర్టిస్టులుగా రాణిస్తున్న కార్తికేయ దేవ్, ఫర్హానాలను ఈ చిన్నారులతో కలిసి ముచ్చటించేలా చూసింది. చైల్డ్ సెలబ్రిటీలతో ఆ పిల్లలు తమ ఇబ్బందులు, ఇష్టాలు, కష్టాలను మనసారా పంచుకున్నారు. ఆ పిల్లల ఆత్మీయత పంచుకున్న చైల్డ్ సెలబ్రిటీలు స్పర్శ్ సేవల్లో తామూ భాగమవుతామని మాటిచ్చారు. 'సలార్', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమాల్లో గుర్తింపు పొంది త్వరలో రాబోతున్న వరుణ్‌తేజ్ 'మట్కా'లో మెరవనున్న కార్తికేయదేవ్, 'ఓరి దేవుడా'లో నటించిన ఫర్హానా ఈ పిల్లల కోసం సరదా సరదా డాన్సులు చేశారు. అల్లరి ఆటలు ఆడారు. ఆ పిల్లలు కూడా వారి అవస్థలు కొద్దిసేపు మర్చిపోయి అడిగి మరీ డైలాగ్స్ చెప్పించుకున్నారు. షూటింగ్ ఎలా ఉంటుంది అని అడిగి తెలుసుకున్నారు. నేనూ పాడతాను.. వింటావా అంటూ ఆ ఆర్టిస్టుల ముందు ఆనందంగా పాటలు పాడారు. 'స్పర్శ్'లో ఊరట పొందుతున్న పిల్లలు సెలబ్రిటీలతో తమ ఆరోగ్య సమస్య ఏమిటో పంచుకున్నారు.

ఇలాంటి పిల్లలకు సాయం అందాలి

సాక్షి మీడియా ద్వారా స్పర్శ్ సెంటర్‌లో ఉన్న పిల్లలను కలిసిన చైల్డ్ సెలబ్రిటీలు కారికేయ, ఫర్హానా ఎంతో కదిలిపోయారు. 'మాకు, ఇక్కడి చిన్నారులకు వయసులో పెద్దగా వ్యత్యాసం లేదు కానీ జీవితాల్లో చాలా తేడా ఉంది. దేశవ్యాప్తంగా ఇలాంటి చిన్నారులు ఎందరో ఉన్నారని ఇక్కడికి వచ్చాకే తెలిసింది. మేమెంత మంచి జీవితాన్ని అనుభవిస్తున్నామో తెలిసింది. వారికి ఆనందాలు పంచుదామని వచ్చి ఆరోగ్యం ఎంత విలువైనదో తెలుసుకుని వెళుతున్నాను' అని కార్తికేయ దేవ్ అంటే 'రోజూ అమ్మతో హాయిగా ఆడుకునే నాకు ఈ చిన్నారులను చూస్తుంటే చాలా బాధేసింది. వారికి సంతోషాలు పంచాలని పాటలు పాడాను. వారితో ఆడుకున్నాను. తదుపరి నా షూటింగ్‌కు కూడా తీసుకెళతానని చెప్పాను. భవిష్యత్‌లో స్పర్శ్ సేవల్లో భాగం పంచుకోవాలని ఉంది' అని ఫర్హానా అంది.

ఈ పిల్లలు చిరంజీవులు కావాలి

'స్పర్శ్'లో ఉన్న పిల్లల తల్లిదండ్రులు తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతున్న తమ పిల్లలు చిర ఆయువును పొందాలని కన్నీటి ప్రార్థనలు చేస్తారు. తమ పిల్లలు చిన్న చిరునవ్వు నవ్వితే, సరిగ్గా ఏదైనా తింటే అదే పది వేలుగా మురిసిపోతారు. కాని వారి గుండెల్లో బడబాలనం ఉంది. వారిని అడిగితే – 'మా బాబుకు ఆ మాయదారి రోగం ఎందుకొచ్చిందో తెలియదు. కేన్సర్ అంట. నాలుగో స్టేజ్‌లో ఉంది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి చికిత్స అందించాం. జ్యూస్ సెంటర్‌లో దినసరి కూలీగా పనిచేస్తున్నాను. ఈ స్పర్శ్ హాస్పిటల్ గురించి తెలిసాక ఇక్కడి సేవలు పొందుతున్నాం. పూర్తిగా నయం చేయలేం కానీ., మీ బాబుకు ఎలాంటి అవస్థలు లేకుండా చూసుకుంటాం అని భరోసా ఇచ్చారు.. ఎంతో ఊరటగా ఉంది' అని చార్మినార్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ అంటే 'నాకిద్దరు కొడుకులు., అందులో ఒక అబ్బాయి టకాయసు ఆర్టిటైటిస్ అనే వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ వ్యాధి నయమయ్యే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. కానీ అంత ఖరీదైన చికిత్స అందించే స్థోమత మాకు లేదు. కనీసం తన నొప్పులు, అవస్థలైనా తగ్గించాలని స్పర్శ్‌లో చేర్చాం. ఇక్కడ ఒక కుటుంబ సభ్యుడిలా చూసుకుంటున్నారు. తనను చూసుకోవడం కోసం నా మరో అబ్బాయి కూడా చదువులకు దూరమయ్యాడు. మా ఆయన ఒక్కడు పని చేస్తే మా అందరికీ రోజు గడుస్తుంది' అని మౌలాలికి చెందిన శైలజ అన్నారు. 'పుట్టుకతోనే వచ్చే కంజెనిటల్ హార్ట్ డిసీజ్‌తో మా పాప బాధపడుతోంది. ఎన్నో హాస్పిటల్స్ తిరిగాం... కానీ లాభం లేకుండాపోయింది. ఈ సమయంలో స్పర్శ్ సైకాలజిస్టులు అందించిన మానసిక సాంత్వన కొంత కుదుట పడేలా చేసింది. ఏ పిల్లలకూ ఇలాంటి పరిస్థితులు రావొద్దని ఆశిస్తున్నాను. అందరు పిల్లలు చిరంజీవులుగా నూరేళ్లు బతకాలని కోరుకుంటున్నాను. అని సఫిల్‌గూడకు చెందిన శారద అన్నారు.



ఈ వారమంతా లిటిల్ స్టార్స్ సందడిని సాక్షి యూట్యూబ్‌లో చూడటానికి ఈ qr కోడ్‌ను స్కాన్ చెయ్యండి



- డి.జి. భవాని
- హనుమాద్రి శ్రీకాంత్
ఫొటోలు: నోముల రాజేష్ రెడ్డి

చిన్నారులకు ఆత్మీయ సాంత్వన



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ, చికిత్స అందించినా నయం కాని జబ్బులతో అవస్థలు పడుతున్న వారికి ఉచితంగా పాలియేటివ్ కేర్ సేవలు అందించాలనే లక్ష్యంతో 2011లో 'స్పర్శ్ హాస్పిస్ అండ్ పాలియాటివ్ కేర్ సెంటర్'ను ప్రారంభించాం. దీనిని రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో ప్రారంభించి, నిరంతరం విరాళాలు సేకరిస్తూ ఈ సేవలు కొనసాగిస్తున్నాం. 82 బెడ్ల సామర్థ్యంతో అన్ని వయసుల వారికీ ఇక్కడ ఉచితంగా సేవలు అందిస్తున్నాం. చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా వార్డ్ ఏర్పాటు చేశాం. ఈ పీడియాట్రిక్ వార్డ్‌లో చిన్నారుల కోసం ప్రత్యేకమైన బెడ్లు, ఆహారం, న్యూట్రిషన్, ప్లేస్టేషన్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేశాం. ఇక్కడ వైద్యపరమైన ఉపశమన సేవలతో పాటు మానసికంగా, శారీరకంగా, సామాజికంగా సాంత్వన చేకూర్చుతాం. దీని కోసం ప్రత్యేకంగా పాలియాటివ్ కేర్ ఫిజీషియన్‌లు, నర్సులు, సైకాలజిస్టులు, కౌన్సిలర్లు, సోషల్ వర్కర్లు, వాలంటీర్లు, వార్డ్ బాయ్స్, ఆయాలు...ఇలా 130 మందికి పైగా ఉన్నారు. విభిన్న కారణాలతో ఈ సెంటర్‌కు రాలేని వారికి ఈ సేవలు అందేలా.. స్పర్శ్ టీమ్ పేషెంట్ల ఇంటికే వెళతారు. స్పర్శ్ నుంచి 60 కిలోమీటర్ల లోపు అందించే ఈ హోం కేర్ సేవల కోసం ప్రత్యేకంగా 6 వ్యాన్లను సైతం ఏర్పాటు చేశాం. తెలుగు రాష్ట్రాలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి పేషెంట్లు మా వద్దకు వస్తుంటారు.

- శారద, కౌన్సెలింగ్ ఇన్‌ఛార్జ్, సైకాలజిస్ట్

చాలా హ్యాపీగా ఉంది

ఇంట్లో చాలా నొప్పులతో ఏడ్చేవాడిని. ఇక్కడ మాత్రం ఏ ఇబ్బంది వచ్చినా డాక్టర్లు మందులు ఇస్తారు, మంచిగా మాట్లాడతారు, ఆటలు ఆడతారు. కార్తికేయ అన్న నా కోసం 'నీకెప్పుడు అవసరమున్నా నేనొస్తాననే' డైలాగ్ చెప్పాడు. నేను తన కోసం పాట పాడాను. సెల్ఫీలు దిగాం ఇద్దరం. కార్తికేయ అన్న ప్రభాస్ సినిమాలో చేశాడంటా. నా కోసం రావడం హ్యాపీగా ఉంది.



- అబ్దుల్ అర్ఫత్,
పదేళ్ల వయసు,
కేన్సర్ బాధితుడు

వన్స్‌మోర్ కొట్టాను

అప్పుడప్పుడు నాకేం అవుతుందో నాకే అర్థం కాదు. ఇబ్బందిగా ఉంటుంది, బాధ అనిపిస్తుంది. కానీ అమ్మ ఏడుస్తుందని బయటకు చూపించను. నా కోసం అమ్మా నాన్న అన్నీ కోల్పోయారు. అన్న చదువులు మానేసి నన్నే చూసుకుంటున్నాడు. తన చదువులకు ఫీజులు కూడా కట్టలేని పరిస్థితికి చేరుకున్నాం. ఇలాంటి సమయంలో మా కష్టాలను మర్చిపోయేలా ఈ స్పర్శ్ చూసుకుంటోంది. ఇక్కడ ఉన్నంత సేపు ఏ బాధలు గుర్తు రావు. ఫర్హానా నా కోసం పాట పాడటం, కార్తికేయ కల్కి సినిమా పాటకు డ్యాన్స్ వేయడం ఎప్పటికీ మర్చిపోను. వన్స్ మోర్ అంటూ మళ్లీ డ్యాన్స్ చేయించుకున్నాను.



- మానిక్‌రాజ్

హెల్త్



నలత లేకుండా చలాకీగా...

పిల్లలు తమ తల్లిదండ్రుల కంటి దీపాలు. వాళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో దేదీప్యమానంగా వెలుగుతుండటమే తల్లిదండ్రులు, పెద్దలు కోరుకునేది. ఈ నెల 14వ తేదీ బాలల దినోత్సవం. ఈ సందర్భంగా... పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల కోసం పెద్దలు గమనించాల్సిన, అప్రమత్తంగా ఉండాల్సిన కొన్ని అంశాలివి...

అప్పుడే పుట్టిన పిల్లలకు ఏడుపే వాళ్ల భాష. తమ తాలూకు బాధలను పెద్దలకు తెలియజెప్పడానికి వాళ్ల ఏడుపునే సాధనంగా ఎంచుకుంటారు. అందుకే పిల్లలు ఏడుస్తున్నప్పుడు వాళ్లకు ఏదైనా సమస్య ఉందేమోనని తల్లిదండ్రులు అనుమానించాలి. పిల్లలు ఎప్పుడెప్పుడు, ఎందుకు ఏడుస్తారో, అప్పుడు ఏం చేయాలో తెలుసుకోవాలి.

పిల్లల్లో ఏడుపుకు కొన్ని కారణాలు


● ఆకలి వేసినప్పుడు, ● భయపడినప్పుడు, ● దాహం వేసినప్పుడు ● ఒక్కరే ఉండి బోర్‌గా అనిపించినప్పుడు ● పక్క తడి అయినప్పుడు, ● వాతావరణం మరీ చల్లగా లేదా వేడిగా ఉండి అసౌకర్యంగా అనిపిస్తున్నప్పుడు ●పెద్ద పెద్ద శబ్దాలు వినిపించినప్పుడు ● కాంతి బాగా ఎక్కువైనా, పొగలు కమ్ముకున్నా ● పళ్లు వస్తున్నప్పుడు, ● ఇన్‌ఫెక్షన్‌లు ముఖ్యంగా యూరినరీ ఇన్‌ఫెక్షను వచ్చినప్పుడు, ● కడుపు నొప్పి (ఇన్‌ఫ్యాంటైల్ కోలిక్) ● జ్వరం ● జలుబు ● చెవినొప్పి వంటి సాధారణ లేదా కొన్ని తీవ్రమైన సమస్యలను పిల్లలు ఏడుపు ద్వారా తెలియజేస్తారు.

1-6 నెలల వయసులో ఉన్న పిల్లలు ఎక్కువగా ఏడవటానికి ముఖ్యంగా కడుపుకు సంబంధించిన సమస్యలు, చెవి నొప్పి, జలుబు వంటివి ప్రధాన కారణాలు.



ఇన్‌ఫెన్‌టైల్ కోలిక్...

చిన్న పిల్లల్లో ఏడుపుకు ముఖ్యమైన కారణం కడుపు నొప్పి. దీన్నే ఇన్‌ఫ్యాంటైల్ కోలిక్ అంటారు. సాధారణంగా మూడు నెలలలోపు పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఆకలి వేయడంగానీ, గాలి ఎక్కువగా మింగడం, ఓవర్ ఫీడింగ్, పాలలో చక్కెరపాళ్లు ఎక్కువగా ఉండటం ఇన్‌ఫ్యాంటైల్ కోలిక్‌కు కొన్ని కారణాలు.



ఇటువంటి పిల్లలను ఎత్తుకోవడం (అప్ రైట్ పొజిషన్), లేదా వాళ్ల పొట్టమీద పడుకోబెట్టడం, ప్రాపర్ ఫీడింగ్ టెక్నిక్, కడుపులోని గాలి వెళ్లిపోయేందుకు తేన్పు వచ్చేలా చూడటం అంటే ఎఫెక్టివ్ బర్పింగ్‌తో ఏడుపు మాన్పించవచ్చు. చికిత్స వరకు వెళ్లాల్సివస్తే... కొందరికి యాంటీస్పాస్మోడిక్స్‌తో పాటు బాగా అవసరమైన పరిస్థితుల్లో మైల్డ్ సెడేషన్ ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉంటుంది. యాంటీ స్పాస్మోడిక్, మైల్డ్ సెడేషన్ అనేవి ఏడుపు చాలా తీవ్రంగా ఉన్నప్పుడు మాత్రమే ఇవ్వాలి. చిన్న పిల్లలు మరీ ఎక్కువగా ఏడుస్తుంటే అంటే పదే పదే ఏడవటం, ఆపకుండా ఏడవటం చేస్తుంటే తక్షణం పిల్లల డాక్టర్‌కు చూపించాలి.

ఏడాది నుంచి రెండేళ్ల వరకు...



ఏడాది వయసు నుంచి పిల్లలు కొద్ది కొద్దిగా సపోర్ట్ తీసుకుంటూ నిలబడుతుండటం, కొద్ది కొద్దిగా బుడిబుడి అడుగులు వేసుకుంటూ మళ్లీ పడిపోతూ, మళ్లీ నిలబడుతుండటం చేస్తుంటారు. వీళ్లు నిలబడుతుండటానికి సపోర్ట్ ఇస్తూ ఆడుకునేలా చేస్తుండాలి. ఈ టైమ్‌లోనే పిల్లలు రివాల్వింగ్ ఛైర్స్ వంటివి పట్టుకుని నిలబడానికి ప్రయత్నించినప్పుడు అవి చక్రాల మీద జారిపోయి, పిల్లలు పడిపోయే ప్రమాదం ఉంటుంది. ఇక ఏ వస్తువును పడితే ఆ వస్తువును కదిలించడానికి ప్రయత్నించడం, సొరుగులు లాగేయడం వంటివి చేస్తుంటారు. ఈ సమయాల్లో వారి వెనకే ఉంటూ ప్రోత్సహిస్తూనే, వాళ్లు ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలి.

రెండేళ్ల వయసు నుంచి స్కూలుకు వెళ్లే సమయం వరకు...

ఈ టైమ్‌లో పిల్లలను కాస్త ఆరుబయట ఆడనివ్వాలి. వాళ్లు ఆరుబయటకు వెళ్తుంటే భయపడకుండా కాస్త నీరెండలోకి, మట్టిలోకి వెళ్లడానికి అనుమతించాలి. కాకపోతే ఎండ నేరుగా తగలకుండా హ్యాట్ లాంటిది వాడటం, ఒళ్లంతా కప్పి ఉంచేలా దుస్తులు తొడగడం, అవసరమైతే 30 ఎస్‌పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ రాయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. కాకపోతే ఆరుబయట ఆడుకుని వచ్చాక వాళ్ల ఒళ్లు తుడిచి, చేతులు శుభ్రంగా కడగాలి. మట్టితో ఆడుకోనివ్వని పిల్లల కంటే అలా ఆడుకున్న చిన్నారులకే ఎక్కువ వ్యాధి నిరోధక శక్తి ఎక్కువని కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.



మూడు నుంచి ఐదేళ్ల వయసుకు..

ఈ వయసులో చిన్నారులు ఇతర పిల్లలతో కలిసి ఆడుతుంటారు. అలా ఆడేలా వారిని ప్రోత్సహించాలి. ఈ టైమ్‌లో ట్రైసైకిల్ లేదా సైకిల్ నేర్చుకునేలా సపోర్ట్ చక్రాలున్న సైకిల్, బంతిని విసిరి పట్టుకునే ఆటలు (థ్రోయింగ్ అండ్ క్యాచింగ్), గెంతడం, స్కిప్పింగ్, డాన్సింగ్ వంటి యాక్టివిటీస్ చేసేలా ప్రోత్సహించాలి. ఈ వయసు పైబడిన పిల్లలు, వాళ్ల వయసుకు తగినట్లుగా కాస్తంత పెద్ద ఆటలను ఆడేలా చూడాలి.

అన్ని టీకాలూ టైముకు ఇప్పించడం...

పిల్లలకు ఆయా సమయాల్లో ఇప్పించాల్సిన టీకాలు (వ్యాక్సినేషన్) తప్పక ఇప్పించాలి. ఈ టీకాల షెడ్యూలు చిన్నపిల్లల డాక్టర్లందరి దగ్గరా ఉంటుంది. వారిని సంప్రదించి... డీటీపీ, ఫ్లూ, హెచ్‌ఐబీ, ఎమ్ఎమ్ఆర్, పోలియో, రొటా వైరస్ మొదలైన వ్యాక్సిన్లు అన్నింటినీ ఆయా సమయాలకు ఇప్పిస్తూ ఉండాలి.

ఆహారం విషయంలో...

పాలు మరిచిన పిల్లలకు మొదట్లో గుజ్జుగా చేసిన అన్నం, పప్పు, నెయ్యి వంటి ఆహారాన్ని అందిస్తూ, క్రమంగా ఘనాహారం వైపు మళ్లించేలా చేయాలి. కాంప్లిమెంటరీ ఫుడ్స్ అంటూ మార్కెట్లో లభ్యమయ్యే వాటి కంటే ఇంట్లో ఆరోగ్యకరమైన పరిస్థితుల్లో వండిన భోజనాన్ని తాజాగా అందిస్తుండటమే మేలు.

'క్లీన్ ప్లేట్ రూల్' వద్దు...



ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. కొందరు తల్లులు తాము ప్లేట్‌లో వడ్డించినదంతా పిల్లలు తినేయాలని అనుకుంటుంటారు. పిల్లలను ఘనాహారం వైపు మళ్లించే వీనింగ్ ప్రక్రియ సమయంలో ప్లేట్‌లో పెట్టిందంతా పిల్లలు తినేయాలని అనుకోవద్దు. కడుపు నిండిన వెంటనే వారు తినడానికి విముఖత చూపుతారు. అప్పుడు ఫీడింగ్ ఆపేయాలి. ఈ 'క్లీన్ ప్లేట్ రూల్' బదులుగా చిన్నారులకు చిన్న చిన్న మోతాదుల్లో ఎక్కువసార్లు తినిపించడం మేలు.



ఇక పిల్లలు కాస్త ఎదిగాక అన్ని రకాల కాయగూరలు, ఆకుకూరలు, పీచు పుష్కలంగా ఉండేలా పొట్టుతీయని కాయధాన్యాలతో వండిన అన్నం, మాంసాహారం తినిపించే వారు చికెన్, చేపలు, తాజా పండ్లతో కూడిన ఆహారాలు అందిస్తూ వారికి అన్ని పోషకాలు అందేలా జాగ్రత్త తీసుకోవాలి. వారు మితిమీరి బరువు పెరగకుండా ఉండేందుకు నెయ్యి, వెన్న వంటి శ్యాచురేటెడ్ ఫ్యాట్స్, చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు, ఉప్పు వంటి వాటిని పరిమితంగా ఇవ్వడం మేలు. పిల్లలకు తినిపించేటప్పుడు తల్లిదండ్రులు చాలా ఓపిగ్గా, వారు ముద్ద నమిలి మింగేవరకు ఆగి, అప్పుడు మరో ముద్ద పెట్టడం, ఆహారం వారికి ఇష్టమయ్యే రీతిలో చాలా రకాల (వెరైటీ ఆఫ్ వెజిటబుల్స్) ఆహారాలను మార్చి మార్చి రుచిగా, కాస్తంత గుజ్జుగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

ఇక పిల్లలు పెద్దవుతున్న కొద్దీ పెద్దలు వాళ్లతో కమ్యూనికేట్ అవుతూ ఉండటం, వాళ్ల ఫీలింగ్స్ గురించి మాట్లాడటం, ప్రతికూల ఆలోచనలను, ధోరణులను దగ్గరికి రాకుండా చూడటం, వాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతుండటం, వాళ్ల సెల్ఫ్ ఎస్టీమ్‌కు భంగం రానివ్వకుండా ప్రోత్సాహపూర్వకంగా మాట్లాడటం, మొదట్లో చిన్న చిన్న లక్ష్యాలు ఏర్పరచి, వాటిని నెరవేర్చగానే చిన్న చిన్న బహుమతులు అందిస్తూ ప్రోత్సాహపూర్వకంగా ప్రశంసించడం, వారికై వారు తమ లక్ష్యాలను మెల్లగా పెద్దవిగా చేసుకునేలా చూడటం, విఫలమైనప్పుడు ఏమాత్రం నిరుత్సాహపరచకుండా మరింత ప్రోత్సహించడం చేస్తూ వాళ్ల అన్నివిధాలా మానసిక, శారీరక ఆరోగ్యాలతో ఎదిగేలా చేయాలి.





లిటిల్స్ డ్యూటీస్!

పిల్లల ఆరోగ్యం కోసం, భవిష్యత్తులో వారిలో ఆరోగ్యకరమైన అలవాట్లు పాదుకునేలా చేయడానికి తల్లిదండ్రులు చేయాల్సినవి, వారికి నేర్పాల్సినవి ఇవి...

● పళ్లు
ఉదయం, సాయంత్రం ప్రతిరోజూ రెండు సార్లు బ్రష్ చేయించాలి. బ్రష్ వెనక్కి ముందుకి కాకుండా, పళ్లపై బ్రష్‌ను గుండ్రంగా తిప్పుతున్నట్లుగా బ్రష్ చేయించడం అలవాటు చేయాలి.



● స్నానం
ప్రతిరోజూ స్నానం చేయించాలి. స్నానానికి గోరువెచ్చని నీళ్లు మంచివి.



● జుట్టు
పిల్లల జుట్టును రోజూ పరిశుభ్రమైన దువ్వెనతో దువ్వాలి. అమ్మాయి జుట్టును మరీ టైట్‌గా దువ్వకూడదు. ఒకరి దువ్వెన మరొకరు వాడకూడదు.

● గోళ్లు
చేతివేళ్ల గోళ్లను, కాలివేళ్ల గోళ్లను ప్రతివారం నెయిల్ కట్టర్‌తో కత్తిరిస్తూ ఉండాలి. మరీ లోపలికి కాకుండా చిగురు తగలకుండా జాగ్రత్తగా కత్తిరించాలి.





● చేతులు
ప్రతిసారీ తినేముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేయాలి. అలాగే బయట ఆడుకుని వచ్చాక కూడా చేతులు సోప్‌తో శుభ్రంగా కడుక్కోవడం, అలాగే కాళ్లు కడుక్కోవడం నేర్పాలి.

● దుస్తులు
పిల్లలకు ఎప్పుడూ ఫ్రెష్ దుస్తులు తొడగాలి. ఆడుకుని చెమటతో తడిసినవాటిని ఎప్పటికప్పుడు మార్చాలి. ఉతికిన బట్టలు ఎండలో సరిగా ఆరకపోతే అవి కాస్త వాసన వేస్తుంటాయి. అలాంటివి తొడగకూడదు.



● నిద్ర
పిల్లలు ప్రతిరోజూ ఒకేవేళకు నిద్రపోయేలా అలవాటు చేయాలి. వాళ్లను కంటినిండా నిద్రపోనివ్వాలి. నిద్రలోనే వాళ్ల మెదడు వికాసం, చదివినది గుర్తుపెట్టుకునేలా మెదడులో స్థిరపడటం జరుగుతాయి.



పంకజ్ అద్వానీ ఖాతాలో 28వ వరల్డ్ టైటిల్

భారత దిగ్గజ క్యూయిస్ట్ పంకజ్ అద్వానీ తన అద్భుత కెరీర్‌లో మరో అంతర్జాతీయ విజయాన్ని అందుకున్నాడు. శనివారం దోహా (ఖతర్)లో ముగిసిన ఐబీఎస్ఎఫ్ వరల్డ్ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో అతను విజేతగా నిలిచాడు. ఫైనల్లో పంకజ్ 4-2 (151-94, 151-0, 150-84, 74-151, 6-154, 152-46) తేడాతో రాబర్ట్ హాల్ (ఇంగ్లండ్)ను ఓడించాడు. వరుసగా మూడు ఫ్రేమ్‌లు గెలిచి విజయానికి చేరువైన దశలో హాల్ గట్టి పోటీనిచ్చాడు. తర్వాతి రెండు ఫ్రేమ్‌లు నెగ్గి సవాల్ విసిరాడు. అయితే ఆరో ఫ్రేమ్‌లో పంకజ్ తన స్థాయిని ప్రదర్శించాడు. అతని కెరీర్‌లో ఓవరాల్‌గా ఇది 28వ వరల్డ్ టైటిల్ కావడం విశేషం. ఇందులో 20 బిలియర్డ్స్ టైటిల్స్ ఉండగా... మరో 8 స్నూకర్‌లో వచ్చాయి. బిలియర్డ్స్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో అతను వరుసగా ఏడో సారి ట్రోఫీని అందుకోవడం విశేషం. 2016లో అతని విజయప్రస్థానం మొదలైంది. అక్కడి నుంచి 2024 వరకు పంకజ్‌కు ఎదురు లేకుండా పోయింది. మధ్యలో రెండేళ్లు కోవిడ్ కారణంగా టోర్నీ నిర్వహించలేదు. ఈ మెగా టోర్నీలో పీటర్ గిల్‌క్రిస్ట్ (సింగపూర్), సౌరవ్ కొఠారి (భారత్) సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచి కాంస్యాలు గెలుచుకున్నారు.

‘పాకిస్తాన్‌లో ఆడేదే లేదు’

- ఐసీసీకి తేల్చి చెప్పిన బీసీసీఐ
- భారత ప్రభుత్వ అనుమతి నిరాకరణ
- చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా మ్యాచ్‌లు యూఏఈలో!

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది పాకిస్తాన్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో భారత్ పాల్గొనే విషయంపై స్పష్టత వచ్చింది. టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్తాన్‌కు భారత జట్టు వెళ్లడం లేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తేల్చి చెప్పింది. పాక్ వేదికగా 2025 ఫిబ్రవరి-మార్చిలో ఎనిమిది జట్లతో ఈ టోర్నీ జరగాల్సి ఉంది. అయితే ఇరు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా భారత్ అక్కడికి వెళ్లే విషయంపై చాలా రోజులుగా సందేహాలు ఉన్నాయి. ఇప్పుడు దీనిని నిజం చేస్తూ బీసీసీఐ తమ నిర్ణయాన్ని ఖరాఖండీగా చెప్పేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్తాన్ గడ్డపై తాము క్రికెట్ ఆడలేమని ప్రకటించింది. ఈ విషయాన్ని అధికారికంగా లేఖ ద్వారా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి తెలియజేసింది. తాము పాకిస్తాన్‌కు వెళ్లొద్దని కేంద్ర ప్రభుత్వం సూచించినట్లుగా భారత బోర్డు సమాచారం అందించింది. తాజా పరిణామంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రత్యామ్నాయ వేదికలను చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్‌తో పాటు భారత్‌కు ప్రత్యర్థిగా ఉండే జట్లు కూడా పాక్ వెలుపల ఉండే వేదికలో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుది. పాక్‌తో పాటు దేశం బయట మరో వేదికను ఎంచుకొని ‘హైబ్రిడ్ మోడల్’లో టోర్నీని నిర్వహించే ఆలోచనే లేదని పీసీబీ చైర్మన్ మొహసిన్ నక్వీ శుక్రవారం కూడా చెప్పారు. అయితే ఒక్కరోజులో పరిస్థితి అంతా మారిపోయింది. భారత మ్యాచ్‌లకు యూఏఈ వేదికగా మారే అవకాశాలు ఉన్నాయి. తాము సిద్ధమంటూ శ్రీలంక బోర్డు చెబుతున్నా... పాక్ కోణంలో వారికి అనుకూల, సౌకర్యవంతమైన వేదిక కాబట్టి యూఏఈకే మొగ్గు చూపవచ్చు. 2023లో భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్ కప్‌లో పాకిస్తాన్ జట్టు వచ్చి ఆడినా... భారత్ మాత్రం అలాంటిదేమీ లేకుండా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకే కట్టుబడింది. నేటి నుంచి సరిగ్గా 100 రోజుల్లో చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది.





బాబర్ ఆజమ్, రోహిత్ శర్మ (ఫైల్)

మరో విజయం లక్ష్యంగా...

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ రెండో టి20

- సమరోత్సాహంతో సూర్యకుమార్ బృందం
- ఒత్తిడిలో సఫారీ జట్టు
- రా. గం. 7.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



జిఖెబెర్హా (పోర్ట్ ఎలిజబెత్): టి20 క్రికెట్‌లో జోరు కొనసాగించాలని పట్టుదలగా ఉన్న భారత జట్టు మరో పోరుకు సన్నద్ధమైంది. నేడు దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టి20లో భారత్ తలపడుతుంది. తొలి మ్యాచ్‌లో నెగ్గిన టీమిండియా ఇక్కడా విజయం సాధిస్తే 2-0తో ముందంజ వేస్తుంది. నాలుగు మ్యాచ్‌ల ఈ సమరంలో ఆపై సిరీస్ కోల్పోయే అవకాశం మాత్రం ఉండదు. మరో వైపు స్వదేశంలో కూడా ప్రభావం చూపలేక సమష్టి వైఫల్యంతో చిత్తయిన దక్షిణాఫ్రికాపై తీవ్ర ఒత్తిడి ఉంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి తమ అవకాశాలు కాపాడుకోవాలని ఆ జట్టు భావిస్తోంది. ఇక్కడి పిచ్‌పై చక్కటి బౌన్స్ ఉండటంతో అటు బ్యాటింగ్‌కు, ఇటు పేస్ బౌలింగ్‌కు అనుకూలం కాబట్టి ఆసక్తికర పోరు జరగవచ్చు. మ్యాచ్ రోజున వర్షం పడే అవకాశం తక్కువ. అంతర్జాతీయ టి20ల్లో వరుసగా 11 మ్యాచ్‌లు గెలిచిన భారత్ ఈ సారి కూడా విజయం సాధిస్తే తమ రికార్డు (12 మ్యాచ్‌లు)నే సమం చేస్తుంది.

అందరూ చెలరేగితే...

తొలి టి20లో భారత్ బ్యాటింగ్ పదునేమిటో కనిపించింది. ఇన్నింగ్స్ చివర్లో కాస్త తడబాటుకు గురైనా స్కోరు 200 దాటడం విశేషం. సంజు సామ్సన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతుండటం సానుకూలాంశం కాగా మరో ఓపెనర్ అభిషేక్ శర్మ అంచనాలను అందుకోవాల్సి ఉంది. వరుసగా విఫలమవుతున్న అతనికి ఇది చివరి అవకాశం కావచ్చు. సూర్యకుమార్ ఎప్పటిలాగే తనదైన శైలిలో బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించడం ఖాయం. తిలక్ వర్మ కూడా తొలి పోరులో మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. చివరి ఓవర్లలో వేగంగా ఆడే క్రమంలో పాండ్యా, రింకూ సింగ్ తొందరగానే అవుటైనా వారు తమ స్థాయికి తగినట్లు ఆడితే భారత్‌కు తిరుగుండదు. ఏడో స్థానంలో అక్షర్ పటేల్ లాంటి ఆల్‌రౌండర్ అందుబాటులో ఉండటం జట్టు బ్యాటింగ్ లోతును చూపిస్తోంది. బౌలింగ్‌లో కూడా వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ స్పిన్‌ను అర్థం చేసుకోవడంతో సఫారీలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పేసర్ అర్ష్‌దీప్ కూడా సత్తా చాటుతుండగా...పునరాగమనంలో అవేశ్ ఆకట్టుకున్నాడు. ఇలాంటి లైనప్ ఉన్న జట్టు మరోసారి చెలరేగితే వరుసగా రెండో విజయం జట్టు ఖాతాలో చేరడం ఖాయం.

గెలిపించేది ఎవరు...

సొంతగడ్డపై ఇటీవలే విండీస్ చేతిలో 0-3తో టి20 సిరీస్‌ను చేజార్చుకున్న దక్షిణాఫ్రికా ఈ ఫార్మాట్‌లో ఇంకా తడబడుతూనే ఉంది. తొలి పోరులో బౌలర్ల వైఫల్యంతో ముందుగా భారీగా పరుగులిచ్చుకున్న జట్టు... ఆ తర్వాత బ్యాటింగ్‌లో సాధారణ ప్రదర్శన కూడా చూపించలేదు. మార్క్‌రమ్ మళ్లీ విఫలం కాగా...రికెల్టన్, స్టబ్స్ కూడా నిలబడలేకపోయారు. క్లాసెన్, మిల్లర్ జోడీపై జట్టు అతిగా ఆధారపడుతున్నట్లు అనిపిస్తోంది. వీరిద్దరు వెనుదిరిగితే చాలు ప్రత్యర్థి చేతికి మ్యాచ్ అప్పగించినట్లే కనిపిస్తోంది. పేరుకే ఆల్‌రౌండర్ అయినా మార్కో జాన్సెన్ ఏమాత్రం ప్రభావం చూపడం లేదు. కొయెట్జీతో పాటు ఇతర బౌలర్లు కూడా రాణిస్తేనే భారత్‌ను సఫారీలు నిలువరించగలరు. పీటర్, సిమ్‌లేన్ గత మ్యాచ్‌లో విఫలమైనా... మరో మ్యాచ్‌లో అవకాశం దక్కవచ్చు. స్పిన్నర్‌గా కేశవ్ మహరాజ్ కూడా రాణించాల్సి ఉంది.

‘ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’గా హర్మన్‌ప్రీత్ సింగ్

- ఉత్తమ గోల్‌కీపర్‌గా శ్రీజేశ్
- అంతర్జాతీయ హాకీ సమాఖ్య అవార్డులు

లాసానే (స్విట్జర్లాండ్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రతిష్టాత్మక వార్షిక పురస్కారాల్లో ఇద్దరు భారత స్టార్‌లు మెరిశారు. జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ‘ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’గా ప్రధాన అవార్డును అందుకున్నాడు. అతని సారథ్యంలోనే భారత జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకుంది. ఈ మెగా ఈవెంట్‌లో 10 గోల్స్‌తో హర్మన్ టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన పీఆర్ శ్రీజేశ్ ‘ఉత్తమ గోల్ కీపర్’ అవార్డును అందుకున్నాడు. ఈ మెగా టోర్నీ తర్వాత శ్రీజేశ్ అంతర్జాతీయ హాకీకి రిటైర్మెంట్ ప్రకటించాడు. హర్మన్, శ్రీజేశ్‌లకు ఈ అవార్డులు దక్కడం ఇది మూడో సారి కావడం విశేషం. గతంలో హర్మన్‌ప్రీత్, శ్రీజేశ్ రెండు సార్లు (2020-21, 2021-22)గా ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌గా, బెస్ట్ గోల్ కీపర్‌గా నిలిచారు. మహిళల విభాగంలో నెదర్లాండ్స్‌కు చెందిన ఇబి జాన్సెన్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచింది. ఒమన్‌లో శుక్రవారం జరిగిన ఎఫ్ఐహెచ్ స్టాచ్యుటరీ కాంగ్రెస్‌లో ఈ అవార్డులు అందజేశారు. ఎఫ్ఐహెచ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలోనే భారత హాకీ జట్టుకు కూడా ప్రత్యేక పురస్కారం అందించారు.



హర్మన్‌ప్రీత్ సింగ్



శ్రీజేశ్

ధ్రువ్ జురేల్ రాణించినా..

- భారత్ ‘ఎ’కు తప్పని ఓటమి
- 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ‘ఎ’ విజయం



వికెట్ తీసిన ఆనందంలో ప్రసిధ్

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన రెండో అనధికారిక టెస్టులోనూ భారత్ ‘ఎ’ జట్టు పరాజయం పాలైంది. ఫలితంగా రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ‘ఎ’ 0-2తో కోల్పోయింది. ఈ మ్యాచ్‌తోనే జట్టులో చేరిన జురేల్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధ శతకాలతో ఆకట్టుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 73/5తో శనివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ ‘ఎ’ జట్టు 77.5 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్ జురేల్ (122 బంతుల్లో 68; 5 ఫోర్లు) మరో హాఫ్ సెంచరీతో పోరాడగా... ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (38; 5 ఫోర్లు, ఒక సిక్సర్), తనుశ్ కొటియాన్ (44; 4 ఫోర్లు, ఒక సిక్సర్), ప్రసిధ్ కృష్ణ (29; 5 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. అనంతరం 168 పరుగుల లక్ష్య ఛేదనకు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ‘ఎ’ 47.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసి గెలిచింది. సామ్ కొన్‌స్టాస్ (128 బంతుల్లో 73 నాటౌట్; 7 ఫోర్లు, ఒక సిక్సర్), వెబ్‌స్టర్ (46 నాటౌట్; 6 ఫోర్లు) జట్టును గెలిపించారు. భారత ‘ఎ’ పేసర్ ప్రసిధ్ కృష్ణ తొలి ఓవర్‌లోనే వరుస బంతుల్లో మార్కస్ హారిస్ (0), కామెరూన్ బాన్‌క్రాఫ్ట్ (0)ను అవుట్ చేసి ఆశలు రేపినా ఫలితం దక్కలేదు.

స్కోరు వివరాలు

భారత్ ‘ఎ’ తొలి ఇన్నింగ్స్ 161; ఆస్ట్రేలియా ‘ఎ’ తొలి ఇన్నింగ్స్ 223; భారత్ ‘ఎ’ రెండో ఇన్నింగ్స్: అభిమన్యు ఈశ్వరన్ (సి)రొచిసియోలి (బి) మెక్ ఆండ్రూ 17; రాహుల్ (బి) రొచిసియోలి 10; సాయి సుదర్శన్ (సి) బాన్‌క్రాఫ్ట్ (బి) వెబ్‌స్టర్ 3; రుతురాజ్ (ఎల్బీ) (బి) మెక్ ఆండ్రూ 11; పడిక్కల్ (సి) మెక్‌స్వీనీ (బి) వెబ్‌స్టర్ 1; జురేల్ (సి) కొన్‌స్టాస్ (బి) రొచిసియోలి 68; నితీశ్ కుమార్ రెడ్డి (సి) పెయిర్‌సన్ (బి) వెబ్‌స్టర్ 38; తనుశ్ (సి) హారిస్ (బి) మెక్‌స్వీని 44; ప్రసిధ్ కృష్ణ (సి) కొన్‌స్టాస్ (బి) రొచిసియోలి 29; ముకేశ్ (ఎల్బీ) (బి) రొచిసియోలి 1; ఖలీల్ అహ్మద్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7, **మొత్తం (77.5 ఓవర్లలో ఆలౌట్) 229. వికెట్ల పతనం:** 1-25, 2-31, 3-44, 4-44, 5-56, 6-150, 7-162, 8-211, 9-229, 10-229, **బౌలింగ్:** బోలండ్ 14-4-36-0, మెక్ ఆండ్రూ 19-4-53-2, వెబ్‌స్టర్ 15-4-49-3, రొచిసియోలి 2335-1-74-4, మెక్‌స్వీనీ 6-2-12-1.

ఆస్ట్రేలియా ‘ఎ’ రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనీ (సి) జురేల్ (బి) ముఖేశ్ 25; హారిస్ (సి) జురేల్ (బి) ప్రసిధ్ 0; బాన్‌క్రాఫ్ట్ (ఎల్బీ) (బి) ప్రసిధ్ 0; కొన్‌స్టాస్ (నాటౌట్) 73; ఒలీవర్ (బి) ధనుశ్ 21; వెబ్‌స్టర్ (నాటౌట్) 46, ఎక్స్‌ట్రాలు 4, **మొత్తం (47.5 ఓవర్లలో 4 వికెట్లకు) 169. వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-48, 4-73, **బౌలింగ్:** ప్రసిధ్ 12-1-37-2, ముకేశ్ 11-1-40-1, ఖలీల్ 4-2-5-0, నితీశ్ 8-0-21-0, తనుశ్ 12.5-1-62-1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

అంతకంటే ఆనందం మరొకటి ఉండదు

- వరుణ్ తేజ్



‘‘బర్మా నుంచి శరణార్థిగా వైజాగ్ వచ్చిన వాసు అనే ఒక అబ్బాయి జీవిత కథ ‘మట్కా’. 1958 నుంచి 1982 వరకు అంచలంచెలుగా వాసు ఎలా ఎదిగాడు? అనేది సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. ‘మట్కా’ సందేశాత్మక చిత్రం కాదు. పక్కా కమర్షియల్ మాస్ ఫిలిం’’అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. కరుణ కుమార్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా, మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘మట్కా’. డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీ ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ పంచుకున్న విశేషాలు...

● కరుణ కుమార్‌గారు ‘మట్కా’ కథని తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా చేద్దామని భావించారు. తనే మట్కా కింగ్ అయి ఉంటే ఎలా చేసేవారో అని ఆలోచించి ఆయనకు వచ్చిన ఐడియాస్‌తో వాసు క్యారెక్టర్‌ని డిజైన్ చేశారు. ఈ కథ చదువుతున్నప్పుడే వాసు పాత్ర ఎలా ఉంటుందో ఒక అంచనాకి వస్తాం. తనకి ఎవడూ సాయం చేయడనే ఒక బాధ, కోపం వాసులో కనిపిస్తుంది. పైగా ఈ దేశంలో చెలామణి అయ్యే ప్రతీ రూపాయిలో 90 పైసలు ఒక్క శాతం వారే సంపాదిస్తారు. మిగతా 10 పైసల గురించి 99 మంది కొట్టుకుంటారు. వాసు ఆ ఒక్క శాతంలో ఉండాలనుకుంటాడు. ఇందుకోసం తను ఏం చేశాడు? అన్నది సినిమాలో ఆసక్తిగా ఉంటుంది.

● ‘మట్కా’లో వాసు పాత్ర చాలా బలంగా ఉంటుంది. మంచీ, చెడు అని కాదు.. ప్రేక్షకులు థియేటర్స్‌లో కూర్చున్నప్పుడు ఒక క్యారెక్టర్‌తో కనెక్ట్ అవ్వాలి, ఆ పాత్రతో ప్రయాణించాలి. అలా చూసుకుంటే ‘మట్కా’ లో వాసు క్యారెక్టర్‌కి ఆడియన్స్ కనెక్ట్ అవుతారు.. రెండున్నర గంటలు వాసుతో పాటు ప్రయాణం చేస్తారు. మాస్ ఆడియన్స్ లక్ష్యంగా చేసిన సినిమా ఇది. కానీ, అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది. ఈ సినిమాలో సెకండ్ హాఫ్‌లో వాసు పాత్ర తన బాధని, అసలు తను ఎందుకు అలా అయ్యాడో కూతురుతో ఒక పిట్ట కథలా చెబుతున్నప్పుడు ప్రేక్షకుల కళ్ల నుంచి నీరు వస్తాయి. దాదాపు వారం పాటు ఆ సీన్, డైలాగ్స్‌ని చదువుతూనే ఉన్నాను. ఆ సన్నివేశాన్ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే ఎగ్జైట్‌మెంట్ ఉంది.

● నేను సోలో హీరోగా నటించిన లాస్ట్ మూడు సినిమాల్లో(గని, గాండీవధారి అర్జున, ఆపరేషన్ వాలంటైన్) పెర్ఫార్మెన్స్ పరంగా కొంచెం లిమిటేషన్స్ ఉండే పాత్రలు చేశాను. ‘గద్దల కొండ గణేష్’ తర్వాత మళ్లీ అలాంటి నటనకి స్కోప్ ఉండే సినిమా కోసం ఎదురు చూస్తున్నప్పుడు ‘మట్కా’ కథ వచ్చింది. ఇందులో వాసులాంటి పాత్ర చేయడం సవాల్‌గా, అదృష్టంగా అనిపించింది. స్క్రీన్‌పై వరుణ్ అని కాకుండా ప్రేక్షకులు వాసునే చూడాలి. దాని కోసం కష్టపడాల్సిందే. ‘గద్దల కొండ గణేష్’ తర్వాత నేను బయటకి వెళ్లినప్పుడు వరుణ్ అని కాకుండా గణేష్ అని పిలిచారు. అది నాకు చాలా పెద్ద ప్రశంస. ఓ యాక్టర్‌గా నన్ను క్యారెక్టర్ పేరుతో పిలిస్తే అంతకంటే ఆనందం మరొకటి ఉండదు.

● కరుణ కుమార్‌గారు మంచి విజన్ ఉన్న డైరెక్టర్. గ్రౌండ్ రియాలిటీని షుగర్ కోటింగ్ లేకుండా చెబుతుంటారు.. అది నాకు చాలా నచ్చింది. ఆయనకి మ్యూజిక్ మీద కూడా మంచి కమాండ్ ఉంది. ‘మట్కా’ తో ఆయనకి ఇంకా మంచి పేరువస్తుంది. ఈ సినిమాలో నాలుగు పాటలున్నాయి. ఆ పాటలు కథలో చాలా ముఖ్యం. జీవీ ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతం, అదిరిపోయే నేపథ్య సంగీతం అందించారు. వాసుతో పాటు ట్రావెల్ అయ్యే క్యారెక్టర్ మీనాక్షీ చౌదరిది. నోరా ఫతేహి, కన్నడ కిషోర్, జాన్ విజయ్, రాజేష్, నవీన్ చంద్ర పాత్రలు కూడా చాలా బాగుంటాయి. మంచి సినిమా తీయాలనే ఉద్దేశంతోనే నిర్మాతలు తొలి రోజు నుంచి చాలా ప్యాషనేట్‌గా పనిచేశారు.



● ‘దిల్’ రాజు, కియారా అద్వానీ, రామ్ చరణ్, ఎస్‌జే సూర్య, అంజలి

ఆయనతో పని చేయడం నా అదృష్టం

- రామ్ చరణ్

‘‘శంకర్‌గారు జీనియస్ డైరెక్టర్. ఆయనతో పనిచేయడం నా అదృష్టం. ‘గేమ్ చేంజర్’ ఎడిటింగ్ పనుల్లో బిజీగా ఉండటం వల్ల ఆయన టీజర్ లాంచ్ వేడుకకి రాలేదు. ఇండియాలోనే లక్నో చాలా పెద్ద నగరం. ఇక్కడి ప్రజల మనసులు కూడా చాలా పెద్దవి. ‘గేమ్ చేంజర్’ టీజర్ లాంచ్ వేడుక ఇక్కడ జరగడం ఆనందంగా ఉంది’’ అని హీరో రామ్‌చరణ్ తెలిపారు. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటించిన చిత్రం ‘గేమ్ చేంజర్’. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో అంజలి, ఎస్‌జే సూర్య, సముద్రఖని, జయరాం ఇతర పాత్రలు పోషించారు. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌పై ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 2025 జనవరి 10న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం లక్నోలో ‘గేమ్ చేంజర్’ టీజర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ‘బేసిగ్గా రామ్ అంత మంచోడు ఇంకోడు లేడు.. కానీ, వాడికి కోపం వస్తే.. వాడంత చెడ్డోడు ఇంకోడు ఉండడు’ వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ‘ఐయామ్ అన్‌ప్రిడిక్టబుల్’(నన్ను మీరెవరూ అంచనా వేయలేరు) అంటూ రామ్ చరణ్ డైలాగ్‌తో టీజర్‌ని ముగించారు. ఈ వేడుకలో ‘దిల్’ రాజు మాట్లాడుతూ–‘‘మా ప్రొడక్షన్‌లో 50వ చిత్రం ‘గేమ్ చేంజర్’. శంకర్‌గారితో పని చేయాలని ఎప్పటి నుంచో అనుకున్నాను. అది రామ్ చరణ్‌తో అవడం మరింత ఆనందంగా ఉంది’’అని చెప్పారు. ‘‘లక్నోలో మా చిత్ర ప్రయాణం ప్రారంభించడం సంతోషంగా ఉంది’’ అన్నారు కియారా అద్వానీ. ‘‘గేమ్ చేంజర్’ టీజర్‌ను మాత్రమే చూశారు. ఇక అసలు సినిమా ముందుంది’’ అని ఎస్‌జే సూర్య చెప్పారు. ‘‘ఈ సినిమాలో నా పాత్ర సవాల్‌గా అనిపించింది’’ అని అంజలి పేర్కొన్నారు.

వినోదానికి ప్రేక్షకులు కనెక్ట్ అవుతున్నారు

- చేతన్ కృష్ణ



● చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్

‘‘ధూం ధాం’ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. సినిమా బాగుంటే తప్ప థియేటర్స్‌కి రాని ఈ ట్రెండ్‌లో మా సినిమా ఆడుతున్న థియేటర్లు 70 నుంచి 80 శాతం మంది ప్రేక్షకులతో నిండటం సంతోషంగా ఉంది. మా చిత్రంలోని వినోదానికి ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతున్నారు’’ అని హీరో చేతన్ కృష్ణ అన్నారు. సాయి కిషోర్ మచ్చా దర్శకత్వంలో చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జోడీగా నటించిన చిత్రం ‘ధూం ధాం’. ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్‌పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సాయి కిషోర్ మచ్చా మాట్లాడుతూ– ‘‘ధూం ధాం’ రిలీజైన ప్రతి సెంటర్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తున్నందుకు సంతోషంగా ఉంది’’ అని తెలిపారు. ‘‘పెద్ద సినిమాల పోటీలో మా ‘ధూం ధూం’లాంటి చిన్న సినిమా నిలదొక్కుకోవడమే గొప్ప విషయం’’ అన్నారు ఎంఎస్ రామ్ కుమార్. రచయిత గోపీ మోహన్, నటుడు గిరిధర్ మాట్లాడారు.



● ధర్మ, ఐశ్వర్య

బ్యాడ్ బాయ్స్

ధర్మ, ఐశ్వర్యా శర్మ జంటగా నటించిన చిత్రం ‘డ్రింకర్ సాయి’. ‘బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్’ అనేది ట్యాగ్ లైన్. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వం వహించారు. ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరీధర్ నిర్మించారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని డైరెక్టర్ మారుతి విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘డ్రింకర్ సాయి’ టైటిల్, ఫస్ట్ లుక్ ఆసక్తిగా ఉన్నాయి. సినిమా మంచి విజయం సాధించాలి’’ అని పేర్కొన్నారు. ‘‘వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు కిరణ్ తిరుమలశెట్టి. త్వరలోనే ఈ సినిమాని విడుదల చేయనున్నాం’’ అని నిర్మాతలు తెలిపారు. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, రీతూ చౌదరి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: శ్రీ వసంత్.

సస్పెన్స్ థ్రిల్లర్



● జో శర్మ, సంబీత్

జో శర్మ, సంబీత్ ఆచార్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘ఎమ్ 4 ఎమ్’(మోటివ్ ఫర్ మర్డర్). మోహన్ వడ్లపట్ల దర్శకత్వం వహించారు. మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్‌విన్ గ్రూప్(యూఎస్‌ఏ) బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ–‘‘సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్, మర్డర్ మిస్టరీ జానర్లో రూపొందిన చిత్రం ‘ఎమ్ 4 ఎమ్’. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నాం. టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు అమెరికాలోనూ ఈ సినిమా ప్రమోషన్స్ మొదలయ్యాయి. వసంత్ ఇసాయిపెట్టై సంగీతం, ఆనంద్ పవన్ ఎడిటింగ్, సంతోష్ షానమోని విజువల్స్ హాలీవుడ్ రేంజ్‌లో ఉంటాయి’’ అని తెలిపారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

గల్లీ ప్రేమను సింపుల్‌గా గెలిపించిన క్రికెట్

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం ‘లబ్బర్ పందు’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ప్రపంచంలో ప్రతి ఒక్క ఆటకు ఆయా ప్రాంతాన్ని బట్టి కొంత ప్రత్యేకత సంతరించుకుంది. మన భారతదేశంలో క్రికెట్ ఆటకి ఉన్న క్రేజ్ మరే ఆటకు లేదు అన్నది అక్షర సత్యం. క్రికెట్ ఆధారంగా గతంలో చాలా సినిమాలే వచ్చాయి. కానీ హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న తమిళ చిత్రం ‘లబ్బర్ పందు’ సినిమా వాటన్నిటికీ అతీతమనే చెప్పాలి. ఈ సినిమా దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు క్రికెట్ ఆట స్ఫూర్తిగా ఓ చక్కటి ప్రేమకథను బ్యాక్‌గ్రౌండ్‌లో నడుపుతూ చెప్పిన విధానం అద్భుతమనే చెప్పాలి. నేటివిటీకి నేచురాలిటీకి కేరాఫ్ అడ్రస్ సౌత్ ఇండియన్ సినిమాలు అన్నదానికి సవివర నిదర్శనం ఈ ‘లబ్బర్ పందు’ సినిమా. ఈ చిత్రం మాతృక తమిళమైనా తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా హాట్‌స్టార్‌లో ఉంది. ఇక ‘లబ్బర్ పందు’ కథాంశానికొస్తే.. అన్బు అనే ఓ యువ క్రికెటర్ తన కులం వల్ల జాలీ ఫ్రెండ్స్ టీమ్‌లోకి చేరలేకపోతాడు. అన్బుకి క్రికెట్ అంటే చిన్నప్పటి నుండి ప్రాణం. అన్బు ఓ అద్భుతమైన ఆల్ రౌండర్ అని, అతన్ని టీమ్‌లోకి తీసుకోవాలని జాలీ ఫ్రెండ్స్ టీమ్ కెప్టెన్ కరుప్పాయ కూడా ప్రయత్నిస్తుంటాడు. మరో వైపు స్టార్ బ్యాట్స్‌మేన్ అయిన పూమలై సచిన్ బాయ్స్ టీమ్‌లో ఎవ్వరూ ఔట్ చేయని విధంగా పరిచయం చేస్తారు. ఈ దశలో ఓసారి అన్బు, పూమలై తలపడాల్సి వచ్చి అన్బు... పూమలైని ఒక్క రన్ కూడా తియ్యనీయకుండా ఔట్ చేస్తాడు. దాంతో పూమలై అన్బు పై ద్వేషం పెంచుకుంటాడు. అలాగే అన్బు కూడా పూమలైపై కోపంతో ఉంటాడు. ఇంతలో అనుకోకుండా పూమలై కూతురు దుర్గతో ప్రేమలో పడతాడు అన్బు. దుర్గ... పూమలై కూతురన్న విషయం అన్బుతో పాటు అందరికీ తెలిసి రచ్చవుతుంది. తన శత్రువుకి తన కూతురుని ఎలా ఇస్తానని అన్బుతో పూమలై తలపడుతూ ఉంటాడు. ఆఖరికి పూమలైని అన్బు ఆటలో మళ్లీ ఓడించి దుర్గని దక్కించుకుంటాడా? లేక ఆటకు దూరమై దుర్గని వదిలేస్తాడా? అన్నది ‘లబ్బర్ పందు’ సినిమాలోనే చూడాలి. ఓ రకంగా చెప్పాలంటే... ప్రేక్షకుడు ఈ సినిమా చూస్తూ... జీవితాన్ని చూస్తున్న అనుభూతి పొందుతాడు. ముఖ్యంగా ఈ సినిమాలో పాత్రధారులందరూ నటించలేదు... జీవించారు. గల్లీ ప్రేమను సింపుల్‌గా గెలిపించిన ఈ ఆట ఓ అద్భుతం. మీరు కూడా ఓ లుక్కేయండి.



- ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

క్లుప్తంగా...

యాదగిరిగుట్టలో హైకోర్టు జడ్జి పూజలు



జస్టిస్ పుల్లా కార్తీక్‌కు నృసింహుని చిత్రపటం బహూకరిస్తున్న దేవస్థానం ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్ శనివారం కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు పూజలు చేశారు. అనంతరం ప్రధానాలయ ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో భాస్కర్ రావు ప్రసాదం అందజేసి, స్వామివారి చిత్ర పటం బహూకరించారు.

కల్తీదారులపై ఉక్కుపాదం మోపాలి

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: విత్తనాలు, క్రిమిసంహారక మందులు కల్తీ చేసే కంపెనీలు, వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.జి.చిన్నారెడ్డి సూచించారు. శనివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నూతనంగా రిక్రూట్ అయిన వ్యవసాయ అధికారుల శిక్షణ ముగింపు సమావేశంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ముఖ్యమైనవి సారవంతమైన నేల, నాణ్యమైన విత్తనాలు, సాగునీరు, నాణ్యమైన క్రిమి సంహారక మందులు, మార్కెటింగ్ అని, ఈ విషయంలో వ్యవసాయ అధికారులు (ఏవో) రైతులకు అండగా నిలవాలని సూచించారు. నేల సారం పెరిగేలా ఏవోలు చర్యలు తీసుకోవాలని, అందుకు వర్మి కంపోస్టులో రైతులను ప్రోత్సహించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పాల సరఫరా డిమాండ్‌కు అనుగుణంగా లేవని, పాడి, పంటలపై వ్యవసాయ అధికారులు దృష్టిని పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ విభాగం హెడ్ కెప్టెన్ పాండురంగారెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, శిక్షణ కోర్సు ఇన్చార్జి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

● 'మీట్ - గ్రీట్'లో స్పీకర్, మండలి చైర్మన్



న్యూజిలాండ్ తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆక్లాండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన 'మీట్ - గ్రీట్'కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రాంమోహన్, కల్యాణ్‌రావు ఉన్నారు.

– సాక్షి, హైదరాబాద్

● ఎక్కడున్నా అండగా ఉంటాం



తెలంగాణవాసులు దేశవిదేశాల్లో ఎక్కడ ఉన్నా ప్రభుత్వం అండగా ఉంటుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన 'మలేషియా తెలంగాణ అసోసియేషన్'(మైటా) దశాబ్ది ఉత్సవాల్లో శ్రీధర్‌బాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మహేశ్‌కుమార్ గౌడ్, జగదీశ్‌రెడ్డి, గోరటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, హైదరాబాద్

మాకూ తుపాకులివ్వండి

- దాడులు అడ్డుకొనేందుకు ఆయుధాలు అవసరం
- ప్రభుత్వానికి అటవీ అధికారుల విన్నపం
- ప్రతిపాదనలు పంపుతామన్న పీసీసీఎఫ్ డోబ్రియాల్
- అమ్రాబాద్ రిజర్వ్ నుంచి గ్రామాల తరలింపునకు ఓకే
- ముగిసిన అటవీ శాఖ రెండురోజుల వర్క్‌షాప్

పీఎస్‌ల మాదిరిగా ఫారెస్ట్ స్టేషన్లు పెట్టండి



తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో జరిగిన వర్క్ షాపులో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, ఇతర అధికారులు

సాక్షి, హైదరాబాద్: 'అటవీ ప్రాంతాల్లో ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటుచేసి మాకు కూడా తుపాకులు ఇవ్వండి'అని పలువురు అటవీ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగతంగా ఇవ్వకపోయినా పోలీస్ స్టేషన్ల మాదిరిగా వివిధ ప్రాంతాల్లో ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటుచేసి వాటిలో 10 – 20 ఆయుధాలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో అన్ని జిల్లాల సర్కిల్ హెడ్‌లు, డీఎఫ్‌వోలు, ఎఫ్‌డీవోలతో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ నిర్వహించిన రెండురోజుల వర్క్‌షాప్ శనివారం రాత్రి ముగిసింది. ఈ సమావేశంలో రెండోరోజు పలువురు అధికారులు ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. గతంలో అటవీ ఉత్పత్తుల స్మగ్లింగ్, జంతువుల వేట అధికంగా ఉంటే.. ఇప్పుడు భూముల ఆక్రమణ ప్రమాదం అధికంగా ఉన్నదని, భూముల పరిరక్షణకు కచ్చితమైన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులు కోరారు. పలుచోట్ల అటవీ అధికారులు, సిబ్బందిపై దాడులు జరగడం, రెండేళ్ల క్రితం జరిగిన దాడిలో ఓ ఉన్నతస్థాయి అధికారి ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనల నేపథ్యంలో.. గతంలో మాదిరిగా అటవీ సిబ్బంది మళ్లీ ఆయుధాలు ఉపయోగించే అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ విజ్ఞప్తులపై పీసీసీఎఫ్ డోబ్రియాల్ సానుకూలంగా స్పందించారు. ఆయుధాల కోసం గతంలోనే ప్రభుత్వానికి విన్నవించామని, ఇప్పుడు మరోసారి ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారు.

1993కు ముందు మాదిరిగా..

రెండేళ్ల క్రితం అటవీ అధికారులపై దాడులు జరిగిన సందర్భంలో అటవీ అధికారులకు ఆయుధాలు ఇవ్వాలని ఐఎఫ్ఎస్ అధికారులు, అటవీ సిబ్బంది సంఘాలు గట్టిగా డిమాండ్ చేశాయి. దీనిపై అప్పటి ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలపై దాదాపు ఆమోదముద్ర పడే సమయంలో అవి నిలిచిపోయాయి. 1993 వరకు అటవీ అధికారుల వద్ద (రేంజ్ ఆఫీసర్ల వరకు) తుపాకులు ఉండేవని ఓ అటవీ అధికారి సాక్షికి తెలిపారు. నక్సలైట్ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో తమ తుపాకులను నక్సలైట్లు దాడి చేసి లాక్కుపోతారనే అనుమానంతో, పోలీసుల ఒత్తిడితో అప్పటి ప్రభుత్వం వాటిని సరెండర్ చేసి భద్రపరిచేలా చర్యలు తీసుకుందని తెలిపారు. అటవీ సిబ్బందిపై దాడులకు సంబంధించిన కేసులు, కోర్టులో పెండింగ్ కేసుల విచారణపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించారు.

ఉపాధి హామీ కింద మొక్కలు పెంపకం

అటవీ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల మొక్కల పెంపకం.. పల్లె పశువుల వనాలు వంటివి అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలు, అందుబాటులో ఉన్న నిధుల గురించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ షఫీఉల్లా నుంచి ఈ సందర్భంగా వివరాలు సేకరించారు. జగిత్యాల, వికారాబాద్ జిల్లాల్లో నగర్ వాన్ యోజన పథకం కింద చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. అటవీ ప్రాంతాల్లో గొత్తికోయల ఆవాసాల సమస్యలు కూడా చర్చకు వచ్చాయి. అమ్రాబాద్‌లో పులుల సంరక్షణ కోసం అక్కడి గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

వివిధ జిల్లాల్లో కొత్తగా మంజూరైన 14 నగర్ వాన్ ప్రాజెక్టుల అమలుకు తీసుకుంటున్న చర్యలు, జాతీయ రహదారుల ప్రాజెక్ట్ పరిధిలో చేపడుతున్న పనుల పురోగతి, గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ కింద 2025లో చేపట్టనున్న పనులను సమీక్షించారు. పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఈలుసింగ్ మేరు, పీసీసీఎఫ్ (అడ్మిన్) సునీతా భగవత్, సీసీఎఫ్ లు ప్రియాంక వర్గీస్, రామలింగం ఇతర అధికారులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

న్యాయ సేవలు గడపగడపకూ అందాలి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజయ్ పాల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్

నయీంనగర్: న్యాయ సేవాధికార సంస్థలు అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల ద్వారా గడపగడపకూ న్యాయ సేవలు అందేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ అన్నారు. శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్–హనుమకొండ జిల్లాల కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ సుజయ్ పాల్ పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ప్రాథమిక హక్కులు, విధులు గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉచిత న్యాయ సహాయం అనేది స్వాతంత్య్రం రాకముందునుంచే ఉందని, టీమ్ ఆఫ్ ఇండియన్ అడ్వకేట్స్ కలిసి సుభాష్ చంద్రబోస్‌కు ఉచిత న్యాయ సహాయం అందించారని గుర్తు చేశారు. ఈ భారత న్యాయ విధానం బ్రిటిష్ వారికి కూడా నచ్చిందని, ఆనాటినుంచే భారత రాజ్యాంగంలో లిఖిత పూర్వకంగా ఉచిత న్యాయ సహాయానికి దారి తీసిందన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో కమ్యూనిటీ మీడియేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఇది సమర్థంగా పని చేస్తూ ప్రజల మధ్య వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో న్యాయ సేవా సంస్థలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ సీహెచ్ పంచాక్షరి, హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయమూర్తులు సీహెచ్ రమేశ్‌బాబు, వీబీ గీతాంబ, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, సీపీ అంబర్ కిశోర్ ఝా పాల్గొన్నారు. కాగా, జిల్లా కోర్టు ప్రాంగణంలో సమావేశం జరుగుతుండగానే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సెల్‌ఫోన్ లైట్లు వేసి సమావేశం కొనసాగించారు.

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలి

అధికారుల పాత్రపై ప్రభుత్వం ఆరా తీయాలి

రాష్ట్ర విశ్రాంత రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ విశ్రాంత రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ యూనియన్ డిమాండ్ చేసింది. ఇప్పటివరకు ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంలో అధికారుల పాత్రపై కూడా ఆరా తీయాలని కోరింది. శనివారం తెలంగాణ విశ్రాంత రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ యూనియన్ కోర్ కమిటీ సమావేశమైంది. ప్రభుత్వ భూముల అవకతవకలపై కూలంకుషంగా చర్చించింది. అనంతరం కోర్ కమిటీలో తీసుకున్న వివరాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు, పదవీ విరమణ చేసిన అధికారులు కె.లక్ష్మయ్య (తహసీల్దార్), సురేష్ పోతెదార్ (జాయింట్ కలెక్టర్), ఎన్.శ్రీనివాసరావు (డిప్యూటీ కలెక్టర్), మధుసూదన్, రవీందర్ రెడ్డి, ఎం సూర్యనారాయణ (స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు), జయప్రకాశ్‌రావు (తహశీల్దార్) తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పాత్ర లేనిదే అంగుళం భూమి కూడా ఎక్కడికీ పోదని, దీనిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. గతంలో తాము అధికారులుగా ఉన్నప్పుడు కాపాడిన భూములు నేడు అన్యాక్రాంతం అవడం ఏంటని ప్రశ్నించారు. రైతుబంధు కోసం గుట్టలను భూములుగా చూపించి ప్రభుత్వం నుంచి రైతుబంధు తీసుకున్నారని, దీంతో రైతులే కాకుండా అధికారులు కూడా లాభపడ్డారని పేర్కొన్నారు. ధరణిని మార్చి కొత్త చట్టం తెస్తామంటున్న ప్రభుత్వం ముందు ధరణిలో ఉన్న లోపాలను గుర్తించాలన్నారు. లోపాలను గుర్తించిన తర్వాతే కొత్త చట్టానికి రూపకల్పన చేయాలని కోరారు. దీనికి రిటైర్డ్ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరారు.



సమావేశంలో రాష్ట్ర విశ్రాంత రెవెన్యూ అధికారులు

క్లుప్తంగా...

టీజీపీఎస్సీలో 142 పోస్టుల సృష్టి

ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)ను బలోపేతం చేయడంలో భాగంగా కొత్తగా 142 పోస్టులను సృష్టిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు కార్యదర్శి (1), సంయుక్త కార్యదర్శి (2), ఉపకార్యదర్శి (5), సహాయ కార్యదర్శి (5), సెక్షన్ ఆఫీసర్ (8), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (31), జూనియర్ అసిస్టెంట్ (41) పోస్టులతో పాటు ఇతర కేటగిరీల పోస్టులు ఇందులో ఉన్నాయి. వీటిలో కొన్ని పోస్టులను ప్రత్యక్ష నియామకాల విధానంలో భర్తీ చేయనుండగా, మిగిలిన పోస్టులను పదోన్నతులు, డెప్యుటేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. 41 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, 2 ప్రోగ్రామర్ పోస్టులు, 4 సహాయ ప్రోగ్రామర్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయనున్నారు. 26 ఏఎస్‌వో పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారానైనా లేదా డెప్యుటేషన్ ద్వారానైనా భర్తీ చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ముగ్గురు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఐదుగురు సహాయ ప్రొఫెసర్లను వర్సిటీలు/పరిశోధన సంస్థల నుంచి డెప్యుటేషన్‌పై నియమించుకోవాలని కోరింది.

ప్రశాంతంగా ఎంబీఏ ప్రవేశ పరీక్ష



బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సుధారాణి తెలిపారు. ఐ–సెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని ఆమె వెల్లడించారు. విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి బోజు శ్రీనివాస్, కామర్స్ విభాగం డీన్ ఆనంద్‌పవార్, సోషల్ సైన్సెస్ విభాగం డీన్ వడ్డాణం శ్రీనివాస్, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ ఎల్వీకే రెడ్డి, ప్రాంతీయ అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్ రాజేందర్‌రెడ్డితో కలిసి శనివారం ఆమె పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. కాగా ఎంబీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలను సోమవారం సాయంత్రం విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎంబీఏ సహా డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నవంబర్ 15 చివరి తేదీగా అధికారులు వివరించారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ పోర్టల్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ లేదా వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్ సంప్రదించవచ్చని సూచించారు.

'బీసీల కోసం రక్షణ చట్టాన్ని తేవాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలపై తరచూ దాడులు జరుగుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణలో కూడా బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈమేరకు శనివారం రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి.నిరంజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఒడుపైన ఎత్తు.. ఒత్తిడే చిత్తు



(పాత బాలప్రసాద్ – సాక్షిప్రతినిధి, సంగారెడ్డి)

ఐఐటీల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు.. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు

ఐఐటీ భువనేశ్వర్‌లో ఏటా హాలోవీన్ నైట్.. ఐఐటీహెచ్‌లో ప్రకృతి ఒడిలో సన్‌షైన్ ఉత్సవం

ఒకచోట అర్ధరాత్రి ఆత్మల్లా విహారం. మరోచోట ఆమని ఒడిలో చిన్నారుల్లా కేరింతలు. భయపెడుతూ, భయపడుతూ, భయాన్ని అధిగమించే సన్నివేశం ఒకటి. బాల్యంలోకి తీసుకెళ్లి బడి ఒత్తిడిని తగ్గించే కార్యక్రమం మరొకటి. దేశంలోని ఉన్నత విద్యా సంస్థలైన ఐఐటీల్లో విద్యార్థులకు మానసిక ఒత్తిడి, భయాన్ని తగ్గించేందుకు అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఐఐటీ భువనేశ్వర్‌లో ఏటా నిర్వహించే హాలోవీన్ నైట్, ఐఐటీ హైదరాబాద్ నిర్వహించే సన్‌షైన్ కార్యక్రమాలు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి.



ఐఐటీలో ఆత్మల రాత్రి

అర్ధరాత్రి.. ఆత్మ మాదిరిగా వేషధారణ.. అక్కడక్కడ శవపేటికలు.. దెయ్యాల కొంపల్లా భవనాల అలంకరణ.. పుర్రెలతో డెకరేషన్.. మసక మసక చీకటితో కూడిన లైటింగ్.. ఐఐటీ భువనేశ్వర్‌లో ఏటా అక్టోబర్ చివరలో నిర్వహించే హాలోవీన్ నైట్ కార్యక్రమం దృశ్యాలివి. విద్యార్థులను తీవ్రమైన మానసిక ఒత్తిడి నుంచి బయటపడేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంస్థలో నవంబర్ మూడో వారం నుంచి సెమిస్టర్ పరీక్షలు మొదలవుతాయి. ఈ పరీక్షల కోసం విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడుతుంటారు. పుస్తకాలతో కుస్తీలు పడుతుంటారు. ల్యాప్‌టాప్‌లలో మునిగిపోతారు. ఈ క్రమంలో అనేక మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. కొందరైతే డిప్రెషన్‌లోకి వెళ్లిపోతుంటారు. ప్రధానంగా మొదటి సంవత్సరం విద్యార్థుల్లో ఈ భయం ఎక్కువగా ఉంటుంది. దీన్ని అధిగమించేందుకు ఈ ఉన్నత విద్యా సంస్థ ఏటా ఇలా హాలోవీన్ నైట్ (పిశాచాల రాత్రి) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటుంది. విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచేందుకు ఇందులో సీఎస్‌టీ (కౌన్సెలింగ్ సర్వీస్ టీం) అనే ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. ఇందులో విద్యార్థులతో పాటు పాఠాలు బోధించే ప్రొఫెసర్లు, వ్యక్తిత్వ వికాస నిపుణులు కూడా ఉంటారు.

ఐఐటీహెచ్‌లో మెంటల్ హెల్త్ మంత్

రాళ్లపై బొమ్మలు (స్టోన్ పెయింటింగ్).. మట్టితో వివిధ ఆకృతులు (క్లే థెరపీ).. ఇవన్నీ చూస్తుంటే ఏదో ప్లే స్కూల్‌లో చిన్నారులు చదువుకునే విధానంలా ఉంది కదా? కానీ, టెక్నాలజీ పరంగా దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థల్లో ఒకటైన హైదరాబాద్ ఐఐటీలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు అవలంభిస్తున్న మార్గాలివి. సన్‌షైన్ పేరుతో పనిచేస్తున్న ప్రత్యేక విభాగం ఏటా అక్టోబర్‌లో మెంటల్ హెల్త్ మంత్ నిర్వహిస్తోంది. విద్యార్థులు చదువుల ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మ్యూజిక్ ఆర్ట్ థెరపీ, ఎమోస్నాప్.. హీల్ అవుట్ లౌడ్.. ఇలా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. ఈ సన్‌షైన్ విభాగంలో స్టూడెంట్ బడ్డీ, మెంటార్స్, కౌన్సిలర్లు, మానసిక వ్యక్తిత్వ నిపుణులు భాగస్వాములుగా ఉంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ యాప్‌నే అభివృద్ధి చేశారు. చాట్‌బాట్ రూపంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఒత్తిడిని జయించే మార్గాలను సలహాలను సూచనలు పొందేలా ఏర్పాట్లు చేశారు.



ఐఐటీహెచ్‌లో తొలి నేషనల్ వెల్‌బీయింగ్ కాంక్లేవ్

హైదరాబాద్ ఐఐటీ వేదికగా తొలి నేషనల్ వెల్ బీయింగ్ కాంక్లేవ్ శనివారం ప్రారంభమైంది. దేశంలోని అన్ని ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిబుల్ ఐటీలు, ఇతర ప్రతిష్టాత్మక ఉన్నత విద్యా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రొఫెసర్లు ఈ సదస్సుకు హాజరయ్యారు. విద్యార్థులు ఒత్తిడిని జయించేందుకు ఆయా విద్యా సంస్థలు అవలంభిస్తున్న మార్గాలను వివరించేందుకు ప్రత్యేకంగా స్టాల్‌లను ప్రదర్శించారు.

ఒత్తిడిని జయించేందుకు ఎంతో ఉపయోగం



విద్యార్థులు మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే ఆ విద్యార్థితో స్టూడెంట్ గైడ్ మాట్లాడుతారు. అవసరం మేరకు ఆ విద్యార్థి పరిస్థితిని వ్యక్తిత్వ వికాస నిపుణుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను అధిగమించేలా చేస్తున్నాము. ఇందుకోసం సీఎస్‌టీ (కౌన్సిలింగ్ సర్వీస్ టీం) పనిచేస్తోంది.

– శ్రావ్య, బీటెక్ మెటలర్జీ, ఐఐటీ భువనేశ్వర్

విద్యార్థులకు అండగా సన్‌షైన్



ఐఐటీహెచ్‌లో సన్‌షైన్ అనే ప్రత్యేక విభాగం విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పనిచేస్తుంది. ఆర్ట్ థెరపీ, హ్యాపినెస్ కార్నివాల్, ఎమోస్నాప్, హీల్ అవుట్‌లౌడ్ వంటి కార్యక్రమాలు నిర్వహి స్తున్నాము. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసి కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి.

– కాంచనపల్లి శ్రీవర్షిణి, బీటెక్, సివిల్, ఐఐటీహెచ్

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి

- విద్యా సంస్థలు తమ విధానాలను ఇచ్చిపుచ్చుకోవాలి
- కేంద్ర ఉన్నత విద్యా విభాగం కార్యదర్శి సంజయ్‌మూర్తి
- జీవితంలో వైఫల్యాలు అంతర్భాగం అని తల్లిదండ్రులు చెప్పాలి
- ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి
- తొలి 'వెల్ బీయింగ్ సదస్సు'ప్రారంభం



సదస్సులో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, కేంద్ర కార్యదర్శి సంజయ్ మూర్తి మాటామంతీ. స్టాళ్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు దేశంలోని ఉన్నత విద్యా సంస్థలు తాము అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను పరస్పరం మార్పిడి చేసుకోవాలని కేంద్ర విద్యాశాఖ పరిధిలోని ఉన్నత విద్యా విభాగం కార్యదర్శి కె.సంజయ్‌మూర్తి పిలుపునిచ్చారు. విధానాల మార్పిడి విద్యా సంస్థలకే పరిమితం కాకుండా ఆయా సంస్థల్లోని వివిధ విభాగాల నడుమ కూడా జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. మార్పిడి చేసుకున్న ఉత్తమ విధానాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల శారీరక, మానసిక పటుత్వం దేశ ఆర్థిక పురోగతికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించటంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఐఐటీ హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరిగే 'తొలి జాతీయ శ్రేయో సదస్సు'ను శనివారం సంజయ్‌మూర్తి ప్రారంభించారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం దేశంలోని అగ్రశ్రేణి విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఇతర జాతీయ విశ్వ విద్యాలయాలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలతో రూపొందించిన 'ఉత్తమ విధానాల సంగ్రహం'పుస్తకాన్ని ఆవిష్కరించారు. అగ్రశ్రేణి విద్యా సంస్థలు అనుసరిస్తున్న విద్యార్థుల శ్రేయో విధానాలను ప్రతిబింబిస్తూ ఏర్పాటుచేసిన స్టాళ్లను ప్రారంభించి సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు.

విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా వర్క్‌షాప్‌లు

విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఏడాదిన్నరగా అనేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాయని సంజయ్‌మూర్తి తెలిపారు. ఐఐటీలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని యూనివర్సిటీలు, విద్యా సంస్థలు ఈ వర్క్‌షాప్‌లలో పాల్గొన్నాయని చెప్పారు. 'గాంధీనగర్ ఐఐటీ ఇటీవల రూపొందించిన కొన్ని మార్గదర్శకాలపై అన్ని విద్యా సంస్థల్లోనూ చర్చ జరగాల్సిన అవసరం ఉంది. వివిధ నేపథ్యాలు భాషలు, అనుభవాల నుంచి ఉన్నత విద్య కోసం చేరుతున్న విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా విద్యా సంస్థలు సన్నద్ధం కావాలి. విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్ల పరిష్కారంలో అధ్యాపకులు, సిబ్బంది సున్నితత్వం, సానుభూతితో వ్యవహరించాలి. సదస్సులో చర్చించే అంశాలను క్రోడీకరించి అమలు చేసేందుకు విధానాలు రూపొందించాలి' అని సంజయ్ మూర్తి సూచించారు.

వైఫల్యాలు జీవితంలో అంతర్భాగం

శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమని, యోగ ద్వారా మానసిక సంతులనంతోపాటు, సవాళ్లను ఎదుర్కొనే తత్వం అలవడుతుందని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. మానసిక సంతులనం కోసం అవసరమైన మార్గాలపై అన్వేషణ కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'ఐఐటీ హైదరాబాద్‌లో 'సన్‌షైన్'సెల్ ద్వారా విద్యార్థుల శ్రేయస్సు కోసం హాజరు, తిండి, నిద్ర వంటి అనేక అంశాల్లో శ్రద్ధ తీసుకుంటున్నాం. విద్యార్థులపై విద్యా సంబంధిత ఒత్తిడిని తగ్గించేందుకు లిబరల్, క్రియేటివ్ ఆర్ట్స్‌లోనూ పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులు సంతోషంగా ఉంటూ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా తీర్చిదిద్దుతున్నాం. వైఫల్యాలు జీవితంలో భాగమనే విషయాన్ని పిల్లల మెదళ్లలో తల్లిదండ్రులు బాల్యం నుంచే చొప్పించాలి. పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో టాపర్స్‌గా ఉన్న విద్యార్థులు ఐఐటీలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించలేక పోతున్నారు. జీవితంలో వైఫల్యం లేదంటే కొత్తగా ఏమీ ప్రయత్నించలేదని, కొత్తగా నేర్చుకోలేదనే అర్థం'అని బీఎస్ మూర్తి అన్నారు. సదస్సులో మొదటిరోజు కేంద్ర ఉన్నత విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి రీనా సోనోవాల్ కౌలి, ఐఐటీ హైదరాబాద్ 'సన్‌షైన్'ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ సోమ్‌నాథ్ మాఝీ, ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర నాగ్‌పాల్ ప్రసంగించారు.

2025లో 27 సాధారణ సెలవులు

- మరో 23 ఐచ్ఛిక సెలవులు
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు ఖరారు
- ఐదు సాధారణ సెలవులు ఆదివారాల్లోనే
- మార్చిలో ఒక్క సాధారణ సెలవూ లేదు
- గరిష్టంగా 5 ఐచ్ఛిక సెలవులు వాడుకొనేందుకు అనుమతి
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వచ్చే సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 27 సాధారణ సెలవులు, 23 ఐచ్ఛిక సెలవులు ఉండనున్నాయి. 2025 సంవత్సరానికి సంబంధించి సాధారణ, ఐచ్ఛిక సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఈ సాధారణ సెలవులు, ఐచ్ఛిక సెలవులను పాటించాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని ఆదివారాలు, అన్ని రెండో శనివారాల్లో ప్రభుత్వ కార్యాలయాలను మూసి ఉంచాలని ఆదేశించారు. నూతన సంవత్సరం సందర్భంగా 2025 జనవరి 1న సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఫిబ్రవరిలోని రెండో శనివారం (ఫిబ్రవరి 8న) రోజును పనిదినంగా పాటించాల్సి ఉంటుందని తెలిపారు. 5 సాధారణ సెలవులు ఆదివారాల్లోనే రానుండగా, మార్చిలో ఒక్క సాధారణ సెలవు కూడా లేకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 23 ఐచ్ఛిక సెలవుల్లో గరిష్టంగా 5 సెలవులను మాత్రమే వినియోగించాలని సూచించారు. తమ ఇష్టానుసారం మతాలతో సంబంధం లేకుండా ఏదైనా పండుగకి సంబంధించిన ఐచ్ఛిక సెలవును ఉద్యోగులు వాడుకోవచ్చు అని ఉత్తర్వుల్లో తెలిపారు.

అయితే దీనికోసం పై అధికారికి ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సాధారణ సెలవులు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు, పారిశ్రామిక సంస్థలకు వర్తించవని స్పష్టం చేశారు. తమ ఉద్యోగులకు సెలవులపై సంబంధిత సంస్థలే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తాయని తెలిపారు. నెలవంక ఆధారంగా రంజాన్, బక్రీద్, మొహర్రం, మిలాద్ ఉన్ నబీ పర్వదినాల సెలవులను తర్వాత మార్చుతామని తెలియజేశారు.

క్రసం	సందర్భం	తేదీ	వారం
1	కొత్త సంవత్సరం	01-01-2025	బుధవారం
2	భోగి	13-01-2025	సోమవారం
3	సంక్రాంతి	14-01-2025	మంగళవారం
4	గణతంత్ర దినోత్సవం	26-01-2025	ఆదివారం
5	మహాశివరాత్రి	26-02-2025	బుధవారం
6	హోళి	14-03-2025	శుక్రవారం
7	ఉగాది	30-03-2025	ఆదివారం
8	రంజాన్	31-03-2025	సోమవారం
9	రంజాన్ తర్వాతి రోజు	01-04-2025	మంగళవారం
10	జగ్జీవన్‌రామ్ జయంతి	05-04-2025	శనివారం
11	శ్రీరామనవమి	06-04-2025	ఆదివారం
12	అంబేద్కర్ జయంతి	14-04-2025	సోమవారం
13	గుడ్ ఫ్రైడే	18-04-2025	శుక్రవారం
14	బక్రీద్	07-06-2025	శనివారం
15	షహదత్ ఇమామ్-ఏ-హుస్సేన్ (10వ మొహర్రం)	06-07-2025	ఆదివారం
16	బోనాలు	21-07-2025	సోమవారం
17	స్వాతంత్ర్య దినోత్సవం	15-08-2025	శుక్రవారం
18	శ్రీకృష్ణాష్టమి	16-08-2025	శనివారం
19	వినాయక చవతి	27-08-2025	బుధవారం
20	ఈద్ మిలాద్-ఉన్-నబీ	05-09-2025	శుక్రవారం
21	బతుకమ్మ ప్రారంభం	21-09-2025	ఆదివారం
22	గాంధీ జయంతి విజయదశమి	02-10-2025	గురువారం
23	విజయదశమి తర్వాతి రోజు	03-10-2025	శుక్రవారం
24	దీపావళి	20-10-2025	సోమవారం
25	కార్తీక పౌర్ణమి గురునానక్ జయంతి	05-11-2025	బుధవారం
26	క్రిస్మస్	25-12-2025	గురువారం
27	క్రిస్మస్ తర్వాతి రోజు (బాక్సింగ్ డే)	26-12-2025	శుక్రవారం

2025లో ఐచ్ఛిక సెలవులు.. సాక్షి ప్లస్‌లో..

డిప్యూటీ రిజిస్ట్రార్ నివేదిక సస్పెన్షన్

'జూబ్లీహిల్స్'కేసు విచారణలో హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ గత పాలకమండలి నుంచి రూ.17,16,67,739తో పాటు రూ.23,42,473 వసూలు చేయాలని డిప్యూటీ రిజిస్ట్రార్ ఇచ్చిన విచారణ నివేదికను హైకోర్టు సస్పెన్షన్‌లో ఉంచుతూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. డిప్యూటీ రిజిస్ట్రార్ నివేదికను సవాల్ చేస్తూ న్యాయవాది రమేశ్ చౌదరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ నివేదిక ఆధారంగా సహకార కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ తమకు జారీ చేసిన ఆదేశాలు చెల్లవని, ఆ నివేదికను కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2022, మార్చి 23న విచారణాధికారిని నియమించారన్నారు. ఆ తర్వాత విచారణ పూర్తి చేయడానికి 2022, నవంబర్ 19 వరకు గడువు పొడించారని చెప్పారు. అయితే సహకార చట్టం సెక్షన్ 51 ప్రకారం విచారణను పూర్తి చేయడానికి గరిష్ఠ గడువు నాలుగు నెలలు మాత్రమేనని.. అంతకు మించి మరో రెండు నెలలు మాత్రమే పొడించే అధికారం రిజిస్ట్రార్‌కు ఉంటుందని పేర్కొన్నారు. అయితే చట్టాన్ని ఉల్లంఘిస్తూ విచారణ గడువును మరింత పొడిగించారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది లిఖిత పూర్వక సూచనల కాపీని అందజేశారు. అందులో విచారణ నివేదిక ఎప్పుడు అందజేశారో తేదీ లేకపోవడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. 2022, నవంబర్ 18న నివేదిక సమర్పించినట్లు జీపీ ఎలాంటి సాక్ష్యం కోర్టుకు అందజేయలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. చట్టప్రకారం విచారణ జరపలేదని అభిప్రాయపడిన న్యాయమూర్తి.. నివేదికను సస్పెన్షన్‌లో ఉంచుతూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

'అమోయ్' కేసుల పునఃపరిశీలన!

- భూవివాదాల ఫిర్యాదులను మళ్లీ పరిశీలించాలని పోలీసుశాఖ నిర్ణయం
- తగిన చర్యలు తీసుకోవాలని రాచకొండ సీపీకి డీజీపీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ అధికారి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్‌పై భూ కుంభకోణాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను పునఃపరిశీలించాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇప్పటివరకుఅందిన ఫిర్యాదులు సివిల్ స్వభావానికి కావడంతో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్న పోలీసులు వాటిని మళ్లీ సమీక్షిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూముల కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే అమోయ్‌కుమార్‌ను ఈడీ అధికారులు గత నెలలో 3 రోజులపాటు ప్రశ్నించడం తెలిసిందే. కేసు దర్యాప్తులో భాగంగా మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి, మాజీ ఆర్డీఓ వెంకటాచారి స్టేట్‌మెంట్లను ఈడీ అధికారులు నమోదు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో మహేశ్వరం పోలీసులు నమోదు చేసిన కేసును పునఃపరిశీలించడంతోపాటు అమోయ్‌కుమార్ పాత్రపైనా కూలంకషంగా దర్యాప్తు చేయించేలా స్థానిక పోలీసులను ఆదేశించాలని ఈడీ అధికారులు డీజీపీ జితేందర్‌ను శుక్రవారం కలిసి కోరారు. దీనిపై స్పందించిన డీజీపీ.. తగిన చర్యలు తీసుకోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబును ఆదేశించారు. దీంతో స్థానిక పోలీసులు సైతం ఈ కేసులపై దృష్టిపెట్టారు. గతంలో నమోదైన కేసు వివరాలు ఉన్నతాధికారులు సేకరించారు. వాటిని విశ్లేషించి అందులోని వాస్తవాల ఆధారంగా మళ్లీ కేసులు నమోదు చేయనున్నారు. అదేవిధంగా మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసేందుకు స్థానిక పోలీసుల సహకారం కావాలని ఈడీ అధికారులు డీజీపీని కోరడంతో అవసరమైన అంశాల్లో ఈడీకి సహకారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శంకరాహి ల్స్ సొసైటీ, బాలసాయిబాబా ట్రస్ట్ భూములు, రాయదుర్గంలోని కొన్ని భూముల అంశాలపై వచ్చిన ఫిర్యాదులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఐఎస్ఎస్‌కు డ్రాగన్ 'రీబూస్ట్'

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కక్ష్య పరిధిని పెంచే (రీబూస్ట్) కార్యక్రమాన్ని స్పేస్ ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌక శుక్రవారం విజయవంతంగా ముగించింది. ఫలితంగా ఐఎస్ఎస్ శనివారం మామూలు కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించింది. దాంతో ఐఎస్ఎస్ రీబూస్టింగ్ కోసం రష్యాపై ఆధారపడాల్సిన అవసరం కూడా నాసాకు తప్పినట్టయింది. ఇప్పటిదాకా రష్యాకు చెందిన సూయజ్ వ్యోమనౌకే ఐఎస్ఎస్‌ను రీబూస్ట్ చేస్తూ వచ్చింది. 2030 నాటికి ఐఎస్ఎస్ శాశ్వతంగా విధుల నుంచి తప్పుకోనుంది. అప్పటికల్లా అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ అవసరాలను తీర్చేందుకు ప్రైవేట్ సంస్థలకు చెందిన వసతులు అందుబాటులోకి రానున్నాయి. అనంతరం దాన్ని సురక్షితంగా పసిఫిక్ మహాసముద్రంలో కూల్చేస్తారు. ఈ ప్రాజెక్టును కూడా స్పేస్ ఎక్స్‌కే నాసా అప్పగించింది. ఐఎస్ఎస్ భూమికి 400 కి.మీ. ఎగువన భూ దిగువ కక్ష్యలో పరిభ్రమిస్తుంటుంది. సమయం గడుస్తున్న కొద్దీ అది కాస్త దిగువకు పడిపోతూ ఉంటుంది. దాంతో అప్పుడప్పుడు రీ బూస్ట్ ప్రక్రియ ద్వారా దాని కక్ష్యను పెంచుతుంటారు. – సాక్షి, నేషనల్ డెస్క్



శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

సప్తవర్ణ శోభితం శ్రీవారి పుష్పయాగం

తిరుమల: పవిత్రమైన కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. సువాసనలు వెదజల్లే 17 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, పత్రాల మధ్య స్వామి, అమ్మవార్ల వైభవం మరింత ఇనుమడించింది. వేదపండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను పఠించారు. తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

పుష్పాధిదేవుడు "పుల్లుడు"ఆవాహన: పుష్పాలకు అధిపతి అయిన దేవుడు పుల్లుడిని ఆవాహన చేసి 20 సార్లు వివిధ రకాల పుష్పాలతో అర్చించారు. ఉత్సవమూర్తుల నిలువెత్తు వరకు ఉండేలా పుష్ప నివేదన చేపట్టారు. పుష్పయాగానికి మొత్తం 9 టన్నుల పుష్పాలు, పత్రాలను దాతలు అందించారు.

'సింగరేణి ప్రతిష్టను మరింత పెంచాలి'

సాక్షి, హైదరాబాద్: సింగరేణి ప్రతిష్టను మరింత పెంచాలని ఏస్సీపీ–ఏస్పీ అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన సింగరేణి సంస్థ సీఎండీ బలరాంను శనివారం కలిశారు. కార్మికుల సంక్షేమం, సింగరేణి ప్రాంత యువత అభివృద్ధి కోసం నూతన ఆవిష్కరణలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సివిల్స్ మెయిన్స్ అభ్యర్థులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించడం హర్షణీయమన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం | 10-11-2024

అందరి బంధువయా... 'వల్లభి' రామయ్య!



పునర్నిర్మాణం చేపట్టాక దేవాలయం

గుండెల్లో పెట్టుకున్న దళిత కుటుంబం ● వల్లభి రామాలయంలో 90 ఏళ్లుగా దళితులే పూజారులు
ధూప, దీప నైవేద్యాలతో శ్రీరామచంద్రుడికి నిత్యపూజలు ● కులమతాలకతీతంగా దర్శనానికి భక్తుల రాక

ముదిగొండ: సామాజిక కట్టుబాట్లు కఠినంగా ఉన్న రోజుల్లో దళితులకు ఆలయ ప్రవేశం ఉండేది కాదు. కుల వివక్షత అడుగడుగునా తాండవించేది. అలాంటి రోజుల్లో దళితులు దేవుడిని తమ గుండెల్లో పెట్టుకుని రామాలయం నిర్మాణం చేపట్టారు. ఆ ఆలయానికి 90 ఏళ్ల నుంచి వారసత్వంగా ఇప్పటికీ దళితుడే పూజారిగా కొనసాగుతుండటం విశేషం. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామంలో ఉన్న ఈ ఆలయంలో శ్రీ రామచంద్రస్వామికి నిత్య పూజలు జరుగుతుండగా.. కులమతాలకతీకంగా అంతా దర్శించుకుని తరిస్తున్నారు.

ఆ అవమాన భారంతోనే..

ఏళ్ల క్రితం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు జరుగుతుండగా కొందరు దళితులు గోడ పైనుంచి చూస్తుండగా అగ్రకుల పెద్దలు అవమానించారు. దీన్ని ఆత్మగౌరవ సమస్యగా భావించిన దళితులు రామాలయం నిర్మాణానికి ప్రతిన బూనారు. స్థల సేకరణ, ఆపై దేవాలయ నిర్మాణం చకచకా జరగగా.. దళితవాడలో సద్గురు బోధనానంద బోధనల ప్రభావంతో ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్న వంగూరి రామస్వామి తొలినాళ్లలో పూజారిగా బాధ్యతలు స్వీకరించారు. మొదట రాములవారి చిత్ర పటంతో నిత్యం పూజలు చేసేవారు. చిన్నగా నిర్మించిన ఆలయంలో పూజలు చేస్తున్న దళితులను అగ్రకులాల వారు హేళన చేసేవారు. దీంతో అగ్రకులాలు – దళితుల నడుమ వివాదం రాజుకుంది. అప్పటికే రామాలయ నిర్మాణం పేరుతో ఆత్మగౌరవ జెండాను ఎగురవేసిన దళితులు అగ్రకులాలపై సై అంటే సై అన్నారు. దీన్ని తట్టుకోలేక అగ్రకులాల వారు దాడులకు పాల్పడటంతో పలువురు గ్రామాన్ని వదిలిపెట్టాల్సి వచ్చింది. ఈ విషయం తెలిసిన గాంధేయవాది బన్సాలీ వల్లభి గ్రామానికి చేరుకుని దళితులు నిర్మించిన రామాలయంలోనే దీక్షకు పూనుకున్నారు. ఈ వార్త



వల్లభిలో దళితుల ఆధ్వర్యాన తొలినాళ్లలో నిర్మించిన రామాలయం (ఫైల్)

బాహ్య ప్రపంచానికి తెలియడంతో ఆనాటి ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకోగా ఇరువర్గాల మధ్య రాజీ అనంతరం బన్సాలీ దీక్ష విరమించారు.

భారమైనా బాధ్యతగా..

దళితులు రెక్కలు ముక్కలు చేసుకుని పొద్దస్తమానం కష్టపడితే కుటుంబాలను పోషించుకోవడమే కష్టం. అయినప్పటికీ కుటుంబ బాగోగుల కంటే మిన్నగా రాముడి కోసం, రాముడే శ్వాసగా వంగూరి రామస్వామి కుటుంబం జీవిస్తోంది. ఎంత కష్టమైనా.. తాము తిన్నా తినకపోయినా రామయ్యకు నిత్యపూజలు చేయడం, నైవేద్యం సమర్పించడాన్ని ఆనవాయితీగా మార్చుకున్నారు. ఓ రకంగా చెప్పాలంటే కుటుంబ పోషణ మాటేమో కానీ.. వీరే కుటుంబానికి భారంగా మారినా రాముడి సేవలోనే జీవిస్తున్నారని చెప్పాలి.

వైఎస్సార్ హయాంలో ధూపదీప నైవేద్యం

ఆలయంలో ఏటా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించేవారు. వంగూరి రామస్వామి నిత్యం ధూప, దీప నైవేద్యాలు సమర్పిస్తూనే పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేవారు. వంగూరి రామస్వామి మరణానంతరం 1988లో ఆయన కుమారుడు చిన ముత్తయ్య పూజారిగా బాధ్యతలు స్వీకరించారు. 2021 వరకు ఆయన కొనసాగగా అనారోగ్య కారణాలతో చిన ముత్తయ్య మరణించాక ఆయన మనవడు అనంతరాములు పూజారిగా బాధ్యతలు స్వీకరించి ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఈ క్రమాన అనంతరాములు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన అర్చకత్వం, పౌరోహిత్యంలో శిక్షణ పొందడం విశేషం. కాగా, ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉన్న సమయంలో పలు ఆలయాల నిర్వహణ, అర్చకుల భృతి కోసం ధూప, దీప నైవేద్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో వల్లభి ఆలయానికి కూడా చోటు దక్కగా నెలనెలా నిధులు అందుతున్నాయి.

రూ.40 లక్షలతో పునర్నిర్మాణం..

తొలినాళ్లలో నిర్మించిన ఆలయం పాతబడటంతో రూ.40 లక్షలతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయంలో 2023 మార్చి 17న ధ్వజ స్తంభ, విగ్రహ ప్రతిష్టాపనతో పాటు రాజగోపురం, కల్యాణమండపం, శిఖర ప్రతిష్టాపన భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి చేతుల మీదుగా జరిగింది.

దళిత పూజారి ద్వారా దగ్గరైన దేవుడు



నా వయస్సు 80 ఏళ్లు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఆలయం ఉంది. అప్పట్లో గానుగ సున్నంతో నిర్మించగా రాములవారి పటంతో శ్రీరామనవమి వేడుకలు వంగూరి చిన ముత్తయ్య జరిపించేవారు. ఇప్పుడు కులమత భేదం లేకుండా అంతా ఆలయానికి వస్తున్నారు. నూతన గుడి నిర్మించాక అభివృద్ధి చెందింది. దళిత పూజారి ద్వారా శ్రీరాముడు మాకు దగ్గరయ్యాడు.

– సామల వీరన్న, వల్లభి గ్రామవాసి

వారసత్వంగా పూజలు...



తాతముత్తాతల నుంచి ఆనవాయితీగా వస్తుండటంతో పాటు టీటీడీలో వేదమంత్రాలు, పూజల్లో శిక్షణ తీసుకున్నాను. ఆలయంలో పూజలు చేస్తూనే సత్యనారాయణస్వామి వ్రతాలు, గృహప్రవేశాలు నిర్వహిస్తుంటా. సీఎంగా వైఎస్సార్ ఉన్నప్పుడు ప్రకటించిన ధూపదీప నైవేద్యం పథకం ద్వారా వచ్చే నిధులతో పాటు గ్రామస్తులు ఇచ్చే విరాళాలు ఆలయ అభివృద్ధికి ఉపయోగపడుతున్నాయి.

– వంగూరి అనంతరాములు, ప్రస్తుత పూజారి




పూజలు నిర్వహిస్తున్న దళిత పూజారి వంగూరి అనంతరాములు



వల్లభి గ్రామ వ్యూ



వంగూరి రామస్వామి, మొదటి పూజారి



వంగూరి చిన ముత్తయ్య, రామస్వామి కుమారుడు

తెలంగాణలో వచ్చే ఏడాది ఐచ్ఛిక సెలవులు

క్రసం	సందర్భం	తేదీ	వారం
1	హజ్రత్ అలీ పుట్టిన రోజు	14-01-2025	మంగళవారం
2	కనుము	15-01-2025	బుధవారం
3	షబ్-ఏ-మేరాజ్	28-01-2025	మంగళవారం
4	శ్రీపంచమి	03-02-2025	సోమవారం
5	షబ్-ఏ-బరాత్	14-02-2025	శుక్రవారం
6	షహదత్ హజ్రత్ అలీ	21-03-2025	శుక్రవారం
7	జుమాతుల్ విదా షబే ఖదర్	28-03-2025	శుక్రవారం
8	మహావీర్ జయంతి	10-04-2025	గురువారం
9	తమిళ కొత్త సంవత్సరం	14-04-2025	సోమవారం
10	బసవ జయంతి	30-04-2025	బుధవారం
11	బుద్ధ పూర్ణిమ	12-05-2025	సోమవారం
12	ఈద్-ఏ- ఘదీర్	15-06-2025	ఆదివారం
13	రథయాత్ర	27-06-2025	శుక్రవారం
14	9వ మొహర్రం	05-07-2025	శనివారం
15	వరలక్ష్మి వ్రతం	08-08-2025	శుక్రవారం
16	శ్రావణ పౌర్ణిమ రాఖీ పౌర్ణమి	09-08-2025	శనివారం
17	పార్సీ కొత్త సంవత్సరం అర్బాయిన్	15-08-2025	శుక్రవారం
18	దుర్గాష్టమి	30-09-2025	మంగళవారం
19	మహర్ణవమి	01-10-2025	బుధవారం
20	యాజ్ దహుమ్ షరీఫ్	04-10-2025	ఆదివారం
21	నరక చతుర్ది	19-10-2025	బుధవారం
22	హజ్రత్ సయ్యద్ మొహమ్మద్ జువాన్‌పురి మెహదీ జన్మదినం	16-11-2025	ఆదివారం
23	క్రిస్మస్ ఈవ్	24-12-2025	బుధవారం





రాజ్‌భవన్‌లో ఉత్తరాఖండ్ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: రాజ్‌భవన్‌లో శనివారం ఉత్తరాఖండ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఉత్తరాఖండ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలుగు భాష ఎంపిక సమర్థనీయమే: హైకోర్టు

జడ్జి నియామకంలో ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టలేం

సాక్షి, హైదరాబాద్: సివిల్ జడ్జిల నియామకంలో తెలుగు భాష ప్రావీణ్యం ఉండాలన్న నిబంధన సమర్థనీయమే అని హైకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి ఉద్యోగి కావాలో ఆ మేరకు నియమించుకునే అధికారం యజమాని (సర్కార్)కి ఉంటుందని అభిప్రాయపడింది. పరిపాలనలో భాగంగా మెరుగైన ఎంపిక కోసం అటువంటి షరతును విధించడం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞతతో కూడుకున్నదని వ్యాఖ్యానించింది. తెలుగు భాషకు ప్రత్యామ్నాయంగా ఉర్దూ భాషకు అవకాశం ఇవ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. జీవో 36 ద్వారా అమల్లోకి తీసుకొచ్చిన తెలంగాణ రాష్ట్ర న్యాయ (సేవా మరియు కేడర్) నిబంధనలు 2023లోని 5.3, 7ఐ నిబంధనలను సవాల్ చేస్తూ హైకోర్టులో మొహమ్మద్ షుజాత్ హుస్సేన్ పిటిషన్ దాఖలు చేశారు. సివిల్ జడ్జి పోస్టులకు తెలుగు భాషలోనూ ప్రావీణ్యం కలిగి ఉండాలన్నది ఈ నిబంధన సారాంశం. తెలుగు భాష స్థానంలో ఉర్దూను కూడా



చేర్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. జ్యుడీషియల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ తరఫు సీనియర్ న్యాయవాది హరేందర్ పర్షద్ వాదనలు వినిపిస్తూ.. ‘పిటిషన్ సమర్థనీయం కాదు. రాష్ట్ర జనాభాలోని 77 శాతం మంది మొదటి భాష తెలుగు. రాష్ట్రంలో ఎక్కువగా ఉపయోగించే భాష తెలుగని.. సివిల్ జడ్జిలు ఆ భాషలో ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించాల్సిన అవసరం ఉంటుంది. న్యాయ ప్రక్రియలో తెలుగు వినియోగానికి ప్రాధాన్యత ఇస్తేనే.. సరైన పరిపాలన, న్యాయాన్ని అందించినట్లవుతుంది. ఈ కోణంలోనే తెలుగులో ప్రావీణ్యం అవసరం అనే నిబంధనను ప్రభుత్వం తీసుకుంది. 2007 వరకు తెలుగు పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి’అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీనియర్ న్యాయవాది వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సర్వీస్ రూల్స్‌లో జోక్యం చేసుకోలేమని ఉత్తర్వులు జారీ చేసింది.

ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల హక్కులను కాపాడాలి

బేవరేజెస్ కార్పొరేషన్‌లో పని చేసేవారిని క్రమబద్ధీకరించాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మూడు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల హక్కులను పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానికి ఉందని, వారి హక్కులను తోసిపుచ్చలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఏళ్లుగా పని చేస్తున్నా వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించకపోవడం హక్కులను కాలరాయడం కిందకే వస్తుందని అభిప్రాయపడింది. బేవరేజెస్ కార్పొరేషన్‌లో దాదాపు 30 ఏళ్లుగా పనిచేస్తున్న వారి అర్హత మేరకు క్రమబద్ధీకరించాలని, అలాగే పదవీ విరమణ చేసిన వారికి పింఛన్ కూడా అందజేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బేవరేజెస్ కార్పొరేషన్ 890 సెక్యూరిటీ గార్డు, అటెండర్, స్వీపర్.. తదితర ఉద్యోగాలకు 1986లో నోటిఫికేషన్ ఇచ్చింది. తర్వాత కాలంలో బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి వచ్చిన 595 మంది జాబితాను పరిశీలించిన ఎక్సైజ్ శాఖ.. 1994లో 200 మంది ఉద్యోగాలను క్రమబద్ధీకరించింది. దీంతో మిగిలిన వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ తాజాగా తీర్పు వెలువరించారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఇంకా ఉద్యోగంలో కొనసాగుతున్న 47 మంది సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.

బండెనక బండి కట్టి..

బండెనక బండి.. పది ఎద్దుల బండ్లు కట్టి.. బ్యాండు మేళా చప్పుళ్లతో పాలపారక కోసం ఊరు శివారులోకి బయల్దేరి వెళ్లారు.. అత్యాధునిక వాహనాలు అందుబాటులో ఉన్నా.. సంప్రదాయాలకే పెద్దపీట వేసిందొక కుటుంబం. పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామానికి చెందిన దాడి సత్తమ్మ– రాజయ్య యాదవ్ దంపతుల కుమారుడు బాలాజీ యాదవ్‌కు అనూషతో ఆదివారం వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలోనే శనివారం పాలపారక కోసం ఎద్దుల బండ్లు వరుసగా వెళ్లడం కనువిందు చేసింది. – పెద్దపల్లి రూరల్



ఎద్దుల బండ్ల ఎదుట బ్యాండ్ మేళా



అప్పన్నపేటలో పాలపారక కోసం ఎడ్లబండ్లతో బయలు దేరుతున్న కుటుంబ సభ్యులు

రాష్ట్రంలో తాలిబన్ల తరహా పాలన

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బీచ్‌రోడ్డు(విశాఖ): రాష్ట్రంలో చాలా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై కేసులు పెడుతుండటంపై ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి మండిపడ్డారు. తాజా పరిస్థితులను చూస్తుంటే రాష్ట్రంలో తాలిబన్ల తరహా పాలన సాగుతుందనడంలో ఎటువంటి అనుమానం అవసరం లేదన్నారు. విశాఖలో శనివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా యాక్టివిస్టలను అరెస్టు చేస్తున్న విధానం చూస్తుంటే అసలు ఆంధ్రలో ఉన్నామా.. అఫ్ఘనిస్తాన్ లో ఉన్నామా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుధారాణి అనే సామాన్య సోషల్ మీడియా కార్యకర్తను తెలంగాణలో అరెస్ట్ చేసి చిలకలూరిపేటకు తెచ్చి ఐదు రోజుల పాటు నిర్బంధించి వేధించి, బాధించడం పాలకుల క్రూరత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆమెపై పోలీసులు చేయి చేసుకోవడంతో ఒంటి మీద గాయాలను జడ్జికి చూపారంటే పరిస్థితులు ఎంత దిగజారిపోయాయో అర్థం చేసుకోవచ్చన్నారు. తుళ్లూరు మండలంలో తురక శ్రీను అనే వ్యక్తి ఏడాదిన్నర క్రితం చనిపోయినా నోటీసులు పంపి కేసులు పెట్టారంటే ప్రభుత్వ పైశాచికత్వం ఏస్థాయికి చేరిందో తెలుస్తోందని ధ్వజమెత్తారు. కూటమి పాలనలో ఆడపిల్లల మానప్రాణాల రక్షణలో వైఫల్యంతో ప్రజలకు సమాధానం చెప్పలేక డైవర్షన్ చేసేందుకే సోషల్ మీడియా యాక్టివిస్టలను అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు.

దొంగనోట్లు మారుస్తూ పట్టుబడిన తండ్రీ కూతురు

పుత్తూరు: తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో శనివారం సాయంత్రం 7గంటల సమయంలో రూ.500 నోట్లను మారుస్తున్న తండ్రీ కూతురు పట్టుబడ్డారు. పట్టణంలోని తిరుపతి రోడ్డు, మండీ స్ట్రీట్‌లోని ప్రొవిజన్ షాపుల్లో వస్తువులు కొనుగోలు చేస్తూ రూ.500 నోట్ ఇచ్చి చిల్లర తీసుకున్నారు. తర్వాత మళ్లీ ప్రతి షాపు వద్ద రెండేసి రూ.500 నోట్లు ఇచ్చి చిల్లర కావాలంటూ అడుగుతుండడంతో షాపు యజమానులకు అనుమానం కలిగింది. వెంటనే వారిచ్చిన నోట్లను మిషన్ ద్వారా చెక్ చేయడంతో అవి దొంగనోట్లుగా తేలింది. వెంటనే షాపు యజమానులు వారిని పూల మార్కెట్ వద్ద పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా వీరు తిరుచానూరుకు చెందిన వారుగా తెలిసింది.

ఆమెకు టెర్రర్!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హత్యాచార ఘటనలు మహిళలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా బతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాల నుంచి తూర్పు గోదావరి జిల్లాకు వలస వచ్చిన మహిళా కూలీలు ఈ వరుస ఘటనలతో హడలెత్తుతున్నారు. ప్రధానంగా కడియం పరిసర మండలాల్లోని నర్సరీల్లో రోజువారీ పనులకు ఒకరిద్దరుగా వెళ్లడానికి వలస మహిళా కూలీలు జంకుతున్నారు. గత నెల 15న నర్సరీలో పనికి వెళ్లిన 43 ఏళ్ల కస్తూరి సామూహిక లైంగిక దాడికి, హత్యకు గురవడమే దీనికి కారణం. ఈ పరిస్థితులు నర్సరీ రైతులకు ఇబ్బందికరంగా మారాయి. మరోవైపు నర్సరీల్లో మొక్కల ఉత్పత్తిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోంది.

- హత్యాచార ఘటనతో వలస కూలీల్లో భయాందోళన
- నర్సరీల్లో పనికి వెనుకంజ
- మొక్కల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం
- కడియం నర్సరీ రైతులకు ఇబ్బందులు

కడియం: తూర్పు గోదావరి జిల్లా కడియం, రాజమహేంద్రవరం రూరల్‌తో పాటు కోనసీమ జిల్లా కొత్తపేట, ఆలమూరు, మండపేట రూరల్ తదితర ప్రాంతాల్లో నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో 1,500 రిజిస్టర్డ్, రిజిస్టర్ కానివి మరో 500 పైగా కలిపి మొత్తం రెండు వేలకు పైగా నర్సరీలు ఉన్నాయి. వీటికి దేశవ్యాప్తంగానే ప్రత్యేక గుర్తింపు ఉంది. రూ.5 నుంచి రూ.50 లక్షల వరకూ విలువ చేసే మొక్కలను ఇక్కడి రైతులు స్వీయ ప్రతిభతో ఉత్పత్తి చేస్తూంటారు. నాణ్యమైన మొక్కలు సరసమైన ధరలకు లభిస్తూండటంతో ఇక్కడి మొక్కల వ్యాపారం దేశం నలుమూలలా విస్తరించింది.

వేలాది మందికి ఉపాధి

ఇక్కడి నర్సరీలపై ఆధారపడి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. మొక్కల సాగు, రవాణా తదితర పనుల్లో వీరి పాత్ర అత్యంత కీలకం. నర్సరీలతో పాటు, పూలతోటలు, గోదావరి లంక ప్రాంతాల్లో కూరగాయల సాగులో కూడా వలస కూలీల పాత్ర ఎక్కువే. సుమారు వందేళ్ల చరిత్ర ఉన్న కడియం నర్సరీ రంగానికి శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి వలస వచ్చిన దాదాపు 25 వేల మంది కూలీలు వెన్నెముకగా ఉన్నారు. వారు తమ కుటుంబాలతో వచ్చి ఇక్కడ స్థిరపడి, నర్సరీల్లో ఉపాధి పొందుతున్నారు. వీరిలో 12 వేల మందికి పైగా మహిళా కూలీలే కావడం విశేషం. చేసే పనిని బట్టి రోజు కూలీగా, కాంట్రాక్టు విధానంలో వీరికి రైతులు చెల్లింపులు చేస్తారు. మహిళలకు రోజుకు రూ.350 నుంచి రూ.400 వరకూ చెల్లిస్తారు. ప్యాకెట్లు పెట్టడం, వాటిని సర్దడం, మొక్కల పెంపకం, కలుపుతీతలు, ఎరువులు వేయడం, మందుల పిచికారీ, నీరు పెట్టడం, ఎగుమతులు, దిగుమతులు తదితర విభాగాల్లో మహిళా కూలీలు పని చేస్తూంటారు. ప్యాకెట్లను బట్టి కూలి ఉంటుంది. ఒక్కోసారి రోజుకు సగటున ఒక్కొక్కరికి రూ.600 నుంచి రూ.800 వరకూ కూడా గిట్టుబాటు అవుతూంటుంది.

చిన్న కమతాలే అధికం

స్థానిక నర్సరీల్లో 85 శాతం పైగా అరెకరం నుంచి రెండెకరాల విస్తీర్ణం ఉన్న చిన్న కమతాలే ఉన్నాయి. ఈ రైతులు ఒకరిద్దరు మహిళలను పనిలో పెట్టుకుని, తాము కూడా పని చేస్తూ మొక్కలు ఉత్పత్తి చేస్తారు. ఇద్దరు మనుషులు నాలుగైదు రోజులు పని చేస్తే మొక్కల సాగులో ఒక దశ పని పూర్తవుతుంది. మళ్లీ కొన్ని రోజులకు పనిలోకి పిలుస్తూంటారు. కానీ అక్టోబర్ హత్యాచార ఘటన తరువాత ఒకే రోజు ఐదారుగురు కలసి పనిలోకి వచ్చేందుకు మాత్రమే మొగ్గు చూపుతున్నారు. దీంతో ఒకరిద్దరే అవసరమయ్యే చిన్న కమతాల రైతులకు భారం తప్పడం లేదు.

భయం తొలగించేందుకు చర్యలు

మహిళా కూలీల్లో భయాన్ని తొలగించేందుకు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసులు పలు చర్యలు చేపట్టారు. ఒకరిద్దరుగా పనులకు వెళ్లవద్దని మహిళలకు సూచించారు. అలాగే ప్రతి నర్సరీలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. అతిగా ప్రవర్తించే వ్యక్తుల సమాచారం తమకు ముందుగా ఇస్తే నిఘా ఉంచుతామని భరోసా ఇస్తున్నారు.

మత్తులో జోగుతున్న యువత



నర్సరీల్లో పనులు చేస్తున్న వారిలో అత్యధిక శాతం మందికి మద్యం అలవాటు ఉందని స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు ఇటీవల గంజాయి వినియోగం కూడా పెరిగిందని అంటున్నారు. జన సంచారం లేని ప్రాంతాల్లోనే కాకుండా జనావాసాల మధ్య సైతం గంజాయి తాగుతూ మత్తులో జోగుతున్నారని చెబుతున్నారు.

అక్టోబర్ 15 దుర్ఘటనతో..

కడియం మండలం కడియపులంక పంచాయతీ బుర్రిలంక వద్ద నర్సరీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్న రౌతు కస్తూరిపై గత నెల 15వ తేదీన నలుగురు దుర్మార్గులు మద్యం మత్తులో అత్యంత పాశవికంగా సామూహిక లైంగిక దాడికి పాల్పడి, హత్య చేశారు. ఈ దారుణ ఘటనతో నర్సరీల్లో పనులు చేసుకునేందుకు వచ్చే వలస మహిళలు, వారి కుటుంబాల్లో తీరని భయం అలముకుంది. ఎక్కడెక్కడి నుంచో ఉపాధి పొందేందుకు ఈ ప్రాంతానికి వచ్చినప్పటికీ వారు, స్థానికులతో కలసిమెలసి జీవిస్తున్నారు. తాము వలస వచ్చామన్న విషయాన్ని మరచిపోయి, హాయిగా గడుపుతున్నారు. ఎప్పటి మాదిరిగానే పనికి వెళ్లిన మహిళ పట్ల, తమకు నిత్యం కనిపించే వ్యక్తులే ఇంతటి దారుణానికి ఒడిగట్టడం వారిలో భయాందోళనను నింపింది. ఈ ఘటన నేపథ్యంలో ఇప్పుడు నర్సరీల్లో కూలి పనులకు వెళ్లేందుకు వలస మహిళా కూలీలు జంకుతున్నారు. రైతుల అవసరాన్ని బట్టి గతంలో ఒకరిద్దరుగా కూడా పనులకు వెళ్లేవారు. అటువంటిది ఇప్పుడు పనికి రావడానికి నిరాకరిస్తున్నారు.



ఒకరిద్దరుగా వెళ్లడానికి భయంగా ఉంది

గతంలో మాదిరిగా ఒకరిద్దరుగా పనుల్లోకి వెళ్లడానికి భయపడుతున్నాం. కస్తూరి ఘటన తరువాత ఒకరిద్దరం పనులకు రాలేమని చెప్తున్నాం. రైతులు అర్థం చేసుకుంటున్నారు. అవసరం లేకపోయినా ఎక్కువ మందిని పనిలోకి పిలవడం వారికి ఇబ్బందే. అయినప్పటికీ తప్పడం లేదు.

– జి.నీలవేణి, నర్సరీ కూలీ, కడియపులంక

మహిళా కూలీలు జంకుతున్నారు

కస్తూరి ఘటనకు ముందు ఎంత మంది కావాలంటే అంత మందే కూలీలు పనులకు వచ్చేవారు. కానీ ఇప్పుడు ఒకరిద్దరుగా రావడానికి భయపడుతున్నారు. మేము కూడా ఉంటామన్న భరోసా ఇస్తే తప్ప పనుల్లోకి రావడం లేదు. బాగా తెలిసిన వారే అయినప్పటికీ వారిని భయం వెంటాడుతోంది.

– ఎం.నాగేశ్వరరావు, నర్సరీ రైతు

అవగాహన పెంచుతున్నాం

రౌతు కస్తూరి ఘటన తరువాత నర్సరీల్లో పనులకు వచ్చే మహిళల భద్రతకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను ఇప్పటికే పలు సమావేశాల ద్వారా వివరించాం. నర్సరీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. పనులకు వెళ్లి వచ్చే సమయంలో కూలీలకు సమావేశాలు ఏర్పాటు చేసి, స్వీయ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నాం.

– ఎ.వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్, కడియం



నర్సరీలో మొక్కలు పెడుతున్న మహిళా కూలీలు



రౌతు కస్తూరి ఘటన క్రమం ఇదీ..

అక్టోబర్ 15 : డ్వాక్రా సమావేశం ముగించుకుని బుర్రిలంకలోని ఇంటి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు కాలినడకన కిలోమీటరు దూరంలోని నర్సరీకి పనికి వెళ్ళింది. సాయంత్రానికి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు.

అక్టోబర్ 16 : కస్తూరి భర్త పాపారావు ఫిర్యాదు మేరకు కడియం పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది.

అక్టోబర్ 17: బుర్రిలంకకు 6 కిలోమీటర్ల దూరంలో ఆలమూరు మండలం చొప్పెల్ల లాకుల వద్ద బాగా పాడైపోయిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని గుర్తించారు. శరీరంపై ఉన్న ఆపరేషన్ ఆనవాళ్లు, కాలి పట్టీల ఆధారంగా ఆ మృతదేహం కస్తూరిదేనని కుటుంబ సభ్యులు నిర్ధారించారు. కస్తూరిపై సామూహిక అత్యాచారం చేసి, హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

అక్టోబరు 31 : నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.



వ్యవసాయ కుటుంబాల.. భూపరిమాణం తగ్గుతోంది

దేశంలో 2016-17లో సగటు కుటుంబ భూమి పరిమాణం 1.1 హెక్టార్లు

- 2021-22లో అది 0.7 హెక్టార్లకు తగ్గుదల
- దేశంలోని 38 శాతం వ్యవసాయ కుటుంబాలకు 0.4 హెక్టార్లలోపే భూమి
- అలాగే, 33 శాతం కుటుంబాలకు 0.41 నుంచి 1 హెక్టార్లే
- నాబార్డ్ ఆలిండియా రూరల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సర్వే 2021-22 వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కుటుంబాల సగటు భూమి పరిమాణం ఏటా తగ్గిపోతోంది. 2016-17లో ఇది 1.1 హెక్టార్లుండగా 2021-22లో అది 0.7కు పడిపోయింది. ఈ విషయాన్ని నాబార్డ్ ఆలిండియా రూరల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సర్వే 2021-22 వెల్లడించింది. వ్యవసాయ గృహాల సాగు సామర్థ్యం, ఉత్పత్తి భూమి పరిమాణం గణనీయమైన ప్రభావం చూపుతుందని, ఈ నేపథ్యంలో దేశంలోను వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాల సగటు భూమి పరిమాణాన్ని ఐదు తరగతులుగా వర్గీకరించినట్లు సర్వే వెల్లడించింది. ఇక దేశంలో 38 శాతం కుటుంబాలకు 0.4 హెక్టార్లలోపే భూమి ఉంది. 33 శాతం వ్యవసాయ కుటుంబాలకు 0.41 హెక్టార్ల నుంచి 1.0 హెక్టార్ వరకు ఉంది. 15 శాతం వ్యవసాయ కుటుంబాలకు 1.01 హెక్టార్ల నుంచి 2.0 హెక్టార్ల వరకు భూమి ఉంది. 8 శాతం కుటుంబాలకు 2.1 హెక్టార్ల కన్నా ఎక్కువ ఉంది. ఆరు శాతం వ్యవసాయ కుటుంబాలకు 0.01 హెక్టార్లలోపే భూమి ఉంది. ఇలా దేశంలోని వ్యవసాయ కుటుంబాలు కలిగి ఉన్న సగటు భూమి పరిమాణం రాష్ట్రాల మధ్య విస్తృత వైవిధ్యాలు కలిగి ఉన్నట్లు స్పష్టమవుతోందని సర్వే పేర్కొంది.

2021-22 సర్వే మేరకు రాష్ట్రాల వారీగా వ్యవసాయ కుటుంబాలు కలిగి ఉన్న భూమి సగటు పరిమాణం.. (హెక్టార్లలో)

రాష్ట్రం	సగటు భూమి పరిమాణం
భారతదేశం	0.7
ఆంధ్రప్రదేశ్	1.0
అరుణాచల్‌ప్రదేశ్	1.1
అసోం	0.3
బిహార్	0.4
ఛత్తీస్‌గఢ్	1.0
గోవా	1.2
గుజరాత్	1.1
హరియాణ	0.5
హిమాచల్‌ప్రదేశ్	0.4
జమ్మూ కశ్మీర్	0.4
జార్ఖండ్	0.4
కర్ణాటక	1.0
కేరళ	0.5
లద్దాఖ్	0.2
మధ్యప్రదేశ్	1.2
మహారాష్ట్ర	1.5
మణిపూర్	0.5
మేఘాలయ	0.9
మిజోరం	0.9
నాగాలాండ్	1.4
ఒడిశా	0.6
పంజాబ్	1.1
రాజస్థాన్	1.3
సిక్కిం	0.5
తమిళనాడు	0.6
తెలంగాణ	0.9
త్రిపుర	0.4
ఉత్తరప్రదేశ్	0.4
ఉత్తరాఖండ్	0.3
పశ్చిమ బెంగాల్	0.4

ఎనిమిది రాష్ట్రాల్లో ఒక హెక్టారు కన్నా ఎక్కువ..

దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబానికి సగటు భూమి ఒక హెక్టార్ కన్నా ఎక్కువగా ఉన్నట్లు సర్వే తెలిపింది. మహారాష్ట్ర, నాగాలాండ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఒక హెక్టార్ కన్నా ఎక్కువ భూమి కలిగి ఉన్నట్లు పేర్కొంది. మరో పది రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాలకు సగటు భూమి 0.4 హెక్టార్లలోపే ఉందని నివేదిక తెలిపింది. అసోం, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో చిన్న భూ పరిమాణమే ఉందని సర్వే స్పష్టం చేసింది.

ఆ వేడుకలే.. ఆయువు పెంచే వేదికలు

పదిహేనేళ్ల విద్యార్థి జీవితం అందమైన పాత జ్ఞాపకంలా గుండె పొరల్లో దాగుండిపోయింది. మూడు దశాబ్దాల ఉద్యోగ జీవితం గతకాలమై మిగిలిపోయింది. రెక్కలొచ్చిన పిల్లలు సొంత గూళ్లు వెతుక్కుంటున్నారు. అరవై ఏళ్ల వయసు దాటాక ఒంటరితనం అనే భూతం వెక్కిరించడం మొదలుపెడుతుంది. ఆ ఒంటరితనాన్ని వదిలించుకునేందుకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కొందరు విశ్రాంత జీవులు ఓ కొత్త పద్ధతిని వెతుక్కున్నారు. పిల్లల పుట్టిన రోజులు, పెళ్లిళ్లు చేసిన ఈ పెద్దవాళ్లు.. ఈ వయసులో తమ పుట్టిన రోజులు, పెళ్లి రోజులు చేసుకోవాలని, అది కూడా స్నేహితుల సమక్షంలో తమ ఇంటిలోనే వేడుకగా జరుపుకోవాలని నిశ్చయించుకున్నారు. ఈ వేడుకలు వారి ఒంటరితనాన్ని దూరం చేస్తున్నాయని చెబుతున్నారు.



మిత్రుని పెళ్లి రోజును వారింట్లో నిర్వహిస్తున్న తోటి మిత్రులు

- ఒంటరితనానికి విరుగుడుగా వేడుకలు
- 60 ఏళ్ల వయసులో పుట్టిన రోజు, పెళ్లి రోజులు చేసుకుంటున్న స్నేహితులు
- విశ్రాంత జీవితంలో విసుగు రాకుండా వినూత్న కార్యక్రమాలు

శ్రీకాకుళం కల్చరల్: గుండె నిండా అనుభవాలు, మనసు నిండా జ్ఞాపకాలు, శరీరం నిండా నొప్పులు.. వెరసి అరవై దాటిన వయసుకు సంకేతాలు. ఇలా అరవై దాటిన వారంతా మళ్లీ ఇరవైల్లోకి వెళ్లిపోతున్నారు. శ్రీకాకుళంలోని మున్సిపల్ హైస్కూల్‌లో 1976లో టెన్త్ చదివిన వారు ఓ కొత్త పద్ధతిని కనిపెట్టారు. తోటి విశ్రాంతజీవులు కూడా ఒంటరిగా ఫీలైతే ఈ పద్ధతిని ఫాలో కావచ్చని చెబుతున్నారు.

యాభై ఏళ్ల జ్ఞాపకాలు నెమరువేసుకుని..

1976 నాటి రోజుల్లో ఈ హైస్కూల్‌లో టెన్త్‌కు 'ఎ' నుంచి 'హెచ్' వరకు సెక్షన్లు ఉండేవి. ఆ బ్యాచ్‌లో చదువుకున్న వారంతా పదేళ్లుగా ఎక్కడో ఓ చోట కలుసుకుంటున్నారు. ప్రతి ఆత్మీయ కలయికకు కనీసం 150 నుంచి 180 మంది వరకు హాజరై నాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నారు. కానీ అది వారికి సరిపోవడం లేదు. వయసు పెరుగుతున్న కొద్దీ స్నేహితులు మాత్రమే మిగిలి మిగతా అంతా దూరమైపోవడంతో.. అంతా మళ్లీ మళ్లీ కలుసుకోవడానికి పెళ్లిరోజులు, పుట్టిన రోజులు చేసే విధంగా నిర్ణయించుకున్నారు.

కష్టసుఖాలు పంచుకునేలా..

మనం సాధారణంగా ఇళ్లలో చిన్నారులకు ఎక్కువగా పుట్టిన రోజులు ఘనంగా నిర్వహిస్తాం. అలాగే కొందరు పెళ్లిరోజులు, పుట్టిన రోజులు కూడా మర్చిపోయి తమ జీవితం కుటుంబానికే అంకితం చేస్తారు. ఈ 60ఏళ్ల వయసులో ఒక్కో ఏడాది ఒక్కో తరహాలో పుట్టిన రోజులు కొన్నాళ్లు, పెళ్లిరోజులు కొన్నాళ్లు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అందుకోసం ఎవరి పుట్టిన రోజు చేద్దామనుకుంటున్నారో వారి ఇంటి వద్ద వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వేడుక చేయడానికి సంకల్పించారు. ఇలా అయితే ప్రతి నెలా అందరం కలిసి కష్టసుఖాలు పంచుకోవచ్చన్నది వారి ఆలోచన. దీంతో ప్రతి ఇంటిలోనూ ఏదో వేడుక నిర్వహించేలా ప్లాన్ చేసుకుని విశ్రాంత జీవితాన్ని విశ్రాంతిగా గడుపుతున్నారు.

ఆపదలో మిత్రులకు అండగా..

కలిసి వేడుక చేసుకోవడమే కాదు.. కష్టాల్లో ఉన్న సహచరులను ఆదుకోవడంలో కూడా ఈ బ్యాచ్ ముందుంది. గత పదేళ్లుగా అవసరమైన తమ మిత్రుల కుమార్తె పెళ్లిళ్లకు, వైద్య ఖర్చుల కోసం, ఇటీవల వచ్చిన కోవిడ్ సమయంలో కొందరిని ఆర్థికంగా ఆదుకున్నారు. స్థానిక బిహరా మనోవికాస కేంద్రం చిన్నారులకు వారి పెళ్లి రోజున, పుట్టిన రోజున దుప్పట్ల పంపిణీ, అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిత్లీ తుఫాన్ సమయంలోనూ ఈ బ్యాచ్ వారంతా కలసి దుప్పట్లను పంచిపెట్టారు.



ఆధ్యాత్మిక సమాచారం

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న వైభవం

నారాయణవనం: శ్రవణోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం తిరుపతి జిల్లా నారాయణవనంలోని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్యపూజా కైంకర్యాలను పూర్తిచేశారు. కల్యాణ వేంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చనలు చేశారు. శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు.

స్నాపనతిమంజనంలో సేదతీరిన శ్రీవారు



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవ మూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుష్పయాగం సందర్భంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీ, భూ, పురుష, నీల, నారాయణ సూక్తాలను మంత్రోచ్చారణలతో, ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, పసుపు, చందనంతో పాటు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. తిరుమల జీయర్ స్వామీజీల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు గోవిందరాజ దీక్షితులు పవిత్రోత్సవాలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీ దేవి కల్యాణాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అషేకం, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగి సేవ చేశారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

అంజన్నకు అష్టోత్తర పూజలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు నిత్యార్చన, తోమాల సేవ, నిత్య హోమ బలిహరణలు నిర్వహించారు. కార్తీకమాస సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి విశేష అష్టోత్తర పూజలు చేపట్టారు. సప్తాహ మహోత్సవాల సందర్భంగా నిరంతర భక్తి గీతాలాపన చేస్తున్నారు. స్వామి వారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యా సమాచారం



నిర్మాణాత్మక పద్ధతులతో సమ సమాజ స్థాపన

తిరుపతి ఐఐటీలో పబ్లిక్ పాలసీలపై వర్క్‌షాప్

ఏర్పేడు(రేణిగుంట): సమాజంలో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కొని సమ సమాజ స్థాపనకు నిర్మాణాత్మక విధానాలను అవలంబించడం ద్వారానే సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన సీఆర్ఐఎస్‌పీ సహకారంలో ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో శనివారం పబ్లిక్ పాలసీలపై సదస్సు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాపును ఐఐటీ ఐఐటీ హ్యూమన్ రిసోర్స్ అండ్ సోషల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు హాజరయ్యారు. 15 సెషన్లలో జరిగిన ఈ వర్క్‌షాపునకు పలువురు సెక్రటరీ ర్యాంకు స్థాయి కలిగిన ఐఏఎస్‌లు పాల్గొని పబ్లిక్ పాలసీలపై సాధ్యాసాధ్యాలను చర్చించారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉత్పాదక రంగాలలో సమకాలీన విధానపరమైన సమస్యలపై విశదీకరించారు.



● ప్రభాస్


డబుల్ ధమాకా

ప్రభాస్ తొలిసారిగా పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్న సినిమా 'స్పిరిట్'. 'అర్జున్ రెడ్డి, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. 'స్పిరిట్' సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ చిత్ర సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్‌తో కలిసి ఈ మూవీ పాటల ట్యూన్స్‌ను ఫైనలైజ్ చేసే పనిలో ఉన్నారు సందీప్ రెడ్డి. జనవరిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు దర్శకుడు. అయితే ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్ర చేయనున్న ప్రభాస్ క్యారెక్టర్‌కు తగ్గట్లుగా షార్ట్ హెయిర్, ఫిట్ లుక్‌తో కనిపిస్తారని ఊహించవచ్చు. కథలో భాగంగా ప్రభాస్ పాత్రలో రెండు వేరియేషన్స్ ఉన్నాయట. అందులో భాగంగా ఓ లుక్‌లో లాంగ్ హెయిర్, హెవీ బాడీతో కూడా కనిపిస్తారని టాక్. ఇదే నిజమైతే ఆయన ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా అనుకోవచ్చు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా, మృణాళ్ ఠాకూర్, కియారా అద్వానీ వంటి హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. మరి వీరిలో ఎవరో ఒకరు ఫైనల్ అవుతారా? లేకుంటే మరో హీరోయిన్‌ని ఫిక్స్ చేస్తారా? అన్నది వేచి చూడాలి. కాగా 'స్పిరిట్' చిత్రం 2025 చివర్లో విడుదల అయ్యే అవకాశాలున్నాయి.

Gold Memories

ఆనంద్

ఓ మంచి సినిమా చూశామన్న ఫీలింగ్ అంటే ఏంటో తెలియాలంటే 20 ఏళ్ల క్రితం వచ్చిన 'ఆనంద్'ను చూడాలి. ఇది ఓ మంచి కాఫీ లాంటి మూవీ. ఫీల్ గుడ్ మూవీస్ తీసే దర్శకుడిగా పేరున్న డైరెక్టర్ శేఖర్ కమ్ముల నుంచి వచ్చిన రెండో సినిమా. ఆత్మాభిమానం, ఇండిపెండెంట్ భావాలు కొంచెం ఎక్కువ గల ఓ యువతి తన లైఫ్‌లో ఎదుర్కొనే సవాళ్లు, లవ్, ఫ్రెండ్‌షిప్ వంటి వాటిని తెరకెక్కించిన విధానం కట్టిపడేస్తుంది. ముఖ్యంగా యూత్‌కు చాలా బాగా కనెక్ట్ అయిన సినిమా. వారి ఆలోచనలు, డ్రీమ్స్, ప్రాబ్లమ్స్ అన్నీ ఇందులో ప్రతిబింబిస్తాయి. హీరోగా రాజా, హీరోయిన్‌గా కమలినీ ముఖర్జీ అద్భుతంగా నటించారు.



పరిణతి గల ప్రేమ

ఈ మూవీలో లవ్ స్టోరీ చాలా నేచురల్‌గా, హానెస్ట్‌గా ఉంటుంది. అన్ని సినిమాల్లోలా కాకుండా ఇద్దరు మెచ్యూర్డ్ యూత్ మధ్య లవ్‌ను అద్భుతంగా చూపించారు డైరెక్టర్. కేవలం కోటిన్నర బడ్జెట్‌తో ఎటువంటి భారీ కాస్టింగ్ లేకుండా సాదా సీదా స్టోరీతో రిలీజై అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.

శేఖర్ కమ్ముల తొలుత 2000లో 'డాలర్ డ్రీమ్స్' తీశారు. ఇది విమర్శకుల మెప్పు పొందింది. సెకండ్ మూవీ 'ఆనంద్' కోసం చాలా మంది నిర్మాతల్ని కలవగా ఎవరూ ఇంట్రస్ట్ చూపలేదు. చేసేది లేక నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సాయం కోరగా ఆ సంస్థ కొంత ఇన్వెస్ట్ చేయడానికి అంగీకరించింది. తెలుగులో ఓ కమర్షియల్ మూవీకి ఇన్వెస్ట్ చేయడం 'ఎన్‌ఎఫ్‌డీసీ'కి ఇదే తొలిసారి.

పద్మారావ్ నగర్‌లోనే...

ఆనంద్ స్టోరీని పవన్ కల్యాణ్‌ను దృష్టిలో పెట్టుకుని రాసినా ఆయన్ను ఎప్పుడూ సంప్రదించలేదని శేఖర్ కమ్ముల ఓ సందర్భంలో చెప్పారు. హీరోయిన్‌గా తొలుత ఆసిన్, సదాను అనుకున్నారు. చివరికి రాజా, కమలినీ ముఖర్జీతో పూర్తి చేసేశారు. హైదరాబాదులో తానుండే పద్మారావ్ నగర్‌లోనే ఓ ఇంటి స్థలంలో దాదాపు సినిమా మొత్తం పూర్తి చేసేశారు డైరెక్టర్. కమలి పాత్రకి సింగర్ సునీతతో డబ్బింగ్ చెప్పించగా ఎంత సహజంగా వచ్చిందంటే అందుకు సునీతని కూడా అవార్డు వరించింది. శేఖర్ కమ్ముల హోవర్డ్ యూనివర్శిటీలో తన మాస్టర్స్ డిగ్రీ థీసిస్‌గా ఈ సినిమా స్క్రీన్‌ప్లేనే సబ్‌మిట్ చేసారనే విషయం చాలా మందికి తెలియదు. 'ఆనంద్' సినిమాను తమిళంలో 'నినైత్తాలే' పేరుతో రీమేక్ చేశారు.

ఫార్ములా సినిమాలకు భిన్నంగా...

ఆనంద్ మూవీ, చిరంజీవి భారీ సినిమా 'శంకర్ దాదా ఎంబీబీఎస్' ఒకే రోజు రిలీజయ్యాయి. అయినా... ఆ పోటీకి నిలబడి ఇంచుమించు అంతే పేరు తెచ్చుకుంది 'ఆనంద్'. ఫార్ములా సినిమాలకు భిన్నంగా తీసిన ఆనంద్ ఏడు నంది అవార్డుల్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాను ఇప్పటికీ చాలా మంది ఇష్టంగా చూస్తారు. మీరు ఇప్పటికీ చూడకపోతే కచ్చితంగా ఓ సారి చూసేయండి.

- ఇంటూరు హరికృష్ణ



● మంచు విష్ణు

ఫోటో లీక్ కావడం బాధిస్తోంది - 'కన్నప్ప' చిత్రయూనిట్

మంచు విష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ అతిథి పాత్రల్లో, మోహన్‌బాబు, శరత్‌కుమార్, బ్రహ్మానందం, ముకేష్ రుషి, బ్రహ్మాజీ, ప్రీతి ముకుందన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా నుంచి ప్రభాస్ పాత్రకు చెందిన ఫోటో ఒకటి సోషల్ మీడియాలో లీకైంది. దీనిపై 'కన్నప్ప' చిత్రయూనిట్ స్పందించి.. ఓ ప్రెస్‌నోట్ విడుదల చేసింది. ''ప్రియమైన ప్రభాస్ అభిమానులను, అందరి హీరోల అభిమానులను కోరడం ఏమనగా.. 'కన్నప్ప' కోసం ఎనిమిదేళ్లుగా ఎంతో కష్టపడుతున్నాం. ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు రెండేళ్లుగా మా టీమ్ నిరంతరం కృషి చేస్తోంది. ఇలాంటి తరుణంలో మా సినిమా నుంచి ఓ ఫోటో అనధికారికంగా లీక్ కావడం మమ్మల్ని బాధిస్తోంది. ఈ లీక్ మా కష్టాన్ని మాత్రమే కాకుండా, ఈ ప్రాజెక్ట్‌పై పని చేస్తున్న రెండువేల మందికిపైగా వీఎఫ్ఎక్స్ కళాకారుల జీవితాలను కూడా ప్రభావితం చేస్తోంది. ఈ లీక్ ఎలా జరిగింది? అని తెలుసుకోవడానికి మేము పోలీస్ కేసు పెట్టనున్నాం. ఈ లీకైన ఇమేజ్ ఫుటేజీని ఎవరైనా షేర్ చేస్తూ ఉంటే, ఆ దొంగల్ని పట్టుకోమని అభిమానులందర్నీ మనస్ఫూర్తిగా కోరుతున్నాం. ఈ లీకైన ఫోటోను షేర్ చేస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారు. ఈ లీక్ చేసింది ఎవరు? అనేది ఎవరైనా కనిపెడితే వారికి ఐదు లక్షల రూపాయలను బహుమతిగా ప్రకటిస్తున్నాం. లీక్ చేసిన వారి వివరాలు తెలిసిన వారు 24ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ 'ఎక్స్' అకౌంట్‌కు డైరెక్ట్‌గా మేసేజ్ చేయవచ్చు'' అన్నది ఆ లేఖ సారాంశం.

బిగ్ బాస్ తొమ్మిదవ వారం విశ్లేషణ...

ఇది మామూలు డ్రామా కాదు రా రామా



నవరసాలను నిరంతరం పండించగలిగే సత్తా ఈ మధ్యకాలంలో ఒక్క బిగ్ బాస్ కార్యక్రమానికి మాత్రం ఉందంటే అతిశయోక్తి కాదేమో. బిగ్ బాస్ మిగతా భాషల్లో ఏమో కానీ తెలుగులో మాత్రం తమ ప్రేక్షకులు జారిపోకుండా షోని రసవత్తరమైన ఘట్టాలతో ఎప్పటికప్పుడు రక్తి కట్టిస్తూ ఆడియన్స్‌ని కట్టిపడేసేందుకు ప్రయత్నిస్తున్నాడు సదరు బిగ్ బాస్. దీనికి ప్రత్యేక నిదర్శనం ఈ వారం బిగ్ బాస్ కార్యక్రమం. ముఖ్యంగా చీఫ్ కంటెండర్ పోటీ కోసం కంటెస్టెంట్లను నాలుగు రంగులతో విభజించి నాలుగాటలు ఆడించి వాళ్లలో నాలుగు ఎమోషన్స్ తెప్పించి నలుగురు పార్టిసిపెంట్స్ కొట్టుకునేలా చేసి ప్రేక్షకులకు నిత్యం వివాదంతో వినోదాన్ని పంచాలని ప్రయత్నించడం నభూతో నభవిష్యతి అని చెప్పవచ్చు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇక్కడ కంటెస్టంట్లను ఎమోషన్లతో రెచ్చగొట్టడం ఒకటే కాదు.. వాళ్ల ఆరోగ్యాలపై కూడా హైప్ క్రియేట్ చేసి క్యాష్ చేసుకోవడం. పోయిన వారం అవినాష్‌కు ఆరోగ్యం బాలేదని, హౌస్ నుండి వెళ్లిపోతున్నాడని ప్రోగ్రాం చివరలో చూపించి మరుసటిరోజు నామినేషన్స్ నాడు తన ఆరోగ్యం బాగుందని బిగ్ బాస్ డాక్టర్లు ప్రోగ్రాంలో కంటిన్యూ చేయమన్నారని చూపించడం విడ్డూరం. రేపెవరైనా కంటెస్టెంట్‌కు మళ్లీ ఆరోగ్యం బాగాలేదని చెబితే ప్రేక్షకులు నమ్మాలా? లేదా?. ఇక ఈ వారం ఎలిమినేట్ అయిన కంటెస్టెంట్ నయని పావని. ఈ అమ్మాయిని కదిపినా కదపకపోయినా కన్నీళ్లు వచ్చేస్తూనే ఉంటాయి. అందుకే కాబోలు బిగ్ బాస్ ఆ అమ్మాయిని ఎలిమినేట్ చేశాడు. బిగ్ బాస్ కార్యక్రమం అనేది ఒక్క హౌస్‌లో ఉన్న కంటెస్టెంట్స్ ఎమోషన్స్‌తోనే కాదు.. బయట చూసే ప్రేక్షకుల ఎమోషన్స్‌తో కూడా ఆడుకుంటున్నాడనేది అక్షర సత్యం. ఎందుకంటే బిగ్ బాస్ అనేది మామూలు డ్రామా కాదు రా రామా!



గాయనిగా శ్రద్ధా దాస్

'అల్లరి' నరేశ్ హీరోగా నటించిన 'సిద్ధు ఫ్రమ్ సీకాకుళం'(2008) సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమయ్యారు శ్రద్ధా దాస్. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాలతో పాటు హిందీ, కన్నడ, మలయాళ, బెంగాళీ భాషల్లో నటించి గ్లామర్ బ్యూటీగా ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారామె. తాజాగా గాయనిగా మారారు శ్రద్ధా దాస్. సూర్య హీరోగా శివ దర్శకత్వం వహించిన ప్రతిష్టాత్మక చిత్రం 'కంగువ'. స్టూడియో గ్రీన్, యువీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన 'కంగువ' ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. 'కంగువ' ద్వారా శ్రద్ధా దాస్‌ని గాయనిగా ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు దేవీ శ్రీ. 'యోలో...' అంటూ సాగే ఓ పెప్పీ సాంగ్‌ను ఆలపించారామె. ఈ పాటకి రాకేందు మౌళి సాహిత్యం అందించారు. ఈ సాంగ్‌ని దేవి శ్రీ ప్రసాద్, శ్రద్ధా దాస్, సాగర్ కలిసి పాడారు. 'హోల్డ్ మి హగ్ మి కిస్ మి కిల్ మి.. లవ్వుతోనే జస్ట్ లాక్ మి..' అంటూ శ్రద్ధా దాస్ తనదైన శైలిలో పాడారు. ఇప్పటికే విడుదలైన ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తుండటం విశేషం.

డేట్ చేంజ్



● అశోక్ గల్లా, మానస

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, హీరో మహేశ్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటించిన రెండవ చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. 'హను-మాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించగా, 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో వారణాసి మానస హీరోయిన్‌గా నటించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్‌పై సోమినేని బాలకృష్ణ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కావాల్సి ఉంది. అయితే ఒక వారం ఆలస్యంగా ఈ 22న రిలీజ్ చేయనున్నట్లు శనివారం ప్రకటించారు మేకర్స్. కాగా ఈ సినిమా వరల్డ్ వైడ్ థియేట్రికల్ రైట్స్‌ని శంకర్ పిక్చర్స్ సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, రసూల్ ఎల్లోర్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

హాలీవుడ్ యాక్షన్



● జేజే ఫెర్రీ, యశ్

'కేజీఎఫ్: చాప్టర్ 1, కేజీఎఫ్: చాప్టర్ 2' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్స్ తర్వాత కన్నడ స్టార్ హీరో యశ్ నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. మలయాళ నటుడు గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో యశ్ సోదరి పాత్రలో నయనతార, యశ్ ప్రేయసిగా కియారా అద్వానీ నటిస్తున్నారని టాక్. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఇటీవల నయనతార, యశ్‌లు పాల్గొనగా కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు గీతూమోహన్ దాస్. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించాలనుకుంటున్నారు. ఇందుకు హాలీవుడ్‌లో 'జాన్ విక్: చాప్టర్2, ఎఫ్ 9, అవతార్: ద వే ఆఫ్ వాటర్' వంటి భారీ బడ్జెట్ యాక్షన్ సినిమాలకు పని చేసిన జేజే ఫెర్రీ 'టాక్సిక్' సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే ఆయన ముంబైలో వాలిపోయారు. డ్రగ్స్ మాఫియా నేపథ్యంతో సాగే ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లు తొలుత మేకర్స్ ప్రకటించారు. అయితే ఆ తేదీకి సినిమా విడుదల కావడం లేదని, త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తామని యశ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ప్రస్తుతం 'టాక్సిక్' తో పాటుగా హిందీలో 'రామాయణ' అనే సినిమా చేస్తున్నారు యశ్.

కోలీవుడ్ ఎంట్రీ




● కయదు

హీరోయిన్ కయదు లోహర్ కోలీవుడ్ ఎంట్రీ ఖరారైంది. ప్రదీప్ రంగనాథన్, అనుపమా పరమేశ్వరన్ జంటగా తమిళంలో రూపొందుతున్న సినిమా 'డ్రాగన్'. అశ్వత్ మరిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాలో కయదు లోహర్ మరో హీరోయిన్ పాత్రలో నటిస్తున్నారు. కాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించి, 'డ్రాగన్' సినిమాలోని పల్లవి పాత్రలో కయదు లోహర్ నటిస్తున్నట్లుగా ఆమె ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. కయదుకు కోలీవుడ్‌లో ఇదే తొలి చిత్రం కావడం విశేషం. ఇంకా ఈ చిత్రంలో దర్శక-నటులు మిస్కిన్, గౌతమ్ వాసు దేవ్ మీనన్, కేఎస్ రవి కుమార్‌లు కీలక పాత్రలు చేస్తున్నట్లు యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాకు లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. శ్రీ విష్ణు హీరోగా నటించిన తెలుగు చిత్రం 'అల్లూరి'తో కయదు నటించారు. ఈ సినిమాతో కయదు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. అలాగే 'అల్లూరి' సినిమా కయదుకి తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం.

లయన్‌కింగ్ ఒక్కటే ఉండాలి!

హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ది లయన్‌కింగ్ (2019)' సినిమాకు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ది లయన్‌కింగ్' అనే చిత్రం రూపొందిన సంగతి తెలిసిందే. బారీ జెంకిన్స్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ పతాకంపై అడెలె రోమన్ స్కీ, మార్క్ సెరియాక్ ఈ సినిమాను నిర్మించారు. ఈ ఏడాది డిసెంబరు 20న 'ముఫాసా: ది లయన్ కింగ్' సినిమా విడుదల కానుంది. ఈ సినిమా తెలుగులోనూ రిలీజ్ అవుతోంది. ఆల్రెడీ తెలుగు ట్రైలర్‌ను కూడా మేకర్స్ విడుదల చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాగా తాజాగా 'ముఫాసా: ది లయన్ కింగ్' ఇంగ్లీష్ ఫైనల్ ట్రైలర్‌ను విడుదల చేశారు చిత్రయూనిట్. ''ఈ కథ స్కార్ అనే ప్రిన్స్‌కి, ఓ అనాథ అయిన ముఫాసాకి చెందినది. వీరిద్దరూ అన్నదమ్ముల్లా ఓ కొత్త సామ్రాజ్యం కోసం ఓ ప్రమాదకరమైన ప్రయాణాన్ని చేసేందుకు రెడీ అవుతున్నారు, నా పేరు ముఫాసా, లయన్ కింగ్ అనేది ఒక్కటే ఉండాలి, మనల్ని ట్రాప్ చేశారు.. ఇప్పుడు ఏం చేయాలి'' అంటూ అర్థం వచ్చే ఇంగ్లీష్ డైలాగ్స్ 'ముఫాసా: ది లయన్‌కింగ్' సినిమా ఇంగ్లీష్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇక 'ముఫాసా: ది లయన్ కింగ్' సినిమాలోని ప్రధాన పాత్రధారులు అయిన ముఫాసాకు హాలీవుడ్ నటుడు ఆరోన్ పియర్, టాకా (ఈ పాత్ర ఆ తర్వాత స్కార్‌గా మారుతుంది)కు కెల్విన్ హరిసన్ జూనియర్ వాయిస్ ఓవర్స్ ఇచ్చారు. ఇక 'ముఫాసా: ది లయన్ కింగ్' తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు మహేశ్‌బాబు వాయిస్ ఓవర్ ఇచ్చారు.



● 'ముఫాసా: ది లయన్ కింగ్' పోస్టర్

డాన్ కాంబో రిపీట్



● శివ కార్తికేయన్

'అమరన్' సినిమా బ్లాక్‌బస్టర్ సక్సెస్‌తో మంచి జోష్‌లో ఉన్నారు హీరో శివ కార్తికేయన్. ఆయన తర్వాతి చిత్రానికి ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నారు. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా, బాలీవుడ్ నటుడు విద్యుత్ జమాల్ విలన్‌గా నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. 2025లో ఈ చిత్రం విడుదల కానుంది. ఆ సినిమా తర్వాత శివ కార్తికేయన్ ఏ దర్శకుడితో పని చేయనున్నారు? అనే చర్చ కొంత కాలంగా కోలీవుడ్‌లో జరుగుతోంది. తన తర్వాతి చిత్రం యువ దర్శకుడు సిబి చక్రవర్తితో ఉంటుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు శివ కార్తికేయన్. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇక 2022లో శివ కార్తికేయన్, సిబి చక్రవర్తి కాంబినేషన్‌లో వచ్చిన 'డాన్' చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌పై తమిళ పరిశ్రమలో మంచి అంచనాలున్నాయి. అలాగే శివ కార్తికేయన్ కెరీర్‌లో 'డాక్టర్' సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్‌తో కూడా భవిష్యత్తులో ఓ సినిమా చేయనున్నట్లు శివ కార్తికేయన్ వెల్లడించారు.

బిజినెస్ రీల్

పోటీతత్వ చట్టాలను ఉల్లంఘించిన స్విగ్గీ, జొమాటో

ముంబై: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ జొమాటో, స్విగ్గీలు పోటీతత్వ చట్టాలను ఉల్లంఘించినట్లు కాంపిటిషన్ కమీషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దర్యాప్తులో తేలింది. కొన్ని రెస్టారెంట్ల భాగస్వాములతో ప్రత్యేక ఒప్పందాలు కుదుర్చుకొని ఇరు సంస్థలు అనైతిక వ్యాపారాలకు పాల్పడినట్లు పేర్కొంది. 'తక్కువ కమీషన్ తీసుకుంటూ జొమాటో ఒప్పందం కుదుర్చుకుంది. తన ప్లాట్‌ఫామ్‌పై నమోదైతే, వ్యాపారాభివృద్ధికి తోడ్పాడతామంటూ స్విగ్గీ హామీలిస్తోంది. తద్వారా ఇరు సంస్థలు తమకు పోటీ లేకుండా పోటీతత్వ చట్టాలను అతిక్రమించాయి' అని సీసీఐ పత్రాలు స్పష్టం చేశాయి.

పీసీ జ్యుయెలర్ వారంట్లకు షేర్ల కేటాయింపు

హైదరాబాద్: ఆభరణాల రిటైల్ చైన్ 'పీసీ జ్యుయెలర్' 3,38,85,000 వారంట్లకు, రూ.10 ముఖ విలువ కలిగిన 3,38,85,000 ఈక్విటీ షేర్లను కేటాయించినట్టు ప్రకటించింది. నాన్ ప్రమోటర్, పబ్లిక్ విభాగంలో ఇన్వెస్టర్లకు ఈ షేర్లు కేటాయించింది. ఇందుకుగాను ఇన్వెస్టర్ల నుంచి 142.82 కోట్లను (ఒక్కో వారంట్ రూ.42.15) స్వీకరించినట్టు తెలిపింది. ఇటీవలి సెప్టెంబర్ త్రైమాసికానికి కంపెనీ పటిష్ట ఫలితాలను ప్రకటించడం గమనార్హం. ఆదాయం 1430 శాతం వృద్ధితో రూ.505 కోట్లకు చేరగా, పన్నుకు ముందు లాభం రూ.124 కోట్లుగా నమోదైంది. రుణ బకాయిలకు సంబంధించి ఇటీవలే బ్యాంక్‌లతో పరిష్కార ఒప్పందం కుదుర్చుకోవడం తెలిసిందే. అందులో భాగంగా కొంత మొత్తాన్ని బ్యాంకులకు చెల్లించినట్టు తెలిపింది.

బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించాలి

ఐఆర్‌డీఏఐ చైర్మన్ పాండా

ముంబై: ప్రజలందరికీ 2027 నాటికల్లా బీమా రక్షణ కల్పించాలన్న లక్ష్యం సాకారం కావాలంటే ఇన్సూరెన్స్ రంగంలోకి భారీగా పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉందని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేబాశీష్ పాండా తెలిపారు. ఈ నేపథ్యంలో ఇన్సూరెన్స్ రంగంలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించాల్సి ఉంటుందని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. బీమా విస్తృతిని పెంచేందుకు ఈ రంగంలో మరిన్ని సంస్థలు రావాల్సిన అవసరం ఉందన్నారు. 2000 నుంచి భారత్‌లో ప్రైవేట్, విదేశీ పెట్టుబడులను క్రమంగా అనుమతిస్తున్నారు. ప్రస్తుతం జనరల్, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ విభాగాల్లో 74 శాతం వరకు ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. దీన్ని వంద శాతానికి పెంచిన పక్షంలో దేశీయంగా వచ్చే పెట్టుబడులకు కూడా కొంత దన్ను లభించగలదని పాండా చెప్పారు. మరోవైపు, బీమా సుగమ్ ప్లాట్‌ఫాం అనేది పాలసీదార్లకు సమగ్రమైన పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా వ్యవహరిస్తూ బీమా రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తోందని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-11-2024

విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560-00
విజయవాడ	565-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	555-00
వరంగల్	557-00
రిటైల్ ధర	6.15

అరబిందో లాభం 8.6 శాతం జూమ్

- నికరలాభం రూ.817 కోట్లు
- టర్నోవర్ రూ.7,796 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న అరబిందో ఫార్మా సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 8.6 శాతం ఎగసి రూ.817 కోట్లు సాధించింది. ఎబిటా 11.6 శాతం దూసుకెళ్లి రూ.1,566 కోట్లు నమోదైంది. ఎబిటా మార్జిన్ 65 బేసిస్ పాయింట్లు మెరుగై 20.1 శాతంగా ఉంది. ఈపీఎస్ 9 శాతం వృద్ధి చెంది రూ.14 ఉంది. టర్నోవర్ 8 శాతం అధికమై రూ.7,796 కోట్లకు చేరింది. మొత్తం ఫార్ములేషన్స్ ఆదాయం 11.3 శాతం వృద్ధి చెంది రూ.6,640 కోట్లు సాధించింది. మొత్తం ఏపీఐ టర్నోవర్ 0.9 శాతం క్షీణించి రూ.1,156 కోట్లకు వచ్చి చేరింది. యూఎస్ ఫార్ములేషన్స్ వ్యాపారం 4.3 శాతం పెరిగి రూ.3,530 కోట్లు, యూరప్ ఫార్ములేషన్స్ ఆదాయం 19% ఎగసి రూ.2,105 కోట్లను తాకింది. వృద్ధి మార్కెట్ల నుంచి ఆదాయం 44% దూసుకెళ్లి రూ.812 కోట్లకు చేరింది. పరిశోధన, అభివృద్ధికి చేసిన వ్యయాలు రూ.410 కోట్లు. ఇది ఆదాయంలో 5.3 శాతానికి సమానం.

సింహభాగం యూఎస్..

మొత్తం వ్యాపారంలో విదేశీ మార్కెట్ల వాటా ఏకంగా 89% ఉంది. టర్నోవర్‌లో యూఎస్ 45.3% తో సింహభాగం వాటా కైవసం చేసుకుంది. యూరప్ 27%, ఏపీఐలు 14.8, వృద్ధి మార్కెట్లు 10.4, ఏఆర్‌వీ ఫార్ములేషన్స్ 2.5% వాటా దక్కించుకున్నాయి. 'ఈ త్రైమాసికంలో కీలక వ్యాపార రంగాలలో రాబడుల నిరంతర వృద్ధితో సంతోషిస్తున్నాం. ఇది విభిన్న పోర్ట్‌ఫోలియో స్థితి స్థాపకతను ప్రతిబింబిస్తుంది. ప్రాథమికంగా కొన్ని వ్యాపార కార్యకలాపాల తాత్కాలిక స్వభావం కారణంగా లాభదాయకత స్వల్పంగా తగ్గినప్పటికీ, అంతర్లీన పనితీరు బలంగా ఉంది. బలమైన పునాది, కొనసాగుతున్న కార్యాచరణ మెరుగు దలలతో వృద్ధి పథాన్ని కొనసాగించగలమని, ప్రస్తుత సంవత్సరానికి వ్యూహాత్మక లక్ష్యాలను సాధించగలమని విశ్వసిస్తున్నాం' అని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి తెలిపారు.

కిమ్స్ లాభం 20 శాతం జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల్లో ఉన్న కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 20 శాతం దూసుకెళ్లి రూ.121 కోట్లు నమోదు చేసింది.



ఎబిటా 23.8 శాతం అధికమై రూ.223 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 28.5 శాతంగా ఉంది. ఈపీఎస్ 16.7 శాతం పెరిగి రూ.3 ఉంది. టర్నోవర్ 19.4 శాతం ఎగసి రూ.782 కోట్లు నమోదైంది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఇన్‌సిగ్నియా హెల్త్‌కేర్‌కు చెందిన 150 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కార్యకలాపాలు, నిర్వహణ బాధ్యతలను చేపట్టేందుకు ఒప్పందం చేసుకున్నట్టు కిమ్స్ వెల్లడించింది. ఇందులో భాగంగా కిమ్స్-శిఖర పేరుతో ఈ ఆసుపత్రి కార్యకలాపాలు చేపడతారు. ఈ కేంద్రానికి మరో 50 పడకలు జోడించే సామర్థ్యం ఉంది. మెడికల్ సేవలు అందించినందుకుగాను కిమ్స్-శిఖర నికర ఆదాయంలో 5 శాతం ఆదాయ రుసుము తమకు సమకూరుతుందని కిమ్స్ తెలిపింది.

అంచనాలను మించిన దివీస్ లాభం

క్యూ2లో నికరలాభం రూ.510 కోట్లు



ముంబై: ఫార్మా కంపెనీ దివీస్ ల్యాబొరేటరీస్ సెప్టెంబర్ త్రైమాసికంలో అంచనాలకు మించి రాణించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ నికరలాభం రూ.510 కోట్లుగా నమోదైంది. 2023-24 ఇదే త్రైమాసిక లాభం రూ.348 కోట్లతో పోలిస్తే ఇది 46% అధికం. మొత్తం ఆదాయం రూ.1,909 కోట్ల నుంచి 22.5% పెరిగి రూ.2,338 కోట్లకు చేరింది. పన్నుకు ముందు లాభం (పీబీటీ) 54% వృద్ధి చెంది రూ.469 కోట్ల నుంచి రూ.722 కోట్లకు చేరింది. మార్జిన్లు 25% నుంచి 31 శాతానికి పెరిగాయి. ఈ క్యూ2లో విదేశీ మారక ద్రవ్య లాభం (ఫారెక్స్ గెయిన్) రూ.29 కోట్లుగా ఉంది.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్థభాగం (ఏప్రిల్-సెప్టెంబర్)లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.4,640 కోట్లు ఆర్జించింది. గతేడాది ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.3,854 కోట్లుగా ఉంది. నికర లాభం రూ.704 కోట్ల నుంచి 33% అధికమై రూ.940 కోట్లకు చేరింది.

వర్ల్‌పూల్ లాభం జూమ్



న్యూఢిల్లీ: కన్స్యూమర్ డూరబుల్స్ సంస్థ వర్ల్‌పూల్ ఇండియా సెప్టెంబర్ క్వార్టర్‌లో రాణించింది. లాభం 40 శాతం వృద్ధితో రూ.54 కోట్లు, ఆదాయం 13 శాతం ఎగసి రూ.1,713 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1,522 కోట్ల ఆదాయంపై రూ.38 కోట్ల లాభాన్ని గడించడం గమనార్హం. వ్యయాలు సైతం 12 శాతం ఎగసి రూ.1,689 కోట్లకు చేరాయి. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో వర్ల్‌పూల్ షేరు 2 శాతం లాభపడి రూ.2,042కు చేరింది.

చిప్ ప్రాజెక్టుల కోసం మాతోనే టాటా గ్రూప్ జట్టు ..

సింగపూర్ మంత్రి షణ్ముగం ధీమా



ముంబై: సెమీకండక్టర్ల తయారీ ప్రణాళికల్లో ఉన్న టాటా సన్స్ తమ దేశాన్ని కీలక భాగస్వామిగా ఎంచుకుంటుందని సింగపూర్ ధీమా వ్యక్తం చేసింది. అంతర్జాతీయ సెమీకండక్టర్ పరిశ్రమలో విశ్వసనీయ దేశంగా తమకు పేరుండటం ఇందుకు దోహదపడగలదని తెలిపింది. శుక్రవారం టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో భేటీ అనంతరం సింగపూర్ హోమ్ అఫైర్స్ శాఖ మంత్రి కె. షణ్ముగం ఈ విషయాలు తెలిపారు. సమావేశంలో సెమీకండక్టర్లపై విస్తృతంగా చర్చించినట్లు వివరించారు. సింగపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలకు అంతర్జాతీయంగా సెమీకండక్టర్ పరికరాల ఉత్పత్తిలో 20 శాతం వాటా ఉందని షణ్ముగం పేర్కొన్నారు. చిన్న దేశమే అయినప్పటికీ తమ దేశంలో 25 సెమీకండక్టర్ల ఫౌండ్రీలు ఉన్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో, దాదాపు అయిదు దశాబ్దాలుగా సింగపూర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న టాటా గ్రూప్ తమతో జట్టు కట్టగలదని షణ్ముగం చెప్పారు. టాటా గ్రూప్ రూ. 91 వేల కోట్లతో గుజరాత్‌లో, రూ. 27,000 కోట్లతో అస్సాంలో సెమీకండక్టర్ల ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఇందుకోసం తైవాన్‌కి చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్‌తో (పీఎస్ఎంసీ) చేతులు కలిపింది.

జింకా లాజిస్టిక్స్ @ రూ. 259-273

ఈ నెల 13-18 మధ్య ఐపీవో

న్యూఢిల్లీ: ట్రక్ ఆపరేటర్లకు డిజిటల్ ప్లాట్‌ఫామ్ సేవలందించే జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 259-273 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 13న ప్రారంభమై 18న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 550 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 2.06 కోట్ల షేర్ల(రూ. 565 కోట్ల విలువ)ను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ రూ. 1,115 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. అర్హతగల కంపెనీ ఉద్యోగులకు ఇష్యూ ధరలో షేరుకి రూ. 25 డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 200 కోట్లు అమ్మకాలు, మార్కెటింగ్‌పై, మరో రూ. 140 కోట్లు బ్లాక్‌బక్ ఫిన్‌సర్వ్ మూలధన పటిష్టతకు, రూ. 75 కోట్లు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌కు వినియోగించనుంది.

స్వల్పంగా తగ్గిన విదేశీ మారక నిల్వలు

ముంబై: భారత విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు నవంబర్ ఒకటి నాటికి 682.13 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంత క్రితం వారంతో పోలిస్తే నిల్వలు 2.67 బిలియన్ డాలర్లు క్షీణించాయి. సెప్టెంబర్ చివరినాటికి ఫారెక్స్ నిల్వలు భారత్‌లో గరిష్ట స్థాయిని తాకి 704.885 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం నిల్వలు 1.224 బిలియన్ డాలర్లు ఎగసి 69.751 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌ఈఆర్) ఒక మిలియన్ డాలర్లు తగ్గి 18.219 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఐఎంఎఫ్ వద్ద భారత నిల్వలు నాలుగు మిలియన్ డాలర్లు అధికమై 4.311 బిలియన్ డాలర్లకు ఎగశాయి.

రూ.2,000 నోట్లు 98 శాతం వెనక్కి

ప్రజల వద్ద 6,970 కోట్ల విలువైన నోట్లు



న్యూఢిల్లీ: రూ.2,000 నోట్లు 98 శాతం బ్యాంకుల్లోకి తిరిగొచ్చినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అయితే, ఇప్పటికీ రూ.6,970 కోట్ల విలువ చేసే నోట్లు ఇంకా ప్రజల వద్దే ఉన్నట్టు తెలిపింది. రూ.2,000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్‌బీఐ 2023 మే 19న ప్రకటించడం గమనార్హం. ''అప్పటికి రూ.3.56 లక్షల కోట్ల విలువ చేసే నోట్లు చలామణిలో ఉండగా, 2024 అక్టోబర్ 31 నాటికి రూ.6,970 కోట్లకు తగ్గాయి. అంటే 2023 మే 19 నాటికి చలామణిలో ఉన్న రూ.2,000 నోట్లతో 98.04% వెనక్కి వచ్చాయి''అని ఆర్‌బీఐ తెలిపింది. అన్ని బ్యాంకు శాఖల్లో రూ.2,000 నోట్లు డిపాజిట్‌కు, మార్పిడికి ఆర్‌బీఐ అవకాశం కల్పించడం తెలిసిందే. 2023 అక్టోబర్ 7 వరకు ఇందుకు అనుమతించింది. ఆర్‌బీఐకి చెందిన 19 ఇష్యూ ఆఫీసులలో రూ.2,000 నోట్ల మార్పిడి సదుపాయం ఇప్పటికీ కొనసాగుతోంది. తమ బ్యాంక్ ఖాతా వివరాలతో పాటు రూ.2,000 నోట్లను ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీసుకు ఇండియా పోస్ట్ ద్వారా పంపుకునేందుకు వీలుంది. హైదరాబాద్ ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీసులోనూ ఈ సదుపాయం ఉంది.

ఆర్‌సీఈపీ, సీపీటీపీపీలో భారత్ చేరాలి

- భారీ వాణిజ్య ఒప్పందాల్లో భాగం కావాలి
- ఎగుమతి అవకాశాలు పెంచుకోవాలి
- దేశ ఎంఎస్‌ఎంఈలకు ప్రయోజనం
- నీతి ఆయోగ్ సీఈవో సుబ్రమణ్యం



న్యూఢిల్లీ: ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సీఈపీ)తోపాటు, సమగ్ర, ట్రాన్స్‌పసిఫిక్ పార్టనర్‌షిప్‌కు సంబంధించి ప్రగతిశీల అంగీకారం (సీపీటీపీపీ)లో భారత్ కూడా భాగం కావాలని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. 2019లో ఆర్‌సీఈపీ నుంచి భారత్ బయటకు రావడం గమనార్హం. ''భారీ వాణిజ్య ఒప్పందాల్లో పాలుపంచుకోని దేశాల్లో భారత్ ఒకటి. ఆర్‌సీఈపీ, సీపీటీపీపీలో భారత్ పాలుపంచుకోవడంతోపాటు సభ్య దేశం కావాలి. దేశ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్‌ఎంఈ) సంస్థలకు ఇది మేలు చేస్తుంది. దేశ ఎగుమతుల్లో 40 శాతం ఎంఎస్‌ఎంఈలవే ఉంటున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలు గొప్ప ఎగుమతిదారులుగా లేవు''అని అసోచామ్ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆర్‌సీఈపీ అన్నది 10 ఆసియా దేశాల కూటమి. బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, మలేషియా, మయన్మార్, సింగపూర్, థాయిల్యాండ్, ఫిలిప్పీన్స్, లావోస్, వియత్నాం సభ్యదేశాలుగా ఉన్నాయి. సీపీటీపీపీ అన్నది కెనడా, మెక్సికో, పెరూ, చిలీ, న్యూజిల్యాండ్, ఆస్ట్రేలియా, బ్రూనై, సింగపూర్, మలేషియా, వియత్నాం, జపాన్‌తో కూడిన కూటమి.

చైనా ప్లస్ వన్‌తో పెద్దగా లబ్ది పొందలేదు..

చైనా ప్లస్ వన్ అవకాశాలను భారత్ తగినంత అందిపుచ్చుకోలేదని సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో భారత్ కంటే వియత్నాం, ఇండోనేషియా, మలేషియా, తుర్కియే, మెక్సికో ఎక్కువగా ప్రయోజనం పొందినట్టు చెప్పారు. అంతర్జాతీయ విలువ ఆధారిత సరఫరా వ్యవస్థలో భారత్ బలపడాలంటూ 70 శాతం వాణిజ్యం ఈ రూపంలోనే ఉంటుందన్నారు. ఇతర దేశాల కంటే మన దగ్గర టారిఫ్‌లు ఎక్కువగా ఉన్నట్టు చెప్పారు. ''మన దగ్గర 2-3 అవరోధాలున్నాయి. టారిఫ్‌లు ఎక్కువగా ఉండడం ఇందులో ఒకటి. టారిఫ్‌లను తగ్గించకపోతే మనం ప్రయోజనం పొందలేం. అలాగే, మనకు కావాల్సిన స్థాయిలో ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు ఉండడం లేదు. సామర్థ్య వినియోగం 70 శాతంగానే ఉంది''అని సుబ్రమణ్యం వివరించారు. అంతర్జాతీయంగా భారత్ ప్రకాశిస్తున్న కిరణమంటూ, విధానపరమైన స్థిరత్వంతోపాటు సంస్కరణలు వేగవంతమైన వృద్ధి దిశగా నడిపిస్తున్నట్టు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం జీడీపీ వృద్ధిని గుర్తు చేశారు. ప్రపంచ వృద్ధిలో భారత్ 20 శాతం వాటా సమకూరుస్తోందని, రానున్న రోజుల్లో ఇది ఇంకా పెరుగుతుందన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందించండి

బ్యాంకులకు ఆర్థిక శాఖ సూచనలు

న్యూఢిల్లీ: వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన మేర రుణ వితరణ చేయాలంటూ బ్యాంక్‌లను కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. వ్యవసాయ అనుబంధ రంగాలైన పశువుల పెంపకం, డైరీ, ఫిషరీస్‌కు రుణ వితరణ పురోగతిపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎం.నాగరాజు మంగళవారం ఢిల్లీలో అధికారులతో కలసి సమీక్షించారు. ప్రభుత్వరంగ బ్యాంక్‌లు (పీఎస్‌బీలు), నాబార్డ్, వ్యవసాయ అనుబంధ రంగాలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీల తరఫున ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రుణ వితరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు బ్యాంక్‌లు చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నాగరాజు కోరారు. అలాగే ఈ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అభివృద్ధి, ఉపాధి కల్పన పరంగా అనుబంధ రంగాలకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. అన్ని ప్రాంతాల్లోనూ రుణ వితరణ సాఫీగా సాగేందుకు సమావేశాల నిర్వహణ/మదింపు చేపట్టాలని బ్యాంక్‌లను ఆదేశించారు. చేపల రైతులను గుర్తించి, వారికి కేసీసీ కింద ప్రయోజనం అందే దిశగా రాష్ట్రాలకు సహకారం అందించాలని నాబార్డ్‌ను సైతం కోరారు.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు Q2 RESULTS

అశోక్ లేలాండ్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 767 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం అశోక్ లేలాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 35 శాతం జంప్‌చేసి రూ. 767 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 551 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 2 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 10,754 కోట్ల నుంచి రూ. 11,262 కోట్లకు ఎగసింది. నిర్వహణ లాభం(ఇబిటా) 12 శాతం పుంజుకుని రూ. 1,017 కోట్లకు చేరింది. తేలికపాటి వాణిజ్య వాహన అమ్మకాలు స్వల్పంగా తగ్గి 16,629 యూనిట్లకు పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు బీఎస్‌ఈలో 3 శాతం ఎగసి రూ. 222 వద్ద ముగిసింది.

ఎంఆర్ఎఫ్ లాభం క్షీణత

క్యూ2లో రూ. 471 కోట్లు



న్యూఢిల్లీ: టైర్ల తయారీ దిగ్గజం ఎంఆర్ఎఫ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు వెలువరించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం క్షీణించి రూ. 471 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 587 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 10 శాతం ఎగసి రూ. 6,881 కోట్లను అధిగమించింది. గత క్యూ2లో రూ. 6,217 కోట్ల టర్నోవర్ సాధించింది. కాగా.. స్టాండెలోన్ నికర లాభం 20 శాతం తగ్గి రూ. 455 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 572 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 11 శాతం పుంజుకుని రూ. 6,760 కోట్లను దాటింది.

ఫలితాల నేపథ్యంలో ఎంఆర్ఎఫ్ షేరు బీఎస్‌ఈలో 1.4 శాతం నష్టంతో రూ. 1,19,286 వద్ద ముగిసింది.

ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు రూ.193 కోట్ల లాభం

ఆదాయం రూ.19,88 కోట్లు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్స్ సేవలు నిర్వహించే ఫోర్టిస్ హెల్త్‌కేర్ సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.193 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఆదాయం రూ.1,988 కోట్లకు వృద్ధి చెందింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.184 కోట్లు, ఆదాయం రూ.1,770 కోట్ల చొప్పున ఉన్నాయి. హాస్పిటల్ వ్యాపారంలో సానుకూల పనితీరు కొనసాగించామని, కన్సాలిడేటెడ్ ఎబిటాలో 82 శాతం ఈ విభాగం నుంచే సమకూరిందని ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఎండీ, సీఈవో అశుతోష్ రఘువంశి తెలిపారు. ఫరీదాబాద్, ఆనంద్‌పూర్, షాలిమార్ బాగ్, నోయిడాలోని ఆస్పత్రుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 700 అదనపు పడకల ఏర్పాటు దిశగా పురోగతి ఉన్నట్టు చెప్పారు. 2023-24లో తాము కొనుగోలు చేసిన మనేసర్‌లోని 350 పడకల వసతిని అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ప్రకటించారు. ఒక్క హాస్పిటల్ విభాగం ఆదాయం 14 శాతం పెరిగి రూ.1,655 కోట్లుగా నమోదైంది.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు అర శాతం తగ్గి రూ.621 వద్ద ముగిసింది.

రేమండ్ లైఫ్‌స్టయిల్ పేలవ పనితీరు

70 శాతం క్షీణించిన లాభం



న్యూఢిల్లీ: రేమండ్ లైఫ్‌స్టయిల్ ఇన్వెస్టర్లను నిరాశపరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికానికి రూ.42 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసిక లాభం రూ.139 కోట్లతో పోల్చి చూస్తే.. 70 శాతం తగ్గిపోయింది. డిమాండ్ తగ్గడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ప్రభావం చూపించాయి. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 5 శాతానికి పైగా క్షీణించి రూ.1,708 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు కేవలం ఒక శాతం పెరిగి రూ.1,623 కోట్లుగా ఉన్నాయి. డిమాండ్‌లో స్తబ్దత, బలహీన వినియోగ సెంటిమెంట్, ద్రవ్యోల్బణ పరమైన ఒత్తిళ్లలోనూ స్థిరమైన పనితీరు చూపించినట్టు రేమండ్ లైఫ్‌స్టయిల్ ఎండీ సునీల్ కటారియా తెలిపారు. టెక్స్‌టైల్స్ విభాగం ఆదాయం (బ్రాండెడ్ వస్త్రాలు) 8 శాతం క్షీణించి రూ.853 కోట్లుగా ఉంది. 'షర్టింగ్' విభాగం (బీ2బీ) ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.228 కోట్లుగా నమోదైంది. అప్పారెల్ విభాగం ఆదాయం ఒక శాతం పెరిగి రూ.441 కోట్లుగా ఉంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కంపెనీ షేరు 8 శాతం పతనంతో రూ.2,024 వద్ద స్థిరపడింది.

నష్టాల బాటలోనే ఏబీఎఫ్ఆర్ఎల్

ఆదాయంలో 13 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ (ఏబీఎఫ్ఆర్ఎల్) సెప్టెంబర్ క్వార్టర్‌కు రూ.215 కోట్ల కన్సాలిడేటెడ్ నికర నష్టాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నష్టం రూ.200 కోట్లతో పోల్చితే 7 శాతం అధికమైంది. ఇదే కాలంలో ఆదాయం 13 శాతం వృద్ధితో రూ.3,226 కోట్ల నుంచి రూ.3,644 కోట్లకు చేరింది. బ్రాండ్, రిటైల్ ఆస్తుల విలువ అధికంగా క్షీణించడం, పెరిగిపోయిన రుణాల వ్యయాలు నష్టాలు అధికం కావడానికి దారితీసినట్టు సంస్థ తెలిపింది. ఈ క్వార్టర్ ఫలితాలను ముందు త్రైమాసికాలతో పోల్చి చూడరాదని సంస్థ కోరింది. సెప్టెంబర్ త్రైమాసికంలో టీసీఎన్ఎస్ క్లాతింగ్ విలీనం, గుడ్‌ప్యూ ఫ్యాషన్ ప్రైవేటు లిమిటెడ్ కొనుగోలు లావాదేవీలను ప్రస్తావించింది. స్తబ్దుగా ఉన్న వినియోగ వాతావరణంలోనూ స్థిరమైన వృద్ధిని నమోదు చేసినట్టు పేర్కొంది. ఉత్పత్తులను పెంచడం, కస్టమర్లకు మెరుగైన అనుభవం దిశగా చర్యలు కొనసాగుతాయని తెలిపింది.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు ధర 2 శాతం క్షీణించి రూ.303 వద్ద ముగిసింది.

నష్టాల్లో జేకే లక్ష్మీ సిమెంట్

క్యూ2లో రూ. 19 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ జేకే లక్ష్మీ సిమెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు వెలువరించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో లాభాలను వీడి రూ. 19 కోట్లకుపైగా నికర నష్టం ప్రకటించింది. సిమెంట్ అమ్మకపు ధరలు నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 96 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం స్వల్పంగా 2 శాతం క్షీణించి రూ. 1,234 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 1,575 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం నామమాత్రంగా తగ్గి రూ. 1,263 కోట్లకు చేరాయి. అమ్మకాలు 1 శాతం వెనకడుగుతో 18.66 లక్షల టన్నులను తాకాయి. ప్రధాన మార్కెట్లో సిమెంట్ అమ్మకపు ధరలు భారీగా క్షీణించినట్లు కంపెనీ చైర్‌పర్సన్, ఎండీ వినీతా సింఘానియా పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో జేకే లక్ష్మీ షేరు బీఎస్‌ఈలో 3 శాతం పతనమై రూ. 776 వద్ద ముగిసింది.

అర్జున్-పర్హామ్ గేమ్ డ్రా


హారిక, వైశాలి మధ్య గేమ్ దృశ్యం

చెన్నై: గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు ఇరిగేశి అర్జున్ తన ఐదో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. అర్జున్, పర్హామ్ మగ్‌సూద్లూ (ఇరాన్) మధ్య జరిగిన గేమ్ సమంగా ముగిసింది. ఈ రౌండ్ తర్వాత 4 పాయింట్లతో అర్జున్ అగ్ర స్థానంలోనే కొనసాగుతున్నాడు. అయితే లెవాన్ అరోనియన్ 3.5 పాయింట్లతో అతనికి చేరువగా వచ్చాడు. శనివారం జరిగిన పోరులో మ్యాగ్జిమ్ వాచైర్-లెగ్రేవ్‌పై అరోనియన్ విజయం సాధించి రెండో స్థానానికి చేరుకున్నాడు. మరో భారత ప్లేయర్ విదిత్ గుజరాతీ కూడా అమీన్‌తో జరిగిన గేమ్‌ను డ్రాగా ముగించాడు. చాలెంజర్ కేటగిరీలో వరుసగా నాలుగు విజయాల తర్వాత వి.ప్రణవ్ జోరుకు బ్రేక్ పడింది. ప్రణవ్, రౌనక్ సిధ్వాని మధ్య జరిగిన ఐదో రౌండ్ డ్రా అయింది. ఇదే కేటగిరీలో ఇద్దరు మహిళా గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, ఆర్.వైశాలి మధ్య జరిగిన గేమ్ కూడా సమంగానే ముగిసింది.

ముంబై ఘనవిజయం

ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో ఒడిశా చిత్తు


షమ్స్

ముంబై: లెఫ్టార్మ్ స్పిన్నర్ షమ్స్ ములానీ రెండో ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్ల ప్రదర్శన చేయడంతో ఒడిశాతో రంజీ మ్యాచ్‌లో ముంబై జట్టు ఘన విజయం సాధించింది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన పోరులో ముంబై ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో ఒడిశా జట్టును మట్టకరిపించింది. ఓవర్‌నైట్ స్కోరు 126/5తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిశా జట్టు 72.5 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ ఆశీర్వాద్ (51; 3 ఫోర్లు), కార్తీక్ బిస్వాల్ (45 నాటౌట్; 5 ఫోర్లు) పోరాడినా జట్టును ఇన్నింగ్స్ పరాజయం నుంచి తప్పించలేక పోయారు. ముంబై బౌలర్లలో షమ్స్ ములానీ 5, హిమాన్షు సింగ్ 4 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన ములానీ... రెండో ఇన్నింగ్స్‌లోనూ తన స్పిన్‌తో ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు. అంతకుముందు ముంబై 602/4 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... ఒడిశా తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేసి ఫాలోఆన్‌లో పడింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేయలేక ఓటమి పాలైంది. షమ్స్ ములానీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

మెరిసిన నజ్ముల్ షంటో

అఫ్గానిస్తాన్‌పై బంగ్లాదేశ్ గెలుపు


నజ్ముల్

షార్జా: తొలి వన్డేలో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిన బంగ్లాదేశ్... రెండో మ్యాచ్‌లో సత్తా చాటింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో వన్డేలో బంగ్లాదేశ్ 68 పరుగుల తేడాతో అఫ్గాన్‌పై గెలుపొందింది. ఫలితంగా సిరీస్ 1-1తో సమమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నజ్ముల్ షంటో (119 బంతుల్లో 76; 6 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధసెంచరీ నమోదు చేయగా... సౌమ్య సర్కార్ (35), జాకీర్ అలీ (37 నాటౌట్; ఒక ఫోర్, 3 సిక్సర్లు), నసుమ్ అహ్మద్ (25; ఒక ఫోర్, రెండు సిక్సర్లు) రాణించారు. తన్జిద్ హసన్ (22), మెహది హసన్ మిరాజ్ (22) కూడా ఫర్వాలేదనిపించారు అఫ్గాన్ బౌలర్లలో నంగెయాలియా ఖరోటె 3, రషీద్ ఖాన్ ఘజన్‌ఫర్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గానిస్తాన్ 43.3 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌటైంది. రహమత్ షా (76 బంతుల్లో 52; 5 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించగా... సెదిఖుల్లా అటల్ (39; 5 ఫోర్లు), గుల్బదిన్ నైబ్ (26; 4 ఫోర్లు, ఒక సిక్సర్) తలా కొన్ని పరుగులు చేశారు. గత మ్యాచ్‌లో స్ఫూర్తివంతమైన ప్రదర్శన కనబర్చిన అఫ్గాన్ బ్యాటర్లు ఈ సారి అదే జోష్ కొనసాగించలేకపోయారు. రహ్మనుల్లా గుర్బాజ్ (2), అజ్మతుల్లా (0), హష్మతుల్లా (17), మొహమ్మద్ నబీ (17), రషీద్ ఖాన్ (14) విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నసుమ్ అహ్మద్ 3... ముస్తఫిజుర్ రహమాన్, మెహదీ హసన్ మిరాజ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే సోమవారం ఇక్కడే జరగనుంది.

తెలుగు టైటాన్స్ తడాఖా

- పీకేఎల్‌లో వరుసగా నాలుగో విజయం
- పుణేరి పల్టన్‌పై గెలుపు


పుణేరి పల్టన్ రెయిడర్‌ను పట్టేస్తున్న టైటాన్స్ ఆటగాళ్లు

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై ఆడిన తొలి అంచె పోటీలను తెలుగు టైటాన్స్ విజయంతో ముగించింది. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో భాగంగా శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తమ చివరి పోరులో తెలుగు టైటాన్స్ జట్టు 34-33 పాయింట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్‌పై గెలుపొందింది. తాజా సీజన్‌లో టైటాన్స్‌కు ఇది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. చివరి వరకు ఆధిక్యం చేతులు మారుతూ సాగిన పోరులో టైటాన్స్ తరఫున విజయ్ మాలిక్ 13 పాయింట్లు, పవన్ సెహ్రావత్ 12 పాయింట్లతో రాణించారు. పవన్ తన రెయిడింగ్ ప్రతిభతో దుమ్మురేపగా... విజయ్ మాలిక్ 8 బోనస్ పాయింట్లు సాధించడం గమనార్హం. మ్యాచ్ ఆరంభంలోనే పల్టన్ జట్టు ఆధిక్యం సాధించినా... చివరి వరకు పోరాటం వీడని టైటాన్స్ మెరుగైన ప్రదర్శనతో ఫలితం రాబట్టింది. పుణేరి పల్టన్ తరఫున పంకజ్ మోహిత్ 9 పాయింట్లతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. ఓవరాల్‌గా మ్యాచ్‌లో టైటాన్స్ 25 రెయిడ్ పాయింట్లు సాధించగా... పల్టన్ 19 పాయింట్లకే పరిమితమైంది. టైటాన్స్ జట్టు రెండు సార్లు ఆలౌట్ కాగా... పల్టన్ ఒకసారి ఆలౌటైంది. తాజా సీజన్‌లో ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడిన టైటాన్స్... 5 విజయాలు, 3 పరాజయాలతో 26 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ఓడినా... పుణేరి పల్టన్ 30 పాయింట్లతో పట్టిక అగ్ర స్థానంలోనే కొనసాగుతోంది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 40-29 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. బెంగాల్ వారియర్స్ తరఫున నితిన్ కుమార్ 14 పాయింట్లు, మణిందర్ సింగ్ 10 పాయింట్లు సాధించారు. బెంగళూరు బుల్స్ తరఫున అక్షిత్ ధుల్ 11 పాయింట్లతో ఒంటరి పోరాటం చేశాడు. తాజా సీజన్‌లో బెంగాల్ వారియర్స్‌కు ఇది రెండో విజయం కాగా... 18 పాయింట్లతో ఆ జట్టు పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. మరోవైపు ఐదో పరాజయం మూటగట్టుకున్న బెంగళూరు బుల్స్ 12 పాయింట్లతో 11వ ప్లేస్‌లో ఉంది. శనివారంతో హైదరాబాద్ అంచె మ్యాచ్‌లు ముగియగా... నేటి నుంచి నోయిడా వేదికగా పోటీలు జరగనున్నాయి. ఆదివారం యూపీ యోధాస్‌తో యూ ముంబా (రాత్రి 8 గంటలకు), గుజరాత్ జెయింట్స్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

భరత్, విహారి పోరాడినా...

- ఆంధ్ర జట్టుకు తప్పని 'డ్రా'
- ఉత్తరాఖండ్‌తో రంజీ మ్యాచ్


విహారి


భరత్

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీలో తొలి విజయం కోసం చకోర పక్షిలా ఎదురు చూస్తున్న ఆంధ్ర జట్టుకు నాలుగో మ్యాచ్‌లోనూ అది దక్కలేదు. ఊరించే లక్ష్య ఛేదనలో మిడిలార్డర్ రాణించినా... కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడం దెబ్బ కొట్టింది. మొత్తానికి పరాజయాల హ్యాట్రిక్ అనంతరం తాజా సీజన్‌లో ఆంధ్ర జట్టు ఓటమినుంచి తప్పించుకుంటూ తొలి 'డ్రా' నమోదు చేసుకుంది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా విజయనగరం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌ను ఆంధ్ర జట్టు 'డ్రా'గా ముగించింది. 321 పరుగుల విజయ లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 8/1తో శనివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు... చివరకు 93 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ (90 బంతుల్లో 92; 12 ఫోర్లు, ఒక సిక్సర్) జట్టును గెలిపించేందుకు విఫలయత్నం చేయగా... హనుమ విహారి (189 బంతుల్లో 66; 6 ఫోర్లు, ఒక సిక్సర్), కరణ్ షిండే (171 బంతుల్లో 65; 8 ఫోర్లు) అర్ధశతకాలతో రాణించారు. ఓపెనర్లు అభిషేక్ రెడ్డి (6), మారంరెడ్డి హేమంత్ రెడ్డి (2) త్వరగానే ఔటవడంతో ఆంధ్ర జట్టుకు మరో ఓటమి తప్పదనిపించినా... కెప్టెన్ షేక్ రషీద్ (31; 4 ఫోర్లు) కాసేపు పోరాడాడు. అతడు వెనుదిరిగిన తర్వాత కరణ్ షిండే , హనుమవిహారి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. తొందరపాటుకు పోకుండా ఆచితూచి ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. విహారి అచ్చమైన టెస్టు ఇన్నింగ్స్‌తో ఆలరించగా.. శ్రీకర్ భరత్ ఎడాపెడా బౌండ్రీలతో మైదానాన్ని హోరెత్తించాడు. అతడున్నంతసేపు ఆంధ్ర జట్టు విజయం సాధించడం ఖాయమే అనిపించింది. అయితే మరి కాసేపట్లో ఆట ముగుస్తుందనగా... అతడు పెవిలియన్ చేరడంతో ఆంధ్ర జట్టు ఆశలు ఆవిరయ్యాయి. ఉత్తరాఖండ్ బౌలర్లలో దీపక్ ధాపోలా 5 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన ఉత్తరాఖండ్ ఓపెనర్ ప్రియాన్షు ఖండూరికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్ 338; ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 146; ఉత్తరాఖండ్ రెండో ఇన్నింగ్స్ 128/9 డిక్లేర్డ్; ఆంధ్ర రెండో ఇన్నింగ్స్: అభిషేక్ రెడ్డి (బి) దీపక్ ధాపోలా 6; హేమంత్ రెడ్డి (ఎల్బీ) (బి) దీపక్ ధాపోలా 2; షేక్ రషీద్ (ఎల్బీ) (బి) దీపక్ ధాపోలా 31; కరణ్ షిండే (సి) అవనీశ్ సుధ (బి) దీపక్ ధాపోలా 65; హనుమ విహారి (బి) దీపక్ ధాపోలా 66; శ్రీకర్ భరత్ (సి) ఆదిత్య తారె (బి) దేవేంద్ర సింగ్ బోరా 92; శశికాంత్ (నాటౌట్) 7; విజయ్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు 16, **మొత్తం (93 ఓవర్లలో 6 వికెట్లకు) 286. వికెట్ల పతనం:** 1-8, 2-13, 3-56, 4-140, 5-276, 6-282, **బౌలింగ్:** దీపక్ ధాపోలా 21-3-75-5, మయాంక్ మిశ్రా 16-5-34-0; స్వప్నిల్ సింగ్ 19-3-52-0, అభయ్ నేగి 17-4-57-0, దేవేంద్ర సింగ్ బోరా 14-2-46-1, అవనీశ్ సుధ 5-1-6-0, రవికుమార్ సమర్థ్ 1-0-1-0.

నీరజ్ కోచ్‌గా జాన్ జెలెజ్నీ


జెలెజ్నీ


నీరజ్

భారత స్టార్‌తో జత కట్టిన దిగ్గజం

న్యూఢిల్లీ: జావెలిన్ త్రోలో ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకరు...ఇదే క్రీడాంశంలో సంచలన ప్రదర్శనతో దేశానికి ఒలింపిక్స్ స్వర్ణం అందించిన ఆటగాడు మరొకరు...వీరిద్దరు ఇప్పుడు మరిన్ని రికార్డులను సృష్టించే లక్ష్యంతో జోడీగా మారారు. భారత్ స్టార్ జావెలిన్ త్రోయర్, 2 ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా తన కొత్త కోచ్‌గా చెక్ రిపబ్లిక్ దిగ్గజం జాన్ జెలెజ్నీని కోచ్‌గా ఎంచుకున్నాడు. రాబోయే 2025 సీజన్‌కు ముందు జత కలిసిన నీరజ్, జెలెజ్నీ అద్భుతమైన ఫలితాలు సాధించాలని పట్టుదలగా ఉన్నారు. 58 ఏళ్ల జెలెజ్నీ 1988 సియోల్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన అనంతరం వరుసగా మూడు ఒలింపిక్స్ (1992, 1996, 2000)లలో స్వర్ణాలు గెలుచుకున్నాడు. మూడు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన అతని పేరిటే జావెలిన్‌ను అతి ఎక్కువ దూరం విసిరిన వరల్డ్ రికార్డు (98.48 మీటర్లు) కూడా ఉంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం సాధించిన నీరజ్‌కు ఇటీవలి వరకు జర్మనీకి చెందిన బయోమెకానిక్స్ ఎక్స్‌పర్ట్ క్లాస్ బార్టొనిట్జ్ కోచ్‌గా ఉన్నాడు. 'చిన్నప్పటినుంచి నేను జెలెజ్నీకి వీరాభిమానిని. ఆయన టెక్నిక్ అంటే ఎంతో ఇష్టం. నా ఆటను మెరుగుపర్చుకునేందుకు పెద్ద సంఖ్యలో ఆయన వీడియోలు చూస్తుండేవాడిని. ఇప్పుడు జెలెజ్నీతో కలిసి పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. మా ఇద్దరి త్రోయింగ్ శైలి ఒకటే. ముమ్ముందు నా కెరీర్‌లో మరిన్ని అత్యుత్తమ విజయాలు సాధిస్తాననే నమ్మకం ఉంది' అని నీరజ్ వ్యాఖ్యానించాడు. నీరజ్ ఆట గురించి తనకు బాగా తెలుసని...ఎంతో మంది అథ్లెట్లు కోచింగ్ కోసం తనను సంప్రదించినా వారందరినీ కాదని భారత ఆటగాడిని ఎంచుకోవడం అతనిలో ప్రతిభను చూసేనని జెలెజ్నీ వెల్లడించాడు. గతంలో ఈ దిగ్గజం శిక్షణలోనే జేకబ్ వాలెజ్, విటిస్లావ్ వెసెలి, బార్బరా స్పొటకోవా లాంటి ఆటగాళ్లు ఒలింపిక్స్‌లో పతకాలు గెలుచుకోవడం విశేషం.

హైదరాబాద్, రాజస్తాన్ మ్యాచ్ 'డ్రా'

- హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్ 273/3
- హిమతేజ సెంచరీ
- రంజీ ట్రోఫీ


హిమతేజ

జైపూర్: దేశవాళీ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీలో రాజస్తాన్‌తో మ్యాచ్‌ను హైదరాబాద్ 'డ్రా'చేసుకుంది. ఎలైట్ గ్రూప్ 'బి'లో ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ ఒక విజయం, 2 ఓటములు, ఒక 'డ్రా'తో 8 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానానికి చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 36/0తో శనివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 65 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. హిమతేజ (176 బంతుల్లో 101 నాటౌట్; 10 ఫోర్లు) అజేయ సెంచరీతో ఆకట్టుకోగా... తన్మయ్ అగర్వాల్ (126 బంతుల్లో 79; 2 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధ శతకంతో మెరిశాడు. అభిరత్ రెడ్డి (46; 7 ఫోర్లు), కెప్టెన్ రాహుల్ సింగ్ (47; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ఫర్వాలేదనిపించారు. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు నిర్ణీత సమయం కంటే ముందే 'డ్రాకు అంగీకరించారు. అంతకుముందు హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 410 పరుగులు చేయగా... రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 425 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన రాజస్తాన్ మూడు పాయింట్లు ఖాతాలో వేసుకొని ఓవరాల్‌గా 13 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. హైదరాబాద్ జట్టుకు ఒక పాయింట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో మెరుపు సెంచరీ బాదిన రాజస్తాన్ బ్యాటర్ శుభమ్ గర్వాల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు లభించింది.

స్కోరు వివరాలు:

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 410; రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్ 425; హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (ఎల్బీ) (బి) అజయ్ సింగ్ 79; అభిరత్ రెడ్డి (సి) కునాల్ సింగ్ రాథోడ్ 46; రోహిత్ రాయుడు (సి) కునాల్ సింగ్ రాథోడ్ (బి) అనికేత్ చౌధరి 0; హిమతేజ (నాటౌట్) 101; రాహుల్ సింగ్ (నాటౌట్) 47; ఎక్స్‌ట్రాలు 0, మొత్తం (65 ఓవర్లలో 3 వికెట్లకు) 273. వికెట్ల పతనం: 1-56, 2-57, 3-196, బౌలింగ్: దీపక్ చహర్ 2-0-11-0, అజయ్ సింగ్ 22-0-84-1, దీపక్ హుడా 6-2-17-0, మహిపాల్ లొమ్రోర్ 18-0-86-0, అరాఫత్ ఖాన్ 5-1-18-1, అనికేత్ చౌధరి 6-0-18-1, అభిజీత్ తోమర్ 6-0-39-0


రుత్విక

ఫైనల్లో రుత్విక-రోహన్ జంట

సాక్షి, హైదరాబాద్: ఎస్ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారిణి గద్దె రుత్విక శివాని ఫైనల్‌కు దూసుకెళ్లింది. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో జరుగుతున్న ఈ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ సెమీ ఫైనల్లో శనివారం రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) జంట 21-16, 21-13తో అమృత-సూర్య (భారత్) జోడీపై గెలుపొందింది. పురుషుల సింగిల్స్‌లో తెలంగాణ షట్లర్ కాటం తరుణ్ రెడ్డి ఫైనల్లో అడుగు పెట్టాడు. సెమీస్‌లో తరుణ్ 14-21, 21-13, 21-14తో తెలంగాణకే చెందిన రుషీంద్ర తిరుపతిపై గెలిచాడు. మరో సెమీస్‌లో రిత్విక్ సంజీవి సతీశ్ కుమార్ (భారత్) 21-18-21-13తో మైరాబాలువాంగ్ మైస్నమ్ (భారత్)పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో ఇషారాణి బారువా (భారత్) 15-21, 21-18, 21-11తో అనుపమా ఉపాధ్యాయ్ (భారత్)పై, రక్షిత శ్రీ సంతోష్ రామరాజ్ (భారత్) 21-11, 21-17తో అన్‌మోల్ ఖరబ్ (భారత్)పై గెలిచి ఫైనల్లో అడుగు పెట్టారు. పురుషుల డబుల్స్‌లో తెలంగాణకు చెందిన పంజాల విష్ణువర్ధన్ గౌడ్ తన భాగస్వామి ఎం.ఆర్.అర్జున్‌తో కలిసి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. సెమీ ఫైనల్లో విష్ణువర్ధన్ గౌడ్-అర్జున్ ద్వయం 21-12, 14-21, 21-18తో సూరజ్-ధ్రువ్ రావత్ (భారత్) జంటపై, పృథ్వీ కృష్ణమూర్తి-సాయిప్రతీక్ (భారత్) జోడీ 21-18, 21-19తో హరిహరన్-రూబన్ కుమార్ (భారత్) జంటపై గెలిచి టైటిల్ ఫైట్‌కు చేరుకున్నారు. మహిళల డబుల్స్‌లో ప్రియ-శృతి (భారత్) ద్వయం 21-10, 21-18తో ప్రగతి-విశాఖ (భారత్) జంటపై, ఆరతి సారా-వర్షిణి (భారత్) జోడీ 21-13, 16-21, 21-15తో అమృత-సోనాలీ (భారత్)ద్వయంపై గెలిచి తుదిపోరుకు అర్హత సాధించింది.

ఐఎస్ఎల్ 1000వ మ్యాచ్ 'డ్రా'


ముంబై, చెన్నైయిన్ మ్యాచ్‌లో దృశ్యం

చెన్నై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) చరిత్రలో 1000వ మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. శనివారం ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్, చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్ మధ్య జరిగిన పోరు 1-1 గోల్స్‌తో 'డ్రా' అయింది. ముంబై జట్టు తరఫున నాథన్ రోడ్రిగ్స్ (63వ నిమిషంలో) ఒక గోల్ సాధించగా... చెన్నైయన్ ఎఫ్‌సీ తరఫున కెప్టెన్ ర్యాన్ ఎడ్వర్డ్స్ (60వ ని.లో) ఏకైక గోల్ సాధించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు పోరాడాయి. ఇరు జట్లు చెరో 14 షాట్లు ఆడగా... అందులో ప్రత్యర్థి గోల్‌పోస్ట్ లక్ష్యంగా నాలుగేసి సార్లు దాడులు చేశాయి. ముంబై జట్టు చిన్న చిన్న పాస్‌లతో ముందుకు సాగగా... చెన్నైయన్‌జట్టు 15 ఫౌల్స్ చేసింది. ఈ ఫలితంతో 8 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 3 పరాజయాలు, 2 'డ్రా'లు నమోదు చేసుకున్న చెన్నైయన్ జట్టు 12 పాయింట్లతో పట్టిక నాలుగో స్థానానికి చేరగా... 10 పాయింట్లు ఖాతాలో ఉన్న ముంబై జట్టు 8వ స్థానంలో ఉంది. ఈస్ట్ బెంగాల్, మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ మధ్య జరిగిన మరో మ్యాచ్ కూడా 0-0తో 'డ్రా'గా ముగిసింది. ఇరు జట్లూ గోల్ సాధించడంలో విఫలమయ్యాయి. లీగ్‌లో భాగంగా ఆదివారం ఒడిశా ఫుట్‌బాల్ క్లబ్‌తో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు తలపడుతుంది.

శ్రీలంక విజయం

తొలి టి20లో న్యూజిలాండ్ ఓటమి



దంబుల్లా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక... న్యూజిలాండ్‌తో తొలి టి20లో విజయం సాధించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి టి20లో శ్రీలంక 4 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 19.3 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. బ్రాస్‌వెల్ (27), జాకరీ ఫోల్క్స్ (27 నాటౌట్) మినహా తక్కిన వాళ్లంతా విఫలమయ్యారు. టిమ్ రాబిన్‌సన్ (3), గ్లెన్ ఫిలిప్స్ (1), మిషెల్ హై (0), జోష్ క్లార్క్‌సన్ (3) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లలగే 3, పతిరన, హసరంగ, నువాన్ తుషారా తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 19 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' చరిత అసలంక (28 బంతుల్లో 35; ఒక ఫోర్, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా... కుశాల్ పెరీరా (23), కమిందు మెండిస్ (23), వనిందు హసరంగ (22) తలా కొన్ని పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకరీ ఫోల్క్స్ 3 వికెట్లు పడగొట్టాడు. ఇరు జట్ల మధ్య నేడు ఇక్కడే రెండో టి20 మ్యాచ్ జరగనుంది.

కిరణ్ జార్జి పరాజయం

కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఇక్సాన్ సిటీ (కొరియా): భారత యువ షట్లర్ కిరణ్ జార్జి కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెమీ ఫైనల్లో పరాజయం పాలయ్యాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో శనివారం కిరణ్ జార్జి 12-21, 20-22తో టాప్ సీడ్, ప్రపంచ మాజీ చాంపియన్ కున్లావత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడాడు. ప్రపంచ 41వ ర్యాంకర్ కిరణ్ జార్జి... తొలి గేమ్‌లో ప్రత్యర్థికి పెద్దగా పోటీనివ్వలేకపోయినా... రెండో గేమ్‌లో తుదికంటా పోరాడాడు. రెండో గేమ్ ఆరంభంలోనూ ప్రత్యర్థిదే పైచేయి కాగా... 24 ఏళ్ల కిరణ్ అసమాన పోరాటం కనబర్చాడు. 4-13తో వెనుకబడిపోయిన కిరణ్... చక్కటి షాట్లతో 20-20తో స్కోరు సమం చేశాడు. అయితే ఆఖర్లో ఒత్తిడిని అధిగమించిన వితిద్‌సర్న్ వరుసగా రెండు పాయింట్లు సాధించి ఫైనల్లో అడుగుపెట్టాడు.

కెనడాకు పోనివ్వలేదని

కన్నతల్లినే కడతేర్చాడు

ఢిల్లీలో ఘటన

న్యూఢిల్లీ: మత్తు మహమ్మారికి బానిసైన పెద్దకుమారుడు కన్నతల్లినే చంపేసిన ఘటన దేశ రాజధానిలో చోటుచేసుకుంది. ఆగ్నేయ ఢిల్లీ పోలీస్ కమిషనర్ రవిసింగ్ తెలిపిన వివరాల ప్రకారం దక్షిణ ఢిల్లీలోని బాదర్‌పూర్ ప్రాంతంలోని మోలార్‌బంద్ గ్రామంలో 52 ఏళ్ల సుర్జీత్ సింగ్ భార్య గీత, పెద్దకుమారుడు కృష్ణకాంత్(31), చిన్న కుమారుడు సాహిల్ బోలీ(27)తో కలిసి ఉంటున్నారు. సుర్జీత్ స్థిరాస్తి వ్యాపారికాగా సాహిల్ ఒక బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. పెద్దకొడుకు కృష్ణకాంత్ మాత్రం తాగుడు, మత్తుపదార్థాలకు బానిసై ఖాళీగా తిరిగేవాడు. తల్లి గీత ఎంతచెప్పినా వినేవాడు కాదు. పైగా కెనడాలో ఉద్యోగం చేస్తా, అక్కడికి వెళ్లి సెటిల్ అవుతానని డబ్బులు ఇవ్వాలని తరచూ గొడవ చేసేవాడు. ''నీకు పెళ్లిచేస్తే అంతా సర్దుకుంటుంది. తొలుత పెళ్లి. ఆ తర్వాతే కెనడా ఆలోచన'అని తల్లి వారించేది. నవంబర్ ఆరో తేదీ సాయంత్రం సైతం ఎవరూలేని సమయంలో తల్లితో కృష్ణకాంత్ ఇదే విషయమై తీవ్ర వాగ్వాదం జరిగింది. పట్టరాని కోపంతో కత్తితో తల్లిని పలుమార్లు పొడిచి చంపేసి తండ్రికి ఫోన్‌చేసి రప్పించాడు. పై గదిలో తల్లి చనిపోయి పడిఉందని, క్షమాపణలు చెప్పి పైకి తీసుకెళ్లాడు. రక్తపుమడుగులో పడి ఉన్న భార్యను చూసి సుర్జీత్ నిశ్చేష్టుడై నిల్చుంటే కొడుకు గదికి బయటి నుంచి తాళం వేసి పారిపోయాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో తండ్రి ఎలాగోలా బయటపడి తల్లిని దగ్గర్లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు ధృవీకరించారు. విషయం తెల్సుకున్న పోలీసులు అదే ప్రాంతంలో కృష్ణకాంత్‌ను అరెస్ట్‌చేసి హత్యకు కారణాలు అడిగారు. ''నేను జీవితంలో ఎదగకపోవడానికి నా తల్లే కారణం. కెనడాకు వెళ్లకుండా నాకు వ్యతిరేకంగా ఆమె క్షుద్రపూజలు చేయిస్తోంది. నేనిలా ఉండటానికి ఆమే కారణం''అని చెప్పాడు. డ్రగ్స్‌కు బానిసైన ఇతడు తల్లిని చంపేందుకు ముందే పథకరచన చేశాడని, గతంలో ఒక కత్తిని ఇందు కోసమే కొన్నాడని పోలీసుల దర్యాప్తులో తేలింది.

మొరుగుతున్నాయని

తగలబెట్టారు

- మూగజీవాలపై మహిళల కర్కశత్వం
- యూపీలో ఐదు కుక్కపిల్లలను చంపేసిన వైనం

మీరట్: ఆధునిక ప్రపంచంలో సుఖమంతమైన జీవనానికి అలవాటుపడిన జనం కాస్తంత అసౌకర్యాన్ని కూడా తట్టుకోలేకపోతున్న విపరీత ధోరణికి దర్పణం పట్టే దారుణఘటన ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. మొరుగుతున్నాయన్న ఒకే ఒక్క కారణంతో ఐదు వీధి కుక్కల పిల్లలను ఇద్దరు మహిళలు నిర్దయగా పెట్రోల్ పోసి కాల్చేసిన ఘటన మీరట్‌లోని రోహ్‌తా రోడ్ సంత్‌నగర్ కాలనీలో నవంబర్ ఐదో తేదీన జరిగింది. పసికూనలను అత్యంత హేయంగా అంతమొందించిన ఘటన వివరాలను కంకేర్‌ఖేడా పోలీస్‌స్టేషన్ అధికారి జితేంద్ర వెల్లడించారు. మూగజీవాల సంరక్షణ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి అన్షుమాలి వశిష్ట ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు మొదలెట్టారు. వరసకు వదినా మరదళ్లు అయిన శోభ, ఆర్తీ అనే ఇద్దరు మహిళల ఇళ్ల సమీపంలోనే ఈ వీధి కుక్క ఇటీవల ఐదు కూనలకు జన్మనిచ్చింది. అక్కడే తచ్చాడుతూ మొరుగుతున్న వాటిని చూసి శోభ, ఆర్తీలకు చిర్రెత్తికొచ్చింది. ఆ ఐదు కుక్కపిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించి అగ్నికి ఆహుతిచేశారు. విషయం తెల్సుకున్న స్థానికులు వీరితో వాగ్వాదానికి దిగితే వదినామరదళ్ల బూతులు, తిట్ల పురాణానికి స్థానికులే వెనుతిరిగారు. నేరుగా కంకేర్‌ఖేడా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేశారు. ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. చేసేదిలేక స్థానికులే ఆ ఐదు కళేబరాలను ఖననంచేశారు. మూగజీవాలను మంటగలిపిన ఉదంతం తెల్సి మూగజీవాల సంరక్షణ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి అన్షుమాలి వశిష్ట వెంటనే మీరట్ వ్యాపారసంఘాల ప్రతినిధులతో కలిసి పోలీసు అధికారి సుచిత్రకు ఫిర్యాదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. దీంతో శోభ, ఆర్తీలపై పోలీసులు కేసు నమోదుచేశారు. జంతువులను హింసించడానికి సంబంధించిన సెక్షన్ 325 కింద కేసు నమోదుచేశారు.

'బెయిల్'పై నిర్ణయం వాయిదా ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: బెయిల్ కోరుతూ దాఖలైన పిటిషన్లు సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉండడం, న్యాయస్థానాలు వాటిపై సకాలంలో నిర్ణయాలు తీసుకోకపోవడంపై, నిర్ణయాన్ని సంత్సరాల తరబడి వాయిదా వేస్తుండడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. బెయిల్ పిటిషన్ల విషయంలో నిర్ణయాన్ని ఒక్క రోజు ఆలస్యం చేసినా పౌరుల ప్రాథమిక హక్కులపై తీవ్ర ప్రభావం పడుతుందని వెల్లడించింది. కోర్టుల్లో జరిగే జాప్యం ప్రజల ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమే అవుతుందని పరోక్షంగా తేల్చిచెప్పింది. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు అత్యధిక ప్రాధాన్యం ఉందని, కోర్టులు ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వు జారీ చేసింది. బెయిల్ పిటిషన్లను ఎక్కువ కాలం పెండింగ్‌లో పెట్టే విధానాన్ని తాము ఎంతమాత్రం ఆమోదించడం లేదని వెల్లడించింది. తన బెయిల్ అప్లికేషన్ అలహాబాద్ హైకోర్టులో గత ఏడాది ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉందని, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని పేర్కొంటూ ఓ వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం బెయిల్ పిటిషన్ల విషయంలో కీలక ఉత్తర్వు జారీ చేసింది. ఇదిలా ఉండగా, సదరు వ్యక్తి అప్లికేషన్‌పై ఈ నెల 11న నిర్ణయం ప్రకటించనున్నట్లు అలహాబాద్ హైకోర్టు పేర్కొంది.

కోడి కాదిది.. హోటల్



ఇదేదో రాక్షస కోడి అనుకుంటున్నారా? అదేమీ కాదు. ఆ ఆకారంలో ఉన్న హోటల్. కోడి ఆకృతిలోని హోటళ్లలో ప్రపంచంలోకెల్లా అతి పెద్దదిగా తాజాగా గిన్నిస్ రికార్డులకెక్కింది. ఇది ఫిలిప్పీన్స్‌లో కంపుస్తోహన్‌లోని హైలాండ్ రిసార్ట్‌లో ఉంది. 115 అడుగుల ఎత్తు, 92 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పున్న ఈ హోటల్‌లో సకల సదుపాయాలతో కూడిన 15 గదులున్నాయి. ఈ నిర్మాణం తన భార్య ఆలోచనంటూ రిసార్టు యజమాని మురిసిపోతున్నాడు. ఫిలిప్పీన్స్ తుఫాన్లకు, వరదలకు పెట్టింది పేరు. వాటన్నింటినీ తట్టుకునేలా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ ఈ నిర్మాణాన్ని కేవలం ఆర్నెల్లలో పూర్తి చేశారట!

కాంగ్రెస్ నేతల బలిదానాలెన్నో

యోగి 'విడిపోతే నశిస్తాం' వ్యాఖ్యలకు ఖర్గే కౌంటర్

నాగ్‌పూర్/బెంగళూరు: హిందువులంతా ఐక్యంగా ఉండాలని, విడిపోతే కాంగ్రెస్‌శక్తులు నాశనంచేస్తాయని ఆరోపిస్తూ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన 'బటేంగే తో కటేంగే'వ్యాఖ్యలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఘాటుగా స్పందించారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాగ్‌పూర్‌లో నిర్వహించిన మీడియాసమావేశంలో ఖర్గే మాట్లాడారు. ''హిందువులు విడిపోతే కాంగ్రెస్ శక్తులు నాశనంచేస్తాయంటూ యోగి విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశాన్ని ఐక్యంగా ఉంచాలనుకునే నేతలెవరూ మరీ ఇలా దిగజారి మాట్లాడరు. వాస్తవానికి దేశాన్ని ఐక్యంగా నిలిపేందుకు ఎందరో కాంగ్రెస్ దిగ్గజ నేతలు తమ ప్రాణాలను త్యాగం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు రాబట్టేందుకే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ జనాలను ఉసిగొల్పుతున్నారు'' అని అన్నారు.

గడ్కరీ, ఫడ్నవిస్‌పై ఆగ్రహం

''మహారాష్ట్ర నేతలు రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి స్వప్రయోజనాలకే పట్టం కడతారు. మహారాష్ట్రకు మంజూరైన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను బీజేపీ గుజరాత్‌కు తరలించుకుపోతుంటే ఈ నేతలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు''అని ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. యుద్ధవిమానాల విడిభాగాల మెయిన్ అసెంబ్లింగ్ యూనిట్, సెమీకండక్టర్ల తయారీ కర్మాగారం వంటి ప్రాజెక్టులు తరలిపోతున్నా పట్టించుకోకుండా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తమ పదవులను కాపాడుకున్నారని ఖర్గే పరోక్షంగా విమర్శించారు. ''ఎరుపు కవర్ ఉన్న రాజ్యాంగప్రతిని పంచడం నేరమా?. మరి ఇదే రంగులో ఉన్న దాదాపు అలాంటి రాజ్యాంగప్రతినే నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ప్రధాని మోదీ బహూకరించారుకదా?'అంటూ సంబంధిత ఫొటోను మీడియాకు ఖర్గే చూపించారు.

చెప్పేవి అబద్ధాలు.. అవికూడా గట్టిగా చెప్తారు

''ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలు. అవికూడా నిజాలేమో అన్నంత గట్టిగా చెప్పడం ఆయనకే చెల్లింది. అధికారంలోకి రాగానే విదేశాల నుంచి నల్లధనం తెచ్చి పౌరుల ఖాతాల్లో జమచేస్తా అన్నారు. రైతుల ఆదాయం రెట్టింపుచేస్తా అన్నారు. 2 కోట్ల మందికి ఉద్యోగాలిస్తామన్నారు. బుల్లెట్ రైళ్లను పరుగెత్తిస్తామన్నారు. ఇక పెద్దనోట్లరద్దు సంగతి సరేసరి. ఈ అబద్ధాలన్నీ చెప్పింది ఆయన కాదా?'అని ఖర్గే ప్రశ్నించారు. ''మా గ్యారెంటీ స్కీములనే బీజేపీ కాపీ కొడుతోంది. కర్ణాటకలో మేం ప్రకటించి అమలు చేస్తున్న పథకాలనే బీజేపీ కాపీకొట్టి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ ఇతర రాష్ట్రాల్లోనూ ప్రకటించింది. ఈవీఎంలపై ఇప్పటికే మా అభ్యంతరాలను తెలిపాం. కపిల్ సిబల్, అభిషేక్‌మనుసింఘ్వీ తదతరులు ఈవీఎంలపై అభ్యంతరాలపై ఇతర అంశాలను సేకరించే పనిలో పడ్డారు. ఆ తర్వాతే దీనిపై మాట్లాడతా''అని ఖర్గే అన్నారు.

ట్రంప్ మార్కు కనిపించేనా!

ఉక్రెయిన్, పశ్చిమాసియాపై ఏం చేస్తారు?

'2.0'విదేశీ విధానంపై సర్వత్రా ఉత్కంఠ

దూకుడుకు, ఆశ్చర్యకర నిర్ణయాలకు పెట్టింది పేరైన రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠమెక్కనున్నారు. ఈ పరిణామం అమెరికా మిత్ర దేశాల్లో భయాందోళనలకు, శత్రు రాజ్యాల్లో హర్షాతిరేకాలకు కారణమవుతోంది. అన్ని విషయాల్లోనూ 'అమెరికా ఫస్ట్'అన్నదే మూల సిద్ధాంతంగా సాగుతానని తేల్చి చెప్పిన ఆయన అదే ప్రాతిపదికన విదేశాంగ విధానాన్ని పునర్నిర్మిస్తారా? అదే జరిగితే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం. గాజాపై ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై ఎలాంటి ప్రభావం ఉంటుందనేది ఆసక్తికరం.



ఉక్రెయిన్ యుద్ధం నాటో పుట్టి ముంచేనా?

రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఒక్క రోజులో ముగించగలనని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పదే పదే చెప్పారు. అదెలా అని మీడియా పదేపదే ప్రశ్నిస్తే ఒక ఒప్పందాన్ని పరిశీలించాల్సి ఉందంటూ సరిపెట్టారు. ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరాను కొనసాగించాలని, రష్యాతో ఆ దేశం శాంతి చర్చలు జరిపేలా చూస్తూనే షరతులు విధించాలని ట్రంప్ మాజీ జాతీయ భద్రతాధిపతులు ఇటీవల సూచించారు. నాటోలో ఉక్రెయిన్ ప్రవేశాన్ని వీలైనంత ఆలస్యం చేయడం ద్వారా రష్యాను తృప్తి పరచాలని చెప్పుకొచ్చారు. కానీ ట్రంప్ మాత్రం యుద్ధానికి ముగింపు పలకడం, అమెరికా వనరుల వృథాను అరికట్టడమే తన ప్రాథమ్యమని స్పష్టంగా చెబుతున్నారు. ఆ లెక్కన రెండేళ్లకు పైగా ఉక్రెయిన్‌కు బైడెన్ సర్కారు అందిస్తూ వచ్చిన భారీ ఆర్థిక, ఆయుధ సాయాలకు భారీగా కోత పడవచ్చని భావిస్తున్నారు. అంతేగాక యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించేలా రష్యా, ఉక్రెయిన్ రెండింటిపైనా ట్రంప్ ఒత్తిడి పెంచడం ఖాయంగా కనిపిస్తోంది. స్వదేశంలో ఇమేజీ కోసం కనీసం తక్షణ కాల్పుల విరమణకైనా ఒప్పించేందుకు ఆయన శాయశక్తులా ప్రయత్నించవచ్చు. అందుకోసం అవసరమైతే ఉక్రెయిన్‌కు ఎప్పటికీ నాటో సభ్యత్వం ఇవ్వొద్దన్న రష్యా డిమాండ్‌కు ట్రంప్ అంగీకరించినా ఆశ్చర్యం లేదంటున్నారు. ఇది నాటోలోని యూరప్ సభ్య దేశాలకు రుచించని పరిణామమే. కానీ నాటో కూటమి పట్ల ట్రంప్ తీవ్ర వ్యతిరేకత దృష్ట్యా వాటి అభ్యంతరాలను ఆయన పెద్దగా పట్టించుకోకపోవచ్చు. ఇది అంతిమంగా నాటో భవితవ్యంపైనే తీవ్ర ప్రభావం చూపవచ్చు. నాటో కూటమి రక్షణ వ్యయం తీరుతెన్నుల్లో భారీ మార్పులకు కూడా ట్రంప్ శ్రీకారం చుట్టవచ్చని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

చైనా వ్యూహంలోనూ మార్పులు!

అమెరికా విదేశాంగ విధానంలో చైనా పట్ల వైఖరి అత్యంత వ్యూహాత్మకమైనది. ఇది ప్రపంచ భద్రత, వాణిజ్యంపైనే ప్రభావం చూపుతుంది. ట్రంప్ అధికారంలో ఉండగా చైనాను 'వ్యూహాత్మక పోటీదారు'గా పేర్కొన్నారు. పలు చైనా దిగుమతులపై సుంకాలు విధించారు. దాంతో చైనా కూడా అమెరికా దిగుమతులపై సుంకాలు విధించింది. ఈ వివాదాన్ని తగ్గించే ప్రయత్నాలు జరుగుతుండగానే కోవిడ్ వచ్చి పడింది. దాన్ని 'చైనీస్ వైరస్'గా ట్రంప్ ముద్ర వేయడంతో ద్వైపాక్షిక సంబంధాలు దిగజారాయి. అనంతరం బైడెన్ సర్కారు కూడా చైనాపై ట్రంప్ సుంకాలను కొనసాగించింది. అమెరికాలో నిరుద్యోగం తదితరాలకు చైనా దిగుమతులను కూడా కారణంగా ట్రంప్ ప్రచారం పొడవునా ఆక్షేపించిన నేపథ్యంలో వాటిపై సుంకాలను మరింత పెంచవచ్చు. అలాగే చైనా కట్టడే లక్ష్యంగా సైనికంగా, వ్యూహాత్మకంగా అమెరికా అనుసరిస్తున్న ఆసియా విధానంలోనూ మార్పుచేర్పులకు ట్రంప్ తెర తీసే అవకాశముంది. చైనా కట్టడికి దాని పొరుగు దేశాలతో బలమైన భద్రతా భాగస్వామ్యాన్ని కొనసాగించాలన్న బైడెన్ ప్రభుత్వ విధానానికి ఆయన తెర దించినా ఆశ్చర్యం లేదు. అదే జరిగితే భారత్‌కు ఇబ్బందికర పరిణామమే. తైవాన్‌పై చైనా దాష్టీకాన్ని అడ్డుకునేందుకు సైనిక బలాన్ని ఉపయోగించాల్సిన అవసరం లేదని కూడా ట్రంప్ పదేపదే చెప్పారు. కనుక తైవాన్‌కు అమెరికా సైనిక సాయాన్ని కూడా నిలిపేయవచ్చు.

కొరుకుడు పడని పశ్చిమాసియా

గాజా యుద్ధం, ఇరాన్‌తో ఇజ్రాయెల్ ఘర్షణ, దానిపై హమాస్‌తో పాటు హెజ్‌బొల్లా దాడులతో అగ్నిగుండంగా మారిన పశ్చిమాసియాలో కూడా శాంతి స్థాపిస్తానని ట్రంప్ వాగ్దానం చేశారు. తాను అధికారంలో ఉంటే ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిగేదే కాదని చెప్పుకున్నారు. ఇరాన్‌పై మరిన్ని ఆంక్షలు, ఆ దేశంతో అణు ఒప్పందం రద్దు వంటి చర్యలకు ఆయన దిగవచ్చంటున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ట్రంప్ సాన్నిహిత్యం అందరికీ తెలిసిందే. కానీ ఇరాన్‌పై ప్రతీకారం, హమాస్, హెజ్‌బొల్లా తదితర ఉగ్ర సంస్థల నిర్మూలన విషయంలో నెతన్యాహు మొండిగా ఉన్నారు. దీన్ని వ్యతిరేకించినందుకు రక్షణ మంత్రినే ఇంటికి పంపించారు. కనుక ట్రంప్ ప్రయత్నాలకు నెతన్యాహు ఏ మేరకు సహకరిస్తారన్నది సందేహమే. నిజానికి ట్రంప్ విధానాలే పశ్చిమాసియాలో అస్థిరతకు దారి తీశాయన్నది ఆయన విమర్శకుల వాదన. వాటివల్ల పాలస్తీనియన్లకు తీవ్ర అన్యాయం జరిగిందని వారంటారు. ఇజ్రాయెల్‌తో పాటు పలు అరబ్, ముస్లిం దేశాల మధ్య దౌత్య సంబంధాలను మెరుగు పరిచేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నాలు పాలస్తీనాను పూర్తిగా ఏకాకిని చేశాయి. ఇన్ని సంక్లిష్టతల నడుమ గాజా కల్లోలానికి ట్రంప్ చెప్పినట్టుగా తెర దించగలరా అన్నది వేచి చూడాల్సిన విషయమే.

– సాక్షి, నేషనల్ డెస్క్

అప్పట్లో ఉగ్రవాది అవ్వాలనుకున్నా

సీనియర్ సైన్యాధికారి నాలో పరివర్తన తీసుకొచ్చారు • టీనేజీ చేదుజ్ఞాపకాలను అసెంబ్లీలో గుర్తుచేసుకున్న కశ్మీర్ నూతన ఎమ్మెల్యే

శ్రీనగర్: టీనేజీ రోజుల్లో సైన్యం జరిపిన ఒక గాలింపు చర్యల్లో తాను ఎదుర్కొన్న అనుభవాలను జమ్మూకశ్మీర్ శాసనసభలో నూతన ఎమ్మెల్యే ఖైసర్ జమ్షెద్ లోనె వెల్లడించారు. అసెంబ్లీలో జమ్మూకశ్మీర్ గవర్నర్ సిన్హా ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా శుక్రవారం జమ్షెద్ లోనె ప్రసంగించారు. ''ఉగ్రవాదుల దాడులు, సైన్యం తీవ్ర గాలింపులు కొనసాగుతున్న రోజులవి. నేనప్పుడు పదో తరగతి చదువుతున్నా. మా ప్రాంతంలో నివసించే కొందరు యువకులు ఉగ్రవాదానికి ప్రభావితులై అందులో చేరిపోయారు. మా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తపరిస్థితులను సద్దుమణిగేలా చేసేందుకు సైన్యం రంగంలోకి దిగింది. ఉగ్రవాదుల జాడ తెలపాలని స్థానికులను ప్రశ్నించడం మొదలెట్టింది. ఆ రోజు నాతోకలిపి 32 మంది టీనేజర్లు ఉన్నారు. మాలో ఒకొక్కరిని ఒక ఆర్మీ ఆఫీసర్ పిలిచి ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదంలో చేరిన స్థానికుల జాడ చెప్పాలని బెదిరించారు.



ఖైసర్ జమ్షెద్ లోనె

స్థానికులు కాబట్టి వారెవరు నాకు తెలుసుగానీ వాళ్లు ఏం చేస్తారు? ఎక్కడ ఉంటారు? అనే వివరాలు నాకు తెలీదని చెప్పా. పట్టరాని ఆగ్రహంతో ఆ ఆర్మీ ఆఫీసర్ నన్ను కొట్టారు. వివరాలు చెప్పాలని, నోరు విప్పి మాట్లాడాలని గద్దయించారు. నాకు తెలీదని మళ్లీ చెప్పడంతో మళ్లీ కొట్టారు. దీంతో 'ఉగ్రవాదిగా మారిపోతా'అని ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నా. కానీ కొద్దిసేపటి భారతసైన్యంలో ఉన్నతాధికారి ఒకరు వచ్చి మాతో మాట్లాడారు. ఆయన నన్ను 'పెద్దయితే ఏమవుతావు?'అని అడిగారు. ఉగ్రవాదిని అవుతా అని సూటిగా సమాధానం చెప్పా. హతాశుడైన ఆ అధికారి నా నిర్ణయానికి కారణాలు అడిగారు. ఇంతకుముందే చితకబాదిన, దారుణంగా అవమానించిన విషయం చెప్పా. దాంతో ఆయన కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితులు, ఆర్మీ అధికారి అంతలా ప్రవర్తించడానికి కారణాలు ఆయన విడమరిచి చెప్పారు. నన్ను కొట్టిన ఆఫీసర్‌ను అందరి ముందటే సైన్యాధికారి చీవాట్లు పెట్టారు. దీంతో నాకు వ్యవస్థపై నమ్మకం ఏర్పడింది. ఉగ్రవాదం వైపు మళ్లొద్దని నిర్ణయించుకున్నా. ప్రజాజీవితంలోకి అడుగుపెట్టా. ఇప్పుడు తొలిసారిగా ఎమ్మెల్యే నయ్యా. అయితే చితకబాదడం వల్లనో, ఉగ్రవాదం భావజాలం పెను ప్రభావమో తెలీదుగానీ ఆరోజు దెబ్బలు తిన్న 32 మందిలో 27 మంది తర్వాతి రోజుల్లో ఉగ్రవాదులుగా మారారు ''అని జమ్షెద్ సభలో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లోలాబ్ నియోజకవర్గం నుంచి నేషనల్ కాన్ఫెరెన్స్(ఎన్‌సీ) పార్టీ తరఫున లోనె విజయం సాధించడం తెల్సిందే.

మిస్ ఎర్త్‌గా ఆస్ట్రేలియా సుందరి



శనివారం ఫిలిప్పీన్స్‌లో జరిగిన మిస్ ఎర్త్-2024 పోటీల్లో విజేతగా నిలిచాక ఆస్ట్రేలియాకు చెందిన జెస్సికా లేన్ అభివాదం

బంధించి, 6 నెలలకుపైగా రేప్

- టీనేజీ నీట్ కోచింగ్ విద్యార్థినిపై టీచర్ల అమానుషం

కాన్పూర్(యూపీ): విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే కామపిశాచులుగా మారి టీనేజీ విద్యార్థినితో అమానుషంగా ప్రవర్తించిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. 2022 డిసెంబర్ చివర్లో జరిగిన ఘటన వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న 17 ఏళ్ల బాలికను ఇద్దరు టీచర్లు బంధించి ఆరునెలలకుపైగా అత్యాచారానికి పాల్పడిన ఘటన ఇప్పుడు యూపీలో చర్చనీయాంశమైంది. కేసు వివరాలను కళ్యాణ్‌పూర్ అసిస్టెంట్ కమిషనర్ అభిషేక్ పాండే శనివారం మీడియాకు వెల్లడించారు. ఫతేపూర్ పట్టణానికి చెందిన ఈ టీనేజీ అమ్మాయి నీట్ కోచింగ్ కోసం కాన్పూర్‌కు వచ్చి హాస్టల్‌లో ఉంటోంది. ఆమె నీట్ కోచింగ్ తీసుకుంటున్న చోటే సాహిల్ సిద్ధిఖీ జీవశాస్త్రం, వికాస్ పూర్వాల్ రసాయనశాస్త్రం బోధించేవారు. 2023 ఏడాది కొత్త ఏడాది వేడుకలు జరుగుతున్నాయి, విద్యార్థులంతా వస్తున్నారని చెప్పి ఈ టీనేజర్‌ను ఆమె ఫ్రెండ్ ఫ్లాట్‌కు టీచర్లు సాహిల్, వికాస్ రప్పించారు. మక్డీఖేరాలోని ఫ్లాట్‌కు వచ్చిన అమ్మాయికి టీచర్లుతప్ప విద్యార్థులెవరూ కనిపించలేదు. మత్తుమందు కలిపిన శీతలపానీయం తాగడంతో స్పృహకోల్పోయిన టీనేజర్‌ను సాహిల్ తన ఫ్లాట్‌కు తీసుకెళ్లి ఆరునెలలకుపైగా బంధించాడు. పలుమార్లు రేప్‌చేశాడు. తర్వాత వికాస్ సైతం అదే దారుణానికి పాల్పడ్డాడు. ఆరునెలల తర్వాత కాన్పూర్‌కు వచ్చిన తల్లి ఆ టీనేజర్‌ను తీసుకెళ్లింది. అయితే అత్యాచారాన్ని వీడియోలు తీసి బెదిరించడంతో కుటుంబపరువు పోతుందన్న భయంతో టీనేజర్ తనకు జరిగిన దారుణాన్ని బయటకు చెప్పలేదు. అయితే రెండు నెలల క్రితం మరో విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో టీచర్ సాహిల్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఇటీవల అతను బెయిల్‌పై బయటికొచ్చాడు. అయితే ఆ మరో విద్యార్థినిని సాహిల్ లైంగికంగా వేధించిన వీడియో తాజాగా బయటకురావడంతో ధైర్యం తెచ్చుకున్న టీనేజర్ ఎట్టకేలకు పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోక్సోసహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేసి సాహిల్, వికాస్‌లను అరెస్ట్‌చేశారు.

యడియూరప్ప, శ్రీరాములుపై విచారణ!

విచారణ కమిషన్ సిఫార్సు

బెంగళూరు: కోవిడ్‌కాలంలో వైద్యఉపకరణాలు, ఔషధాల కొనుగోళ్లలో చోటుచేసుకున్నాయని, ఈ విషయంలో నాటి కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప, ఆరోగ్యమంత్రి శ్రీరాములుపై విచారణ చేపట్టాలని మాజీ జడ్జి జస్టిస్ మైఖేల్ కన్హా విచారణ కమిషన్ సిఫార్సుచేసింది. ఈ వివరాలను రాష్ట్ర ఆరోగ్యమంత్రి దినేశ్ గుండూరావు శనివారం వెల్లడించారు. ''కోవిడ్ సంక్షోభంతో రాష్ట్రం అల్లకల్లోలం అవుతుంటే నాడు శవాలమీద సైతం నాటి ప్రభుత్వం చిల్లర ఏరుకుంది. ఆనాడు వైద్యఉపకరణాల కొనుగోలు ప్రక్రియలో ఎన్నో లొసుగులు బయటపడ్డాయి. నాటి అస్తవ్యస్త పరిస్థితిని ప్రభుత్వం తమకు అనుకూలంగా మార్చుకుని కోట్లు కొల్లగొట్టింది. దీనిపై విచారణ కమిషన్ ప్రాథమిక నివేదికను ఆగస్ట్ 31న సమర్పించింది. దీనిపై కేబినెట్ ఉపసంఘం సమీక్ష జరిపింది. మరో ఆరేడు నెలల్లో రెండో నివేదిక సమర్పిస్తుంది. పీపీటీ కిట్ల కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వానికి రూ.14 కోట్లు నష్టంరావడానికి యడియూరప్ప, శ్రీరాములే కారణమని కమిషన్ తేల్చింది. అధిక ధరకు వాటిని కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్నాసరే అధిక ధరకు చైనా, హాంకాంగ్‌ల నుంచి తెప్పించారు. ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు, ఔషధాల కొనుగోళ్లు సక్రమంగా లేవు. మీ బండారం బయటపడింది. యడియూరప్ప, శ్రీరాములు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నుంచి తప్పుకుంటే మంచిది. వీళ్లను విచారించాలని కమిషన్ సిఫార్సుచేసింది''అని గూండూరావు చెప్పారు. దీనిపై యడియూరప్ప స్పందించారు. ''ఇలాంటి బెదిరింపులకు యడియూరప్ప తలవంచడు. కోవిడ్‌వేళ నిజాయతీగా చేసిన పనినీ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుపడుతోంది. వాళ్లేం చేస్తారో చేసుకోనివ్వండి. వాటిని ఎదుర్కొనే సత్తా నాకుంది. దేశంలో చట్టాలున్నాయి, కోర్టులున్నాయి''అని సిద్ధా అన్నారు.''మైసూరు భూకేటాయింపులు, వక్ఫ్ అంశాల నుంచి కన్నడిగుల దృష్టి మరల్చేందుకే సిద్ధరామయ్య సర్కార్ కొత్త నాటకం ఆడుతోంది''అని యడియూరప్ప కుమారుడు, కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర అన్నారు. ''నేనొక్కడినేకాదు, అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ సైతం ఈ పీపీఈ కిట్లు, మాస్కుల కొనుగోళ్లలో నిర్ణయాలు తీసుకుంది. తప్పు జరిగినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలగుతా''అని శ్రీరాములు అన్నారు.

సాక్షి ప్లస్
ఆదివారం । 10-11-2024

రాష్ట్రాల్లో ద్విసభా విధానానికి పునాదులు వేసిన చట్టం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ చరిత్ర

భారతదేశ ప్రభుత్వాల నిర్మాణాన్ని, అవి పని చేసే విధి విధానాలను గురించి తెలిపే లిఖిత పత్రమే భారత రాజ్యాంగం. జాతీయ శాసనంగా రాజ్యాంగం ప్రభుత్వ శాఖలు, సంస్థలు, వ్యవస్థలు, వ్యక్తులకు మార్గదర్శకంగా ఆధికృతను కలిగి ఉంటుంది.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగం అనేక సవరణలను తనలో ఇముడ్చుకుని ప్రజాస్వామిక స్వభావాన్ని కలిగి ఉంది. ప్రపంచ రాజ్యాంగాల చరిత్ర ఆధునిక కాలంలో అమెరికా రాజ్యాంగంతోనే నిర్మాణాత్మకంగా ప్రారంభమైంది. ప్రపంచ రాజ్యాంగాలన్నింటిలో కూడా అత్యంత సుదీర్ఘమైంది భారత రాజ్యాంగం. అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ అభిప్రాయం ప్రకారం.. భారత ప్రజల ఎన్నో ఏళ్ల కలల సాకారమే రాజ్యాంగం. భారత రాజ్యాంగానికి బ్రిటిష్ ప్రభుత్వ పాలనాకాలంలోనే పునాదులు పడ్డాయి. ఈస్టిండియా పాలనలో ప్రవేశ పెట్టిన చార్టర్ చట్టాలు, 1858లో విక్టోరియా మహారాణి ప్రకటన, బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌన్సిల్ చట్టాలు, వాటి ద్వారా ఏర్పాటు చేసిన వ్యవస్థలు, సంస్థలు మన రాజ్యాంగ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలిచాయి.

1757లో జరిగిన ప్లాసీ యుద్ధం భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాదులు వేసింది. బక్సార్ యుద్ధానంతరం బెంగాల్, బీహార్, ఒరిస్సాల్లో దివానీ హక్కులను (శిస్తు వసూలు) పొందటం ద్వారా మన దేశంపై ఈస్టిండియా కంపెనీకి చట్టబద్ధంగా హక్కులు సంక్రమించాయి. 1772లో వారన్ హేస్టింగ్స్ శిస్తు వసూలు కోసం ప్రవేశ పెట్టిన కలెక్టర్ వ్యవస్థ మన దేశపాలనా యంత్రాంగ పునాదులను బలోపేతం చేయడంతో పాటు సివిల్ సర్వీసెస్ విధానానికి మార్గదర్శకంగా నిలిచింది. ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలను క్రమబద్ధీకరించడం కోసం బ్రిటిష్ పార్లమెంట్ రూపొందించిన రెగ్యులేటింగ్ చట్టం(1773) మనదేశ పాలనాయంత్రాంగానికి దిక్సూచిగా మారింది. కొంతమంది చరిత్రకారులు రెగ్యులేటింగ్ చట్టాన్ని మొదటి భారత రాజ్యాంగ చట్టంగా వర్ణించారు. బెంగాల్ గవర్నర్‌ను గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా మార్చడంతో పాటు మద్రాసు, బొంబాయి ప్రెసిడెన్సీలను గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్ పరిధిలోకి తీసుకొచ్చారు. 1774లో కలకత్తాలోని ఫోర్ట్ విలియం కోటలో స్థాపించిన సుప్రీంకోర్టు మనదేశంలో ఏకీకృత న్యాయవ్యవస్థకు పునాదులు వేసింది. 1726 మేయర్ కోర్టుల స్థాపన, 1862లో కలకత్తా, బొంబాయి, మద్రాసుల్లో స్థాపించిన హైకోర్టులు సమీకృత న్యాయవ్యవస్థకు తోడ్పడ్డాయి.

గవర్నర్ జనరల్‌కు సలహాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన కౌన్సిల్ తీర్మానాన్ని వీటో చేసే అధికారం 1793 చార్టర్ చట్టం గవర్నర్ జనరల్‌కు కల్పించింది. ఈ అంశం ప్రస్తుతం పార్లమెంట్ చేసిన శాసనాలను వీటో చేసే అధికారం భారత రాష్ట్రపతికి కల్పించడానికి దారితీసింది. 1813 చార్టర్‌చట్టం ఎలాంటి ప్రత్యేకతనూ సంతరించుకోలేదు. కారణం.. ఈ చట్టం ఎలాంటి మౌళిక మార్పులను తీసుకురాకపోవడమే.



1833 చార్టర్ చట్టం కొన్ని ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టింది. భారతదేశ సివిల్, క్రిమినల్ చట్టాలను క్రోడీకరించడానికి అవసరమైన సూచనలు చేయడానికి లా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. దేశపరిపాలనా నిర్వహణలో గవర్నర్ జనరల్‌కు సలహాలు ఇచ్చే కౌన్సిల్‌కు తోడుగా శాసనపరమైన అంశాల్లోనూ సలహాల కోసం ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు.

బానిసత్వాన్ని రద్దు చేయడం, ఇండియన్ సివిల్ సర్వీసెస్‌లో భారతీయులకు అవకాశం కల్పించాలని నిర్ణయించినప్పటికీ ఈ రెండు అంశాలు అమల్లోకి రాలేదు. బ్రిటిషర్ల వ్యతిరేకతే ఇందుకు కారణం. బానిసత్వం రద్దు, సివిల్ సర్వీసెస్‌లో భారతీయులకు అవకాశం వంటి వాటిని 1853 చార్టర్ చట్టం ద్వారా అమల్లోకి తెచ్చారు. గవర్నర్ జనరల్‌కు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్... లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు బాధ్యత వహించే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి పార్లమెంటరీ ప్రభుత్వ లక్షణానికి నాందిగా పేర్కొనొచ్చు.

1857లో సిపాయిల తిరుగుబాటు అనంతరం 1858లో బ్రిటిష్ ప్రభుత్వం విక్టోరియా మహారాణి ప్రకటన ద్వారా భారత ప్రభుత్వ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈస్టిండియా కంపెనీ పరిపాలనకు స్వస్తి పలికి భారతదేశ పరిపాలనను బ్రిటిషర్లు ప్రత్యక్షంగా చేపట్టారు. బ్రిటన్‌లో మనదేశ పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించడానికి భారత రాజ్య కార్యదర్శిని నియమించారు. ఆయనకు సలహాలివ్వడం కోసం 15మంది సభ్యులతో కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. మనదేశ పరిపాలనకు అవసరమైన చట్టాలను బ్రిటిష్ పార్లమెంటే రూపొందించింది. 1858 చట్టం ద్వారా మన రాజ్యాంగ పరిణామ క్రమం... అంటే చరిత్ర ప్రారంభమైందని భారత రాజ్యాంగ నిపుణుడు డి.డి. బసు వర్ణించారు. 1861 కౌన్సిల్ చట్టం ద్వారా కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటి సారిగా ముగ్గురు భారతీయులకు అవకాశం కల్పించారు. దాంతో పాటు మన దేశ పాలన వ్యవస్థలో బడ్జెట్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్ జారిచేసే అధికారాన్ని కల్పించారు. అదేవిధంగా 1859లో ప్రవేశపెట్టిన పోర్ట్‌ఫోలియో విధానానికి ఇది చట్టబద్ధతను కల్పించింది. 1892లో ప్రవేశపెట్టిన కౌన్సిల్‌చట్టం మనదేశంలో మొదటిసారిగా ఎంపిక విధానాన్ని పరిమిత ప్రాతిపదికపై కల్పించింది.

లార్డ్ కర్జన్ 1905లో బెంగాల్‌ను విభజించటాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన వందేమాతర ఉద్యమం నేపథ్యంలో 1906లో ముస్లింలీగ్ ఏర్పడింది. అలాగే 1907లో కాంగ్రెస్ పార్టీ సూరత్ చీలిక ద్వారా అతివాదులు, మితవాదులుగా విడిపోయింది. ఈ సందర్భాలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1909లో మింటో-మార్లే సంస్కరణల రూపంలో కౌన్సిల్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా మనదేశంలో పరిమిత ప్రాతిపదికపై ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలో భారతీయుడైన సత్యేంద్రప్రసాద్ సిన్హాకు ప్రాతినిధ్యం కల్పించారు. కేంద్ర-రాష్ట్ర శాసనసభల సభ్యుల సంఖ్యను, అనధికార సభ్యుల సంఖ్యనూ పెంచారు. భారత గవర్నర్ జనరల్ లార్డ్ మింటో విభజించి పాలించే సూత్రాన్ని ఆచరణలో పెడుతూ ముస్లింలకు ప్రత్యేకంగా మతపరంగా నియోజకవర్గాల ఏర్పాటుకు నాంది పలికాడు. నాటి భారతరాజ్యాంగ కార్యదర్శి లార్డ్ మార్లే బ్రిటిష్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ 'భారతదేశంలో ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలనే విషబీజాలను నాటాం. ఇక పంట ఎంత చేదుగా ఉంటుందో చూద్దాం' అని పేర్కొనడం ఆయన కుటిల రాజనీతికి అద్దం పడుతోంది. ఈ అంశమే చివరికి భారతదేశం మత ప్రాతిపదికపై విడిపోవడానికి కారణమైంది.

1919 మాంటేగ్-ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం నేటి మన రాజకీయ వ్యవస్థ ఏర్పాటులో ఎంతో కీలకపాత్రను పోషించింది. భారత్‌లో బాధ్యతాయుత పరిపాలనను ప్రవేశపెట్టడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యంగా ప్రవేశికలో పేర్కొన్నారు. మనదేశ శాసనశాఖ నిర్మాణంలో ద్విసభా విధానానికి పునాదులు వేసింది ఈ చట్టమే. ప్రభుత్వ పాలనా అంశాలను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సూచన ప్రాయంగా వేరు చేశారు. సిక్కులకు ప్రత్యేక నియోజక వర్గాలతో పాటు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ద్వంద్వ ప్రభుత్వ విధానానికి శ్రీకారం చుట్టారు. ప్రాధాన్యం, ఆదాయం కలిగిన శాఖలను రిజర్వ్‌డ్ శాఖలుగా పేర్కొంటూ... రాష్ట్ర గవర్నర్‌కు ఆ అంశాలపై అధికారం కల్పించారు. ఎలాంటి ప్రాముఖ్యతలేని శాఖలను ట్రాన్స్‌ఫర్డ్ జాబితాగా పేర్కొంటూ... వాటిపై భారత మంత్రులకు అధికారం కల్పించారు. మన పార్లమెంట్‌లో ప్రస్తుతం అత్యంత ముఖ్యమైన పార్లమెంటరీ కమిటీగా పనిచేస్తున్న పీఏసీ అత్యంత పురాతన కమిటీ.

సైమన్ కమిషన్ నివేదికపై అన్నివర్గాల అభిప్రాయాలను తెలుసుకోవడానికి లండన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ఫలితాలను ఆధారం చేసుకొని లార్డ్ లిన్‌లిత్‌గో శ్వేతపత్రాన్ని ప్రకటించాడు. భారత్‌లో ప్రవేశపెట్టబోయే సంస్కరణలను ఈ పత్రంలో పొందుపరిచారు. భారతదేశ పరిపాలన కోసం బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యంత సమగ్రమైన చట్టం '1935 భారత ప్రభుత్వ చట్టం'. భారత రాజ్యాంగానికి ప్రధాన మూలాధారంగా వర్ణించే ఈ చట్టం మన రాజ్యాంగానికి మాతృక వంటిది. ఈ చట్టంనుంచే 70శాతం పైగా అంశాలను మన రాజ్యాంగం గ్రహించింది.

సైమన్ కమిషన్ సూచన మేరకు భారతదేశ పరిస్థితులు, భిన్నత్వాన్ని దృష్టిలో పెట్టుకుని సమాఖ్య తరహా ప్రభుత్వ విధానాన్ని ప్రవేశ పెట్టారు. పాలనా అధికారాలను కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలుగా ఏర్పాటు చేశారు. కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరించే నేపథ్యంలో మన దేశంలో అత్యున్నత న్యాయ స్థానంగా ఫెడరల్ కోర్టును ఏర్పాటు చేశారు. కేంద్ర శాసన సభను ద్విసభా విధానంగా కొనసాగిస్తూనే రాష్ట్రాల్లోనూ ఇదే విధానాన్ని ప్రవేశపెట్టారు.

బ్రిటిష్ పాలిత రాష్ట్రాలు మొత్తం 11 ఉండగా, వాటిలో ఆరు రాష్ట్రాల్లో ద్విసభా విధా నాన్ని ప్రవేశ పెట్టారు. రాష్ట్రాల్లో ద్వంద్వ ప్రభుత్వ విధానాన్ని రద్దుచేసి స్వయం ప్రతిపత్తి కల్పించారు. సైమన్ కమిషన్ ద్వంద్వ ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించింది. ఐతే రాష్ట్రాల్లో ఆ విధానం రద్దు చేసినప్పటికీ కేంద్రంలో కొనసాగించారు. బలహీన వర్గాలకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేశారు. ఈ చట్టాన్ని పటిష్టమైన బ్రేకుల వ్యవస్థ ఉన్న ఇంజన్ లేని వాహనంతో నెహ్రూ పోల్చారు.

బ్రిటిష్ ప్రభుత్వ చట్టాలు

1773 రెగ్యులేటింగ్ చట్టం
1784 పిట్స్ ఇండియా చట్టం
1793 చార్టర్ చట్టం
1813 చార్టర్ చట్టం
1833 చార్టర్ చట్టం
1853 చార్టర్ చట్టం
1858 విక్టోరియా మహారాణి ప్రకటన
1861 కౌన్సిల్ చట్టం
1892 కౌన్సిల్ చట్టం
1909 మింటోమార్లే సంస్కరణలు
1919 మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు
1935 భారత ప్రభుత్వ చట్టం
1947 భారత స్వాతంత్ర్య చట్టం

బ్రిటిష్ చట్టాల నుంచి గ్రహించిన అంశాలు

- గవర్నర్ వ్యవస్థ • కలెక్టర్ వ్యవస్థ
- ఏకీకృత న్యాయ వ్యవస్థ
- ద్విసభా విధానం • పార్లమెంటరీ పద్ధతులు
- సమాఖ్య పద్ధతులు
- బలహీన వర్గాల సంక్షేమం
- పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు
- బడ్జెట్ విధానం • ఆర్డినెన్స్‌ల జారీ

మాదిరి ప్రశ్నలు

1) బ్రిటిషర్లు కలకత్తాలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు? (గ్రూప్ 1 - 2008)
ఎ) 1773 బి) 1774
సి) 1775 డి) 1776

2) ఏ ప్రతిపాదనను భారత ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు మాగ్నా-కార్టా వంటిదిగా పేర్కొంటారు?
ఎ) వేవెల్ ప్రతిపాదన
బి) ఆగస్టు ప్రతిపాదనలు
సి) క్రిప్స్ ప్రతిపాదనలు
డి) విక్టోరియా మహారాణి ప్రకటన

3) గవర్నరు జనరల్‌కు ఆర్డినెన్సులను జారీ చేసే అధికారాన్ని కల్పించిన చట్టం?
ఎ) 1861 బి) 1892
సి) 1919 డి) 1935

4) రాష్ట్రాల్లో ద్విసభా విధానానికి పునాదులు వేసిన చట్టం?
ఎ) 1909 బి) 1919
సి) 1935 డి) 1947

5) ఏ చట్టం బ్రిటిష్ వైస్రాయికి పోర్టుఫోలియో విధానాన్ని ఏర్పాటుచేసే అధికారం కల్పించింది?(సివిల్స్ -2002)
ఎ) 1892 బి) 1885
సి) 1861 డి) 1909

6) భారతదేశంలో అతి తక్కువ కాలం అమల్లో ఉన్న చట్టం? (సివిల్స్ -1999)
ఎ) 1861 బి) 1892
సి) 1909 డి) 1919

7) కిందివాటిలో ఏ అంశాన్ని 1833 చార్టర్ చట్టంలో ప్రస్తావించ లేదు? (సివిల్స్ -2003)
ఎ) ఈస్టిండియా కంపెనీ వ్యాపార వాణిజ్య హక్కులను 20 ఏళ్లకు పొడిగించారు.
బి) భారతదేశ ఉన్నత అధికారాన్ని భారత గవర్నరు జనరల్‌కు కట్ట బెట్టారు.
సి) దేశ పరిపాలనకు అవసరమైన శాసనాధికారాలను గవర్నరు జనరల్‌తో కూడిన కౌన్సిల్‌లో ఏర్పాటు చేశారు.
డి) గవర్నరు జనరల్ లేజిస్లేటివ్ కౌన్సిల్‌లో భారత సభ్యుడికి ప్రాతినిధ్యం కల్పించారు.

8) కమ్యూనల్ అవార్డు ప్రధాన లక్ష్యం?
ఎ) ఆంగ్లో ఇండియన్లకు ప్రాతినిధ్యం కల్పించడం
బి) సిక్కులకు ప్రాతినిధ్యం కల్పించడం
సి) బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం
డి) పైవన్నీ

9) 1935 భారత ప్రభుత్వ చట్టానికి చెందని లక్షణం?
ఎ) ఫెడరల్ కోర్టు ఏర్పాటు
బి) కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వం
సి) భారత్ నుంచి బర్మాను వేరుచేయడం
డి) సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించడం

10) కింది వాటిలో కౌన్సిల్ చట్టం కానిది?
ఎ) 1853 బి) 1861
సి) 1892 డి) 1905

సమాధానాలు:
1) బి; 2) డి; 3) ఎ; 4) సి; 5) సి;
6) సి; 7) డి; 8) సి; 9) డి; 10) ఎ.

గుణాత్మక విద్యలో భాగంగా పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్

NCF - 2005

1. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) NCF - 2005 ఉద్దేశం - జ్ఞాన నిర్మాణం
బి) పాఠ్యపుస్తకాల రచన కేంద్రీకరణ పద్ధతిలో జరగాలి
1) ఎ, బి రెండూ సరైనవే
2) ఎ సరైంది, బి సరైంది కాదు
3) ఎ, బి రెండూ సరైనవి కావు
4) ఎ సరైంది కాదు, బి సరైంది

2. కింది వాటిలో NCF - 2005 ప్రకారం మార్గదర్శక సూత్రం కానిది ఏది?
1) పాఠ్యప్రణాళికలో వ్యవస్థాగత మార్పులు చేయాలి
2) పరీక్షలను సరళీకరించాలి
3) కంఠస్థం చేసే పద్ధతిని నిరుత్సాహ పరచాలి
4) పాఠశాల జ్ఞానాన్ని బయటి జ్ఞానంతో అనుసంధానించాలి

3. జతపరచండి.
జాబితా-1
i) అధ్యాయం-01
ii) అధ్యాయం-02
iii) అధ్యాయం-03
iv) అధ్యాయం-04
జాబితా-2
a) పాఠశాల, తరగతి గది వాతావరణం
b) అభ్యసనం, జ్ఞానం
c) దృక్పథం
d) పాఠ్యాంశాలు, పాఠశాల స్థాయి, మూల్యాంకనం
1) i-b, ii-a, iii-c, iv-d
2) i-c, ii-d, iii-a, iv-b
3) i-d, ii-b, iii-c, iv-a
4) i-c, ii-b, iii-d, iv-a

4. గుణాత్మక విద్యలో భాగంగా ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమం ఏది?
1) CLIP 2) QIP
3) LEP 4) CLAPS

5. 6 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు రోజుకి ఎన్ని గంటలు ఇంటిపని ఇవ్వాలని NCF - 2005 పేర్కొన్నది?
1) 1 గంట 2) 2 గంటలు
3) 3 గంటలు 4) సరిపడినంత ఇవ్వాలి

6. NCF - 2005, ఠాగూర్ రచించిన 'సివిలైజేషన్ అండ్ ప్రోగెస్' అనే గ్రంథంలోని ఏ వాక్యంతో ప్రారంభమవుతుంది?
1) భారం లేని అభ్యసనం
2) నిరంతరం వెలుగుతున్న దీపమే వేరొక దీపాన్ని వెలిగించగలదు
3) ప్రకృతిలోకి తిరిగిపోదాం
4) సృజనాత్మకశక్తి, సహజమైన ఆనందం బాల్యానికి కీలకం

7. కింది వాటిలో NCF-2005 ప్రకారం సరైంది ఏది?
ఎ) విద్యాహక్కు పరిరక్షణ అథారిటీని ఏర్పాటు చేయాలి
బి) NCF-2005ను MHRD రూపొందించింది
1) ఎ, బి రెండూ సరైనవి కావు
2) ఎ, బి రెండూ సరైనవే
3) ఎ సరైంది, బి సరైంది కాదు
4) బి సరైంది, ఎ సరైంది కాదు

8. అధ్యాయం-01కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) భారం లేని విద్యలోని అంశాల ఆధారంగా పాఠ్యప్రణాళిక భారాన్ని తగ్గించాలి
2) ప్రయోగాత్మక పద్ధతుల ద్వారా క్రియాశీల అభ్యసనాలను కల్పించాలి
3) జ్ఞాన నిర్మాణ కృత్యాల్లో అభ్యాసకులకు భాగస్వామ్యం కల్పించాలి
4) పాఠ్యప్రణాళిక ఆచరణలో సామాజిక, సాంస్కృతిక అంశాలకు చోటు కల్పించాలి

9. NCF - 2005 ప్రకారం కింది వాటిలో సరికానిది ఏది?
1) ఉపాధ్యాయుడు ఉత్తమ సంధానకర్తగా ఉండాలి
2) ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక నోడల్ ఏజెన్సీలు ఉండాలి
3) క్యాపిటేషన్ రుసుం వసూలు చేస్తే దానికి 5 రెట్లు జరిమానా విధించాలి
4) +2 వరకు పని ఆధారిత విద్యను ప్రవేశపెట్టాలి

10. జతపరచండి.
జాబితా-1
i) అధ్యాయం-05
ii) మార్గదర్శక సూత్రం
iii) అధ్యాయం-02
iv) అధ్యాయం-04
జాబితా-2
a) పాఠశాలలో సమాజ భాగస్వామ్యం కల్పించాలి
b) విద్యార్థుల అనుభవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
c) ప్రత్యక్ష అనుభవాల ద్వారా బోధించాలి
d) కంఠస్థం చేసే పద్ధతిని నిరుత్సాహ పరచాలి
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-d, ii-a, iii-c, iv-b
3) i-a, ii-b, iii-c, iv-d
4) i-d, ii-c, iii-b, iv-a

11. NCF-2005 ప్రకారం విజ్ఞాన శాస్త్రం ప్రధాన ఉద్దేశం?
1) తార్కిక ఆలోచన
2) సృజనాత్మకతను పెంపొందించడం
3) శాస్త్రీయ వైఖరి కలిగి ఉండటం
4) శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం

12. NCF - 2005 ప్రకారం పాఠ్యప్రణాళిక రూపకల్పన ఎలా ఉండాలి?
1) అభ్యాసకుల వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని, వారి వికాస ప్రాకార్యాలకు అనుగుణంగా తయారు చేయాలి
2) పిల్లల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించాలి
3) భారంలేని అభ్యసనానికి ప్రాధాన్యం ఇచ్చే విధంగా తయారు చేయాలి
4) విషయజ్ఞానం పెంపొందించే విధంగా తయారు చేయాలి

13. తరగతిలో వైయుక్తిక భేదాల జ్ఞానం, ఉపాధ్యాయుడికి ఎందుకు తోడ్పడుతుంది?
1) బోధనాభ్యసన కృత్యాల రూపకల్పనకు
2) క్రమశిక్షణ నిర్వహించడానికి
3) తరగతిలో ఏర్పాట్లు చేయడానికి
4) విద్యార్థుల ఇంటిపని మూల్యాంకనం చేయడానికి

14. ఉపాధ్యాయ శిక్షణలో ఏ విద్య ఒక భాగంగా ఉండాలి?
1) పని విద్య 2) కళల విద్య
3) ఆరోగ్య విద్య 4) శాంతి విద్య

15. సామాజిక శాస్త్రానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) గతంపట్ల పిల్లల దృక్పథాన్ని ప్రభావితం చేసేదిగా చరిత్ర ఉండాలి
2) పౌరశాస్త్రాన్ని రాజనీతిశాస్త్రంగా మార్చాలి
3) పాఠశాలలో సమాజ భాగస్వామ్యం కల్పించాలి
4) సాంఘికశాస్త్ర భావనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

16. కింది వాటిలో అధ్యాయం-02కు సంబంధించింది ఏది?
1) గుణాత్మక విద్యను అందించాలి
2) బోధనా పద్ధతులు ప్రశ్నించడానికి, ఆలోచించడానికి అవకాశం కల్పించాలి
3) నిరంతర సమగ్ర మూల్యాంకనం చేపట్టాలి
4) ప్రజాస్వామ్య పద్ధతిలో స్వీయ క్రమశిక్షణ పెంపొందించాలి

17. NCF - 2005 ప్రకారం శిశు కేంద్రీకృత విద్యకు సంబంధించనిది?
1) పిల్లల అనుభవాలకు అవకాశం కల్పించాలి
2) విద్యార్థుల క్రియాశీల భాగస్వామ్యానికి అవకాశం కల్పించాలి
3) జ్ఞాన నిర్మాణంలో ఉపాధ్యాయుడు క్రియాత్మకంగా ఉండాలి
4) పిల్లల ఆలోచనలకు స్థానం కల్పించాలి

18. అధ్యాయం-04కి సంబంధించి సరైంది ఏది?
1) ప్రతి విద్యార్థి ఆసక్తులను, శక్తి సామర్థ్యాలను వెలికితీసేలా పాఠశాల సంస్కృతి ఉండాలి
2) ప్రయోగాత్మక పద్ధతుల ద్వారా క్రియాశీల అభ్యసనాన్ని కల్పించాలి
3) ఉమ్మడి పాఠశాల వ్యవస్థ ఉండాలి
4) ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వాలి



19. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) అధ్యాయం-05 పరీక్ష, సంస్థాగత సంస్కరణల గురించి తెలియజేస్తుంది
బి) రోజుకు ఒక పీరియడ్‌ను గ్రంథాలయానికి కేటాయించాలని NCF - 2005 పేర్కొన్నది
1) ఎ, బి రెండూ సరైనవి కావు
2) ఎ సరైంది, బి సరైంది కాదు
3) ఎ సరైంది కాదు, బి సరైంది
4) ఎ, బి రెండూ సరైనవే

20. జతపరచండి.
జాబితా-1
i) అధ్యాయం-03
ii) అధ్యాయం-02
iii) అధ్యాయం-05
iv) అధ్యాయం-04
జాబితా-2
a) భాగస్వామ్య, జట్టు కృత్యాలు నిర్వహించాలి
b) మాతృభాషనే అత్యుత్తమ బోధన భాష
c) ప్రతి ఉపాధ్యాయుడు ఒక భాష కోర్సును నేర్చుకోవాలి
d) బోధనావ్యూహాల్లో పిల్లల అనుభవాలకు చోటు కల్పించాలి
1) i-a, ii-b, iii-c, iv-d
2) i-a, ii-c, iii-d, iv-b
3) i-b, ii-d, iii-c, iv-a
4) i-d, ii-b, iii-c, iv-a

21. అధ్యాయం-05కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) పాఠశాల క్యాలెండర్‌ను వికేంద్రీకరణ పద్ధతిలో తయారు చేయాలి
2) అభ్యసన వైకల్యం ఉన్న వారికి నిర్దిష్ట కార్యక్రమాలను రూపకల్పన చేయాలి
3) నిబద్ధులైన పౌరులను తయారు చేయాలి
4) గ్రామస్థాయిలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

22. జతపరచండి.
జాబితా-1
i) పని విద్య
ii) శాంతి విద్య
iii) కళా విద్య
iv) ఆరోగ్య విద్య
జాబితా-2
a) హయ్యర్ సెకండరీలో ఆప్షనల్ సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టాలి
b) ప్రతి స్థాయిలోనూ ఒక సబ్జెక్ట్‌గా ప్రవేశ పెట్టాలి
c) ఉపాధ్యాయ శిక్షణలో ప్రవేశపెట్టాలి
d) అన్ని సబ్జెక్టుల్లోను ప్రవేశపెట్టాలి
1) i-d, ii-c, iii-b, iv-a
2) i-c, ii-b, iii-d, iv-a
3) i-a, ii-b, iii-c, iv-d
4) i-d, ii-c, iii-a, iv-b

23. కింది వాటిలో NCF - 2005 ప్రతిపాదించిన మార్పు ఏది?
1) తరగతిలో అభ్యసనం
2) ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో అభ్యసనం
3) విస్తృత, సామాజిక పరిసరాల్లో అభ్యసనం
4) పుస్తకాల ద్వారా అభ్యసనం

24. జ్ఞాన నిర్మాణానికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) పెద్దలు ఇష్టపడే, సమాజానికి ఉపయోగపడే జ్ఞానాన్ని అభ్యాసకుడు నిర్మిస్తాడు
2) క్రమబద్ధమైన తరగతి బోధన ప్రాతిపదికగా అభ్యాసకుడు స్వీయ జ్ఞానాన్ని నిర్మించుకుంటాడు
3) భారం లేని అభ్యసనం ద్వారా జ్ఞాన నిర్మాణం చేసుకుంటాడు
4) తన అనుభవాల ఆధారంగా అభ్యాసకుడు స్వీయ జ్ఞానాన్ని నిర్మించుకుంటాడు

25. కింది వాటిలో NCF - 2005 ప్రకారం సరికానిది ఏది?
1) ఆంగ్లాన్ని బోధనామాధ్యమంగా వక్కాణించడం
2) నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని తెలియజేయడం
3) అభ్యసనంలో నిర్మాణాత్మక ఉపగమం తెలియజేయడం
4) పాఠశాల జ్ఞానాన్ని బయటి జ్ఞానంతో అనుసంధానించడం

26. NCF - 2005 ప్రకారం ఆంగ్లభాష బోధన ఉద్దేశం దేన్ని నిర్మించడం?
1) ఏక భాషావాదం 2) ఆంగ్లం మాత్రమే
3) బహు భాషావాదం 4) ద్వి భాషావాదం

27. NCF - 2005 ప్రకారం ఒకటి, రెండు తరగతుల్లో ఉండాల్సిన మదింపు?
1) ఎలాంటి పరీక్షలు లేకుండటం
2) సిలబస్ ఆధారంగా
3) మౌఖిక పరీక్ష
4) సరళమైన రాత పరీక్ష

28. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) NCF-2005 నినాదం ఒత్తిడి లేని అభ్యసనం
బి) NCF - 2005 ప్రకారం హయ్యర్ సెకండరీలో ప్రాచీన భాషను ప్రవేశపెట్టాలి
1) ఎ మాత్రమే సరైంది
2) ఎ, బి రెండూ సరైనవి
3) ఎ, బి రెండూ సరైనవి కావు
4) బి మాత్రమే సరైంది

29. 'అంతరదృష్టితో కూడిన అభ్యసనం కోసం వివిధ సబ్జెక్టుల మధ్య జ్ఞానాన్ని అనుసంధానించాలి' అని NCF-2005 ఏ అధ్యాయంలో పేర్కొన్నారు?
1) 2వ అధ్యాయం 2) 5వ అధ్యాయం
3) 1వ అధ్యాయం 4) 3వ అధ్యాయం

30. ఉపాధ్యాయులు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బహుళ పాఠ్యపుస్తకాలు పాఠశాలల్లో అందుబాటులో ఉండాలని ఏ అధ్యాయంలో పేర్కొన్నారు?
1) 4వ అధ్యాయం 2) 5వ అధ్యాయం
3) 2వ అధ్యాయం 4) 1వఅధ్యాయం

సమాధానాలు

1) 2	2) 1	3) 4	4) 3	5) 1
6) 4	7) 1	8) 1	9) 3	10) 1
11) 2	12) 1	13) 1	14) 4	15) 3
16) 2	17) 3	18) 1	19) 2	20) 3
21) 4	22) 1	23) 3	24) 4	25) 1
26) 3	27) 1	28) 1	29) 1	30) 2

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
ఆదివారం। 10-11-2024

వెంట్రుకల గురించి చేసే అధ్యయనాన్ని ఏమంటారు?

జ్ఞానేంద్రియాలు - మాదిరి ప్రశ్నలు

1. మానవుని కంటిలో ఉండే కందరాల సంఖ్య?
ఎ) 3 బి) 2 సి) 6 డి) 4
2. కంటిలో ఉండే మూడు పొరల్లో వెలుపలి పొర?
ఎ) దృఢస్తరం బి) రక్త పటలం
సి) నేత్ర పటలం డి) శుక్ల పటలం
3. కనుపాప వెనుక ఉండే భాగం?
ఎ) తారక బి) కటకం
సి) నేత్ర పటలం డి) ఏదీకాదు
4. కంటిలో ఎన్ని రకాల కణాలు ఉంటాయి?
ఎ) 4 బి) 3 సి) 6 డి) 2
5. దండ కణాలు, శంకు కణాలు కంటిలో ఏ నిష్పత్తిలో ఉంటాయి?
ఎ) 1 : 15 బి) 1 : 1
సి) 15 : 1 డి) 12 : 15
6. రొడాప్సిన్ ఉత్పత్తికి ఏ విటమిన్ అవసరం?
ఎ) డి బి) బి సి) కె డి) ఎ
7. కంటిలోని శంకు కణాల్లో ఉండే వర్ణ పదార్థం?
ఎ) రొడాప్సిన్ బి) ఐడాప్సిన్
సి) ఎ, బి డి) కెరోటిన్
8. కంటిలోని ఎల్లో స్పాట్‌లో ఏ కణాలు ఎక్కువగా ఉంటాయి?
ఎ) దండ కణాలు బి) శంకు కణాలు
సి) రెండూ సమాన నిష్పత్తిలో ఉంటాయి
డి) ఎర్ర రక్తకణాలు
9. మానవునిలో ఉండే దృష్టి?
ఎ) బైనాక్యులర్ బి) మోనాక్యులర్
సి) మల్టిపుల్ డి) ఏదీకాదు
10. హ్రస్వ దృష్టి (మయోపియా) ఉన్నవారు ఏ కటకాలను ఉపయోగిస్తారు?
ఎ) కుంభాకార బి) పుటాకార
సి) ద్విపుటాకార డి) సమతల దర్పణం
11. కిందివాటిలో కంటి వ్యాధి కానిది?
ఎ) గ్లకోమా బి) ట్రకోమా
సి) పమోరియా డి) కాటరాక్ట్
12. చదివేటప్పుడు కంటికి, పుస్తకానికి మధ్య ఉండాల్సిన దూరం?
ఎ) 10 సెం.మీ. బి) 20 సెం.మీ.
సి) 40 సెం.మీ. డి) 30 సెం.మీ.
13. సాధారణంగా వయసు పైబడిన వారికి వచ్చే కంటి వ్యాధి?
ఎ) కాటరాక్ట్ బి) జిరాప్తాల్మియా
సి) రేచీకటి డి) ఏదీకాదు
14. కంటికి ముందు ఉన్న చిన్న గది?
ఎ) కచావత్ కక్ష్య బి) నేత్రోదక కక్ష్య
సి) కటకం డి) కంటి పొర
15. కంటి గురించి చేసే అధ్యయనాన్ని ఏమంటారు?
ఎ) జీరంటాలజీ బి) ఆప్తమాలజీ
సి) పేలినాలజీ డి) ట్రైకాలజీ
16. బహుళ నేత్రం దేనిలో ఉంటుంది?
ఎ) పక్షి బి) కీటకం
సి) మానవుడు డి) గబ్బిలం
17. భారతదేశంలో ఎంత శాతం మంది కంటి సంబంధ వ్యాధులకు లోనవుతున్నారు?
ఎ) 30 బి) 40 సి) 20 డి) 10
18. నీటి కాసులు (గ్లకోమా) వ్యాధి శరీరంలోని ఏ భాగానికి సోకుతుంది?
ఎ) దంతాలు బి) కళ్లు
సి) పేగు డి) కాలేయం
19. భారతదేశంలో ఎంత శాతం మంది తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నారు?
ఎ) 5 బి) 20 సి) 40 డి) 9
20. చేపల్లో రుచి గ్రాహకాలు ఎక్కడ ఉంటాయి?
ఎ) నాలుకపై బి) శరీరంపై
సి) మొప్పలపై డి) వాజాలపై
21. నాలుకలోని ఏ భాగం పులుపు రుచిని గ్రహిస్తుంది?
ఎ) ముందు భాగం బి) వెనుక భాగం
సి) అంచులు డి) పైవన్నీ
22. శరీరంలో అతి పెద్ద అవయవం?
ఎ) నాడీ దండం బి) చర్మం
సి) వెంట్రుకలు డి) తొడ ఎముక



23. సూర్యరశ్మి ఎక్కువ కావడంతో చర్మ గాఢ వర్ణాన్ని సంతరించుకోవడాన్ని ఏమంటారు?
ఎ) టానింగ్ బి) ఆల్బినో
సి) డెర్మటైటిస్ డి) ఏదీకాదు
24. చర్మంలోని మెలనిన్ అవసరం ఏమిటి?
ఎ) ఎక్స్-రే కిరణాల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది
బి) గామా కిరణాల నుంచి శరీరానికి రక్షణ కల్పిస్తుంది
సి) యూవీ కిరణాల నుంచి శరీరాన్ని కాపాడుతుంది
డి) పైవన్నీ
25. వేలి ముద్రలకు సంబంధించిన ఎత్తు పల్లాలు ఎక్కడ ఉంటాయి?
ఎ) అంతః చర్మం బి) బాహ్య చర్మం
సి) ఎ, బి డి) చర్మం మధ్యపొర
26. చర్మ సంబంధ వ్యాధి కానిది?
ఎ) గజ్జి బి) తామర
సి) స్కేబీస్ డి) ఏదీకాదు
27. స్కేబీస్ చర్మ వ్యాధి ముఖ్య లక్షణం?
ఎ) చర్మం పొర పొరలుగా రాలిపోవడం
బి) చర్మంలో బొరియలు పడటం
సి) స్వేద గ్రంథులు పని చేయకపోవడం
డి) చర్మం నల్లబారడం
28. గజ్జి దేని కారణంగా సంభవిస్తుంది?
ఎ) కీటకాలు బి) ఫంగస్
సి) బ్యాక్టీరియా డి) వైరస్
29. గజికర్ణ (తామర) వ్యాధికి కారణం?
ఎ) బ్యాక్టీరియా బి) వైరస్
సి) ఫంగస్ డి) ప్రోటోజోవా
30. చర్మంపై వెంట్రుకలు నల్లగా ఉండటానికి కారణం?
ఎ) అధిక కెరోటిన్ బి) అధిక మెలనిన్
సి) తక్కువ మెలనిన్ డి) ఏదీకాదు
31. వెంట్రుకల గురించి చేసే అధ్యయనాన్ని ఏమంటారు?
ఎ) ట్రైకాలజీ బి) డెర్మటాలజీ
సి) హెమటాలజీ డి) జీరంటాలజీ
32. ఎఖిని అనేది ఒక?
ఎ) కాలేయ సంబంధ వ్యాధి
బి) గుండె సంబంధ వ్యాధి
సి) చర్మ సంబంధ వ్యాధి
డి) ఎముకల సంబంధ వ్యాధి
33. జతపరచండి.
1. డెర్మటైటిస్ ఎ. కండరాలు
2. టిటానస్ బి. కన్ను
3. పమోరియా సి. దంతాలు
4. గ్లకోమా డి. చెవి
ఈ. చర్మం
ఎ) 1-ఈ, 2-బి, 3-సి, 4-ఎ
బి) 1-ఈ, 2-ఎ, 3-సి, 4-డి
సి) 1-ఈ, 2-ఎ, 3-బి, 4-సి
డి) 1-ఈ, 2-ఎ, 3-సి, 4-బి
34. చెవిలో ఉండే ఎముకల సంఖ్య?
ఎ) 6 బి) 3 సి) 8 డి) 12
35. కర్ణభేరి ఏ భాగంలో ఉంటుంది?
ఎ) బాహ్య చెవి బి) మధ్య చెవి
సి) అంతర చెవి డి) ఏదీకాదు
36. బోనీ కండక్షన్‌లో తోడ్పడే ముఖ్యమైన భాగాలు?
ఎ) చెవులు బి) ఎముకలు
సి) వెంట్రుకలు డి) పైవన్నీ
37. జీవి సమతాస్థితిని నెలకొల్పే చెవిలోని భాగం?
ఎ) బాహ్య చెవి బి) అంతర చెవి
సి) మధ్య చెవి డి) కర్ణభేరి
38. మానవుడి మెదడులో ఉష్ణోగ్రతను నియంత్రించే భాగమేది?
ఎ) మెడుల్లా బి) సెరిబెల్లం
సి) హైపోథాలమస్ డి) పైవన్నీ
39. శరీరంలో అతి చిన్న ఎముక?
ఎ) స్టెపిస్ బి) ఇంకస్
సి) ఇయర్ డ్రమ్ డి) మాలియస్
40. యూస్టేషియన్ నాళం దేనితో సంబంధాన్ని కలిగి ఉంటుంది?
ఎ) నోటి కుహరం – లోపలి చెవి కుహరం
బి) నోటి కుహరం – మధ్య చెవి కుహరం
సి) బాహ్య చెవి కుహరం – మధ్య చెవి కుహరం
డి) నోటి కుహరం – బాహ్య చెవి కుహరం
41. మానవ శరీరంలో జ్ఞానేంద్రియాల సంఖ్య?
ఎ) 5 బి) 3 సి) 4 డి) 10
42. మానవ శరీరంలో చర్మం బరువు సుమారుగా ఎంతశాతం?
ఎ) 20 బి) 50 సి) 5 డి) 15
43. చెమటలో ఉండే పదార్థాలు?
ఎ) నీరు, సోడియం క్లోరైడ్
బి) నీరు, యూరియా
సి) నీరు, సోడియం క్లోరైడ్, యూరియా
డి) సోడియం క్లోరైడ్ మాత్రమే ఉంటుంది
44. చెమటలో నీరు, సోడియం క్లోరైడ్ శాతాలు వరుసగా?
ఎ) 99, 0.2 - 0.5 బి) 0.5, 99
సి) 5, 90 డి) 0.5, 0.2
45. 'ది జాక్ ఆఫ్ ఆల్ ట్రేడ్స్' అని దేన్ని పిలుస్తారు?
ఎ) చెవి బి) కన్ను
సి) చర్మం డి) గుండె
46. విటమిన్-డి అనేది ఏ పదార్థ రూపాంతరం?
ఎ) యూరియా బి) కొలెస్టిరాల్
సి) లిపిడ్లు డి) ప్రోటీన్లు
47. జ్ఞాన కేంద్రాలు మెదడులోని ఏ భాగంలో ఉంటాయి?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) మజ్జాముఖం డి) ఏదీకాదు
48. సల్ఫర్ సంబంధ లేపనాలను ఏ వ్యాధి చికిత్సలో ఉపయోగిస్తారు?
ఎ) ఎఖిని బి) ప్లూరైటిస్
సి) సోరియాసిస్ డి) స్కేబీస్
49. చర్మ శుద్ధి కర్మాగారాలు ఎక్కువగా ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
ఎ) కేరళ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) బిహార్
50. దీర్ఘ దృష్టి ఉన్నవారు వాడే కటకం?
ఎ) పుటాకార బి) కుంభాకార
సి) సమతల డి) ద్వికుంభాకార
51. వర్ణాంధత్వం (కలర్ బ్లైండ్‌నెస్) అనేది?
ఎ) విటమిన్-ఎ లోపం వల్ల వస్తుంది
బి) పోషకాహార లోపం వల్ల వస్తుంది
సి) అనువంశిక వ్యాధి
డి) ఏదీకాదు
52. కిందివాటిలో చర్మ వ్యాధి కానిది?
ఎ) ఎగ్జిమా బి) సోరియాసిస్
సి) క్షయ డి) ఎఖిని

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) బి; 4) డి; 5) సి;
6) డి; 7) బి; 8) బి; 9) ఎ; 10) బి;
11) సి; 12) డి; 13) ఎ; 14) బి; 15) బి;
16) బి; 17) బి; 18) బి; 19) డి; 20) బి;
21) సి; 22) బి; 23) ఎ; 24) సి; 25) ఎ;
26) డి; 27) బి; 28) ఎ; 29) సి; 30) బి;
31) ఎ; 32) సి; 33) డి; 34) ఎ; 35) ఎ;
36) బి; 37) బి; 38) సి; 39) ఎ; 40) బి;
41) ఎ; 42) డి; 43) సి; 44) ఎ; 45) సి;
46) బి; 47) ఎ; 48) డి; 49) బి; 50) బి;
51) సి; 52) సి.

అకశేరుకాలు (నాన్ కార్డేటా)

1. వీటిలో భిన్నమైంది?
1) బొద్దింక 2) సిల్వర్‌ఫిష్
3) డెవిల్ ఫిష్ 4) తేలు
2. బాహ్య అస్థిపంజరం వేటిలో ఉంటుంది?
1) కీటకాలు 2) పాములు
3) బల్లి 4) ఏదీకాదు
3. సముద్ర నక్షత్రం ఏ వర్గానికి చెందుతుంది?
1) మొలస్కా 2) ఆర్థ్రోపొడా
3) అనెలిడా 4) ఎఖినోడర్మేటా
4. పాకుడు జంతువులు ఏ వర్గంలో ఉంటాయి?
1) అనెలిడా 2) ఆర్థ్రోపొడా
3) సరీసృపాలు 4) అన్నీ
5. నాలుగు జతల కంటే ఎక్కువ కాళ్లు వేటిలో ఉంటాయి?
1) స్కోలోపెండ్రా 2) పెరిప్లానేటా
3) మెగాస్కోలెక్స్ 4) అన్నీ
6. ఉభయ లైంగికత్వం దేనిలో ఉంటుంది?
1) వానపాము 2) బల్లి
3) తేలు 4) ఈగ
7. గుడ్లు పెట్టని జీవులు వేటిలో ఉంటాయి?
1) క్షీరదం 2) సరీసృపాలు
3) ఆర్థ్రోపొడా 4) ఏదీకాదు
8. వివిపారస్ జంతువు?
1) ఎఖిడ్నా 2) ప్లాటిపస్
3) కంగారూ 4) 1, 2
9. అతి తక్కువ గర్భావధి కాలం కలది?
1) అపోసం 2) ఏనుగు
3) ఆవు 4) గుర్రం
10. మలకబలం చేసే జీవి?
1) ఎలుక 2) కుందేలు
3) ఏనుగు 4) ఏదీకాదు
11. జతపర్చండి?

ఎ	బి
ఎ) ఎంటమిబా	1) టీనియాసిస్
బి) టీనియాసోలియం	2) ఢిల్లీ బోయిల్స్
సి) ట్రిపనోసోమా	3) కాలాఅజార్
డి) లీష్మానియా ట్రాపికా	4) గాంబియా జ్వరం
	5) అమీబియాసిస్

1) ఎ-2, బి-1, సి-4, డి-5
2) ఎ-5, బి-1, సి-4, డి-3
3) ఎ-5, బి-1, సి-4, డి-2
4) ఎ-1, బి-2, సి-5, డి-3
12. రౌండ్ వార్మ్స్ అనేవి?
1) వానపాములు 2) నిమాటి హెల్మింథిస్
3) ప్లాటి హెల్మింథిస్ 4) అన్నీ
13. ఉచరేరియా అనేది ఏ వ్యాధికి కారణం?
1) మలేరియా 2) ఫైలేరియా
3) కలరా 4) అన్నీ
14. దోమల ద్వారా సోకని వ్యాధి?
1) మలేరియా 2) టైఫాయిడ్
3) ఎలిఫెంటియాసిస్ 4) ఏదీకాదు
15. కీటకాల ద్వారా సంభవించే వ్యాధి?
1) గజ్జి 2) తామర
3) ఎఖిని 4) ప్లేగు
16. ట్రాఖియా ద్వారా శ్వాసక్రియ దేనిలో జరుగుతుంది?
1) తేలు 2) కీటకాలు
3) వానపాము 4) కప్ప
17. హీమోలింఫ్ దేనిలో ఉంటుంది?
1) కప్ప 2) కీటకాలు
3) ఎలుక 4) వానపాము
18. రింగ్ వామ్‌తో సంబంధం లేనిది?
1) నులిపాము 2) వానపాము
3) టేప్ వామ్ 4) ఏదీకాదు
19. సుమారు రెండు లక్షల వరకు గుడ్లు పెట్టే జీవి?
1) ఆస్కారిస్ 2) టీనియా సోలియం
3) ఉచరేరియా 4) బొద్దింక
20. రూప విక్రియ ఏ వర్గం జీవిలో ఉంటుంది?
1) కీటకాలు 2) కప్ప
3) 1, 2 4) పక్షులు
21. ముత్యాలు వేటి నుంచి రూపొందుతాయి?
1) ఆల్చిప్ప 2) నత్త
3) సముద్ర నక్షత్రం 4) అన్నీ
22. యూరికోటెలిక్ జీవి?
1) కప్ప 2) బొద్దింక
3) ఏనుగు 4) చేప
23. మనిషి శారీరక క్రోమోజోములు?
1) 22 జతలు 2) 2 జతలు
3) 46 జతలు 4) 23 జతలు
24. స్పాన్ అంటే?
1) కప్ప శుక్ర కణాలు 2) కప్ప అండ కణాలు
3) వానపాము రక్తం 4) తేలు ఊపిరితిత్తులు
25. ఎగ్‌బాక్స్ దేనిలో ఉంటుంది?
1) బొద్దింక 2) తేలు
3) వానపాము 4) అన్నీ

సమాధానాలు

1) 3; 2) 1; 3) 4; 4) 3; 5) 1;
6) 1; 7) 4; 8) 3; 9) 1; 10) 2;
11) 3; 12) 2; 13) 2; 14) 2; 15) 1;
16) 2; 17) 2; 18) 4; 19) 1; 20) 3;
21) 1; 22) 2; 23) 1; 24) 2; 25) 1;

What is the total distance between..

Model Questions

Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below.

Certain number of people was seated in a linear row facing north. One of them was seated at the end. Information about some of them is known. There were not more than 13 people. At least six people were seated between P and U where P was to the right of U. V was to the immediate right of S. T was seated second from the right end of the row. The number of people to the left of Q was more than twice the number of people to the right of Q. Only one person was seated between R and S. There were not more than 5 people sitting between R and Q. R was not seated adjacent to U. No three people mentioned were sitting together.

1. How many people were seated in the row?
a) 8 b) 12 c) 10 d) 11
e) Cannot be determined
2. Who was seated second to the left of R?
a) P b) Q c) U
d) No body e) Data insufficient
3. How many people were seated between Q and S?
a) 3 b) 5 c) 7 d) 8
e) Cannot be determined
4. What is the position of T with respect to U?
a) Second to the right
b) Tenth to the right
c) Fourth to the left
d) Immediate right
e) Immediate left
5. How many people were seated to the left of S?
a) 6 b) 4 c) 9
d) 3 e) 7

Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.

Eight persons A, B, C, D, E, F, G and H went to a conclave. It was seen that each person was of a different age. The partial sequence of their ages is as follows:

___>___> F >___ >___>___> __
(39) (27) (23)
D > ___

They were seated in a straight row facing the North. The partial arrangement is shown below:


___ B ___ ___ ___ ___ ___ G
(25) (36)

The numbers shown in the brackets denote age.

» The person aged 31 was seated 3rd to the left of the one who was aged 27.
» B was aged more than G.
» The person who was 39 years old was seated 2nd to the left of F
» E was the 2nd eldest person and was seated to the immediate right of C.
» The person aged 23 was to the immediate right of the one who was aged 22
» A was seated 3rd to the left of the one who was 19 years old
» D was not the eldest.

6. What was the age of the person who was at the extreme left end of the row?
a) 31 b) 19 c) 22
d) 39 e) Cannot be determined
7. What was the difference between the age of A and C?
a) 1 year b) 2 years
c) 3 years d) 4 years
e) 9 years
8. Who among the following was seated to the immediate left of D?
a) A b) E c) F
d) B e) H
9. Who among the following was the 3rd youngest person?
a) D b) B c) C
d) A e) F
10. If all the digits at odd positions in the number "324846237" are changed to previous digit in the number series and all the digits at even positions are changed to next digit in the number series, then which digit appears more than twice in the number thus formed?
a) More than one such digit is there
b) 7 c) 2 d) 3
e) No such digit is there

Directions (Q.No.11-15): Study the information carefully and answer the questions given below.



Six people were born in different years with the current base is taken as 2018. None of them is older than 90 years old. They like different colours Red, Orange, Green, Blue, Black and Yellow.

A was born in the year 1981. The difference of age between A and C is 23 years. B's age is sum of the digits of the year in which C was born. The one who likes Blue colour is 6 years elder to B. The one who likes green colour is just younger than F. F's age is either the last two digits or reverse of the last two digits of the year in which the person who likes Blue colour was born. The difference between the age of D and the one who likes Green colour is 25 years. D is older than E. F is not the eldest. The one who likes Red colour is just elder than the one who likes Black colour. C does not like Orange colour.

Note - If mentioned the last two digits or reverse of the last two digits of the year in which a person is born can be the age of some other person. (Like A is born in 1943 and age of b is denoted by the last two digits of the birth year of A. Then B's age will be either 34 or 43).

11. Who among the following likes Orange colour?
a) A b) D c) E
d) B e) None of these
12. Who among the following is the eldest?
a) A b) D c) C
d) E e) None of these
13. Which of the following combination is true?
a) A - 1981 - Black
b) B - 2012 - Blue
c) C - 2006 - Yellow
d) F - 1958 - Black
e) None of these
14. Which of the following statement is correct?
a) A is three years younger than the one who likes Black
b) C is the eldest
c) E likes Blue colour
d) E is born before A
e) All are correct
15. In which of the following year F was born?
a) 1995 b) 1958
c) 1956 d) 2004
e) None of these

Directions (Q.No.16-20): Study the following information carefully and answer the questions given below.

Eight persons P, Q, R, S, T, U, V, W are sitting around a rectangular table but not necessarily in the same order. Those who are sitting next to each have different distance from each other. Each of them facing towards the center. Some of them are sitting at the corners while some are sitting on the side of the table. The area of the rectangular table is 540m². The length of the table is 7m more than the breadth of the table. R sits at one of the corners of the table. T sits second to the left of R. P is sitting at a distance of 14m from T. Only two persons sit between P and Q. The distance between R and U is twice of the distance between R and V. W faces R. P sits immediate right of W and at a distance of 13m. Neither Q nor S is an immediate neighbour of R. The distance between R and U is 2m more than the distance between P and T. U is not an immediate neighbour of T. The distance between Q and W is equal to the distance between R and U. The distance between Q and S is half of the distance between V and T. T does not sit at the corner of the table.


16. What is the total distance between V and W?
a) 40 m b) 15 m c) 24 m
d) 39 m e) 49 m
17. Who among the following sits second to the left of Q?
a) T b) W c) V
d) P e) R
18. Which of the following is not true regarding U?
a) U sits second to the left of S
b) The distance between U and V is 24 m
c) W sits third to the right of U
d) P is an immediate neighbour of U
e) All are correct
19. How many persons sits between T and U when counted from the left of U?
a) Three b) One c) No one
d) Four e) Two
20. What is the position of P with respect to S?
a) Third from the right
b) Second from the left
c) Second from the right
d) Fourth from the left
e) None of these

Directions (Q.No.21-23): Study the following data carefully and answer the following given questions.

In a family, there are ten members A, B, J, K, L, N, P, Q, R and T. J is married to K. R is daughter of P. T is wife of N. A is paternal aunt of B. K is paternal aunt of R. Q is niece of A. N is son of J. T has two daughter. L is mother of R. Q and B are granddaughter of J. Each child has either both their parents alive or none alive.


21. How many female members are there in the family?
a) 5 b) 6 c) 7 d) 3 e) 4
22. Which of the following is true?
a) J is brother of P
b) T is sister of R
c) Q is mother of R
d) A is sister of L
e) R is niece of K
23. How many generations and couples are there in the family?
a) 2, 3 b) 3,3 c) 3,2
d) 1, 3 e) 2, 1

Directions (Q.No. 24- 25): Study the following example based on corresponding conditions:



i) If the box contains number
a) And the number is even then multiply the number by 1.5
b) And the number is odd then multiply the number by 3
ii) If the box contains letter/s then
a) Replace vowel by its 2nd next letter as per English alphabets
b. Replace consonant by its 2nd pervious letter as per English alphabets

Apply the conditions to the given input and answer the following questions.



24. 32 will be replaced by ?
a) 64 b) 96 c) 16
d) 48 e) 23
25. U and S will be replace by ____ respectively
a) W and U b) S and U
c) W and Q d) S and Q
e) None of these

KEY

1) b 2) c 3) a 4) b 5) b
6) d 7) d 8) c 9) d 10) d
11) d 12) b 13) d 14) c 15) b
16) d 17) e 18) d 19) e 20) c
21) c 22) e 23) b 24) d 25) c